శుక్రవారం 9-6-2023

సత్యమేవ జయతే

సాక్షి

WWW.SAKSHI.COM

పేజీలు: 16 వెల: ₹ 5.50 సంపుటి: 16 సంచిక: 78

SIMULTANEOUSLY PRINTED AT HYDERABAD | BANGALORE | CHENNAI | DELHI | MUMBAI | ANANTAPUR | GUNTUR | KADAPA | KHAMMAM | KARIMNAGAR | KURNOOL | MAHABOOBNAGAR | MANGALAGIRI | NALGONDA | NELLORE | NIZAMABAD | ONGOLE | RAJAMAHENDRAVARAM | SRIKAKULAM | TADEPALLI GUDEM | TIRUPATHI | VIJAYAWADA | VISAKHAPATNAM | WARANGAL




'ప్రజాస్వామ్యంలో ప్రతి ఒక్కరి గొంతు వినడానికి ప్రభుత్వం సిద్ధంగా ఉండాలి'



భారత్ ఎదురీత!

తొలి ఇన్నింగ్స్‌లో 151/5. స్మిత్ సెంచరీ. ఆస్ట్రేలియా 469 ఆలౌట్ -15లో



మళ్లీ వృద్ధికే పెద్దపీట

6.5శాతం వద్దే రెపో రేటు. వరుసగా రెండోసారి యథాతథం -15లో



ఈడీ ఎదుటకు రుజిరా

బెంగాల్‌లో బొగ్గు స్కామ్‌కు సంబంధించి కేసు దర్యాప్తు చేస్తున్న ఈడీ టీఎంసీ నేత అభిషేక్ బెనర్జీ భార్య రుజిరాను ప్రశ్నించింది.

వివరాలు 6లో ▸



శాంతితోనే సత్సంబంధాలు

లద్దాఖ్‌లో ఉద్రిక్త పరిస్థితులు కొనసాగుతుండగా చైనాతో సత్సంబంధాలను సాగించడం వీలుకాదని జైశంకర్ తేల్చేశారు.

వివరాలు 6లో ▸



23న విపక్ష పార్టీల భేటీ

ఎన్నికల్లో బీజేపీని ఎదుర్కొనేందుకు బిహార్ సీఎం ఏర్పాటు చేసిన ప్రతిపక్ష అగ్రనేతల సమావేశం 23న పట్నాలో జరుగనుంది.

వివరాలు 6లో ▸



'అగ్ని ప్రైమ్' విజయవంతం

కొత్త తరం బాలిస్టిక్ క్షిపణి 'అగ్ని ప్రైమ్'ను డీఆర్‌డీవో, ఎలైట్ స్ట్రాటజిక్ ఫోర్సెస్ కమాండ్ విజయవంతంగా పరీక్షించాయి.

వివరాలు 6లో ▸

చేతికే చెక్ పెట్టాలి!

వచ్చే ఎన్నికల్లో తమ ప్రధాన ప్రత్యర్థి కాంగ్రెస్సే అని భావిస్తున్న బీఆర్‌ఎస్

- పలు నివేదికలు, సర్వేలు, గత ఎన్నికల గణాంకాల ఆధారంగా అంచనా
- సుమారు 80 నియోజకవర్గాల్లో హస్తం పార్టీతోనే ప్రధాన పోటీ!
- కాంగ్రెస్ కదలికలు, వ్యూహాలు, అభ్యర్థుల ఎంపిక తీరుపై దృష్టి
- ఆ పార్టీ లక్ష్యంగా ఎన్నికల వ్యూహానికి పదును పెడుతున్న సీఎం కేసీఆర్
- కర్ణాటక ఎన్నికల తర్వాత బీజేపీ గ్రాఫ్ పడిపోయిందని లెక్కలు



సాక్షి, హైదరాబాద్: ఈ ఏడాది చివర్లో జరిగే ఎన్నికల కోసం తన సన్నద్ధతను భారత్ రాష్ట్ర సమితి (బీఆర్‌ఎస్) వేగవంతం చేసింది. అదే సమయంలో ప్రధాన ప్రతిపక్షాలైన కాంగ్రెస్, బీజేపీల కదలికలను ఎప్పటికప్పుడు అంచనా వేస్తూ ప్రతివ్యూహాలను సిద్ధం చేస్తోంది. కర్ణాటక ఎన్నికల తర్వాత జాతీయ, రాష్ట్ర స్థాయిలో చోటు చేసుకుంటున్న పరిణామాలను నిశితంగా గమనిస్తున్న ఆ పార్టీ.. రాష్ట్రంలో జరిగే ఎన్నికల్లో కాంగ్రెస్, బీజేపీల నుంచి ఎదురయ్యే పోటీపై లెక్కలు వేస్తోంది. ఈ నేపథ్యంలో గత ఎన్నికల గణాంకాలు, వివిధ రూపాల్లో అందిన నివేదికల ఆధారంగా తమ ప్రధాన ప్రత్యర్థి కాంగ్రెస్సేనన్న అంచనాకొచ్చింది. ఆ పార్టీ అనుసరించే వ్యూహాలు, ఎత్తుగడలు, ఇస్తున్న హామీలు, అభ్యర్థుల ఎంపిక, ప్రచారం తీరుతెన్నుల వంటి అంశాలపై లోతుగా దృష్టి సారించింది. పార్టీ అధినేత, ముఖ్యమంత్రి కె.చంద్రశేఖర్‌రావు, పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్, మంత్రి కేటీ రామారావు వరుస సభలు, సమావేశాలతో క్షేత్ర స్థాయిలో విస్తృతంగా పర్యటిస్తున్నారు. ఆత్మీయ సమ్మేళనాలు, దశాబ్ది ఉత్సవాల పేరిట పార్టీ యంత్రాంగాన్ని ఎన్నికల వాతావరణంలోకి తీసుకెళ్లేందుకు కేసీఆర్ ప్రత్యేక కార్యాచరణ అమలు చేస్తున్నారు. అసెంబ్లీ నియోజకవర్గాల వారీగా అక్కడి రాజకీయ పరిస్థితులు, సమీకరణాలు, పార్టీ సిట్టింగ్ ఎమ్మెల్యేలు, ఇన్‌చార్జీల

మిగతా 8వ పేజీలో ▶

నేడు మంచిర్యాలకు సీఎం

- గృహలక్ష్మి, బీసీ కుల వృత్తిదారులకు రూ.లక్ష సాయం.. రెండో విడత దళితబంధు పథకాలు ప్రారంభం

8 లో

288 నియోజకవర్గాల్లో బీఆర్‌ఎస్ విస్తరించాలి

- మహారాష్ట్ర నేతలతో కేసీఆర్..
- 15న నాగ్‌పూర్‌కు కేసీఆర్..

8 లో

కాంగ్రెస్ గూటికి పొంగులేటి..

మెజారిటీ అనుచరుల సూచన మేరకు నిర్ణయం



- 12న ఇతర నేతలతో కలిసి కాంగ్రెస్‌లో చేరికపై ప్రకటన
- నేడు ఉమ్మడి ఖమ్మం జిల్లా ముఖ్య నేతలతో కీలక భేటీ
- ఈ సమావేశంలోనూ అభిప్రాయ సేకరణ
- ఈనెల 28 తర్వాత చేరికకు సన్నాహాలు!

సాక్షి ప్రతినిధి, ఖమ్మం

మాజీ ఎంపీ పొంగులేటి శ్రీనివాసరెడ్డి ఏ పార్టీలో చేరతారనే దానిపై నెలకొన్న ఉత్కంఠ తొలగనుంది. ఉమ్మడి ఖమ్మం జిల్లావ్యాప్తంగా ఉన్న ఆయన అనుచరుల్లో మెజార్టీ నేతలు కాంగ్రెస్‌లో చేరాలని చేసిన సూచనతో పొంగులేటి సైతం అదే నిర్ణయం తీసుకుంటున్నట్లు తెలుస్తోంది. ఈ మేరకు సన్నాహాలు చేసుకుంటున్న ఆయన.. తనతో కలిసి వచ్చే ఇతర నాయకులతో కలిసి ఈనెల 12న ఆ పార్టీలో చేరికపై ప్రకటన చేయనున్నారు. పొంగులేటి శుక్రవారం ఉమ్మడి ఖమ్మం జిల్లాలోని పది నియోజకవర్గాల ముఖ్య నేతలతో ఖమ్మంలో సమావేశమవుతున్నారు. ఈ సందర్భంగా మరోసారి వారి అభిప్రాయాలు తెలుసుకోనున్నట్లు తెలిసింది.

జనవరి నుంచే జోరుగా చర్చ

ఈ ఏడాది జనవరి ఒకటిన బీఆర్‌ఎస్‌పై పొంగులేటి ధిక్కార స్వరం వినిపించినప్పటి నుంచి ఆయన పార్టీ మార్పుపై జోరుగా చర్చ సాగుతోంది. ఆయన మాత్రం ఆచితూచి నిర్ణయం తీసుకుంటానంటూ

మిగతా 8వ పేజీలో ▶

కాంగ్రెస్‌లోకే పొంగులేటి, జూపల్లి



సీఎల్పీ నేత భట్టి విక్రమార్క వ్యాఖ్య

- నల్లగొండకు బీఆర్‌ఎస్ ప్రభుత్వం తీవ్ర నష్టం చేసింది
- కాంగ్రెస్ అధికారంలోకి వస్తే ప్రాజెక్టులన్నీ పూర్తి చేస్తాం

- వివరాలు 8లో ▶

న్యూస్‌రీల్

ఆగని కన్నీటి వరద



నీపర్ నదిపై కఖోవ్కా డ్యామ్ పేలుడుతో కొత్త మలుపు తీసుకున్న ఉక్రెయిన్–రష్యా యుద్ధంతో జనం కష్టాలు మరింత పెరిగాయి. ఇన్నాళ్లూ భూగర్భ గృహాల్లో తలదాచుకున్న జనం.. ఇప్పుడవన్నీ జలమయం కావడంతో సుదూర ప్రాంతాలకు ప్రాణభయంతో పరుగు పెడుతున్నారు. - వివరాలు 6లో ▶

పీజీ ఈసెట్‌లో 91% అర్హత



ఇంజనీరింగ్ పోస్టు–గ్రాడ్యుయేట్ కోర్సుల్లో ప్రవేశానికి గత నెలలో నిర్వహించిన పీజీఈసెట్–2023 ఫలితాలను ఉన్నత విద్యామండలి చైర్మన్ ప్రొఫెసర్ ఆర్.లింబాద్రి విడుదల చేశారు. ఈ పరీక్షలో మొత్తం 91.48 శాతం అర్హత సాధించినట్టు ఆయన పేర్కొన్నారు.

- వివరాలు 2లో ▶

వేతన చైర్మన్ నియామకంపై కౌంటర్ వేయండి: హైకోర్టు



కనీస వేతన సలహా మండలి చైర్మన్‌గా అధికార పార్టీకి చెందిన వ్యక్తిని నియమించడంపై కౌంటర్ దాఖలు చేయాలని ఆదేశిస్తూ ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి, కార్మిక శాఖ కమిషనర్‌కు హైకోర్టు నోటీసులు జారీ చేసింది.

- వివరాలు 2లో ▶

ముక్కలుగా నరికాడు... కుక్కర్‌లో ఉడికించాడు..




కలిసుందామంటూ నమ్మి వచ్చిన మహిళను ముంబైలో ఓ వ్యక్తి అత్యంత దారుణంగా హత్యచేశాడు. మృతదేహాన్ని 20 ముక్కలుగా నరికాడు. కొన్ని ముక్కలను కుక్కర్‌లో సైతం ఉడకబెట్టినట్లు తెలుస్తోంది.

- వివరాలు 6లో ▶

10 రోజుల్లో 'రైతుబంధు' జమ

సాక్షి, హైదరాబాద్



వానాకాలం సీజన్ రైతుబంధు సొమ్మును వారం, పది రోజుల్లో రైతుల ఖాతాల్లో వేసేందుకు ఏర్పాట్లు చేస్తున్నట్లు వ్యవసాయశాఖ వర్గాలు వెల్లడించాయి. ఈ సీజన్‌లో ఎకరాకు రూ. 5 వేల చొప్పున పంట పెట్టుబడి సాయాన్ని దాదాపు 65 లక్షల మంది లబ్ధిదారులకు అందించేందుకు రూ. 7,400 కోట్లు అవసరమవుతాయని అంచనా వేస్తున్నట్లు పేర్కొన్నాయి. ఈ వానాకాలం సీజన్‌లో రాష్ట్రవ్యాప్తంగా కోటిన్నర ఎకరాలకుపైగా ఉన్న భూములకు చెందిన రైతులకు రైతుబంధు వర్తింపజేస్తామని తెలిపాయి. కొత్తగా పట్టాదారు పాసుపుస్తకాలు పొందిన రైతులు, మొదటిసారి రైతుబంధు కోసం దరఖాస్తు చేసుకొనే రైతులు ఏఈవోలను సంప్రదించి ఆయా వివరాలు సమర్పించాలని సూచించాయి. సమీకరించిన నిధుల్లోంచి నేషనల్ పేమెంట్ పోర్టల్ ద్వారా రోజువారీగా నిధులను రైతుల బ్యాంకు ఖాతాల్లోకి బదిలీ చేస్తామని పేర్కొన్నాయి. మొదటి రోజున ఎకరాలోపున్న వారికే మొదట ప్రాధాన్యం ఇవ్వనుండగా మర్నాటి నుంచి ఒక్కో ఎకరా పెంచుకుంటూ నెలాఖరు వరకు అర్హులైన రైతులందరి ఖాతాల్లో నిధులు జమ చేయనుంది.

లోతైన పరిజ్ఞానం.. తక్షణ ఉపాధి

మారనున్న యూజీ డిగ్రీ స్వరూపం

- ఇక నాలుగేళ్ల కాల పరిమితితో హానర్స్ కోర్సులు
- ఆర్ట్స్ విద్యార్థికి కంప్యూటర్ పరిజ్ఞానం.. సైన్స్ విద్యార్థికి సామాజిక అవగాహన..
- యూజీసీ సరికొత్త బోధన ప్రణాళిక
- కేంద్రం ప్రతిపాదనలకు అన్ని రాష్ట్రాలూ ఓకే

2 లో

అన్ని బాధ్యతలూ బన్సల్‌కే!



- రాష్ట్ర పార్టీని చక్కదిద్దేపనిలో భాగంగా అటు రాజకీయ వ్యవహారాలు, ఇటు సంస్థాగత అంశాలకు సంబంధించిన బాధ్యతలను ఒక్కరికే అప్పగించే దిశలో బీజేపీ జాతీయ నాయకత్వం చర్యలు చేపడుతున్నట్టు తెలుస్తోంది. నలుగురైదుగురు ఇన్‌చార్జీలు కాకుండా ఒక్కరికే పూర్తిస్థాయి ఇన్‌చార్జి బాధ్యతలు కట్టబెట్టడం ద్వారా మంచి ఫలితాలను సాధించవచ్చనే అంచనాకు వచ్చినట్టు సమాచారం.

8 లో

కేరళను తాకిన నైరుతి

ప్రకటించిన ఐఎండీ.. ఈ ఏడాది సాధారణ వర్షాలేనని అంచనా



ఎట్టకేలకు నైరుతి అరుదెంచింది. సాధారణం కంటే ఒక వారం ఆలస్యంగా నైరుతి రుతు పవనాలు గురువారం కేరళను తాకాయని భారత వాతావరణ శాఖ(ఐఎండీ) ప్రకటించింది. ఈ ఏడాది సాధారణ వర్షాలుంటాయని అంచనా వేసింది. -6లో ▶

రాష్ట్రంలో నేడూ, రేపు వర్షాలు

- వివరాలు 2లో ▶



చార్జింగ్ చాలట్లే!

- 'ఈ–బస్సు' 2 సార్లు చార్జ్ చేయాల్సిందే!
- ఆర్టీసీ ఈ–గరుడ ఎలక్ట్రిక్ బస్సుకు ట్రాఫిక్ షాక్.. 150 కి.మీ. సరిపడా శక్తిని మింగేస్తున్న ట్రాఫిక్ - 8లో ▶

ఇదండీ సంగతి



కాంగ్రెస్‌ను నమ్మితే.. శంకరగిరి మాన్యాలే



బహిరంగ సభలో మాట్లాడుతున్న కేటీఆర్

55 ఏళ్ల పాలనలో ప్రజా సమస్యలు పట్టించుకోలేదు: కేటీఆర్

- కాంగ్రెస్ పాలిత రాష్ట్రాల్లో తెలంగాణ పథకాలున్నాయా?
- నాడు మీరు అభివృద్ధి చేసి ఉంటే ఈ సన్నాసి యాత్రలుండేవా?
- నాడు రెండు దఫాలుగా ఆరు గంటల కరెంట్.. నేడు 24 గంటలూ విద్యుత్
- ఆగస్టులో కర్వెన రిజర్వాయర్‌ను కృష్ణా జలాలతో నింపుతాం
- ఉదండాపూర్‌ను త్వరగా పూర్తిచేసి జడ్చర్లలో 1.44 లక్షల ఎకరాలకు సాగునీరు ఇస్తామని వెల్లడి.. జడ్చర్లలో డబుల్ బెడ్‌రూం ఇళ్లను ప్రారంభించిన కేటీఆర్

జడ్చర్ల: కాంగ్రెస్ పార్టీ రాష్ట్రాన్ని 55 ఏళ్లు పాలించినా ఏనాడూ ప్రజా సమస్యలు పట్టించుకోలేదని ఐటీ, పరిశ్రమల శాఖ మంత్రి కేటీఆర్ ధ్వజమెత్తారు. ఎన్నికలు వస్తున్నందున మాకొక అవకాశమివ్వండి అంటూ కాంగ్రెస్ సన్నాసులు నక్క వినయాలు ప్రదర్శించి మీ ముందుకు వస్తున్నారని చెప్పారు. వారిని పొరపాటున నమ్మితే మిమ్మల్ని శంకరగిరి మాన్యాలు పట్టిస్తారని దుయ్యబట్టారు. అధికారంలో ఉన్నప్పుడు మీరు చేసిందేమిటో.. అలాగే తాము చెడగొట్టింది ఏమిటో చెప్పాలని నిలదీశారు. జడ్చర్లలో రూ.33.03 కోట్లతో నిర్మించిన 560 డబుల్ బెడ్‌రూం ఇళ్లను ప్రారంభించిన అనంతరం ఏర్పాటు చేసిన బహిరంగ సభలో కేటీఆర్ మాట్లాడారు. రైతుబంధు, రైతుబీమా, కళ్యాణలక్ష్మి, దళితబంధు వంటి పథకాలు కాంగ్రెస్ పాలిత రాష్ట్రాల్లో

మిగతా 5వ పేజీలో ▶

క్లుప్తంగా...

దూరవిద్య కోర్సులకు ఓయూలో సెమిస్టర్ పరీక్షలు

ఉస్మానియా యూనివర్సిటీ: ఓయూలో దూర విద్య కోర్సులకు ఇక నుంచి సెమిస్టర్ పరీక్షల విధానాన్ని ప్రవేశ పెట్టనున్నట్లు డైరెక్టర్ ప్రొ. జీబీ రెడ్డి తెలిపారు. ఇప్పటికే ఎంబీఏ, ఎంసీఏ కోర్సులకు సెమిస్టర్ అమలులో ఉండగా యూజీసీ నిబంధనల మేరకు ఈ విద్యా సంవత్సరం నుంచి అన్ని పీజీ కోర్సుల పరీక్షలు సెమిస్టర్ పద్ధతిలో కొనసాగనున్నాయని పేర్కొన్నారు. డిగ్రీ కోర్సులకు కూడా వచ్చే ఏడాది నుంచి సెమిస్టర్ పరీక్షల పద్ధతిని ప్రవేశపెట్టనున్నట్లు వివరించారు. ఈ విద్యా సంవత్సరం ప్రవేశాలకు 15 రోజుల్లో ప్రకటన విడుదల చేయనున్నట్లు ఆయన వెల్లడించారు.

టెన్త్ అడ్వాన్స్‌డ్ సప్లిమెంటరీ హాల్ టికెట్లు సిద్ధం

సాక్షి, హైదరాబాద్: ఈ నెల 14 నుంచి జరిగే టెన్త్ అడ్వాన్స్‌డ్ సప్లిమెంటరీ పరీక్షల హాల్ టికెట్లను టెన్త్ బోర్డ్ విద్యార్థులకు అందుబాటులోకి తెచ్చింది. సంబంధిత పాఠశాలల నుంచి వీటిని పొందవచ్చని పరీక్షల విభాగం డైరెక్టర్ కృష్ణారావు తెలిపారు. విద్యార్థులు www.bse.telangana.gov.in వెబ్‌సైట్ నుంచి కూడా పొందవచ్చని సూచించారు.

వ్యవసాయ డిప్లొమా కోర్సులకు దరఖాస్తులు

సాక్షి, హైదరాబాద్: ప్రొఫెసర్ జయశంకర్ తెలంగాణ రాష్ట్ర వ్యవసాయ విశ్వవిద్యాలయం పరిధిలోని వివిధ డిప్లొమా కోర్సుల్లో 2023–24 సంవత్సరానికి ప్రవేశాల నోటిఫికేషన్ జారీ అయింది. వ్యవసాయ, సేంద్రియ, ఇంజనీరింగ్ విభాగాల్లో డిప్లొమా కోర్సులు, సీట్ల సంఖ్య, పాలిటెక్నిక్‌లలో ఉన్న ఫీజులు, వివరాలు తదితర సమగ్ర సమాచారం కలిగిన ప్రాస్పెక్టస్ విశ్వవిద్యాలయ వెబ్‌సైట్ www.pjtsau.edu.inలో పొందుపరిచినట్లు విశ్వవిద్యాలయం రిజిస్ట్రార్ డాక్టర్ వెంకటరమణ గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ కోర్సుల కోసం జూలై మొదటి వారంలో కౌన్సెలింగ్ నిర్వహిస్తున్నట్లు వివరించారు. పాలిసెట్–2023 ర్యాంకుల (అగ్రికల్చర్ స్ట్రీమ్) ప్రకారం మెరిట్ ప్రాతిపదికన సీట్ల కేటాయింపు ఉంటుందని పేర్కొన్నారు. ప్రభుత్వ నియమ నిబంధనల ప్రకారం రిజర్వేషన్ విధానం అమలు చేస్తారు. ఆసక్తిగల అభ్యర్థులు ఆన్‌లైన్లో దరఖాస్తు చేసుకునేందుకు ఈ నెల 24 చివరి తేదీ అని తెలిపారు. పూర్తి వివరాలకు విశ్వవిద్యాలయం వెబ్‌సైట్ చూడాలని సూచించారు.

ఇంటర్ అడ్వాన్స్‌డ్ హాల్ టికెట్లు సిద్ధం

సాక్షి, హైదరాబాద్: ఈనెల 12 నుంచి జరిగే ఇంటర్మీడియెట్ అడ్వాన్స్‌డ్ సప్లిమెంటరీ పరీక్ష హాల్ టికెట్లు పొందవచ్చని ఇంటర్ బోర్డ్ ఒక ప్రకటనలో తెలిపింది. www.tsbie.cgg.gov.in అనే వెబ్‌సైట్‌కు లాగిన్ అయికూడా హాల్ టికెట్లు డౌన్‌లోడ్ చేసుకోవచ్చని పేర్కొంది. ఏవైనా తప్పులుంటే ప్రిన్సిపాళ్ల ద్వారా వాటిని పంపుకొని సరిచేసుకోవాలని సూచించింది.



లోతైన పరిజ్ఞానం..

తక్షణ ఉపాధి

మారనున్న యూజీ డిగ్రీ స్వరూపం

- ఇక నాలుగేళ్ల కాల పరిమితితో ఆనర్స్ కోర్సులు
- ఆర్ట్స్ విద్యార్థికి కంప్యూటర్ పరిజ్ఞానం.. సైన్స్ విద్యార్థికి సామాజిక అవగాహన.. యూజీసీ సరికొత్త బోధన ప్రణాళిక
- కేంద్రం ప్రతిపాదనలకు అన్ని రాష్ట్రాలూ ఓకే

సాక్షి, హైదరాబాద్

దేశవ్యాప్తంగా కోట్లాది మంది చదువుతున్న అండర్ గ్రాడ్యుయేట్ (యూజీ) డిగ్రీ స్వరూపం క్రమంగా మారబోతోంది. ఇప్పటిలా మూడేళ్ళు కాకుండా, నాలుగేళ్ళ కాలపరిమితితో డిగ్రీ (యూజీ ఆనర్స్) ఉండనుంది. సాధారణ సంప్రదాయ కోర్సులు భవిష్యత్‌లో తెరమరుగయ్యే వీలుంది. బీఏ, బీకాం, బీఎస్సీ..లాంటివి ప్రత్యేకంగా ఉండకుండా వీటికి కంప్యూటర్స్, డేటాసైన్స్, ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ (ఏఐ).. లాంటి కోర్సులు జత కానున్నాయి. విద్యార్థికి లోతైన పరిజ్ఞానం అందించడమే లక్ష్యంగా ఈ కోర్సులు ఉండనున్నాయి. ఆర్ట్స్ విద్యార్థికి కంప్యూటర్ పరిజ్ఞానం.. సైన్స్ విద్యార్థికి సామాజిక అవగాహన కోర్సుల వంటి మార్పులతో నాలుగేళ్ల డిగ్రీ ఉండనుంది. జాతీయ విద్యావిధానం–2020లో భాగంగా ఈ తరహా బోధన ప్రణాళికను (కొత్త కరిక్యులం ఫ్రేమ్‌వర్క్) యూనివర్సిటీ గ్రాంట్స్ కమిషన్ (యూజీసీ) ఇప్పటికే సిద్ధం చేసింది. యూజీసీ కొత్త ప్రణాళికలను అన్ని రాష్ట్రాలూ ఆమోదించాయి. తెలంగాణతో పాటు అన్ని రాష్ట్రాల్లో నాలుగేళ్ల యూజీ ఆనర్స్ డిగ్రీ కోర్సులను పరిమితంగా ప్రవేశపెట్టారు. భవిష్యత్తులో ఇది మరింత విస్తృతం కానుండగా..రాష్ట్రంలోని ప్రైవేటు కాలేజీలు కూడా ఆనర్స్ డిగ్రీ కోర్సులను అందుబాటులోకి తెచ్చేందుకు ముందుకొస్తున్నాయి.

ఇకనుంచి క్రెడిట్స్ విధానం

ఇక నుంచి డిగ్రీ పట్టాలు క్రెడిట్స్ ఆధారంగా ఉంటాయి. ఒక్కో స్థాయికి కొన్ని క్రెడిట్స్ ఉంటాయి. విద్యార్థులు మూడేళ్లలో 120 క్రెడిట్లు పూర్తి చేస్తేనే యూజీ డిగ్రీకి అర్హులవుతారు. సబ్జెక్టులను బట్టి క్రెడిట్లు ఉంటాయి. కాగా విద్యార్థి నాలుగేళ్లలో 160 క్రెడిట్లను పూర్తి చేస్తేనే యూజీ ఆనర్స్ డిగ్రీ పట్టా లభిస్తుంది. అలాగే ఆనర్స్ డిగ్రీ కోర్సుల్లో చేరేవారు రీసెర్చ్ కోసం వెళ్లాలనుకుంటే తమ నాలుగేళ్ల కోర్సులోనే రీసెర్చ్ ప్రాజెక్టులను చేపట్టాల్సి ఉంటుంది. మొదటి ఆరు సెమిస్టర్లలో 75 శాతం అంతకంటే ఎక్కువ మార్కులు సాధించిన విద్యార్థులు పరిశోధనలు చేపట్టాలనుకుంటే నాలుగో ఏడాదిలో పరిశోధనా ప్రాజెక్టును ఎంచుకోవచ్చు. దీన్ని పూర్తి చేస్తే వారికి యూజీ ఆనర్స్ విత్ రీసెర్చ్ డిగ్రీని ప్రదానం చేస్తారు.

మూడేళ్ల కోర్సు చేస్తున్నవారికీ అవకాశం

ప్రస్తుతం మూడేళ్ల డిగ్రీ కోర్సులు చేస్తున్నవారు కూడా నాలుగేళ్ల ఆనర్స్ కోర్సులకు మారేందుకు కొత్త కరిక్యులం ఫ్రేమ్‌వర్క్ అవకాశం కల్పిస్తుంది. ఇప్పటికే చాయిస్ బేస్డ్ క్రెడిట్ సిస్టమ్ (సీబీసీఎస్) ప్రకారం మూడేళ్ల యూజీ కోర్సుల్లో పేర్లు నమోదు చేసుకున్న, అభ్యసిస్తున్న విద్యార్థులు కూడా నాలుగేళ్ల యూజీ ఆనర్స్ కొనసాగించడానికి అర్హులని నిబంధనల్లో పేర్కొన్నారు. ఇలాంటి విద్యార్థులు బ్రిడ్జి కోర్సులు పూర్తి చేయడం తప్పనిసరి అని యూజీసీ పేర్కొంది.

లోతైన పరిజ్ఞానం అందించడమే లక్ష్యం



ఆనర్స్ డిగ్రీ కోర్సుల్లో లోతైన పరిజ్ఞానం అందించేలా బోధన ఉంటుంది. బహుళ ప్రయోజనాలు ఉండాలన్నదే సరికొత్త మార్పుల లక్ష్యం. భవిష్యత్‌లో ఇక నాలుగేళ్ళ ఆనర్స్ కోర్సులే ఉండే వీలుంది. ఇందుకు అనుగుణంగానే తెలంగాణలోనూ బోధన ప్రణాళిక, పరీక్ష విధానంపై మార్పులకు అధ్యయనాలు జరుగుతున్నాయి.

– ప్రొఫెసర్ ఆర్.లింబాద్రి, ఉన్నత విద్యా మండలి చైర్మన్

ఆనర్స్ వైపే అందరిచూపు..



విద్యార్థులు డిగ్రీ విద్యలో మార్పు కోరుకుంటున్నారు. ఆనర్స్ కోర్సులకు ప్రాధాన్యత పెరుగుతోంది. అందుకే ప్రైవేటు కాలేజీలు కూడా విద్యార్థులు కోరుకుంటున్న ఆనర్స్ కోర్సులు అందించేందుకు యత్నిస్తున్నాయి. ఈ మేరకు మౌలిక వసతుల కల్పనకు కృషి చేస్తున్నాయి.

– ఎక్కల్‌దేవి పరమేశ్వర్, ప్రైవేటు డిగ్రీ కాలేజీల సంఘం ప్రధాన కార్యదర్శి

ఏడాది చదివితే సర్టిఫికెట్.. రెండేళ్లయితే డిప్లొమా

➤ నాలుగేళ్ల యూజీ ఆనర్స్ కోర్సు విద్యార్థులకు బహుళ ప్రవేశ, నిష్క్రమణలకు అవకాశం కల్పించనున్నారు. ఇందులో భాగంగా మొదటి ఏడాది పూర్తి చేస్తే ఆ మేరకు విద్యార్థికి సర్టిఫికెట్ లభిస్తుంది. రెండేళ్లు చదివితే డిప్లొమా లభిస్తుంది. మూడేళ్లు చదివితే డిగ్రీ పట్టా లభిస్తుంది. నాలుగేళ్లు పూర్తి చేస్తే ఆనర్స్ బ్యాచిలర్ డిగ్రీ పట్టా అందుతుంది.

➤ యూజీ ఆనర్స్‌ను మార్కెట్లో తక్షణ ఉపాధి లభించేలా, వైవిధ్యంగా నైపుణ్యాత్మకంగా అందించాలని నిర్ణయించారు. మెయిన్, మైనర్ స్ట్రీమ్ కోర్సులు, భాష, నైపుణ్య కోర్సులు, పర్యావరణ విద్య, డిజిటల్, సాంకేతిక పరిష్కారాలు తదితర విభాగాల కోర్సులు ఉంటాయి.

బోధనలోనూ మార్పులు..

కొత్తగా ఆరోగ్యం, యోగా, క్రీడలు, ఫిట్‌నెస్ వంటివి కూడా చేర్చారు. ఆధునిక భారతీయ భాష, సంస్కృతి, ఆంగ్ల భాష, నైపుణ్యాల పెంపుదల, నైతిక విలువల కోర్సులు ఉంటాయి. అలాగే విద్యార్థుల ఉపాధి అవకాశాలు పెంపొందించడానికి ఆచరణాత్మక నైపుణ్యాలు, శిక్షణ, సాఫ్ట్ స్కిల్స్ అందించడం లక్ష్యంగా ప్రత్యేక కోర్సులను చేర్చారు.



వివాహ వేడుకలో సీఎం.. గురువారం రాత్రి హైదరాబాద్ గచ్చిబౌలి సంధ్య కన్వెన్షన్‌లో సీబీఐ మాజీ జాయింట్ డైరెక్టర్ వి.వి.లక్ష్మీనారాయణ కుమార్తె వివాహ వేడుకకు ముఖ్యమంత్రి కేసీఆర్ హాజరయ్యారు. వధూవరులను ఆశీర్వదించి, శుభాకాంక్షలు తెలిపారు. సీఎం వెంట ఎంపీ జోగినపల్లి సంతోష్ కుమార్, ఎమ్మెల్సీ పల్లా రాజేశ్వర్ రెడ్డి ఉన్నారు.

విద్యార్థులకు అల్పాహారంగా రాగిజావ

- 20న విద్యా దినోత్సవం నుంచి ప్రారంభం
- మంత్రి సబితా ఇంద్రారెడ్డి వెల్లడి
- ఆధునీకరించిన వెయ్యి పాఠశాలల ప్రారంభోత్సవం
- విద్యార్థులకు నోటు పుస్తకాలు.. టీచర్లకు ట్యాబ్‌లు



సమావేశంలో మంత్రి సబిత

సాక్షి, హైదరాబాద్: రాష్ట్రావతరణ దశాబ్ది ఉత్సవాల సందర్భంగా ఈ నెల 20న నిర్వహించే తెలంగాణ విద్యా దినోత్సవం మొదలు రాష్ట్రంలోని ప్రభుత్వ పాఠశాలల్లో చదువుతున్న విద్యార్థులకు అల్పాహారంగా రాగిజావ అందించనున్నట్లు విద్యా శాఖ మంత్రి పి.సబితా ఇంద్రారెడ్డి తెలిపారు. ప్రతిరోజూ ప్రార్థనా సమయానికి ముందు విద్యార్థులకు 250 మిల్లీలీటర్ల చొప్పున రాగిజావ ఇస్తారని చెప్పారు. దీనివల్ల 28,606 ప్రభుత్వ పాఠశాలల్లోని 25,26,907 మంది విద్యార్థులకు ప్రయోజనం కలుగుతుందన్నారు. గురువారం తన కార్యాలయంలో విద్యా శాఖ పనితీరును మంత్రి సమీక్షించారు. తెలంగాణ విద్యా దినోత్సవం సందర్భంగా రాష్ట్రవ్యాప్తంగా 'మన ఊరు..మన బడి', 'మన బస్తీ..మన బడి'కింద సకల వసతులతో ఆధునీకరించిన వెయ్యి ప్రభుత్వ పాఠశాలలను మంత్రులు, శాసన సభ్యులు ప్రారంభిస్తారని సబిత తెలిపారు. రాష్ట్రంలో ఒకటి నుంచి ఐదవ తరగతి వరకు చదువుతున్న 16,27,457 మంది విద్యార్థులకు మూడేసి చొప్పున వర్క్ బుక్స్, ఆరు నుంచి పదవ తరగతి చదువుతున్న 12,39,415 మంది విద్యార్థులకు సబ్జెక్టుకు ఒక్కో నోటు పుస్తకం చొప్పున అందించనున్నామన్నారు. పాఠశాలల్లో విద్యా ప్రమాణాలు పెంపొందించేందుకు, సమాచార బదలాయింపు కోసం రాష్ట్రంలోని 20 వేల మంది ఉపాధ్యాయులకు ట్యాబ్‌లు ఇవ్వనున్నట్లు తెలిపారు. రాష్ట్రంలోని 1,600 పాఠశాలల్లో ఏర్పాటు చేసిన 4,800 డిజిటల్ తరగతులను విద్యా దినోత్సవం సందర్భంగా ప్రారంభించేందుకు ఏర్పాట్లు చేయాలని అధికారులను మంత్రి ఆదేశించారు. అలాగే 10 వేల గ్రంథాలయాలను ప్రారంభించేందుకు ఏర్పాట్లు చేయాలని సూచించారు. రాష్ట్రవ్యాప్తంగా ప్రాథమిక పాఠశాలలు మొదలు వర్సిటీల వరకు విద్యా దినోత్సవం రోజున సభలు, సమావేశాలు నిర్వహించాలని, రాష్ట్రంలో విద్యా రంగంలో సాధించిన విజయాలను వివరించాలని సూచించారు.

రూ.190 కోట్లతో పాఠ్య పుస్తకాలు

రూ.190 కోట్లు వ్యయం చేసి 30 లక్షల మంది విద్యార్థులకు ఉచితంగా పాఠ్యపుస్తకాలు అందిస్తున్నామని, ఈ పుస్తకాలను ఇప్పటికే జిల్లా కేంద్రాలకు తరలించామని మంత్రి సబిత తెలిపారు. ప్రభుత్వ పాఠశాలల్లో చదువుతున్న 26 లక్షల మంది విద్యార్థులకు రూ.150 కోట్లు వెచ్చించి ఒక్కో విద్యార్థికి రెండేసి జతల చొప్పున యూనిఫామ్‌లు అందిస్తున్నామని చెప్పారు. సమావేశంలో ప్రభుత్వ కార్యదర్శి వాకాటి కరుణ, పాఠశాల విద్యా సంచాలకులు దేవసేన తదితరులు పాల్గొన్నారు.

ఓయూ విద్యార్థుల విదేశీ విద్యకు ఉపకార వేతనం



ఉస్మానియా యూనివర్సిటీ: ఉన్నత చదువుకు విదేశాలకు వెళ్లే ఓయూ విద్యార్థులకు ఉపకార వేతనాలు అందజేయనున్నట్లు గ్లోబల్ ఎడ్యుకేషన్ కెరీర్ ఫోరం చైర్మన్, తెలంగాణ కాలేజియేట్ ఎడ్యుకేషన్ కమిషనర్ నవీన్ మిట్టల్ తెలిపారు. ఓయూ దూరవిద్య కేంద్రం సెమినార్ హాల్‌లో గురువారం ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఉస్మానియా, జీఈసీఎఫ్ ఈ మేరకు అవగాహన ఒప్పందం కుదుర్చుకున్నాయి. ఈ సందర్భంగా నవీన్ మిట్టల్ మాట్లాడుతూ విదేశాలకు వెళ్లి ఉన్నత విద్యను అర్జించాలనుకునే ఓయూ విద్యార్థులకు జీఈసీఎఫ్ ద్వారా ఇంగ్లిష్ లాంగ్వేజ్ క్వాలిఫికేషన్ ఉపకార వేతనాలను అందజేయనున్నట్లు పేర్కొన్నారు. గతేడాది 150 మందికి ఉపకార వేతనాలను అందజేశారని, ఈ ఏడాది 1500 మందికి అందజేయనున్నట్లు వివరించారు. ఇప్పటివరకు 500 మంది విద్యార్థులు ఉపకార వేతనాలకు ఎంపికైనట్టు తెలిపారు. ఓయూ హెచ్‌ఆర్‌డీసీ, జీఈసీఎఫ్, కాలేజియేట్ ఆఫ్ ఎడ్యుకేషన్ నడుమ త్రైమాసిక ఒప్పందం కుదిరినట్లు వివరించారు. కార్యక్రమంలో రాష్ట్ర ఉన్నత విద్యమండలి చైర్మన్ ప్రొఫెసర్ లింబాద్రి, ఓయూ హెచ్‌ఆర్‌డీసీ డైరెక్టర్ ప్రొఫెసర్ స్టీవెన్‌సన్, జీఈసీఎఫ్ కార్యదర్శి లక్ష్మీనారాయణ తదితరులు పాల్గొన్నారు.

రాష్ట్రంలో 13 మెడికల్ కాలేజీలకు ఎన్‌ఎంసీ అనుమతి

ప్రభుత్వ కాలేజీలకు కేంద్రం ఒక్క రూపాయి ఇవ్వలేదు: హరీశ్



సాక్షి, హైదరాబాద్: రాష్ట్రంలోని 9 ప్రభుత్వ, 4 ప్రైవేటు మెడికల్ కాలేజీలు కలిపి మొత్తం 13 మెడికల్ కాలేజీలకు నేషనల్ మెడికల్ కమిషన్ (ఎన్‌ఎంసీ) అనుమతి ఇచ్చింది. ప్రభుత్వ మెడికల్ కాలేజీలన్నీ పూర్తిగా రాష్ట్ర నిధులతో ఏర్పాటు చేస్తున్నవేనని వైద్య, ఆరోగ్య శాఖ మంత్రి హరీశ్ రావు ఒక ప్రకటనలో పేర్కొన్నారు. అంతేగానీ కేంద్రం రూపాయి ఇవ్వలేదని, రాష్ట్రంలో మెడికల్ కాలేజీలకు కేంద్రం ఆమోద ముద్ర అని సోషల్ మీడియా, మీడియాలో వస్తున్న వార్తలు అవాస్తవం అన్నారు. ఎన్‌ఎంసీ అటానమస్ బాడీ అని, నిర్దేశించిన అన్ని నిబంధనలు సంతృప్తి పరిచేలా ఉన్నాయా లేవా అని పరిశీలించిన తర్వాతే మెడికల్ కాలేజీలకు అనుమతి ఇస్తుందని ఆయన తెలిపారు.

దేశవ్యాప్తంగా కులగణన చేపట్టాలి

బీసీ కమిషన్ చైర్మన్ వకుళాభరణం



సాక్షి, న్యూఢిల్లీ: దేశవ్యాప్తంగా 'కులగణన'చేపట్టాలని కోరుతూ జాతీయ బీసీ కమిషన్ కేంద్రానికి సిఫారసు చేయాలని తెలంగాణ బీసీ కమిషన్ చైర్మన్ వకుళాభరణం కృష్ణమోహన్ రావు కోరారు. కులగణన ద్వారా విద్య, ఉద్యోగ, అలాగే స్థానిక సంస్థల ఎన్నికలలో బీసీ రిజర్వేషన్ల శాతం, జాబితాల పునర్విభజన, మార్పులు, చేర్పులను శాస్త్రీయంగా నిర్ణయించడానికి వీలవుతుందని అన్నారు. గురువారం ఆయన ఢిల్లీలో జాతీయ బీసీ కమిషన్ చైర్మన్ హన్స్‌రాజ్ గంగారాం అహీర్‌తో సమావేశమయ్యారు. ఈ సందర్భంగా వివిధ అంశాలపై ఆయన హన్స్‌రాజ్‌కు వినతి పత్రాలు అందించారు. కులగణన చేపట్టడం వల్ల ప్రధానంగా బీసీల అభ్యున్నతికి పకడ్బందీగా చర్యలు తీసుకోవడానికి వీలవుతుందని హన్స్‌రాజ్ గంగారాంకు తెలిపారు. కేంద్రంలో బీసీలకు ప్రత్యేక మంత్రిత్వ శాఖ ఏర్పాటు చేయాల్సిందిగా ప్రభుత్వానికి నివేదించాలన్నారు. నాన్ క్రీమీ లేయర్ ఆదాయ పరిమితిని రూ.15 లక్షలకు పెంచేలా కేంద్రానికి సిఫారసు చేయాలని కృష్ణమోహన్‌రావు జాతీయ బీసీ కమిషన్ చైర్మన్‌కు విజ్ఞప్తి చేశారు.

వారిని నియమించకుంటే ఓట్లు రావు!

ఎస్సీ, ఎస్టీ కమిషన్ చైర్మన్, సభ్యుల నియామకంపై హైకోర్టు.. ఈ మేరకు ప్రభుత్వానికి చెప్పాలని వ్యాఖ్య



సాక్షి, హైదరాబాద్: ఎస్సీ, ఎస్టీ కమిషన్ చైర్మన్, సభ్యుల నియామకం ఎప్పుడు చేపడతారో తెలియజేయాలని రాష్ట్ర ప్రభుత్వాన్ని హైకోర్టు ఆదేశించింది. ఎన్నికల సమయం వస్తోందని.. నియామకం చేపట్టకుంటే ఓట్లు రావని ప్రభుత్వానికి చెప్పాలని వ్యాఖ్యానించింది. తదుపరి విచారణను ఈ నెల 28కి వాయిదా వేస్తూ, అప్పటిలోగా వివరాలు అందజేయాలని స్పష్టం చేసింది. రాష్ట్ర ప్రభుత్వం ఎస్సీ, ఎస్టీ కమిషన్ చైర్మన్, సభ్యుల నియామకాలు చేపట్టకపోవడాన్ని సవాల్ చేస్తూ సికింద్రాబాద్‌కు చెందిన సామాజిక కార్యకర్త ఎస్.గణేశ్‌రావుతో పాటు మరొకరు హైకోర్టులో పిటిషన్ దాఖలు చేశారు. దీనిపై ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ ఉజ్జల్ భూయాన్, జస్టిస్ తుకారాంజీ ధర్మాసనం గురువారం విచారణ చేపట్టింది. వాదనలు విన్న ధర్మాసనం.. 2021 నుంచి ఎస్సీ, ఎస్టీ కమిషన్ చైర్మన్, సభ్యుల్లేక ఖాళీగా ఉన్నా ఎందుకు నియమించడం లేదని ప్రశ్నించింది. ఫిబ్రవరిలో దీనిపై విచారణ సందర్భంగా నియామకం చేపట్టమని ఆదేశించాం కదా? అని ప్రభుత్వ న్యాయవాదిని నిలదీసింది. నియామకానికి ప్రభుత్వం ఇప్పటికే చర్యలు చేపట్టిందని, రెండు వారాల సమయం కావాలని ఆయన కోరారు. దీంతో ధర్మాసనం.. తదుపరి విచారణను జూన్ 28కు వాయిదా వేసింది.

కౌంటర్ దాఖలు చేయండి

కనీస వేతన సలహా మండలి చైర్మన్ నియామకంపై హైకోర్టు

సాక్షి, హైదరాబాద్: కనీస వేతన సలహా మండలి చైర్మన్‌గా అధికార పార్టీకి చెందిన వ్యక్తిని నియమించడంపై కౌంటర్ దాఖలు చేయాలని ఆదేశిస్తూ ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి, కార్మిక శాఖ కమిషనర్‌కు హైకోర్టు నోటీసులు జారీ చేసింది. తదుపరి విచారణ నాటికి కౌంటర్ దాఖలు చేయాలని స్పష్టం చేసింది. కనీస వేతన సలహా మండలి చైర్మన్‌గా బీఆర్ఎస్‌కు చెందిన పి.నారాయణను ప్రభుత్వం నియమించడాన్ని సవాల్ చేస్తూ తెలంగాణ రీజినల్ కాంట్రాక్ట్ కార్మిక సంఘం ప్రధాన కార్యదర్శి మాదిశెట్టి శ్రీనివాస్ పిటిషన్ దాఖలు చేశారు. దీనిపై ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ ఉజ్జల్ భూయాన్, జస్టిస్ తుకారాంజీ ధర్మాసనం గురువారం విచారణ చేపట్టింది. పిటిషనర్ తరఫున న్యాయవాది వాదనలు వినిపిస్తూ... నారాయణ, ఇతరులను చైర్మన్, సభ్యులుగా నియమిస్తూ మే 24న ప్రభుత్వం జీవో జారీ చేసిందన్నారు. బీఆర్ఎస్ కార్మిక విభాగం ప్రధాన కార్యదర్శి అయిన నారాయణను చైర్మన్‌గా నియమించడం కనీస వేతన చట్టం–1948, సెక్షన్ 9ని ఉల్లంఘించడమే అవుతుందని చెప్పారు. కనీస వేతన సలహా మండలి చైర్మన్‌గా నియమితులయ్యే వ్యక్తికి ఏ పార్టీతో సంబంధాలు ఉండకూడదని చట్టం చెబుతోందన్నారు. ప్రభుత్వం తరఫున స్పెషల్ జీపీ సంజీవ్‌కుమార్ వాదనలు వినిపించారు. అనంతరం ధర్మాసనం తదుపరి విచారణను జూలై 7కు వాయిదా వేసింది.

పీజీ ఈసెట్‌లో 91శాతం అర్హత

- ఇన్‌స్ట్రుమెంటల్‌లో 44 మార్కులకే టాప్ ర్యాంక్
- ఫలితాలు వెల్లడించిన ప్రొఫెసర్ ఆర్.లింబాద్రి
- ఆగస్టులో కౌన్సెలింగ్ ప్రక్రియ మొదలు

సాక్షి, హైదరాబాద్: ఇంజనీరింగ్ పోస్టు–గ్రాడ్యుయేట్ కోర్సుల్లో ప్రవేశానికి గత నెలలో నిర్వహించిన పీజీఈసెట్–2023 ఫలితాలను ఉన్నత విద్యామండలి చైర్మన్ ప్రొఫెసర్ ఆర్.లింబాద్రి గురువారం విడుదల చేశారు. ఈ పరీక్షలో మొత్తం 91.48 శాతం అర్హత సాధించినట్టు ఆయన పేర్కొన్నారు. పలు యూనివర్సిటీల పరిధిలో మొత్తం 19 కోర్సులకు 11,914 సీట్లు ఉన్నాయి. పీజీసెట్‌కు 16,563 మంది రిజిస్టర్ చేసుకున్నారు. 14,882 (89.85 శాతం) మంది పరీక్ష రాశారు. వీరిలో 11,520 మంది అర్హత సాధించారు. సివిల్ ఇంజనీరింగ్‌లో 2,239 మంది అర్హత సాధించారు. కంప్యూటర్ సైన్స్‌లో 1,158 మంది, మెకానికల్ ఇంజనీరింగ్‌లో 817 మంది, ఎలక్ట్రికల్ ఇంజనీరింగ్‌లో 1,388 మంది, ఫార్మసీలో అత్యధికంగా 4,001 మంది అర్హత పొందారు. జీమ్యాట్, గేట్, జీప్యాట్ పరీక్ష ఫలితాల తర్వాత ఆగస్టులో పీజీ ఇంజనీరింగ్ కోర్సులకు కౌన్సెలింగ్ నిర్వహిస్తామని లింబాద్రి తెలిపారు. పీజీఈసెట్‌లో టాప్ ర్యాంకులు పొందిన వారి పేర్లను జేఎన్‌టీయూహెచ్ వైస్ చాన్స్‌లర్ ప్రొఫెసర్ కట్టా నర్సింహారెడ్డి వెల్లడించారు.


కొన్ని బ్రాంచీల్లో వంద మార్కులకు 50 మార్కులు రాకున్నా రాష్ట్ర టాపర్‌గా ర్యాంకులు పొందడం విశేషం. ఏరోస్పేస్ ఇంజనీరింగ్‌లో జి.దివ్యహంస 47 మార్కులకే టాపర్‌గా నిలిచారు. ఇన్‌స్ట్రుమెంటేషన్ ఇంజనీరింగ్‌లో 44 మార్కులతోనే ఎండీ రహీల్ టాప్ ర్యాంకు పొందారు. ఈ బ్రాంచీల్లో పరీక్ష రాసిన వారి సంఖ్య కూడా తక్కువగా ఉంది. ఫలితాల వెల్లడి సందర్భంగా జరిగిన విలేకరుల సమావేశంలో పీజీఈసెట్ కన్వీనర్ ప్రొఫెసర్ బి.రవీందర్‌రెడ్డి, కో కన్వీనర్ ప్రొఫెసర్ జె.సురేశ్ కుమార్, రిజిస్ట్రార్ ప్రొఫెసర్ మంజూర్ హుస్సేన్, రెక్టార్ ప్రొఫెసర్ గోవర్ధన్‌రెడ్డి, ఉన్నత విద్యామండలి కార్యదర్శి డాక్టర్ శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

ప్రధాన బ్రాంచీల్లో టాపర్స్ వీరే...



నేడు, రేపు అక్కడక్కడా వర్షాలు

- కొన్ని జిల్లాల్లో వడగాడ్పులు వీచే అవకాశం
- హైదరాబాద్ వాతావరణ కేంద్రం వెల్లడి
- కుంచవెల్లిలో అత్యధికంగా 45.9 డిగ్రీల ఉష్ణోగ్రత నమోదు



సాక్షి, హైదరాబాద్: ఉత్తర ఛత్తీస్‌గఢ్ నుంచి తెలంగాణ మీదుగా కర్ణాటక వరకు కొనసాగుతున్న ద్రోణి గురువారం బలహీనపడిందని... దీని ప్రభావంతో శుక్ర, శనివారాల్లో రాష్ట్రంలో అక్కడక్కడా ఉరుములు, మెరుపులు, ఈదురు గాలులతో కూడిన వర్షాలు కురిసే అవకాశం ఉందని హైదరాబాద్ వాతావరణ కేంద్రం తెలిపింది. మరి కొన్నిచోట్ల తేలికపాటి నుంచి మోస్తరు వర్షాలు కురిసే అవకాశం ఉంది. గత 24 గంటల్లో గద్వాల జిల్లా జూరాలలో 5 సెంటీమీటర్ల వర్షపాతం నమోదైంది. వనపర్తి జిల్లా ఖిలా ఘన్‌పూర్‌లో 4, నల్లగొండ జిల్లా దేవరకొండలో 3 సెంటీమీటర్ల చొప్పున వర్షపాతం నమోదైంది. మరోవైపు శుక్రవారం ఖమ్మం, నల్లగొండ, సూర్యాపేట, కొత్తగూడెం, ఆదిలాబాద్, కొమురం భీం, మంచిర్యాల, నిర్మల్ జిల్లాల్లో వడగాడ్పులు వీచే అవకాశం ఉందని వాతావరణ కేంద్రం తెలిపింది. గురువారం కొమురం భీం జిల్లా కుంచవెల్లిలో అత్యధికంగా 45.9 డిగ్రీల సెల్సియస్ ఉష్ణోగ్రత నమోదైంది.

గురువారం రాష్ట్రంలో నమోదైన గరిష్ట ఉష్ణోగ్రతలు..(సెల్సియస్‌లలో)

ప్రాంతం	గరిష్ట ఉష్ణోగ్రత	ప్రాంతం	గరిష్ట ఉష్ణోగ్రత
కుంచవెల్లి (కొమురంభీం)	45.9	భద్రాచలం	43.2
రవీంద్రనగర్ (కొమురంభీం)	45.5	ఆదిలాబాద్	42.3
కేతేపల్లి (నల్లగొండ)	45.1	నల్లగొండ	42.0
వీణవంక (కరీంనగర్)	44.8	హనుమకొండ	41.0
గార్ల (మహబూబాబాద్)	44.7	రామగుండం	42.2
యానంబైలు (భద్రాద్రి కొత్తగూడెం)	44.6	మెదక్	41.2
కొత్తపల్లి-ధర్మారం (కరీంనగర్)	44.5	హైదరాబాద్	39.7
జంబుగ (కొమురంభీం)	44.5	నిజామాబాద్	40.9
ఖమ్మం	43.6	మహబూబ్‌నగర్	38.6

కొరగాని 'కంపల్సరీ' జీవో!

- పోలీసు శాఖలో పదోన్నతులకు అడ్డుగా మారిన ఉమ్మడి రాష్ట్రం నాటి ఉత్తర్వులు
- లూప్‌లైన్‌లో విధులు తప్పనిసరని నాడు ఉత్తర్వులు
- ఇది సాధ్యం కాదని తెలిసినా ఇప్పటికీ అమల్లోనే...
- దీంతో ప్రతిసారీ ఆలస్యమవుతున్న ప్రమోషన్ల ప్రక్రియ
- రాష్ట్ర పోలీసు విభాగంలో విచిత్ర పరిస్థితి

సాక్షి, హైదరాబాద్: పోలీసు విభాగంలో పదోన్నతుల ప్రక్రియ 'కంపల్సరీ జీవో'వల్ల ప్రతిసారీ ఆలస్యం అవుతోంది. ఉమ్మడి రాష్ట్రంలో అప్పటి పరిస్థితులను బట్టి ఇచ్చిన ఈ ఉత్తర్వులు ఇప్పటివరకు ఒక్కసారి కూడా పక్కాగా అమలైన సందర్భం లేదు. దీంతో సీనియారిటీ లిస్టులు తయారుచేసే ప్రతి సందర్భంలోనూ ఆ జీవోలోని నిబంధనలకు మినహాయింపు ఇస్తూ మరో జీవో జారీ చేయడం రివాజుగా మారింది. కొరగాకుండా మారిన నాటి ఉత్తర్వులను పూర్తిగా ఎత్తేయాలని అధికారులు, సిబ్బంది కోరుతున్నారు.

నాడు జీవో ఎందుకు తెచ్చారు?

ఒకప్పుడు రాష్ట్ర పోలీసు విభాగంలో సిబ్బంది, అధికారుల కొరత తీవ్రంగా ఉండేది. ఉన్న వాళ్లు లూప్‌లైన్లలో పని చేయడానికి ఆసక్తి చూపేవాళ్లు కాదు. దీంతో పోలీసు విభాగంలో అడుగుపెట్టిన, పదోన్నతి పొందిన వాళ్లు కచ్చితంగా మూడేళ్లు లూప్‌లైన్‌లో పనిచేయాలంటూ ఉత్తర్వులిచ్చారు. అలా చేసిన వాళ్లే తదుపరి పదోన్నతికి అర్హులవుతారని స్పష్టం చేశారు. క్షేత్రస్థాయిలో ఉన్న పరిస్థితుల కారణంగా ప్రతి అధికారీ లూప్‌లైన్‌లో పని చేయడం సాధ్యంకాదు. ఆ అధికారి, సిబ్బందికి ఉన్న సామర్థ్యం, అనుభవం తదితరాలతోపాటు వేకెన్సీని బట్టి ప్రతి బ్యాచ్‌లోనూ కొందరికి అసలు లూప్‌లైన్ అంటే ఏమిటో తెలియని పరిస్థితి ఉంటుంది. దీంతో వీరితో కలిసి సీనియారిటీ లిస్టులు తయారు చేయాలంటే 'లూప్‌లైన్ కంపల్సరీ'జీవో నుంచి మినహాయింపు ఇస్తూ మరో జీవో జారీ చేయాల్సిందే. ఆ తర్వాతే సీనియారిటీ జాబితా తయారీ, డిపార్ట్‌మెంటల్ ప్రమోషన్ కమిటీ (డీపీసీ) సమావేశం జరుగుతాయి. ఆ తర్వాతే పదోన్నతుల ఉత్తర్వులు వెలువడతాయి.

మినహాయింపు జీవో ఇవ్వాల్సిందే..

రాష్ట్ర పోలీసు విభాగంలో ప్రస్తుతం అధికారులు, సిబ్బంది కొరత ఉమ్మడి రాష్ట్రంలో ఉన్న స్థాయిలో లేదు. మరోపక్క ప్రోత్సాహకాల కారణంగా అనేక లూప్‌లైన్లలో పోస్టింగ్ హాట్‌కేక్‌గా మారి పైరవీలు చేయించుకునే వరకు వెళ్లింది. సాధారణంగా పోలీసు అకాడమీ, సీఐడీ, ఇంటెలిజెన్స్, జీఆర్పీ, ఎస్‌బీ, విజిలెన్స్, ట్రాన్స్‌కో, జీహెచ్‌ఎంసీ తదితర విభాగాలను లూప్‌లైన్లుగా పరిగణిస్తారు.

ఇప్పుడేం జరుగుతోంది...

ప్రస్తుతం పోలీసు విభాగంలో 2009 బ్యాచ్‌కు చెందిన దాదాపు 200 మంది ఎస్సైలకు ఇన్‌స్పెక్టర్లుగా, 1996, 98 బ్యాచ్‌లకు చెందిన 165 మంది ఇన్‌స్పెక్టర్లకు డీఎస్పీలుగా పదోన్నతి ఇచ్చే ప్రక్రియ మొదలైంది. వీరికి సంబంధించిన మినహాయింపు జీవో ఫైల్ ప్రభుత్వం వద్ద పెండింగ్‌లో ఉంది. దీంతో పదోన్నతుల ప్రక్రియ కొన్నాళ్లుగా ఆలస్యం అవుతోంది. 'వరంగల్‌లో 2012 బ్యాచ్‌కు చెందిన ఎస్సైలు కూడా ఇన్‌స్పెక్టర్లు అయ్యారు. 2009 బ్యాచ్‌లో మొదటి విడత అధికారులకు పదోన్నతి ఐదేళ్ల క్రితం వచ్చింది. మొత్తానికి ఇన్నాళ్లకు మాకూ పదోన్నతి వస్తోందని ఆశపెట్టుకున్నాం. మినహాయింపు జీవో జారీలో ఆలస్యం కారణంగా ఈ ప్రక్రియకు బ్రేక్ పడింది'అని ఓ ఎస్సై ఆవేదన వ్యక్తం చేశారు.

ప్రస్తుతం సీఐడీలో 25 శాతం, ఎస్‌బీ, ఇంటెలిజెన్స్‌ల్లో 50 శాతం, అకాడమీలో 20 శాతం వేతనంపై ప్రోత్సాహకం, ట్రాన్స్‌కోలో టీఏ ఇస్తున్నారు. దీంతో వీటిలో పోస్టింగ్స్ కోసం ఎగబడే పరిస్థితులున్నాయి. మిగిలిన లూప్‌లైన్లకూ కొందరు అధికారుల కారణంగా డిమాండ్ ఉంటోంది. ఈ నేపథ్యంలో ఉమ్మడి రాష్ట్రంలో ఇచ్చిన 'కంపల్సరీ జీవో'కొరగాకుండా పోయింది. అయినప్పటికీ అది అమలులో ఉండటంతో మినహాయింపు జీవో జారీ కచ్చితమైంది.

రేపు జాతీయ లోక్ అదాలత్

హైకోర్టు, తాలూకా కోర్టుల్లో నిర్వహణ

సాక్షి, హైదరాబాద్: ఎన్‌ఐ యాక్ట్ కేసులు, ఎక్సైజ్ కేసులు, కార్మిక వివాదాలు, మ్యాట్రిమోనియల్, సివిల్ కేసుల్లో రాజీ కోసం రేపు(శనివారం) జాతీయ లోక్ అదాలత్ నిర్వహించనున్నారు. ఈ మేరకు రాష్ట్ర న్యాయ సేవాధికార సంస్థ(టీఎస్ఎల్ఎస్ఏ) సభ్య కార్యదర్శి ఎస్.గోవర్ధన్‌రెడ్డి గురువారం ఓ ప్రకటన విడుదల చేశారు. జాతీయ న్యాయసేవాధికార సంస్థ ఆదేశాల మేరకు ఈ కార్యక్రమాన్ని ఫిజికల్‌గా, ఆన్‌లైన్‌లో నిర్వహిస్తున్నట్లు వెల్లడించారు.

హైకోర్టుతో పాటు తాలూకా కోర్టుల్లోనూ ఈ లోక్ అదాలత్ నిర్వహించడం జరుగుతుందని పేర్కొన్నారు. కేసులను పరిష్కరించుకోవాలనుకునే వారు జిల్లా న్యాయసేవాధికార సంస్థ చైర్మన్, న్యాయసేవా సదన్, మండల న్యాయసేవా కమిటీలను సంప్రదించాలని తెలిపారు. అలాగే రుణ రికవరీ ట్రిబ్యునల్‌లోనూ 10న లోక్ అదాలత్ నిర్వహిస్తున్నట్లు బార్ అసోసియేషన్ అధ్యక్షుడు సంజయ్‌కుమార్ ఓ ప్రకటన విడుదల చేశారు. అబిడ్స్ త్రివేణి కాంప్లెక్స్‌లోని రుణ రికవరీ ట్రిబ్యునల్ 1, 2 ప్రాంగణంలోనే ఈ కార్యక్రమం జరుగుతుందని, కక్షిదారులు వినియోగించుకోవాలని సూచించారు.

జి-20 సదస్సుకు సమన్వయంతో ఏర్పాట్లు

డీజీపీ అంజనీకుమార్

సాక్షి, హైదరాబాద్: నగరంలో ఈ నెల 15, 16, 17 తేదీల్లో జరగనున్న ప్రతిష్టాత్మక జి-20 వ్యవసాయ మంత్రుల సమావేశాన్ని విజయవంతం చేసేందుకు అన్ని శాఖలు సమన్వయంతో పనిచేయాలని డీజీపీ అంజనీకుమార్ కోరారు. జి-20 వ్యవసాయ శాఖ మంత్రుల సమావేశం నిర్వహణ, భద్రత ఏర్పాట్లపై గురువారం డీజీపీ కార్యాలయంలో వివిధ శాఖలతో భద్రత సమన్వయ సమావేశం నిర్వహించారు. సమావేశానికి అడిషనల్ డీజీలు అభిలాష బిస్త్, విజయ్‌కుమార్, సంజయ్‌కుమార్ జైన్, సైబరాబాద్ కమిషనర్ స్టీఫెన్ రవీంద్ర, జీపీడీ డైరెక్టర్ అర్వీందర్ సింగ్, ఎన్‌ఎస్‌జీ, ఐబీ, పాస్‌పోర్ట్, కస్టమ్స్, అగ్ని మాపక, వ్యవసాయ, సాంస్కృతిక శాఖాధికారులు హాజరయ్యారు. డీజీపీ మాట్లాడుతూ, సమావేశాని కి వివిధ దేశాల నుంచి ప్రముఖులు, ఉన్నతాధికారులు, శాస్త్రవేత్తలు పెద్దసంఖ్యలో హాజరవుతున్నందున తగిన భద్రత ఏర్పాట్లు చేస్తున్నట్లు తెలిపారు. జి-20 సమావేశానికి తెలంగాణ సాంస్కృతిక కళారూపాలను పరిచయం చేయడానికి 300 మందికి పైగా కళాకారులతో ప్రత్యేక ప్రదర్శనలకు ఏర్పాట్లు చేస్తున్నట్టు సాంస్కృతిక శాఖ డైరెక్టర్ హరికృష్ణ తెలిపారు.



సమావేశంలో మాట్లాడుతున్న డీజీపీ అంజనీకుమార్

సివిల్స్ టాపర్లను అభినందించిన డీజీపీ

ఇటీవల విడుదలైన యూపీఎస్సీ ఫలితాల్లో 35వ ర్యాంకు సాధించిన అజ్మీర సంకేత్‌కుమార్, 78వ ర్యాంకు సాధించిన ఉత్కర్ష్ కుమార్, 646వ ర్యాంకు సాధించిన అపూర్వను డీజీపీ అంజనీకుమార్, సీఐడీ అడిషనల్ డీజీ మహేశ్ భగవత్ అభినందించారు. అదేవిధంగా సీఏపీఎఫ్ (సెంట్రల్ ఆర్మ్‌డ్ పోలీస్ ఫోర్సెస్)లో అసిస్టెంట్ కమాండెంట్ పరీక్షలో 30వ ర్యాంకు సాధించిన రాజ్‌మోహన్ రెడ్డి, 50వ ర్యాంకు సాధించిన మధుసూధన్‌రెడ్డిలను కూడా పుష్పగుచ్ఛాలతో అభినందించారు. ఈ కార్యక్రమంలో శాంతిభద్రతల అడిషనల్ డీజీ సంజయ్‌కుమార్ జైన్, పోలీస్ అకాడమీ డైరెక్టర్ సందీప్ శాండిల్య పాల్గొన్నారు.

ఓ విశ్వాసులారా! నిశ్చయంగా, దైవభీతి గలవారు చెలమలు గల స్వర్గవనాలలో ఉంటారు.
– ఇస్లాం ధర్మం

సాక్షి
శుక్రవారం, 9 జూన్ 2023

అందీ అందని మేఘసందేశం

వాన రాకడ... ప్రాణం పోకడ చెప్పలేమంటారు. చిత్రంగా ఏటా నిర్ణీత సమయానికి వచ్చే తొలకరి చినుకుల రాకడ కూడా ఇప్పుడు దాదాపు అలాగే తయారవుతోంది. నైరుతి ఋతుపవనాలు సాధారణంగా జూన్ 1న కేరళ తీరాన్ని తాకుతాయి. అయితే, ఈసారి అంతకన్నా ముందుగా మే 27 నాటికే ఋతుపవనాలు వస్తాయంటూ భారత వాతావరణ శాఖ (ఐఎండీ) కొంతకాలం క్రితం అంచనా వేసింది. ఆ తర్వాత జూన్ 4 అంటూ కొత్త అంచనా చెప్పింది. తీరా అసలుకే లెక్క తప్పి, జూన్ 7 దాటినా చినుకు జాడ లేకపోవడం గమనార్హం. ఇక, తాజాగా అరేబియా సముద్రంలో ఏర్పడ్డ వాయుగుండం 'బిపర్‌జయ్' సైతం ఈసారి ఋతుపవనాలపై దుష్ప్రభావాన్ని చూపనున్నట్టు తాజా వార్త. అసలే వారానికి పైగా ఆలస్యమైన వానలకు ఇది ఊహించని అవరోధం. తొలకరి చినుకును శాస్త్రీయంగా అంచనా వేయడంలో తప్పుతున్నామా, లేక పర్యావరణంలో మార్పులతో పూర్తిగా లెక్కలే మారిపోతున్నాయా అన్నది ఇప్పుడు జవాబు వెతకాల్సిన ప్రశ్న.

ఋతుపవనాలు వాతావరణ అంశమే కావచ్చు. కానీ భారత ఆర్థికరంగానికి అది అత్యంత కీలకం. దేశానికి 'అసలైన' ఆర్థికమంత్రి ఋతుపవనాలే అని ఓ మాజీ రాష్ట్రపతి గతంలో వ్యాఖ్యానించారు. దేశ వార్షిక వర్షపాతంలో 70 శాతానికి పైగా అందించే నైరుతి ప్రాధాన్యానికి ఆ వ్యాఖ్యలే మచ్చుతునక. బిపర్‌జయ్ దెబ్బతో ఋతుపవనాలు బలహీనమై, వాటి రాకకు మరో 48 గంటలు పట్టవచ్చని శాస్త్రవేత్తల హెచ్చరిక. వరుసగా రెండు రోజులు లక్షద్వీప్, కేరళ, కోస్తా కర్ణాటకలో వానలు కురిస్తేనే ఋతుపవనాలు వచ్చినట్టు లెక్క. ప్రస్తుతం కేరళలో కురుస్తున్న వానలు వాయుగుండం ప్రభావంతోనేనట. పైగా నలుమూలలా ఋతుపవనాలు విస్తరించడానికి మరింత సమయం పడుతుందంటున్నారు. కారణాలేమైనా – ఈ జాప్యంతో, బలహీనమైన వానలతో ఈ జూన్‌లో పడాల్సిన వర్షపాతం తగ్గడం అనివార్యం. దీర్ఘకాలిక సగటు (ఎల్పీఏ) వర్షపాతం కనీసం 20 శాతం తగ్గుతుందని ప్రైవేట్ వాతావరణ సంస్థ స్కైమెట్ అంటోంది. ఈ జాప్యాల నడుమ పొలం పనులు కనీసం వారం రోజులు వెనక్కి వెళ్ళకా తప్పదు. వెరసి ఇది ఆర్థిక వ్యవస్థపై ప్రభావం చూపవచ్చు.

అసలే ఈ ఏడాదీ వేసవిలో ఎండలు దంచేస్తున్నాయి. ఉష్ణపవనాల తాకిడి ఉండనే ఉంది. ఫలితంగా ఈసారి వర్షపాతం సాధారణం కన్నా తక్కువుంటుందని స్కైమెట్ జోస్యం. కొద్ది నెలల క్రితమే చెప్పిన ఈ జోస్యం నిజమై, జూన్ – సెప్టెంబర్‌ల మధ్య సాధారణ వర్షపాతంలో 94 శాతమే కురిస్తే చిక్కులు తప్పవు. ఆసియాలోని మూడో పెద్ద ఆర్థిక వ్యవస్థ అయిన మనం ఇరుకున పడతాం. వరి, చెరకు లాంటి పంటల దిగుబడి తగ్గి, ఆహార ధరలు అమాంతం పెరుగుతాయి. గమనిస్తే – నిరుడు మార్చిలో శతాబ్ద కాలంగా ఎన్నడూ లేనంతటి ఉష్ణోగ్రత, ఉడుకెత్తించిన ఉష్ణపవనాల వల్ల గోదుమల ఉత్పత్తి తగ్గింది. కొన్ని ఎగుమతులపై నిషేధం తప్పలేదు. ఈసారీ వ్యావసాయిక ఉత్పత్తులు తగ్గితే కష్టమే. ఆహార ద్రవ్యోల్బణం ఇంకా హెచ్చి, ఖజానాపై భారం పడుతుంది. కోట్లాది సామాన్యులకు కడుపు నిండా తిండి కష్టమవుతుంది.

నిజానికి, ఏటా జూన్ నుంచి సెప్టెంబర్ వరకు నాలుగు నెలలు మనకు నైరుతి ఋతుపవనాల కాలం. వార్షిక వర్షపాతంలో అత్యధికం ఈ సీజన్‌లో కురిసేదే. అందుకే, మన దేశంలో సాంస్కృతికంగానే కాక ఆర్థిక కాలపట్టికలోనూ ఈ ఋతుపవనాలు కేరళను తాకే రోజుకు ప్రత్యేక స్థానం ఉంది. గత పదేళ్ళలో 2018లో, 2022లో ఋతుపవనాలు ముందుగానే వచ్చాయి. గత ఏడాది మే 29కే తొలికరి కురిసింది. అలాగే, గత దశాబ్దిలో అతి ఆలస్యంగా వానలు మొదలైంది 2019లో. ఆ ఏడాది జూన్ 8న కానీ పుడమి తడవలేదు. ఈసారి జాప్యంలో ఆ రికార్డు బద్దలవుతున్నట్టుంది. ఈ ఆలస్యానికీ, ముందస్తుగానే ముగిసిపోవడానికీ ఎల్ నినో లాంటివి కూడా కారణమని శాస్త్రజ్ఞుల ఉవాచ. ఈ వాతావరణ మార్పుల మధ్య ఋతుపవనాల జోస్యం తప్పకూడదంటే, సమర్థంగా లెక్కలు కట్టాలి.

ఐఎండీ పరిశోధకులు పదేళ్ళ పైగా శ్రమించి, ఏటా ఎప్పుడు, ఎంత వర్షం పడుతుందని అంచనా వేసేందుకు కొత్త విధానం రూపొందించారు. కచ్చిత అంచనాలందించే విధాన రూపకల్పన కోసం 2012లో ఏర్పాటైన నేషనల్ మాన్‌సూన్ మిషన్ సైతం ఫలితమిస్తోంది. చారిత్రక విధానాలపై కాక, అప్పటికప్పుడు క్షేత్రస్థాయిలో సమాచారం సేకరించే పద్ధతిని అది ప్రవేశపెట్టింది. దానితో పాటు ప్రపంచవ్యాప్తంగా ఉన్న 10 వాతావరణ నమూనాలను పరిగణనలోకి తీసుకొని, విస్తృత సమాచారాన్ని సేకరించి, పరీక్షించి, దక్షిణాసియా వాతావరణానికి సరిపడే నాలుగైదింటిని ఖరారు చేసే శ్రమతో కూడిన పని సాగుతోంది. ఇక, 2016లో ఆమోదించిన కొత్త నిర్వచనాలు, పరామితుల ఆధారంగా ఐఎండీ ఋతుపవనాల రాకను మునుపటి కన్నా మెరుగ్గా అంచనా కట్టి ప్రకటిస్తోంది.

ఇంత చేసినా ప్రతి జూన్‌లో కచ్చితమైన అంచనా కట్టలేకపోతున్న వానల వ్యవహారం చూస్తుంటే, మరింత లోతైన అధ్యయన అవసరం కనిపిస్తోంది. పరిశోధనలు పెరగాల్సిన అగత్యం అర్థమవుతోంది. వాతావరణ మార్పులతో ఉక్కిరిబిక్కిరవుతున్న భారత్‌కు అంచనాల్లో కచ్చితత్వం కీలకం. దీనితోనే రైతులకు మార్గదర్శనం, పంటల సంరక్షణ వీలవుతుంది. పెరుగుతున్న ప్రపంచ ఉష్ణోగ్రతలతో ఇతర సముద్రాల కన్నా వేగంగా హిందూ మహాసముద్రం వేడెక్కుతోంది. ఫలితంగా భూ, సముద్ర ఉష్ణోగ్రతల మధ్య తేడా తగ్గిపోతోంది. అంటే, రానున్న ఏళ్ళలో ఋతుపవనాలు మరింత జాప్యమవుతాయని విశ్లేషణ. మారుతున్న పర్యావరణంతో వాన, వాతావరణంపై కచ్చితమైన జోస్యం చెప్పడం సవాలే. కానీ, ఏ సవాలుకైనా శాస్త్ర విజ్ఞానం, సమగ్ర పరిశోధనలే పరిష్కారం కదా!

అనివార్య వ్యూహాత్మక భాగస్వాములు

అమెరికా రక్షణ మంత్రి మొన్న భారత్ వచ్చారు. ప్రధాని మోదీ అమెరికా వెళ్లనున్నారు. ఇరుదేశాల సంబంధాలు ప్రస్తుతానికి ఏకీభావంతోనే నడుస్తున్నాయి. అయితే అమెరికాలోని ఒక వర్గం వ్యూహకర్తలు ఈ భాగస్వామ్యాన్ని బలహీన పరిచే అంశాలను ఎత్తిచూపుతున్నారు. చైనా దూకుడుకు చెక్ పెట్టడంలో భారత్ క్రియాశీల భాగస్వామిగా ఉండాలని అమెరికా ఆశిస్తోందని వారు అంటున్నారు. ఉక్రెయిన్ ఘర్షణలో రష్యాకు బదులుగా పాశ్చాత్య దేశాల వైపు భారత్ నిలబడాలని సలహా ఇచ్చారు. భాగస్వామికీ, మిత్రపక్షానికీ తేడా ఉంది. అమెరికా, భారత్ వ్యూహాత్మక భాగస్వాములు. ఒకరిపై ఒకరు ఆధారపడాల్సిన అవసరముందని ఇరు దేశాలూ గ్రహించాలి. ఇరువురి జాతీయ అవసరాలను గుర్తించగలిగితే సంబంధాలు బలపడతాయి.

విశ్లేషణ



లెఫ్టినెంట్ జనరల్ అనిల్ అహూజా (విశ్రాంత)

అమెరికా, భారత్ మధ్య వ్యూహాత్మక సంబంధాలు సమాంతర పట్టాలపైన ఏకీభావంతోనే నడుస్తున్నట్లు కనిపిస్తోంది. అమెరికా అధ్యక్షుడు జో బైడెన్, భారత ప్రధాని నరేంద్ర మోదీ గత నెలలో హిరోషిమాలో కలుసుకున్న తీరు, అమెరికా రక్షణ శాఖ మంత్రి లాయిడ్ ఆస్టిన్ జూన్ 4, 5 తేదీల్లో భారత్‌కు విచ్చేసిన వైనం (2021లో బాధ్యతలు చేపట్టాక ఆయన రెండో సారి రావడం), ఈ నెల చివరలో ప్రధాని మోదీ అమెరికాలో పర్యటించనుండటం... ఈ మూడింటినీ పరిగణనలోకి తీసుకుంటే ద్వైపాక్షిక సంబంధాలు సరైన దిశలోనే సాగుతున్నట్లు అర్థమవుతుంది.

అమెరికాలోని ఒక వర్గం వ్యూహకర్తల నుంచి వస్తున్న సంకేతాలు, ఈ భాగస్వామ్యాన్ని బలహీన పరిచే అంశాలను ఎత్తిచూపుతున్నాయి. 'ఫారిన్ ఎఫైర్స్'లో ఇటీవల ప్రచురితమైన కథనం... చైనా ఏకపక్ష దూకుడుకు చెక్ పెట్టే ప్రయత్నాల్లో భారత్ క్రియాశీల భాగస్వామిగా ఉండాలని అమెరికా ఆశిస్తోందని చెబుతోంది. ఈ అంచనా అంత సరైంది కాదు. అమెరికా, చైనా ఘర్షణల్లో వేలుపెట్టేందుకు భారత్ ఏమాత్రం సిద్ధంగా లేదు. దీనివల్ల తమ భద్రతకు ముప్పు అని భారత్‌కు తెలుసు. వ్యూహాత్మక, సాంకేతిక పరిజ్ఞాన భాగస్వామ్యానికి భారత్ తగినది కాదన్న ధ్వని కూడా ఆ కథనంలో వినిపించింది.

'ఫైనాన్షియల్ టైమ్స్'లో ప్రత్యక్షమైన ఇంకో కథనం కూడా అమెరికా లేదా చైనా ఆధిపత్యంలోని ప్రపంచాన్ని భారత్ కోరుకోవడం లేదనీ, పొరుగు దేశం కంటే అగ్రరాజ్యం ఆధిపత్యాన్ని స్వల్పకాలికంగానైనా సహించే స్థితిలో భారత్ ఉందనీ సూచించింది. 'ఫారిన్ ఎఫైర్స్'లోనే గతంలో ప్రచురితమైన ఇంకో కథనం, ఉక్రెయిన్ యుద్ధం నేపథ్యంలో రష్యాకు బదులుగా పాశ్చాత్యదేశాల వైపు భారత్ నిలబడాలనీ, అది ఆ దేశాన్ని శక్తిమంతంగా మారుస్తుందనీ వ్యాఖ్యానించింది. అమెరికా దృష్టిలో నమ్మదగ్గ భాగస్వామిగా నిలిచేందుకు ఇదే మంచి అవకాశమని భారత్‌కు సలహా కూడా ఇచ్చింది.

ఈ రకమైన కథనాలు ఏ సందర్భంలో వస్తున్నాయి? ఎనిమిది నెలల్లో ఆరుసార్లు భారత్, అమెరికా సంయుక్తంగా మిలిటరీ కార్యకలాపాలు చేపట్టినప్పుడు! ఇరుదేశాల మధ్య 'ఇనిషియేటివ్ ఆన్ క్రిటికల్ అండ్ ఎమర్జింగ్ టెక్నాలజీస్' (ఐసెట్) ప్రారంభ సమావేశం జరిగిన కొంత కాలానికి! అంతేనా? ఈ ఏడాది జనవరి 31నే ఇరు దేశాల భద్రత సలహాదారులు వాషింగ్టన్‌లో సమావేశమయ్యారు కూడా. అంతకు మునుపు కూడా భారత్, అమెరికా రెండూ రక్షణ, భద్రతలకు సంబంధించిన అంశాల్లో భాగస్వామ్యం ఏర్పాటయ్యేందుకు పునాది రాళ్లు వేసుకున్నాయి. ఒక్క విషయమైతే స్పష్టం. ఈ సానుకూల దృక్పథాన్ని తిరోగమన బాట పట్టించాలని అమెరికా అనుకోవడం లేదు. కాకపోతే ద్వైపాక్షిక సంబంధాలను ఒక్కసారి సమీక్షించుకుని అవసరమైన మార్పులు చేర్పులు చేసుకోవాలని ఆశిస్తున్నట్లు కనిపిస్తోంది. ఇది కూడా అర్థం చేసుకోదగ్గ విషయమే.



'ఫారిన్ ఎఫైర్స్' మ్యాగజైన్‌లో భారత్ నమ్మదగ్గ భాగస్వామి కాదన్న అభిప్రాయాన్ని వ్యక్తం చేసిన కథనం ఒక విషయాన్ని మరచిపోయింది. భాగస్వామికీ, మిత్రపక్షానికీ మధ్య తేడా ఉంది. వారి దృక్కోణాలు వేరుగా ఉండేందుకు ప్రధాన కారణం ఇదే. సంక్షోభాల సమయంలో అమెరికా చేసిన సాయాన్ని భారత్ ఎప్పటికప్పుడు గుర్తిస్తూనే ఉంది. మైత్రి దృఢంగా మారేందుకు ఇది చాలా కీలకం. అదే సమయంలో తన జాతీయ భద్రత విషయంలో అమెరికాపై భారత్ ఏమాత్రం బాధ్యత, బరువు పెట్టడం లేదు. సామర్థ్యం విషయంలో తేడాలున్నప్పటికీ భారత్, చైనా రెండూ తమ సార్వభౌమత్వాలను కాపాడుకునేందుకు ఎంతగా కట్టుబడి ఉన్నాయో ఇప్పటికే పలుమార్లు నిరూపించుకున్నాయి.

తూర్పు, దక్షిణ చైనా సముద్రాల్లో భారత్ సిద్ధం చేసుకుంటున్న వ్యవస్థలు తమకు మద్దతుగానే అని అమెరికా మేధావులు భావిస్తుంటారు. అయితే మిలిటరీ వర్గాలు మాత్రం మన భద్రత కోసమే అయినప్పటికీ వాస్తవాధీన రేఖ వెంబడి భారత్ సైన్యం మోహరించడం మేలనీ, తద్వారా చైనా బలగాలు తూర్పు దిక్కున తక్కువ అవుతాయనీ భావిస్తారు. అలాగే భారత నావికాదళం అమెరికా, ఇతర భాగస్వాముల సాయంతో హిందూ మహా సముద్ర ప్రాంతంలో నౌకా సంబంధ భద్రతకు కేంద్ర బిందువుగా నిలవగలదు. తద్వారా అమెరికాపై ఒత్తిడి కొంత తగ్గుతుంది.

గతాన్ని మరచి ఇరు దేశాల మిలిటరీ వర్గాలు తమ సంబంధాలను మరింత ముందుకు తీసుకెళ్లాలి. ఇరు వర్గాల మధ్య ఇప్పటికే ప్రశంసించదగ్గ స్థాయిలో సహకారం నడుస్తోంది. సమాచార వినిమయం, నైపుణ్యాలకు మెరుగుపెట్టుకోవడమూ జరుగుతోంది. యుద్ధ విద్యల సామర్థ్యాల్లోనూ, రక్షణ టెక్నాలజీల వ్యాపారంలోనూ ముందడుగులు పడుతున్నాయి. ఇలా సర్వసన్నద్ధమైన బలగాలు అందుబాటులో ఉండటం వల్ల నేతలు ఇతర ముఖ్యమైన అంశాలపై తమ దృష్టిని కేంద్రీకరించే వీలు ఏర్పడుతుంది.

టెక్నాలజీ రంగంలో సహకరించుకోవడం అనేది ఇరు దేశాలు ఎంతో ఆసక్తిగా చూస్తున్న అంశం. ద్వైపాక్షికంగానే కాదు... 'క్వాడ్' సభ్యదేశాలుగానూ ఇది చాలా ముఖ్యమైంది. 'ఇనిషియేటివ్ ఆన్ క్రిటికల్ అండ్ ఎమర్జింగ్ టెక్నాలజీస్' కింద కీలక అంశాలను ఎంపిక చేసేందుకు సిద్ధమవుతున్న తరుణమిది. సెమీకండక్టర్ రంగంలో పెట్టుబడులు, ఏరో ఇంజిన్ ఉత్పత్తిని భారత్‌కు తరలించడం వంటివి ఏవైనా కావచ్చు... ఏవైనా అపోహలుంటే వాటిని తొలగించుకునేందుకు ఇదే మంచి సమయం.

'డిఫెన్స్ టెక్నాలజీ అండ్ ట్రేడ్ ఇనిషియేటివ్' (డీటీటీఐ) విఫలమైన నేపథ్యంలో దానికి బదులుగా 'ఐసెట్' వచ్చిందనేది తప్పుడు అంచనా అవుతుంది. ఎందుకంటే ఇరు పక్షాలూ కలిసికట్టుగా పనిచేయడంలో ఉన్న సున్నితమైన అంశాలపై సంపూర్ణ అవగాహన పొందేందుకు డీటీటీఐ సాయపడింది కాబట్టి! అలాగే ఈ భాగస్వామ్యాల్లో నిర్ణయాధికారం అమెరికాదని కొందరు అనుకుంటూ ఉండటం కూడా అంత సరికాదు. ఎందుకంటే ఉమ్మడి శత్రువును ఎదుర్కొనేందుకు హిందూ – పసిఫిక్ మహా సముద్ర ప్రాంతలో వ్యూహాత్మక స్థిరత్వానికి సాంకేతిక రంగం విషయంలో ఇరు పక్షాల మధ్య అంతరం తగ్గాల్సిన అవసరముంది.

చివరగా, భారతీయ రక్షణ రంగ మార్కెట్ తన ఆయుధ తయారీదారులకు అందకుండా పోతుందన్న అమెరికా ఆందోళన గురించి... అమెరికా రక్షణ శాఖ మంత్రి ఆస్టిన్ 2021 మార్చిలో భారత్ వచ్చినప్పుడు ఇచ్చిన సూచన ఆచరణ సాధ్యమైంది. "భారతీయ సైనిక దళాలు అమెరికా ఆయుధ వ్యవస్థల తాలూకూ లాభాలను చవిచూసేందుకు అవకాశాలుండాలి. అప్పుడే వారు తమకు తగిన వాటిని ఎంచుకునే వీలు ఏర్పడుతుంది. అంతేకానీ అమెరికా ఒత్తిడి తీసుకొచ్చి వాటిని అమ్మే ప్రయత్నం చేయరాదు. ఇది ప్రతికూల ప్రభావం చూపుతుంది" అని వ్యాఖ్యానించారు ఆయన.

ఈ నెల నాలుగవ తేదీ భారత్‌కు విచ్చేసిన ఆస్టిన్ రక్షణ శాఖ మంత్రి రాజ్‌నాథ్ సింగ్‌ను ఆ మరుసటి రోజు కలిశారు. రక్షణ రంగ పారిశ్రామిక సహకారానికి ప్రణాళికలను ఖరారు చేసుకున్నారు. జాతీయ రక్షణ సలహాదారు అజిత్ ధోవల్‌తోనూ చర్చలు జరిపారు.

భారత్, అమెరికా అనివార్య భాగస్వాములు. ఒకరిపై ఒకరు ఆధారపడాల్సిన అవసరముందని ఇరు దేశాలూ గుర్తించాలి. ఇరువురి జాతీయ అవసరాలను గుర్తించగలగడం వంటి లక్షణాలను అలవర్చుకుంటే ఇరువురి మధ్య సంబంధాలు బలపడతాయి. ఇరు పక్షాలు చేసిన శత ప్రయత్నాల ఫలితంగానే ప్రస్తుత సుహృద్భావ మైత్రి ఏర్పడింది. రానున్న కొన్ని నెలల కాలం ఇప్పటికే సిద్ధంగా ఉన్న వ్యవస్థలను కార్యాచరణకు దింపే అవకాశాలను కల్పిస్తుంది.

వ్యాసకర్త ఇండియా–యూఎస్ డీటీటీఐ ఇంటర్ ఏజెన్సీ టాస్క్‌ఫోర్స్ మాజీ సహాధ్యక్షులు
('ద ట్రిబ్యూన్' సౌజన్యంతో)

సోషల్ మీడియా

సోషల్ నెట్ వర్కింగ్ వెబ్‌సైట్లు ఫేస్‌బుక్, ట్విట్టర్‌లలో సెలబ్రిటీల 'మనసులోని మాట'లు తాజాగా ఇలా...!

ఖండనార్హం



భారత మాజీ ప్రధాని ఇందిరా గాంధీ హత్యను ఉత్సవం చేసిన కెనడాలోని ఒక కార్యక్రమం గురించిన కథనాలు నన్ను ఆందోళనకు గురిచేశాయి. కెనడాలో ద్వేషానికీ, హింసను శ్లాఘించడానికీ స్థానం లేదు. ఇలాంటి చర్యలను నిర్ద్వంద్వంగా ఖండిస్తున్నాను.

– కామెరాన్ మాక్‌కే, ఇండియాలో కెనడా హై కమిషనర్

ఇందుకా?



ఫ్రెంచ్ పట్టణం ఆన్‌సీలో విచ్చలవిడి కత్తిపోట్ల వల్ల ఆరుగురు చిన్నారులు గాయపడ్డారు. దాడికి పాల్పడిన వ్యక్తి సిరియా శరణార్థి. అయినా అతివాద వామపక్షీయులు పడవలకొద్దీ శరణార్థులను బ్రిటన్ అనుమతించాలంటున్నారు.

– పాలా లండన్, బ్రాడ్‌కాస్టర్

నాకో దేశం ఉంది!



నాకు నార్వే పౌరసత్వం వచ్చిందని ఇప్పుడే తెలిసింది. మొట్టమొదటిసారి నా జీవితంలో, దేశం లేనివాడిని కాను. మా ముత్తాత, తాత, నాన్న అందరూ దేశం లేని పాలస్తీనియన్లు. నేనిప్పుడు నార్వేజియన్‌ని; ఎప్పటికీ పాలస్తీనియన్‌ని!

– ఇయాద్ ఎల్ బాగ్దాదీ, రచయిత

విసిగిస్తున్నారు



టెలిమార్కెటర్లకు వ్యతిరేకంగా చర్య తీసుకోవాల్సిన సమయం వచ్చిందనుకుంటున్నాను. డీఎన్‌డీ (డు నాట్ డిస్టర్బ్) రిజిస్టర్‌లో ఉన్నప్పటికీ ఫోన్ కాల్స్ చేసే చిరుద్యోగులనే కాదు, మన ప్రైవసీని భంగపరిచి సొమ్ము చేసుకునే బిగ్ బాసులపై కూడా! జైలు అనేది మరీ కఠినంగా అనిపించొచ్చు. కానీ చట్టం గట్టి శిక్ష ఏదో సిద్ధంచేయాలి.

– వీర్ సంఘ్వీ, జర్నలిస్ట్

గొప్ప విజయం



1980ల్లోని 80 శాతం అత్యంత పేదరికం నుంచి అత్యంత పేదరికం అనేది లేని దశకు చైనా చేరుకుంది. ఇది చరిత్రలో అత్యంత విజయవంతమైన ఆర్థికాభివృద్ధి. చైనా సాఫల్యాల పట్ల సంతోషించాలి. భయపడకూడదు.

– ఎరిక్ సోల్‌హెయిమ్, నార్వే మాజీ దౌత్యవేత్త

పోరాటాలే శరణ్యం

సందర్భం



కూనంనేని సాంబశివరావు

దేశానికి స్వాతంత్ర్యం వచ్చి 75 ఏళ్లు దాటింది. ఈ నాటికీ పేదరికం పరిష్కారం కాలేదు. దేశంలో దాదాపు 30 కోట్ల మంది కఠిన దారిద్ర్యంలో ఉన్నారు, గ్రామీణ ప్రాంతాల్లో నెలకు రూ. 276ల ఆదాయం, పట్టణ ప్రాంతాల్లో రూ. 296లలోపు ఆదాయం ఉన్న వారిని పేదలుగా పరిగణిస్తున్నారు. ఈ పరిగణన పూర్తిగా అశాస్త్రీయమైనది. నెలకు రూ. 10 వేల నుంచి రూ. 15 వేల వరకు సంపాదిస్తున్నవారు కూడా పేదరికాన్ని అనుభవిస్తున్నారు. దీన్ని పరిగణలోకి తీసుకుంటే దేశంలో దాదాపు 50 శాతానికి పైగా ప్రజలు పేదరికంలో ఉన్నట్లే. ఇటీవల విడుదలైన గ్లోబల్ హంగర్ ఇండెక్స్ ప్రకారం పాకిస్తాన్, బంగ్లాదేశ్, కొన్ని ఆఫ్రికన్ దేశాలకంటే కూడా భారతదేశం వెనుకబడి 107వ ర్యాంకులో ఉన్నది. 'ఆక్స్' నివేదిక ప్రకారం ఇండియాలో ఒక శాతం ప్రజల చేతుల్లో 45.5 శాతం సంపద, 10 శాతం ప్రజల చేతుల్లో 80 శాతం సంపద, 50 శాతం ప్రజల చేతుల్లో కేవలం 3 శాతం సంపద మాత్రమే ఉన్నది. ఈ విధంగా దేశం సంపన్న భారత్ – పేదరిక భారత్‌లుగా విడిపోయి అసమానతల భారత్‌గా రూపాంతరం చెందింది.


ఈ అంతరాలను రూపు మాపే క్రమంలో ప్రజలకు కనీస అవసరాలు ముందు తీర్చాలి. సొంత ఇల్లు, విద్య, వైద్యం, జీవిత చరమాంకంలో బ్రతకడానికి గౌరవప్రదమైన పెన్షన్ సౌకర్యాలు నేటి తక్షణ అవసరాలు. ఇల్లు లేని వారికి కేంద్ర, రాష్ట్రాలు సమన్వయంతో యూనిట్‌కు రూ. 10 లక్షల చొప్పున ఐదేళ్ళలో అందరికి పక్కా ఇళ్లు కట్టించేలా సాచురేషన్ విధానాన్ని రూపొందించుకోవచ్చు. అలాగే కొన్ని పాశ్చాత్య దేశాల్లో లాగా ప్రతి వ్యక్తికీ ఆరోగ్య బీమా సౌకర్యాన్ని కల్పించవలసిన బాధ్యత ప్రభుత్వాలదే. అలాగే విద్యకు సంబంధించి ఖర్చులను ప్రభుత్వాలే భరించాలి. కెనడా, హంగేరి, స్వీడన్, ఐస్‌లాండ్, డెన్మార్క్, ఇంగ్లాండ్ లాంటి దేశాలలో విద్య, వైద్యాలను ప్రభుత్వమే నిర్వహిస్తోంది. జీవిత చరమాంకంలో (58 ఏళ్లు దాటిన తర్వాత) జీవితంపై భరోసా కల్పించేలా ప్రభుత్వ ఉద్యోగులకు ఇచ్చినట్లే వివిధ వృత్తులు అనుసరిస్తున్నవారికీ, ప్రైవేట్ రంగంలో పనిచేస్తున్నవారికీ, కాంట్రాక్ట్, ఔట్‌సోర్సింగ్ విధానాల్లో పనిచేసే పెన్షన్ రాని ప్రభుత్వ ఉద్యోగులకూ కూడా పెన్షన్ సౌకర్యం కల్పించాలి.

కొంత మంది కుహనా మేధావులూ, వివిధ పార్టీలకు చెందిన రాజకీయ నేతలూ... 'కమ్యూనిస్టులు పోరాటాలు మర్చిపోయారు' అనే కువిమర్శలకు పాల్పడుతున్నారు. వారు ఒక అంశాన్ని గమనంలోకి తీసుకోవాలి. ప్రజాపోరాటాలు అనేక రూపాల్లో ఉంటాయి. ఒకనాడు సాయుధ పోరాటం చేశారు. ఇవ్వాళ ప్రజాస్వామ్య వెలుగులో సమ్మెలు, ర్యాలీలు, ధర్నాలు, బహిరంగ సభలు, పాదయాత్రలు, నిరాహార దీక్షల రూపాన్ని కమ్యూనిస్టుల పోరాటాలు తీసుకున్నాయి. ప్రజల కనీస అవసారాల సాధనకై పోరాటంలో భాగంగా ఏప్రిల్ 14 డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ జయంతి నుంచి మే 14 వరకు తీవ్ర ఎండల్లో సైతం దేశవ్యాప్తంగా కోట్లాదిమందిని ప్రభావితం చేస్తూ భారత కమ్యూనిస్టు పార్టీ యాత్రలు జరిగాయి. ఈ నేపథ్యంలోనే కార్మిక పట్టణమైన కొత్తగూడెంలో జూన్ 11న 'ప్రజాగర్జన' పేరుతో లక్ష మందిని సమీకరించేందుకు సీపీఐ తెలంగాణ రాష్ట్ర కౌన్సిల్ పిలుపు ఇచ్చింది.

వ్యాసకర్త సీపీఐ రాష్ట్ర కార్యదర్శి
(జూన్ 11న కొత్తగూడెంలో 'ప్రజాగర్జన' సభ)

రొండొకట్ల రొండు గాదు మూడొకట్ల మూడు

అట్లుంటది



తెలిదేవర భానుమూర్తి

పొద్దు మీకింది. మొగులు మీద చుక్కలు ఎల్లినయి. వాడకట్టుల లైటు బుగ్గలు ఎల్గినయి. తొవ్వలు ట్రాఫిక్‌తోని మెస్త రాకుంటున్నయి. ఇంటికి పోబుద్దిగాని కొందరు సర్కార్ జీతగాల్లు హోటల్ల గూసోని ముచ్చట బెడుతున్నరు. గా దినం ఎప్పటి తీర్గనే ఆనంద్‌బాగ్ చౌరస్త కాడ్కి బోయిన. గాడ రవి పాన్ డబ్బ ఉన్నది. పొద్దు మీకంగనే మా దోస్తులందరు ఆడ జమైతరు.

"తెలంగాన వొచ్చి పదేండ్లు గాక ముందె బీఆర్ఎస్ సర్కార్ దశాబ్ది పండ్గ షురువు జేసింది" అని యాద్గిరి అన్నడు.

"రైతు దినోత్సవంతోని గీ పండ్గను షురువు జేసింది" అని సత్నారి జెప్పిండు.

"రైతు దినోత్సవం నాడు రైతులేం జేసింద్రు" అని ఇస్తారి అడిగిండు.

"కొందరు రైతులు కేసీఆర్ ఫోట్వకు పాలాబిసేకం జేసింద్రు."

"ఎందుకు జేసింద్రు?"

"తాలు వొడ్లను కొన్నందుకు. అప్పులను మాఫ్ జేసినందుకు. బీఆర్ఎస్ అసువంటి సర్కార్ దేసమంత ఉంటె బాగుంటది. జై బోలో బీఆర్ఎస్ అన్కుంట కొంతమంది రైతులు చిర్తలు గొట్టుకుంట బజన జేసింద్రు" అని సత్నారి అన్నడు.

"గిట్ల పంట కరాబ్ గాంగనే గట్ల సర్కార్ వేల రూపాయలిచ్చినందుకు కుషితోని కొందరు రైతులు డాన్సు జేసింద్రు."

"లచ్చ రూపాయల అప్పును సర్కార్ మాఫ్ జేసినందుకు సంబురంతోని ఒక రైతు అందరికి కోవ పేడలు బంచి పెట్టిండు."

"ఉందిలే మందు దుక్నం సందు సందునా/ అందరు మందు గొట్టాలె నందనందనా" అని పాడుకుంట మందు గొట్టి మోటర్ సైకిల్లు, మోటర్లల్ల బోయెటోల్లు దొరికితె ఇంతకుముందు జుర్మాన ఏసి ఇడ్సిబెట్టెటోల్లు" అని యాద్గిరి ఇంకేమొ జెప్ప బోతుంటె సత్నారి అడ్డందల్గి – "గిప్పుడేం జేస్తున్నరు?"

"చెర్లపల్లి జేల్ల బెట్టి పని జేపిస్తున్నరు. కిష్నుడు పుట్టిన వూరికి బోయొచ్చినం. మా కాల్లు మొక్కుండ్రి. మా కాల్లు మొక్కితె మీకు పున్యమొస్తదని జేలుకు బోయొచ్చినోల్లు అంటున్నరు."

"సంటర్ల బీజేపీ సర్కారొచ్చి తొమ్మిదేండ్లు అయింది. గీ తొమ్మిదేండ్లల్ల ఏం జేసినమో జెప్పెతందుకు నెల దినాలు జెనంలకు బోవాలని బీజేపీ లీడర్లు అనుకుండ్రు. గా ఒక దినంకు గ్యాస్ బండ దినం అని పేరు బెట్టింద్రు."



"గా దినం నాడు గాల్లు జెనంకు ఏం జెప్పింద్రు?"

"మా సర్కార్ గ్యాస్ బండ దరను బెంచిందని అపొజిసనోల్లు పుజూల్ల అంటున్నరు. గాల్ల మాటలు నమ్మకుండ్రి. నూరు రూపాయలకే ఒక గ్యాస్ బండను ఇస్తున్నం. బీదోల్లకైతె ఫిరీగ గ్యాస్ బండ ఇస్తున్నం. గంతేగాదు గ్యాస్ బండ మీద వొంట జేసెతందుకు వొంట మనుసులను గుడ్క ఇండ్లల్లకు బంపిస్తున్నం."

"గ్యాస్ బండ దినోత్సవం గాకుంట ఇంకేం దినోత్సవాలు జేస్తున్నరు?"

"పిట్రోలు దినోత్సవం, బియ్యం దినోత్సవం, కూరగాయల దినోత్సవం, సల్ది బువ్వ దినోత్సవం జేస్తున్నరు. పిట్రోలును అగ్వ దరకే ఇచ్చేతందుకే రష్యాకెల్లి పిట్రోలు గొంటున్నం అని పిట్రోలు దినోత్సవం నాడు జెప్తున్నరు."

"కర్నాటకల మీటర్ రీడింగ్ జేసెతందుకు కరెంటు జీతగాడు ఒక ఇంటికి బోయిండు. గని గా ఇంటోల్లు గా కరెంటు జీతగాన్ని ఎడాపెడా గొట్టింద్రు."

"ఎందుగ్గొట్టింద్రు?"

"అందరికి కరెంటు ఫిరీగ ఇస్తమని ఎలచ్చన్ల ముంగట కాంగ్రెస్ జెప్పింది. మల్ల గిప్పుడు మీటర్ రీడింగ్ జేసుడేందని అడిగింద్రు. ఇనకపోతె కరెంటు జీతగాన్ని గొట్టింద్రు."

"గిప్పుడు కర్నాటకల కాంగ్రెస్ సర్కారే ఉన్న సంగతి నీకెర్కె గదా?"

"అందుకో చెయ్యందుకో అని పాడుకుంట కాంగ్రెస్ తెలంగానల ఆకర్ష్ చెయ్యి షురువు జేసింది" అని యాద్గిరి అన్నడు.

"రాండ్రీ బీజేపీ లీడర్లూ, రాండ్రీ బీఆర్ఎస్ లీడర్లూ, తెలంగానల కాంగ్రెస్ సర్కారే వొస్తది. మిమ్ములను మంత్రుల జేస్తం. గిప్పుడు గోడ దుంకకుంటె ఫాయిద ఉండదు. అటెంకల మీరు వస్తాయిస్తె లాబం లేదు. మేము గాదు. రాహుల్ గాందే కుద్ద మిమ్ములను గోడ దుంకమంటున్నడు. ఫౌరన్ గోడ దుంకుండ్రి అని కాంగ్రెస్ లీడర్లు అనబట్టింద్రు" అని సత్నారి జెప్పిండు.

"కద్మ పార్టీల లీడర్లను బీజేపీలకు గుంజే పని ఈటెల రాజేందర్ మీద బడ్డది. బీఆర్ఎస్‌ల కెల్లి ఎల్లిన పొంగులేటి శ్రీనువాసరెడ్డి, జూపల్లి కిష్నారావును బీజేపీలకు గుంజెతందుకు గాయిన ఒక్క తీర్గ కోషిస్ జేసిండు. నేను గాల్లకు రొండొకట్ల రొండు అన్కుంట రొండో ఎక్కం జెబ్తె గాల్లు ఉల్ట నాకు మూడొకట్ల మూడు అన్కుంట మూడో ఎక్కం నేర్పింద్రని రాజేందర్ అన్నడు."

గీ తీర్గ మా దోస్తులు ముచ్చట బెట్టింద్రు.

రచయిత సీనియర్ జర్నలిస్ట్ | 99591 50491

అనుకొన్నదొకటి...

అనుకొన్నదొకటీ, అయినదొకటీ అయిపోవటం అప్పుడప్పుడూ అందరికీ జరుగుతుంది. కానీ అనుకొన్న దానికీ, అయిన దానికీ మధ్య వ్యత్యాసాన్ని కైక లాగా అత్యధిక స్థాయిలో ఎవ్వరూ ఎక్కడా ఎప్పుడూ అనుభవించి ఉండరు. ఆమెకు దేనికీ లోటు లేదు. భర్త ఆమెకు దాసుడు. సవతులున్నా, వాళ్ళకు ఆమెతో ఇబ్బందులే కానీ ఆమెకు వాళ్ళతో సవతిపోరు లేదు. అష్టైశ్వర్యాలున్నాయి. సవతులతో పాటు తనకూ యజ్ఞఫల రూపమైన దివ్యసంతానం కలిగింది. సొంత ప్రజ్ఞ విషయమూ, ఆమె దేవాసుర యుద్ధంలో, స్వయంగా భర్త ప్రాణాలు సంరక్షించుకొన్న సాహసి.

ఇన్ని ఉండీ, లోక వ్యవహారానికీ లోకుల అభిప్రాయానికీ విరుద్ధంగా, తన కొడుకును రాజును చేయాలన్న దురాలోచనకు తలఒగ్గింది.



జ్యోతిర్మయం

నిజానికి ఆ పాపం తన బుర్రలో పుట్టిన కోరిక కాదు. చెప్పుడు మాట. కానీ కోరిక మరీ విజృంభించితే ప్రమాదం. మోహంతోనూ, మొండితనంతోనూ కలిసి మరీ బిగిసిందంటే, ఉచితానుచితాలు మరిపించి, తెగేదాకా తీసుకు వెళుతుంది.

కైక అనుకొన్నది జరగనే లేదు. అంత మాత్రమే కాదు. స్వయంకృతం వల్ల భర్త చావుకు కారణమై, పసుపు కుంకుమలు కూడా పోగొట్టుకొంది. లేనిదేదో అక్రమంగా సాధించుదామనుకొని, ఉన్నదంతా పోగొట్టుకొన్నది. పోనీ, ఎవరి కోసమైతే ఇంత దుస్సాహసం చేసిందో ఆ ఒక్కగానొక్క కొడుకు ఆమె ప్రేమనూ, తపననూ గుర్తించాడా? చిటికెడు సానుభూతి చూపాడా? తీవ్రంగా దుర్భాషలాడి, ఛీకొట్టాడు. రాముడు కోపిస్తాడన్న భయంవల్ల ప్రాణాలతో మాత్రం వదిలాడు. కానీ, అంతకంటే చంపేస్తేనే బాగుండేది అన్నంత దుర్భర స్థితిలో వదిలాడు. ఆమె కోరుకొన్నది ఆమె సంతానం వృద్ధి మాత్రమే. కానీ మితులు మీరేసరికి, లోకమంతా ఆమెను అసహ్యించుకొంది. ఆమె పేరు దురాలోచనకూ, దుష్టత్వానికీ పర్యాయ పదంగా చరిత్రలో నిలిచిపోయింది. ఎలా బ్రతక గూడదో మానవ జాతికి చూపేందుకు ఆమె బ్రతుకు ఉదాహరణగా మిగిలిపోయింది.

– ఎం. మారుతిశాస్త్రి

గ్రహం అనుగ్రహం

శ్రీ శోభకృత్ నామ సంవత్సరం, ఉత్తరాయణం, గ్రీష్మ ఋతువు, జ్యేష్ఠ మాసం, **తిథి:** బ.షష్ఠి రా.8.21 వరకు, తదుపరి సప్తమి, **నక్షత్రం:** ధనిష్ఠ రా.9.19 వరకు, తదుపరి శతభిషం, **వర్జ్యం:** తె.4.01 నుండి 5.31 వరకు(తెల్లవారితే శనివారం), **దుర్ముహూర్తం:** ఉ.8.06 నుండి 8.56 వరకు, తిరిగి ఉ.11.46 నుండి 1.06 వరకు, **అమృతఘడియలు:** ప.12.55 నుండి 1.46 వరకు ; **రాహుకాలం:** ఉ.10.30 నుండి 12.00 వరకు, **యమగండం:** ప.3.00 నుండి 4.30 వరకు, **సూర్యోదయం:** 5.28, **సూర్యాస్తమయం:** 6.29.

చేపలు పట్టిన ఎర్రబెల్లి



దశాబ్ది ఉత్సవాల్లో భాగంగా చెరువుల పండుగ సందర్భంగా గురువారం మహబూబాబాద్ జిల్లా పెద్దవంగర మండలం గంట్లకుంట గ్రామ చెరువులో జాలర్లతో కలిసి మంత్రి ఎర్రబెల్లిదయాకర్‌రావు చేపలు పట్టారు.. చేపలు పడ్డాయా?.. అంటూ ఆరా తీసి వారితో ముచ్చటించారు. – పెద్దవంగర

క్షవరం చేసిన ఎమ్మెల్యే

లింగాలఘణపురం: జనగామ జిల్లా లింగాలఘణపురం మండలం కుందారం పాఠశాలలో 'పల్లెనిద్ర' చేసిన స్టేషన్‌ఘన్‌పూర్ ఎమ్మెల్యే తాటికొండ రాజయ్య గురువారం ఉదయం గ్రామంలో పర్యటించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే హెయిర్ కటింగ్ సెలూన్‌లో కత్తెర పట్టి క్షవరం చేయగా.. అందరూ ఆసక్తిగా తిలకించారు.



సెలూన్‌లో కటింగ్ చేస్తున్న ఎమ్మెల్యే రాజయ్య

మంత్రి గంగులకు తప్పిన ప్రమాదం

అదుపు తప్పిన మరపడవ • కాపాడిన పోలీసులు

కొత్తపల్లి(కరీంనగర్): తెలంగాణ దశాబ్ది ఉత్సవాల్లో భాగంగా కరీంనగర్ జిల్లా కొత్తపల్లి మండలం ఆసిఫ్‌నగర్ చెరువు వద్ద బీసీ సంక్షేమం, పౌర సరఫరాల శాఖ మంత్రి గంగుల కమలాకర్‌కు ప్రమాదం తప్పింది. ఊరూరా చెరువుల పండుగలో భాగంగా గురువారం ఆసిఫ్‌నగర్ చెరువు వద్ద మైసమ్మ తల్లికి పూజలు చేశారు. కాళేశ్వర జలాలతో మండుటెండల్లో సైతం నిండుకుండను తలపిస్తున్న చెరువులను చూసి ఆనందం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా అక్కడ ఏర్పాటు చేసిన మర పడవలో కొంతదూరం ప్రయాణించి చెరువు అందాలను తిలకించాలనుకున్నారు. కానీ ఆయన కూర్చున్న మరపడవ ఆదిలోనే అదుపు తప్పడంతో మంత్రి నీళ్లలో పడిపోయారు. వెంటనే అప్రమత్తమైన పోలీసులు మంత్రి గంగులను చెరువు నుంచి బయటకు తీసుకొచ్చారు. చెరువు గట్టు సమీపంలోనే పడవ తిరగబడటం.. అక్కడ మోకాలి లోతు మాత్రమే నీరుండటంతో మంత్రికి ప్రమాదం తప్పింది.



చెరువులో పడిపోయిన మంత్రి కమలాకర్‌ను బయటకు తీసుకొస్తున్న పోలీసులు

కాంగ్రెస్‌ను నమ్మితే.. శంకరగిరి మాన్యాలే

▶ మొదటి పేజీ తరువాయి

ఎందుకు లేవని ప్రశ్నించారు. నాటి కాంగ్రెస్ పాలనలో రెండు దఫాలుగా ఇచ్చే ఆరు గంటల కరెంట్‌తో రైతులు ఎన్నో ఇబ్బందులు పడ్డారని గుర్తు చేశారు. ఎవరైనా చస్తే మేం అంత్యక్రియలకు పోతున్నాం బావి దగ్గర స్నానాలకు ఒక అరగంట పాటు కరెంట్ ఇవ్వండని విద్యుత్ సిబ్బందిని బతిమిలాడిన రోజులను ఎలా మరిచిపోతామన్నారు. నేడు 24 గంటలూ కరెంట్ ఇస్తున్న ఘనత తమదేనని స్పష్టంచేశారు. 'నాడు తాగునీటికి గోస ఉండే.. 14 రోజులకోసారి తాగునీళ్లు వచ్చేది. తెలంగాణ రాక ముందు ఎమ్మెల్యేలు గ్రామాల్లోకి వెళ్లాలంటే తాగునీటి సమస్యలపై బిందెలు అడ్డుపెట్టి కుండలు మర్లేసి తంతరనే భయం ఉండేది. ఇప్పుడా పరిస్థితి ఎక్కడైనా ఉందా'అని అన్నారు.

అభివృద్ధిపై చర్చకు సిద్ధం: రాష్ట్రంలో అభివృద్ధి జరగలేదని అంటున్నారని.. లెక్కలతో రండి బట్టలూడదీస్తామని మంత్రి కేటీఆర్ అన్నారు. 'జడ్చర్లలో మా లక్ష్మన్న, మహబూబ్‌నగర్‌లో శ్రీనన్నలు అభివృద్ధిపై చర్చకు సిద్ధంగా ఉన్నారు. కాంగ్రెస్ నాయకులు దమ్ముంటే చర్చకు రావాలి. కోర్టు కేసులతో కాంగ్రెస్ సన్నాసులు పాలమూరు-రంగారెడ్డి ప్రాజెక్టును అడ్డుకునేందుకు ప్రయత్నిస్తున్నా.. వాయువేగంతో 90 శాతం పనులు పూర్తిచేశాం. ఆగస్టులో కర్వెన రిజర్వాయర్‌ను కృష్ణా జలాలతో నింపుతాం. ఉదండాపూర్‌నూ త్వరగా పూర్తి చేసి జడ్చర్ల నియోజకవర్గంలోని 1.44 లక్షల ఎకరాలకు సాగునీరు అందిస్తాం'అని చెప్పారు. 'ఒకాయన 800 కి.మీ. తిరిగిన అంటూ బోర్డులు పట్టు కుని తిరుగుతుండ్రు. నాడు మీరు అభివృద్ధి చేసి ఉంటే.. ఇన్ని సంక్షేమ పథకాలు అమలు చేసి ఉంటే.. ఇప్పుడు సన్నాసి యాత్రలు ఉండేవా'అని ధ్వజమెత్తారు. ఎమ్మెల్యే లక్ష్మారెడ్డి కోరిక మేరకు జడ్చర్ల మున్సిపాలిటీని గ్రేడ్–1గా మారుస్తామని, పట్టణ అభివృద్ధికి రూ.30 కోట్లు మంజూరు చేస్తామని ప్రకటించారు. కార్యక్రమంలో మంత్రులు మల్లారెడ్డి, శ్రీనివాసరెడ్డి, ఎమ్మెల్యేలు లక్ష్మారెడ్డి, ఆల వెంకటేశ్వర్‌రెడ్డి, గిడ్డంగుల కార్పొరేషన్ చైర్మన్ సాయిచంద్ పాల్గొన్నారు.

ప్రారంభోత్సవాలు.. శంకుస్థాపనలు

జెడ్పీ సెంటర్/భూత్పూర్/అడ్డాకుల: మహబూబ్‌నగర్ జిల్లాలోని భూత్పూర్ మున్సిపాలిటీ, మూసాపేట, జిల్లా కేంద్రంతోపాటు జడ్చర్లలో మంత్రి కేటీఆర్ పర్యటించారు. ఈ సందర్భంగా పలు అభివృద్ధి కార్యక్రమాలకు శంకుస్థాపనలు, ప్రారంభోత్సవాలు చేశారు. ముందుగా భూత్పూర్ మున్సిపాలిటీలో మినీ ట్యాంక్‌బండ్‌పై ఓపెన్‌జిమ్‌ను ప్రారంభించారు. అనంతరం మూసాపేట మండలం వేముల సమీపంలోని ఎస్‌జీడీ ఫార్మా వద్ద రూ.500 కోట్లతో కొత్తగా ఎస్‌జీడీ ఫార్మా కార్నింగ్ టెక్నాలజీ ప్లాంట్ నిర్మాణానికి శంకుస్థాపన చేశారు. అక్కడి నుంచి మహబూబ్‌నగర్‌కు చేరుకున్న కేటీఆర్ మెట్టుగడ్డలోని మహిళా ఐటీఐ కాలేజీ ఆవరణలో సెయింట్ ఫౌండేషన్, శాంతా నారాయణగౌడ్ చారిటబుల్‌ట్రస్ట్ ఆధ్వర్యంలో నిర్మించనున్న స్కిల్ డెవలప్‌మెంట్ సెంటర్ నిర్మాణానికి భూమి పూజ చేశారు. అనంతరం జడ్చర్లలో డబుల్ బెడ్‌రూం ఇళ్లను ప్రారంభించారు. కాగా, జడ్చర్లలోని నేతాజీ చౌరస్తాలో కొందరు బీజేపీ కార్యకర్తలు కేటీఆర్ కాన్వాయికి అడ్డుగా రావడంతో కాసేపు నిలిపివేశారు. వెంటనే స్పందించిన పోలీసులు ఏడుగురిని అరెస్టు చేశారు.



జడ్చర్లలో డబుల్ బెడ్‌రూం గృహప్రవేశం చేయించిన అనంతరం స్వీటు బాక్స్ అందజేసిన గిరిజన మహిళతో మాట్లాడుతున్న మంత్రులు కేటీఆర్, శ్రీనివాస్‌గౌడ్, ఎమ్మెల్యే లక్ష్మారెడ్డి

• ప్రజలను తప్పుదోవ పట్టించేందుకు మంత్రి కేటీఆర్..కాంగ్రెస్‌పై విషం చిమ్మడం 'ఉల్టాచోర్ కొత్వాల్‌కో డాటే'తరహాలో ఉందని టీపీసీసీ ఉపాధ్యక్షుడు జి.నిరంజన్ విమర్శించారు. గాంధీభవన్‌లో ఆయన మీడియాతో మాట్లాడుతూ..ఇప్పటికే కేసీఆర్ మాటల వలలో పడి మోసపోయి రాష్ట్ర ప్రజలు గోసపడ్తుంటే..కేటీఆర్ కాంగ్రెస్‌ను నమ్మొద్దని అనడం విడ్డూరంగా ఉందని ఎద్దేవా చేశారు. ప్రజలను మభ్యపెట్టి మోసం చేయడంలో కేసీఆర్, కేటీఆర్‌లు దిట్ట అని అన్నారు.

సూర్యాపేటలో మిలటరీ మ్యూజియం ఏర్పాటు చేయాలి

• ఎంపీ ఉత్తమ్ కుమార్‌రెడ్డి
• కోదాడలో కల్నల్ సంతోష్‌బాబు విగ్రహావిష్కరణ

కోదాడ: దేశం కోసం ప్రాణాలను అర్పించిన కల్నల్ సంతోష్‌బాబు త్యాగం భావితరాలకు తెలిసే విధంగా ఆయన స్వస్థలం సూర్యాపేటలో మిలటరీ మ్యూజియాన్ని ఏర్పాటు చేయాలని నల్లగొండ ఎంపీ ఉత్తమ్‌కుమార్‌రెడ్డి పార్లమెంటరీ డిఫెన్స్ కమిటీని కోరారు. గురువారం సూర్యాపేట జిల్లా కోదాడలో కల్నల్ సంతోష్‌బాబు విగ్రహాన్ని ఆవిష్కరించిన అనంతరం ఉత్తమ్ మాట్లాడుతూ.. చైనా సైన్యంతో గల్వాన్‌లోయలో జరిగిన ఘర్షణలో ధైర్యసాహసాలతో పోరాడిన సంతోష్‌బాబు అమరుడు అయ్యాడని, దేశం గొప్ప దేశభక్తుడిని కోల్పోయిందని అన్నారు. ఈ సందర్భంగా సంతోష్‌బాబు తల్లిదండ్రులను సన్మానించారు.



సంతోష్‌బాబు విగ్రహాన్ని ఆవిష్కరిస్తున్న ఎంపీ ఉత్తమ్. చిత్రంలో సంతోష్‌బాబు తల్లిదండ్రులు

టీచర్ల పెండింగ్ బిల్లుల కోసం ట్రెజరీల్లో కమిషన్లు



సాక్షి, హైదరాబాద్: గత ఏడాదిగా పెండింగ్‌లో ఉన్న టీచర్ల సరెండర్ లీవులు, మెడికల్, జీపీఎఫ్ బిల్లులను తక్షణమే ఉపాధ్యాయుల ఖాతాల్లో జమ చేయాలని టీచర్స్ ఎమ్మెల్సీ కూర రఘోత్తం రెడ్డి ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ప్రోగ్రెసివ్ రికగ్నైజ్‌డ్ టీచర్స్ యూనియన్ (పీఆర్‌టీయూటీఎస్) రాష్ట్ర కార్యవర్గ సమావేశం గురువారం హైదరాబాద్‌లో నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మీడియాతో మాట్లాడారు. ఉపాధ్యాయుల అవసరాలను ఆసరాగా తీసుకుని ట్రెజరీల్లో బిల్లుల మంజూరుకు పర్సంటేజీలు అడుగుతున్నారని ఆరోపించారు. టీచర్లకు అడహాక్ పద్ధతిలో పదోన్నతులు కల్పించాలని ఆయన కోరారు. ఈ సమావేశంలో మాజీ ఎమ్మెల్సీ పూల రవీందర్, సంఘం రాష్ట్ర కార్యదర్శి బీరెల్లి కమలాకర్‌రావు, నేతలు గుర్రం చెన్నకేశవరెడ్డి, తిరుమలరెడ్డి, ఇన్నారెడ్డి, చిత్తలూరు ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

9 ఏళ్లలో రూ. 5 లక్షల కోట్ల 'సంక్షేమం'

• దళితులకు పలు పథకాల కింద రూ. 92 వేల కోట్లకుపైగా లబ్ధి
• రాష్ట్రావతరణ దశాబ్ది ఉత్సవాల్లో భాగంగా నేడు సంక్షేమ కార్యక్రమాలను వివరిస్తాం: సమాచారశాఖ

సాక్షి, హైదరాబాద్: ముఖ్యమంత్రి కేసీఆర్ నేతృత్వంలోని ప్రభుత్వం గత తొమ్మిదేళ్లుగా ఏటా రూ. 50 వేల కోట్లకుపైగా నిధులతో పలు రకాల ప్రజా సంక్షేమ పథకాలను అమలు చేస్తోందని సమాచార, పౌర సంబంధాల శాఖ పేర్కొంది. గత తొమ్మిదేళ్లలో దాదాపు రూ. 5 లక్షల కోట్లను ఆసరా ఫించన్లు సహా వివిధ సంక్షేమ పథకాలకు కేటాయించినట్లు వివరించింది. ఇది దేశ సంక్షేమరంగ చరిత్రలో తెలంగాణను అగ్రభాగాన నిలిపిందని వివరించింది. ఆసరా పింఛన్లు కాకుండా రైతులకు అందించిన పంట పెట్టుబడి వంటి వ్యక్తిగత ఆర్థిక సాయం సామాజిక పెట్టుబడిగా మారిందని గురువారం విడుదల చేసిన ప్రకటనలో వెల్లడించింది. సంక్షేమ కార్యక్రమాలపై శుక్రవారం తెలంగాణ అవతరణ దశాబ్ది ఉత్సవాల నిర్వహణలో భాగంగా ఈ అంశాన్ని వివరించనున్నట్లు తెలిపింది. వివక్షకు గురవుతున్న ఎస్సీ కులాలకు ఆర్థిక, సామాజిక గౌరవాన్ని పెంపొందించడానికి ప్రభుత్వం దళితబంధు పథకాన్ని బ్యాంకు లింకేజీ, సెక్యూరిటీ లేకుండా, లబ్ధిదారుడు తిరిగి చెల్లించాల్సిన అవసరం లేకుండా రూ. 10 లక్షల గ్రాంటును అందిస్తున్నట్లు సమాచార శాఖ తెలిపింది. దళితుల కోసం పలు పథకాల కింద 2014–15 నుంచి 2022–23 వరకు రూ. 92,640.41 కోట్లను ఖర్చు చేసినట్లు వివరించింది.

ఆసరాతో అండ...

నిరుపేద కుటుంబాల్లోని వృద్ధులు, వితంతువులు, వికలాంగులు, బోదకాలు బాధితులు, ఒంటరి మహిళలు, గీత కార్మికులు, చేనేత కార్మికులు, బీడీ కార్మికులు, ఎయిడ్స్ వ్యాధిగ్రస్తులు, వృద్ధ కళాకారులు, డయాలసిస్ రోగులందరికీ పింఛన్లతో ప్రభుత్వం భరోసా అందిస్తున్నట్లు సమాచార శాఖ పేర్కొంది. తెలంగాణ రాష్ట్రం ఏర్పాటయ్యాక సీఎం కేసీఆర్ ప్రభుత్వం 2014 నుంచి 2023 మే మధ్య ఆసరా తదితర పింఛన్ల కోసం దాదాపు పదింతలు అంటే రూ. 58,696 కోట్లు ఖర్చు చేసిందని తెలిపింది.

టీచర్లకు ప్రమోషన్లు ఇవ్వాలి: పీఆర్‌టీయూ



సాక్షి, హైదరాబాద్: ఉపాధ్యాయ ప్రమోషన్లకు అవకాశం ఉన్నా ప్రభుత్వం దృష్టి పెట్టకపోడం దుర్మార్గమని పీఆర్‌టీయూ, తెలంగాణ మండిపడింది. తక్షణమే అడ్డంకులు తొలగించి ప్రమోషన్లు, బదిలీలు చేపట్టేలా చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేసింది. గురువారం సంఘం రాష్ట్ర అధ్యక్ష, కార్యదర్శులు ముదిరేసి చెన్నయ్య, సుంకరి బిక్షంగౌడ్ మీడియాతో మాట్లాడారు. ఎన్నికలకు వెళ్లే ముందే ఉపాధ్యాయ సమస్యలు పరిష్కరించాలని, లేని పక్షంలో ఆందోళన చేపడతామని హెచ్చరించారు.

అవన్నీ రైతు ఆత్మహత్యలు కావు..

• వరంగల్ సీపీ వివాదాస్పద వ్యాఖ్యలు



వరంగల్ క్రైం: పంట నష్టం, అప్పుల బాధ తదితర కారణాలతో గ్రామాల్లో జరిగే రైతుల ఆత్మహత్యలపై వరంగల్ పోలీస్ కమిషనర్ చేసిన వ్యాఖ్యలు వివాదాస్పదమయ్యాయి. గురువారం పోలీస్ కమిషనరేట్ కార్యాలయంలో ఏర్పాటుచేసిన విలేకరుల సమావేశంలో నకిలీ విత్తన ముఠాల వివరాలు వెల్లడించిన సీపీ.. అనంతరం పలువురు విలేకరులు అడిగిన ప్రశ్నలకు సమాధానాలు ఇచ్చారు. ఈ క్రమంలో రైతు ఆత్మహత్యలపై మాట్లాడుతూ 'గ్రామాల్లో జరుగుతున్నవన్నీ రైతు ఆత్మహత్యలు కాదు.. గుండెపోటు, అనారోగ్యంతో చనిపోయినా రైతు ఆత్మహత్యలుగా నమోదయ్యేవి. గతంలో రైతు ఆత్మహత్య చేసుకుంటే ప్రభుత్వం రూ.లక్ష పరిహారం ఇచ్చేది. అందుకే రైతు ఆత్మహత్యగా నమోదు చేసేవాళ్లం. ఎలా చనిపోయినా రైతు ఆత్మహత్యగానే నమోదు చేయడంతో సంఖ్య ఎక్కువగా ఉంది..'అని అన్నారు. ఈ వ్యాఖ్యలు మీడియాలో రావడంతో సీపీ వివరణ ఇచ్చారు.


6 నెలలుగా ఎఫ్ఐఆర్ నమోదు కాలేదు: రైతు ఆత్మహత్యలపై ఎలాంటి వివాదం లేదని సీపీ వివరణ ఇచ్చారు. రాష్ట్ర ప్రభుత్వం అవగాహన కల్పించడం ద్వారా ఆరు నెలల కాలంగా ఏ ఒక్క రైతు కూడా ఆర్థిక, పంటనష్టం కారణంతో ఆత్మహత్యకు పాల్పడలేదని, ఈ కారణాలతో ఆత్మహత్య చేసుకున్నట్లు ఎక్కడా ఎఫ్ఐఆర్ కూడా నమోదు కాలేదని చెప్పారు. తెలంగాణ రాష్ట్రంలో రైతుల అభ్యున్నతి కోసం ప్రభుత్వం తీసుకున్న చర్యల్లో భాగంగానే రైతుబీమా పథకాన్ని ప్రారంభించిందని తెలిపారు. ఈ పథకం ద్వారా రైతు ఏ కారణంతో మరణించినా ఆ కుటుంబానికి ఐదు లక్షల ఆర్థిక సాయాన్ని అందిస్తున్నారన్నారు. కానీ రైతులు, పోలీసులకు ఈ పథకంపై సరైన అవగాహన లేకపోవడంతో ప్రస్తుత తెలంగాణ రాష్ట్రంలో ఇతర కారణాలతో రైతులు మరణిస్తే 2004లో అప్పటి ప్రభుత్వం జారీచేసిన 421 జీఓ నిబంధనల ప్రకారమే ఆర్థిక సాయం కోసం రైతు ఆత్మహత్యలుగా ఎఫ్ఐఆర్ నమోదు చేసినట్లు వివరించారు. అయితే ప్రస్తుతం రైతులు ఏ విధంగా మరణించినా బాధిత కుటుంబాలకు రైతుబీమా ద్వారా ఐదు లక్షల రూపాయల ఆర్థిక సాయం అందజేస్తున్నారని తెలిపారు.

దశాబ్ది వేడుకల పేరుతో ప్రజాధనం వృథా

మెదక్ జోన్: దివ్యాంగులు, అనాథ పిల్లల సంక్షేమానికి ఇచ్చిన హామీలను గాలికొదిలిన ప్రభుత్వం దశాబ్ది వేడుకల పేరుతో ఓట్ల కోసం ప్రజాధనాన్ని వృథా చేస్తోందని ఎంఆర్‌పీఎస్ వ్యవస్థాపకుడు మందకృష్ణ మాదిగ ధ్వజమెత్తారు. మెదక్ కలెక్టరేట్ ఎదుట గురువారం నిర్వహించిన దివ్యాంగుల ధర్నాలో ఆయన మాట్లాడారు. అనాథ పిల్లల సంక్షేమానికి ప్రభుత్వం తల్లిదండ్రుల పాత్ర పోషిస్తుందని 2015లో కేసీఆర్ చెప్పి ఎనిమిదేళ్లవుతోందని గుర్తు చేశారు. ఇప్పటివరకు దివ్యాంగుల కోసం ఆయనేం చేశారో చెప్పాలని డిమాండ్ చేశారు.

మరో 8 'సివిల్' బంకులు

• పౌరసరఫరాల సంస్థ ఆధ్వర్యంలో జిల్లాల్లో ఏర్పాటుకు కసరత్తు



సాక్షి, హైదరాబాద్: పౌరసరఫరాల సంస్థ ఆధ్వర్యంలో రాష్ట్రంలో కొత్తగా మరో 8 రిటైల్ పెట్రోల్ బంకులు ఏర్పాటు కానున్నాయి. ఇటీవలే 9 పెట్రోల్ బంకుల నిర్వహణకు ఆమోదం లభించడంతో మొత్తంగా 17 జిల్లాల్లో పెట్రోల్ బంకుల ఏర్పాటు ప్రక్రియ పూర్తయినట్లయింది. ఆదాయం పెంచుకొనే చర్యల్లో భాగంగా జిల్లాకు ఒకటి చొప్పున పెట్రోల్ బంకులను ఏర్పాటు చేయాలని పౌరసరఫరాల శాఖ మంత్రి గంగుల కమలాకర్ సూచించారు. దీంతో జిల్లాల్లో అనువైన స్థలాలను గుర్తించి ఆయా ఆయిల్ కంపెనీలకు బంకులు కేటాయించేందుకు సంస్థ చైర్మన్ సర్దార్ రవీందర్‌సింగ్ ఆధ్వర్యంలో ఐదుగురు అధికారులతో కమిటీ ఏర్పాటైంది. ఈ కమిటీ తొలివిడతలో 9 జిల్లాల్లో పెట్రోల్ బంకుల ఏర్పాటుకు సిఫార్సు చేసింది. ఈ మేరకు పెట్రోల్ బంకుల ఏర్పాటు ప్రక్రియ జరుగుతోంది. ఇక రెండో విడతలో వరంగల్, వనపర్తి, సూర్యాపేట, జయశంకర్ భూపాలపల్లి, పెద్దపల్లి, సిద్దిపేట, హనుమకొండ, జనగామ జిల్లాల్లో పెట్రోల్ బంకుల ఏర్పాటుకు ఆమోదం తెలిపినట్లు సంస్థ చైర్మన్ రవీందర్‌సింగ్ తెలిపారు. వీలైనంత త్వరగా వినియోగదారులకు సేవలు అందుబాటులోకి తేవాలని ఐఓసీ, హెచ్‌పీసీఎల్, బీపీసీఎల్ ఆయిల్ కంపెనీలకు సూచించినట్లు చెప్పారు. ఇప్పటికే పౌరసరఫరాల సంస్థ జీహెచ్‌ఎంసీ పరిధిలో 3 పెట్రోల్ రిటైల్ బంకులను విజయవంతంగా నిర్వహిస్తోంది. కొత్త బంకులు ఏర్పాటైతే వాటి సంఖ్య 20కి చేరనుంది.

అనంత కరుణామయుడు (అల్లాహ్)!
ఆయనే మానవుణ్ణి సృష్టించాడు.
ఆయనే అతనికి మాట్లాడటం నేర్పాడు.
– ఇస్లాం ధర్మం

సాక్షి
శుక్రవారం, 23 జూన్ 2023

ప్రతిపక్షాల ఆశల పందిరి

కొన్ని సమావేశాలకు ఎక్కడ లేని ప్రత్యేకతా ఉంటుంది. సమయం, సందర్భం, చేపట్టిన అంశం, హాజరయ్యే ప్రతినిధులు – ఇలా అందుకు ఏదైనా కారణం కావచ్చు. మరి, కీలకమైన అవన్నీ కలగలిసిన సమావేశమంటే దానికుండే ప్రాధాన్యం చెప్పనక్కర లేదు. జాతీయ ప్రజాస్వామ్య కూటమి (ఎన్డీఏ)కి చెందని ప్రతిపక్షాలన్నీ ఈ శుక్రవారం పాట్నాలో జరుపుతున్న సమావేశం సరిగ్గా అలాంటిదే. వచ్చే 2024 లోక్‌సభ ఎన్నికల్లో నరేంద్ర మోదీ సారథ్యంలోని బీజేపీని కలసికట్టుగా ఎదుర్కొనేందుకు వీలుగా ఉమ్మడి ప్రణాళికను మథించేందుకు ప్రతిపక్ష నేతలు ఒక దగ్గరకు వస్తున్నారు. ఆలోచన మంచిదే. పాలక పక్షాన్ని ఎదుర్కొనేందుకు ఇది మంచి ప్రయత్నమే. అయితే, ఆచరణలో ప్రతిపక్ష ఐక్యత ఓ ఊహకందని పజిల్ కూడా కావడంతో పాట్నా భేటీ ఆసక్తి రేపుతోంది. ఎన్నికల ప్రయోజనాలే ప్రధాన లక్ష్యం గనక, ఢిల్లీ గద్దెపై ఎవరి ఆశలు వారికున్న బడా నేతల మధ్య ఐక్యత ఏ మేరకు ఫలిస్తుంది, నిలుస్తుందనే సందేహాలనూ కలిగిస్తోంది.

ఆ మధ్య కొద్దికాలం క్రితమే బీజేపీ వ్యతిరేకిగా అవతారమెత్తిన బిహార్ సీఎం నితీశ్ కుమార్ కాషాయ పార్టీకి వ్యతిరేకంగా అన్ని పక్షాలనూ ఏకం చేయాలని తపిస్తున్నారు. కొన్నాళ్ళుగా వివిధ పార్టీల అగ్రనేతల్ని కలుస్తూ, కూటమి కట్టడానికి సమాలోచనలు చేస్తున్నారు. అందులో భాగమే పాట్నాలో ఈ మెగా భేటీ. దాదాపు 20 కీలక ప్రతిపక్షాలకు చెందిన నేతలను సాదరంగా స్వాగతించి, ఆతిథ్యమిచ్చేందుకు సిద్ధమవుతున్నారు. నిత్యం కీచులాడుకొంటూ, ఒకరిపై మరొకరు పై చేయి సాధించేందుకు ప్రయత్నించే ప్రతిపక్షాల మధ్య ఇది ఓ అపురూప దృశ్యం. ఉమ్మడి కార్యక్రమం, పార్లమెంట్ లోపల – బయట ఉమ్మడి అజెండా, క్షేత్రస్థాయి వ్యూహం లాంటివన్నీ ఈ భేటీ అజెండాలో భాగం. అలా ఇది ప్రతిపక్షాల నైతిక స్థైర్యాన్ని పెంచనుంది. వచ్చే ఎన్నికలు భీకరపోరు కానున్నాయనే సంకేతం ఇవ్వనుంది. కాషాయ పార్టీకి కంటి మీద కునుకు కరవయ్యేలా చేయనుంది.

ప్రతిపక్షాల ఐక్యతా అజెండాలో అనేకం ఉన్నప్పటికీ, అవి అత్యవసరంగా పరిష్కరించుకోవాల్సిన సమస్యలూ అనేకం. ముందుగా ఆ పార్టీలు తమ మధ్యనున్న విభేదాలను రూపుమాపుకోవాల్సి ఉంది. ఢిల్లీ ముఖ్యమంత్రి, ఆమ్ ఆద్మీ పార్టీ (ఆప్) సారథి క్రేజీవాల్ లాంటివారు సుప్రీమ్ కోర్ట్ తీర్పును సైతం పక్కన పెట్టేలా కేంద్రం తెచ్చిన ఆర్డినెన్స్‌పై పార్లమెంట్‌లో ప్రతిపక్షాల ఐక్యతా పోరాటాన్ని ఆశిస్తున్నారు. కానీ, ఆర్డినెన్స్‌పై ఆప్‌ను సమర్థించే విషయంలో కాంగ్రెస్ సందిగ్ధంలో ఉండడం అర్థం చేసుకోదగినదే. ఢిల్లీ, పంజాబ్‌లలో 'ఆప్'కు కాంగ్రెస్ ప్రధాన ప్రత్యర్థి. త్వరలో ఎన్నికలు జరగనున్న కాంగ్రెస్ పాలిత రాజస్థాన్‌లో సైతం చొచ్చుకుపోవాలని 'ఆప్' కత్తులు నూరుతోంది. రాజస్థాన్ సీఎం అశోక్ గెహ్లోత్ తమ పార్టీ సామాజిక న్యాయ అజెండానే కాపీ కొట్టారంటూ కేజ్రీవాల్ ఆరోపణలూ చేశారు.

మరి, పరస్పర విరుద్ధ ప్రయోజనాలున్న ఈ పార్టీలు ఎలా కలుస్తాయి? రెండు కత్తులు ఒకే ఒరలో ఎలా ఇముడుతాయి? యూపీలో సమాజ్‌వాది పార్టీకి కాంగ్రెస్, బీఎస్పీలతో; బెంగాల్‌లో తృణమూల్‌కు కాంగ్రెస్, వామపక్షాలతో; ఇంకా అనేక రాష్ట్రాల్లో ఇలాంటి ఉప్పూ నిప్పూ పరిస్థితులే ఉన్నాయి. వాటిని అవి ఎలా సర్దుబాటు చేసుకుంటాయో చూడాలి. లోక్‌సభ ఎన్నికల్లో ఎక్కడికక్కడ బీజేపీపై ఒకే బలమైన ప్రతిపక్ష అభ్యర్థిని నిలబెట్టడం చెప్పినంత సులభం కాదు. ఎన్నికల తర్వాత కన్నా ఎన్నికల ముందే ఐక్యతా రాగాలాపనకు పార్టీలకు ఇలాంటి సమస్యలెన్నో! అందుకే, ఐక్య ప్రతిపక్షం ఆలోచన మంచిదైనా, సరైన అజెండా, ఆచరణాత్మక ప్రణాళిక, అన్నిటికన్నా ముఖ్యంగా అన్ని పక్షాలకూ ఆమోదయోగ్యుడైన ఉమ్మడి నేత లేకపోతే కష్టం.

ప్రతిపక్షాలన్నీ పరస్పర నమ్మకంతో సాగించాల్సిన సుదీర్ఘ ప్రయాణమిది. అలాంటప్పుడు అనుమానాల నివృత్తి అయినా, ఆచరణ ప్రణాళికైనా ఒక రోజు మాటల మథనంతో సాధ్యమనుకుంటే అత్యాశ. ఇలాంటి భేటీలు తరచూ జరగాలి. బలమైన పాలకపక్షాన్నీ, జనాకర్షక విన్యాసాల్లో దిట్ట అయిన దాని సారథినీ ఎదుర్కొనాలంటే, ప్రతిపక్షాలన్నీ తమ మధ్య పాత పగలను పక్కన పెట్టాలి. స్వీయ ప్రయోజనాల కన్నా ఉమ్మడి శత్రువుపై విజయమే వాటి లక్ష్యం కావాలి. అందుకవసరమైతే కొంత త్యాగానికి కూడా సిద్ధం కావాలి. అంతటి దీక్ష, దృఢ సంకల్పం, చిత్త శుద్ధి ఎన్ని పార్టీలకు ఉందన్నది విమర్శకుల సందేహం. అందుకే, ఒక్కరోజు పాట్నా భేటీపై అతిగా అంచనాలు ఎవరికీ లేవు. అదే సమయంలో కలసి పోరాడాలన్న ఆశయంలో ఇది ముందడుగనడంలో అనుమానం లేదు.

ఎన్నికలకు మరో 11 నెలల కన్నా తక్కువ వ్యవధి మాత్రమే ఉన్నందున పాట్నా భేటీ సాక్షిగా ప్రతిపక్షాలు తమలో తాము పట్టువిడుపులు ప్రదర్శించాలి. ఐక్యంగా ఉండడం ఎంత ముఖ్యమో, తమ కూటమి అసలైన ప్రత్యామ్నాయమనే నమ్మకం ప్రజల్లో కల్పించడం అంతకన్నా ముఖ్యం. అలాగే, పాలక నేతకు తమ ప్రత్యామ్నాయం ఎవరో స్పష్టం చేయగలిగి ఉండాలి. ఒకప్పుడు కాంగ్రెస్, ఇందిరా గాంధీలకు వ్యతిరేకంగా జయప్రకాశ్ నారాయణ్ సారథ్యంలో సాగిన ప్రతిపక్ష ప్రయోగం మాదిరిగా... మళ్ళీ అంత నమ్మకం కలిగించగలిగితేనే ఏ కూటమి అయినా ఫలిస్తుంది. ఎన్నికల క్షేత్రంలో ఫలితాలు సాధిస్తుంది. ఏది ఏమైనా, ప్రభుత్వం లోటుపాట్లను ఎత్తిచూపుతూ, ప్రజల పక్షాన నిలదీసే దృఢమైన ప్రతిపక్షం ఉంటేనే ఏ ప్రజాస్వామ్యమైనా నాలుగు కాళ్ళపై నిలుస్తుంది, నడుస్తుంది. తొమ్మిదేళ్ళ తర్వాత దేశంలో ఇప్పుడా అవసరం ఎంతైనా ఉంది. తాజా పాట్నా భేటీ ఆశలు రేపుతోంది అందుకే!

సర్దుకుపోతేనే మణిపూర్‌లో శాంతి!

విశ్లేషణ



ప్రదీప్ ఫన్‌జౌబమ్

నెలన్నరగా మణిపూర్ మండుతూనే ఉంది. తీవ్రత తగ్గినప్పటికీ హింసాత్మక ఘటనలు పూర్తిగా ఆగిపోలేదు. ఇప్పటివరకూ సుమారు 120 మంది ప్రాణాలు కోల్పోగా, 45 వేల మంది సహాయ శిబిరాల్లో జీవించాల్సిన పరిస్థితి ఏర్పడింది. ఆందోళన కలిగించే విషయం ఏమిటంటే, అటు మైతైలతో పాటు ఇటు కుకీలు కూడా ప్రభుత్వ బలగాలు ఒక పక్షానికి కొమ్ము కాస్తున్నాయన్న అభిప్రాయంలో ఉండటం. ప్రస్తుతం మణిపూర్ పరిస్థితిపై ఉన్న సాధారణ అంచనా ఏమిటంటే, రాష్ట్ర ప్రభుత్వానికి ఏం చేయాల్లో దిక్కుతోచడం లేదు. కేంద్రానికి నిబద్ధత కరవైంది! ప్రస్తుత సంక్షోభం మణిపూర్‌లోని తెగల మధ్య ఉన్న సంక్లిష్టమైన సంబంధాలను మరోసారి ప్రపంచానికి ఎత్తి చూపుతోంది.

మణిపూర్‌లో చీకటి రోజులు నడుస్తున్నాయి. నెలన్నరగా రెండు ప్రధాన తెగలైన మైతై, కుకీల మధ్య ఘర్షణలు కొనసాగుతూనే ఉన్నాయి. సాధారణ పరిస్థితులు నెలకొంటాయన్న సూచనలు కనుచూపుమేరలో కనిపించడం లేదు. మొదలైనప్పటి స్థాయిలో కాకపోయినా అక్కడక్కడా రెండు తెగలకు చెందిన గ్రామాలున్న చోట హింస చోటు చేసుకుంటోంది. ఒకప్పుడు ఆప్తమిత్రుల్లా ఉన్న ఈ తెగలిప్పుడు బద్ధశత్రువుల్లా మారిపోయాయి.

మణిపూర్‌లో ఘర్షణలు మొదలైన తరువాత ఇప్పటివరకూ సుమారు 120 మంది ప్రాణాలు కోల్పోగా, 45 వేల మంది రిలీఫ్ క్యాంపుల్లో జీవించాల్సిన పరిస్థితి ఏర్పడింది. శాంతి సాధనలో రాష్ట్ర ప్రభుత్వం విఫలమైందన్న భావన ఏర్పడటంతో... క్యాంపుల్లో ఆశ్రయం పొందుతున్న వారిలో నిస్పృహ పెరిగిపోతోంది. ఇప్పుడిది ఆగ్రహంగా పరిణమించి మరిన్ని హింసాత్మక ఘటనలకూ, ఘర్షణలకూ దారితీసే అవకాశం ఏర్పడుతోంది. ఈ ఆగ్రహం అధికారంలో ఉన్న వారిపైకి మళ్లినా ఆశ్చర్యం లేదు. ప్రస్తుతం మణిపూర్ పరిస్థితిపై ఉన్న సాధారణ అంచనా ఏమిటంటే, రాష్ట్ర ప్రభుత్వానికి ఏం చేయాల్లో దిక్కుతోచడం లేదు. కేంద్రానికి నిబద్ధత కరవైంది!

ఆందోళన కలిగించే విషయం ఏమిటంటే, అటు మైతైలతో పాటు ఇటు కుకీలు కూడా ప్రభుత్వ బలగాలు ఒక పక్షానికి కొమ్ము కాస్తున్నాయన్న అభిప్రాయంలో ఉండటం. రాష్ట్ర ప్రభుత్వ పోలీసు కానిస్టేబుళ్లు, సాయుధ మణిపూర్ రైఫిల్స్ బలగాలు మైతైలకు అనుకూలంగా పనిచేస్తున్నాయని అనుకుంటూంటే... కేంద్ర పారామిలటరీ బలగాలు, ముఖ్యంగా అస్సామ్ రైఫిల్స్ కుకీలకు వత్తాసు పలుకుతున్నాయని భావిస్తున్నారు. వాస్తవానికి జూన్ రెండున జరిగిన ఘర్షణలు పూర్తిగా నివారించదగ్గవి. మణిపూర్ పోలీస్ కమాండోలు, అసాం రైఫిల్స్‌కు చెందిన ఒక యూనిట్ మధ్య జరిగిన ఈ ఘర్షణ దాదాపుగా కాల్పులకు దారితీసింది. ఈ ఘటనలో అస్సాం రైఫిల్స్‌కు చెందిన ఒక బృందం రెచ్చగొట్టే విధంగా సబ్ డివిజనల్ పోలీస్ ఆఫీసర్ కార్యాలయ దారిని మూసేసింది. గేట్ దగ్గర ఇద్దరు సాయుధ సిబ్బందిని నియమించింది. పరిస్థితి చేయిదాటే సమయానికి ఈ బృందం వెనక్కు తగ్గింది. ఈ ఘటన మొత్తం ఒక వ్యక్తి తాలూకా అసూయ కావచ్చు లేదా ఇంకేదైనా స్థానిక కారణం కావచ్చు. కేంద్ర హోం శాఖ మంత్రి అమిత్ షా మణిపూర్ పర్యటన జరిగిన రెండు రోజుల తరువాత ఈ ఘటన చోటు చేసుకోవడం గమనార్హం.



అమిత్ షా హామీ ఇచ్చిన విధంగానే గౌహతి హైకోర్టు మాజీ ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ అజయ్ లాంబా నేతృత్వంలో ముగ్గురు సభ్యుల ధర్మాసనం ఏర్పాటు కావడం స్వాగతించాల్సిన విషయం. మణిపూర్ సంక్షోభానికి కారణాలను కనుక్కోవడం, ఎవరి బాధ్యత ఏమిటో తేల్చడం ఈ కమిటీ ఉద్దేశం. అయితే రాష్ట్ర గవర్నర్ అనసూయ యుకీ నేతృత్వంలో 51 మందితో ఒక శాంతి కమిటీ ఏర్పాటు చేసే ప్రయత్నం మాత్రం అందరూ ఊహించినట్టుగానే బాలారిష్టాలను ఎదుర్కొంటోంది. కమిటీ కోసం ఎంపిక చేసినవారు క్రమంగా విరమించుకుంటున్నారు. రాజకీయ ప్రమేయం ఉన్నవారు ఎక్కువవుతున్నందుకే విరమించుకుంటున్నట్లు చెబుతున్నారు.

కమిటీలోని కుకీ సభ్యులు ముఖ్యమంత్రి ఎన్. బీరేన్ సింగ్ చేరికపై అభ్యంతరం వ్యక్తం చేశారు. ప్రస్తుత సంక్షోభానికి ఆయనే సూత్రధారి అనీ, ఆయన కుకీ వ్యతిరేకి అనీ వారి వాదన. ఇంకో విషయం... కమిటీలో ముఖ్యమంత్రిని చేర్చడం ద్వారా ఆయన్ని పదవి నుంచి తప్పించే ఉద్దేశమేమీ తమకు లేదని కేంద్రం చెప్పకనే చెప్పినట్లు అయ్యింది. రాష్ట్రపతి పాలన విధించే అవకాశాలూ లేవని తేలిపోయింది. రాష్ట్రంలోని చాలామంది ఈ రెండింటిలో ఏదో ఒకటి సంభవమన్న అంచనాలో ఉండటం గమనార్హం. బీజేపీ పాలిత రాష్ట్రం కావడం వల్లనే ఇవి ఏవీ జరగడం లేదేమో!

ప్రస్తుత సంక్షోభం మణిపూర్‌లోని ఆదిమ తెగల మధ్య ఉన్న సంక్లిష్టమైన సంబంధాలను మరోసారి ఎత్తి చూపుతోంది. ఇది కేవలం తెగల మధ్య ఏర్పడ్డ భేదాభిప్రాయాలు మాత్రమే అనుకునేందుకు లేదు. కొండలు, లోయల్లో నివసించే వారి మధ్య ఘర్షణలుగానూ చూడవచ్చు. ఈ విషయంలో నాగాలు, కుకీలు ఒక వైపున ఉంటే మైతైలు ఇంకోవైపున ఉన్నారు. మణిపూర్ మొత్తమ్మీద 90 శాతం పర్వత ప్రాంతమే. షెడ్యూల్డ్ తెగల కోసం ప్రత్యేకమైన ప్రాంతంగా దీనికి గుర్తింపు ఉంది. లోయ ప్రాంతాలు రాష్ట్ర భూభాగంలో పది శాతం. గిరిజన తెగలకు చెందని మైతైల నివాస ప్రాంతాలు ఇవే. ఇటీవలి కాలంలో మైతైల్లో అధికశాతం మంది తమకూ షెడ్యూల్డ్ తెగల గుర్తింపు కాంక్షిస్తున్నారు. నాగాలు, కుకీలు దీన్ని వ్యతిరేకిస్తున్నారు. ఈ వ్యతిరేకత వల్లనే పరిస్థితి ఈ స్థాయికి చేరింది అనేందుకు అవకాశం లేదు. ఎందుకంటే మైతైల డిమాండ్‌ను వ్యతిరేకిస్తూ మే 3న నిర్వహించిన ర్యాలీలో నాగాలు తమ సంబంధాల హద్దులను దాటలేదు. కుకీలు మాత్రం చురాచంద్రపూర్ జిల్లాలో మైతైలున్న ప్రాంతాలపై దాడులు చేసి విధ్వంసానికి పాల్పడ్డారు. కుకీ యుద్ధ స్మారకం ఒక దాన్ని మైతైలు తగలబెట్టేశారన్న వదంతులతో ఈ విధ్వంసం జరగడం గమనార్హం.

మైతైలపై కలిసి యుద్ధం చేద్దామని కుకీలు కొన్ని సంకేతాలు పంపినా నాగాలు ప్రస్తుతానికి తటస్థంగానే ఉన్నారు. ఈ తటస్థ వైఖరితోనూ కొన్ని చిక్కులున్నాయి. జూన్ 9న రాష్ట్రానికి చెందిన పది మంది నాగా ఎమ్మెల్యేలు సంప్రదింపుల కోసం అమిత్ షాను కలిశారు. రాష్ట్రంలో సాధారణ పరిస్థితులు నెలకొల్పేందుకు తమ వంతు సాయం అందిస్తామని హామీ కూడా ఇచ్చారు. అయితే కుకీల కోసం ప్రత్యేక పరిపాలన వ్యవస్థను ఏర్పాటు చేయాలన్న ప్రతిపాదన తీసుకురావడం గమనార్హం. దీనికోసం నాగాల భూముల జోలికి మాత్రం రావద్దని వీరు ప్రతిపాదించారు.

మణిపూర్‌లోని పర్వతప్రాంత జిల్లాల్లో మొత్తంగా కుకీ గ్రామాలు విస్తరించి ఉన్నాయి. నాగాలు కూడా చురాచంద్రపూర్ మినహా మిగిలిన పర్వతప్రాంత జిల్లాలు తమ మూల నివాసంగా భావిస్తారు. అంటే ఆచరణలో కుకీల డిమాండ్ ఏమాత్రం ఆమోదయోగ్యం కానిది అవుతుంది. 1990లో యునైటెడ్ నాగా కౌన్సిల్ కుకీ గ్రామాలను ఖాళీ చేయించాలని నిర్ణయించింది. నాగాల దృష్టిలో కుకీలు తమ గ్రామాల్లో ఉంటున్న కిరాయిదారులు. ఈ తీర్మానం చివరకు ఘర్షణలకు దారి తీయడమే కాకుండా, 800 మంది ప్రాణాలు కోల్పోయేందుకు కారణమైంది.

తటస్థ వైఖరి అనేది హెర్బెర్ట్ బి.స్వోప్ కథనం ఒకదాన్ని గుర్తు చేస్తోంది. పులిట్జర్ ప్రైజ్ అవార్డు పొందిన కొన్ని కథనాలను స్వోప్ జర్మనీ నుంచి రాసేవారు. 'న్యూయార్క్ వరల్డ్'లో ప్రచురితమయ్యాయి. ఆ కాలంలో అమెరికన్లు తటస్థ వైఖరి ప్రకటించడంపై జర్మన్లు గుర్రుగా ఉండేవారు. మొదటి ప్రపంచ యుద్ధంలో అమెరికా పాల్గొనేందుకు ఏడాది ముందు ముచ్చట ఇది. అమెరికన్ల తటస్థత జర్మన్ల విషయంలో మెదడు సంబంధి అనీ, మిత్రపక్షాలతో వర్తన మాత్రం హృదయ సంబంధి అనీ జర్మన్లు భావించేవారు. నాగాల పరిస్థితి అలాగే ఉంది. కుకీల పక్షం వహించబోమని చెబుతూనే, మైతైలతో తమకు భేదాభిప్రాయాలు లేవని అనుకోవద్దంటున్నారు. ప్రస్తుతం మణిపూర్ ప్రజల ముందున్న సవాలు ఏమిటంటే... ఘర్షణ పూరిత వాతావరణం తొలగిపోయిన వెంటనే, పరిపాలన వ్యవస్థ నిర్మాణంలో ఏకాభిప్రాయానికి కృషి చేయడం. అప్పుడే దాదాపు 34 భాషాపరమైన సమూహాలున్న మణిపూర్‌లో శాంతి స్థాపన సాధ్యమవుతుంది. పరస్పరం సహకరించుకోవడం, సర్దుకుపోవడం, ఉమ్మడి విధిని అంగీకరించడం ఇప్పుడు జరగాల్సిన పనులు!

వ్యాసకర్త 'ఇంఫాల్ ఫ్రీ ప్రెస్' సంపాదకుడు
('ద ట్రిబ్యూన్' సౌజన్యంతో)

సోషల్ మీడియా

సోషల్ నెట్ వర్కింగ్ వెబ్‌సైట్లు ఫేస్‌బుక్, ట్విట్టర్‌లలో సెలబ్రిటీల 'మనసులోని మాట'లు తాజాగా ఇలా...!

పంజాబీ ఆధిపత్యం



పాకిస్తాన్ రాజకీయాలను పంజాబ్ ఎంతగా శాసిస్తున్నదో చెప్పడానికి ఒక ఉదాహరణ. ఆఖరికి ఇమ్రాన్ ఖాన్ (పుట్టుకతో పష్తూన్) కూడా భారత ప్రధాన మంత్రి పేరును నరేందర్ మోదీ అని ఉచ్చరిస్తారు. ('ఇంద్ర'ను వారు ఇందర్ అంటారు).

– క్రిస్టోఫ్ ఇవానెక్, కాలమిస్ట్

మంచి చర్య



ఈ ఏడాది తమిళనాడు ప్రభుత్వం తీసుకున్న మంచి చర్యల్లో ఒకటి సుమారు 500 మద్యం దుకాణాలను మూసేయడం. ప్రత్యేకించి ఇళ్లకు, పాఠశాలలకు దగ్గరగా ఉన్నవి. తమిళ మహిళలతో నేను జరిపిన చాలా సంభాషణల్లో మద్యం వల్ల వాళ్లు ఎన్ని ఇబ్బందులు పడుతున్నారో చెప్పారు.

– కమలా త్యాగరాజన్, జర్నలిస్ట్

రాజకీయ ప్రచారమా?



భారత్‌లోని 98 శాతం మంది ముస్లిములు తమ మతాన్ని స్వేచ్ఛగా ఆచరించగలుగుతున్నామని చెప్పినట్టు 'ప్యూ' పరిశోధన పేర్కొంది. భారత ముస్లింలు విస్తృత వివక్షకు గురవుతున్నారనే భారత వ్యతిరేక యాక్టివిస్టుల రాజకీయ కథనాన్ని ఈ వెల్లడింపులు కొట్టిపారేస్తున్నాయి.

– జెబా జోరియా, కాలమిస్ట్

అదే ముఖ్యం!



బిజినెస్ స్కూల్స్ తమ పాఠ్య ప్రణాళికలో దయచేసి 'వ్యూహం' బోధించడం ఆపాలి. దానికి బదులు ఎక్కువగా ఆచరణ ఎలాగో చెప్పాలి. ఒక స్టార్టప్ స్థాపకుడిగా ఇది నా వినయ పూర్వక వినతి.

– ఉత్సవ్ అగర్వాల్, ఆంట్రప్రెన్యూర్

నాకు ప్రమోషన్



మా మామయ్య తాను కలిసే ప్రతి ఒక్కరితోనూ నాకో ఫుడ్ బ్లాగ్ ఉందనీ, దాన్ని ఫాలో కమ్మనీ చెబుతుంటారు. అది వినడానికి ఎనభై శాతం ఇబ్బందిగా ఉంటుంది, కానీ నూరు శాతం సూపర్ క్యూట్ అనిపిస్తుంది.

– చైతాలీ అగర్వాల్, బ్లాగర్

సాక్షి ఎడిటోరియల్ పేజీకి వ్యాసాలను, అభిప్రాయాలను యూనికోడ్‌లో పంపాలి. ఎక్కడా పరిశీలనలో లేనట్టు హామీపత్రం జతచేయాలి. ఈ-మెయిల్: editpage@sakshi.com

అమానవీయ ప్రవర్తన ఇంకెన్నాళ్లు?

సందర్భం



సింగారెడ్డి శౌరి రెడ్డి

ఎన్నో గొప్ప సంప్రదాయాలకు పుట్టినిల్లు అయిన మన దేశంలో వితంతువుల పట్ల అమానవీయ ధోరణి కొనసాగడం బాధాకరం. వితంతువుగా మారిన స్త్రీని ఆచారాల పేరుతో అవమానిస్తూ, చులకనగా చూడడం రహస్యమేమీ కాదు. విషాదం ఏమిటంటే ఊళ్లోవాళ్ళే కాక కుటుంబ సభ్యులు, బంధు వులు కూడా వీరి పట్ల అన్యాయంగా ప్రవ ర్తిస్తూ ఉంటారు. ఇందుకు కారణం తర తరాలుగా సమాజంలో పాతుకు పోయిన ఆచారాలూ, నమ్మకాలే. సాటి మనిషిని, అదీ భర్త చనిపోయి పుట్టెడు దుఃఖాన్ని అనుభవిస్తూ ఉన్న ఆడకూతుర్ని నిర్దాక్షిణ్యంగా అనేక సామాజిక కార్యక్రమాలలో పాల్గొనకుండా నిషేధించడం సబబేనా? సమాజం చూసే చిన్నచూపు భరించలేక 29 శాతం మంది యువ వితంతువులు చావే మంచిదని ఆత్మ హత్యా ప్రయత్నాలు చేస్తున్నారన్న సంగతి ఈ సందర్భంగా గమనార్హం.

అనేకమంది వితంతువులు ఆర్థిక ఇబ్బందుల్లో కూరుకుపోతున్నారు. భర్త చని పోయిన వారికి బ్యాంకులు, ఇతర రుణ సంస్థలు రుణాలు (లోన్‌లు) ఇవ్వవు. ఇందువల్ల వారు తమ కాళ్లమీద తాము నిలబడటానికి చేసే ప్రయత్నాలు విఫలమవుతున్నాయి. అలాగే వీరికి ఉద్యోగాలు దొరకడమూ గగనమే. ఇటువంటి పరిస్థితుల్లో తరచుగా శ్రమదోపిడీకీ, అత్యాచారాలకూ గురవుతూ ఉంటారు వీరు. విచిత్రమేమిటంటే కుటుంబ సభ్యులూ, బంధువులే వీరిపై తరచూ లైంగిక దాడులకు పాల్పడడం.

ప్రపంచ వ్యాప్తంగా సుమారుగా 26 కోట్ల వితంతువులు ఉంటే అందులో భారతదేశంలోనే 4 కోట్లమందికి పైగా వితంతువులున్నారు. పలు దేశాల్లో పలు రకాల ఆర్థిక, సామాజిక వివక్ష, మూఢ నమ్మకాలు, ఆచారాల వల్ల వీరు సతమతమౌతున్నారు. జీవచ్ఛవాలుగా బతుకుబండి లాగిస్తున్న కోట్లాది వితంతువుల సమస్యలపై అన్ని వర్గాలూ చర్చించి వారు గౌరవప్రదమైన జీవనం గడపడానికి పాటుపడాలనే ఉద్దేశంతో ఐక్యరాజ్యసమితి జూన్ 23ను 'వితంతువుల దినం'గా 2010లో ప్రకటించింది. దురదృష్టవశాత్తు మన దేశంలో జటిలమైన వితంతు సమస్యపై సానుభూతి లేకపోవడమే కాదు, వితంతువుల దినం నిర్వహించడంపైనా నిర్లక్ష్యం కనిపిస్తోంది.

వితంతువులపై వివక్ష చూపడం మానవ హక్కుల ఉల్లంఘన కిందకే వస్తుంది. కుల, మతాల ఆధారంగా సాటి మనిషిపై వివక్ష చూపడం కూడా మానవ హక్కుల ఉల్లంఘనగా గుర్తించిన రాజ్యాంగం మనది. అలాంటి దేశంలో వితంతువుల పట్ల వివక్షకు వ్యతిరేకంగా మరో సామాజిక ఉద్యమాన్ని నడప వలసిన అవసరం ఉంది.

'బాలవికాస' సంస్థ దశాబ్ద కాలంగా చేస్తున్న సామాజిక చైతన్య కార్యక్రమాల వల్ల లక్షలాది వితంతువులు ఆత్మ స్థైర్యంతో ముందుకు సాగుతున్నారు. అలాగే పలు గ్రామాలలో ప్రజా ప్రతినిధులు, గ్రామ నాయకులు వారి గ్రామాల్లో జరిగే ప్రారంభోత్సవ కార్యక్రమాలకు, శుభ కార్యాలకు వీరిని ఆహ్వా నిస్తున్నారు. బతుకమ్మ పండుగలలో పాల్గొనే విధంగా ప్రోత్సహిస్తున్నారు. వేలాదిమంది యువత వారి వివాహాల సందర్భంలో వితంతువులైన తల్లి లేదా వారి బంధువులతో అక్షింతలు వేయించుకుంటున్నారు. 'బాల వికాస' హైదరాబాద్ క్యాంపస్ ప్రారంభోత్సవంలో మూడు రాష్ట్రాల మంత్రులు, ప్రజా ప్రతినిధులు, విదేశీ అతిథులు వచ్చినప్పటికీ తొలి కొబ్బరికాయ వితంతు స్త్రీతో కొట్టించి ప్రేరణగా నిలిచింది.

'బాల వికాస' చేపట్టిన 'వితంతు వివక్షా విముక్తి' ఉద్యమంలో వందలాది స్వచ్ఛంద సంస్థలు, వేలాది కార్యకర్తలు, ప్రజా ప్రతినిధులు పాల్గొని ఉద్యమాన్ని ముందుకు తీసుకెళ్తున్నారు. ఈ సంవత్సరం వితంతు దినానికి ఐక్యరాజ్య సమితి వారు ఎంపిక చేసిన అంశం 'నూతన ఆవిష్కరణలు – సాంకేతికతతో లింగ సమానత్వం'. దీనికి అనుగుణంగా అందరికి అందుబాటులో ఉన్న సోషల్ మీడియాను వేదికగా చేసుకొని సమాచారాన్ని పంచుతూ, చర్చలు చేస్తూ, అవగాహనా ఉద్యమాన్ని చేపడితే మార్పు తథ్యం.

వ్యాసకర్త 'బాలవికాస' ఎన్జీవో ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్

కావాలనే దివాలా తీయిస్తున్నారు!

అభిప్రాయం



తారానాథ్ మురాల

ప్రభుత్వ రంగ సంస్థ (పీఎస్‌యూ)లను దివాళా తీయించి కార్పొరేట్ సంస్థలకు లాభార్జనలో అడ్డులేకుండా చేయడం కోసం కేంద్ర ప్రభుత్వం చేయదగినదంతా చేస్తోంది. దీనికి భారత్ సంచార్ నిగమ్ లిమిటెడ్ (బీఎస్ఎన్ఎల్) పట్ల కేంద్ర ప్రభుత్వం అనుసరించిన విధానం నిలువెత్తు నిదర్శనం. ఈ సంస్థకు ఒకవైపు నష్టాలు వచ్చేలా పరిస్థి తులను సృష్టిస్తున్నది ప్రభుత్వమే. అదే సమయంలో నష్టాల నుంచి బయట పడేయడానికి పునరుద్ధరణ (రివైవల్) ప్యాకేజీలు పేరిట మాయ చేస్తున్నదీ ప్రభుత్వమే.

ప్రభుత్వం కీలక అనుమతులు ఇచ్చే క్రమంలో ముందు తన సంస్థలకు ఇచ్చి, తర్వాత ప్రైవేటు సంస్థలకు ఇవ్వడం సహజం. కాదంటే ఎటువంటి వివక్షా లేకుండా ప్రభుత్వ, ప్రైవేటు సంస్థలు రెండింటికీ అనుమతులు జారీ చేయాలి. కానీ కేంద్ర ప్రభుత్వం బీఎస్ఎన్ఎల్‌కు 3జీ సర్వీసులు ఇవ్వడానికి కావాల్సిన స్పెక్ట్రమ్ ఇచ్చే సమయంలో కానీ, 4జీ సర్వీసులు ఇవ్వడానికి కావాల్సిన స్పెక్ట్రమ్ ఇచ్చేందుకు కానీ అనేక అడ్డంకులు సృష్టించింది. కానీ ఇదే సమయంలో ప్రయివేటు టెలికాం కంపెనీలకు 4జీ సేవల అనుమతుల విషయంలో ఉదారంగా వ్యవహరించింది.

ప్రపంచ వ్యాప్తంగా టెలికాం సాంకేతిక పరిజ్ఞానం ఎగుమతి చేసే దేశాలు నాలుగు మాత్రమే ఉన్నాయి. భారత దేశానికి మూడేళ్ళ వరకు ఆ పరిజ్ఞానం లేదు. చాలామంది పెట్టుబడి దారుల ఒత్తిడితో భారత ప్రభుత్వం బీఎస్ఎన్ఎల్ కేవలం మన దేశంలో తయారైన 4జీ సాంకేతిక పరిజ్ఞానాన్ని మాత్రమే వాడుకుని 4జీ సర్వీసులు ఇవ్వాలని నిబంధనలు పెట్టింది. అంటే విదేశాల నుంచి ఈ టెక్నాలజీని ఇది దిగుమతి చేసుకోకూడదన్నమాట. అయితే ప్రైవేటు టెలికాం కంపెనీలకు మాత్రం ఈ నిబంధన విధించలేదు. దీంతో ప్రైవేట్ సంస్థలు 4జీ సేవలు అందిస్తూ మార్కెట్‌లో దూసుకుపోతుంటే... స్వదేశీ సాంకేతిక పరిజ్ఞానం కోసం మూడేళ్ల బీఎస్ఎన్ఎల్ ఎదురు చూడాల్సి వచ్చింది. ఈలోపు దాని ఖాతాదారులు చేజారిపోయారన్న సంగతి వేరే చెప్పనవసరం లేదు. ఇక నష్టాలు వచ్చాయంటే రావా? చివరకు 4జీ సర్వీసులు ప్రారంభించడానికి అయ్యే ఖర్చులు, బీఎస్ఎన్ ఎల్‌కు ఉన్న అప్పులు, నష్టాలు, ఉద్యోగుల కోసం అయ్యే ఖర్చులు పరిశీలించి మొదటి రివైవల్ ప్యాకేజీని సెప్టెంబర్ 2019లో కేంద్ర ప్రభుత్వం ప్రకటించింది. ఈ ప్యాకేజీలో 90,000 మంది ఉద్యోగుల వాలంటరీ రిటైర్మెంట్ పథకం అమలైతే చెల్లించాల్సిన డబ్బూ భాగమన్న విషయం గుర్తుంచుకోవాలి.

దాదాపు 74,000 కోట్ల రివైవల్ ప్యాకేజీని సెప్టెంబర్ 2019లో కేంద్ర ప్రభుత్వం ప్రకటించింది. ఇందులో 20,140 కోట్లు 4జీ స్పెక్ట్రమ్ కోసం కాగా, రూ. 3,674 కోట్లు బీఎస్ఎన్ఎల్ కేంద్రానికి చెల్లించాల్సిన జీఎస్టీ చార్జీలు. బీఎస్ఎన్ఎల్ ఉద్యోగుల వాలంటరీ రిటైర్మెంట్ పథకం ఖర్చు దాదాపు రూ. 29,935 కోట్లు. ఈ వీఆర్ఎస్ పథకంలో ఉద్యోగులకు రిటైర్మెంట్ రోజు ఇవ్వాల్సిన గ్రాట్యుటీ, కమ్యూటేషన్ లాంటి ఆర్థిక ప్రయోజనాలను వాయిదా వేసి, ప్రభుత్వం మోసం చేసిందనుకోండి. బీఎస్ఎన్ఎల్ 4జీ స్పెక్ట్రమ్‌పై చెల్లించాల్సిన రూ. 3,674 కోట్ల జీఎస్టీపై కూడా ఎలాంటి వెసులుబాటు ఇవ్వలేదు.



బీఎస్ఎన్ఎల్ ఏర్పాటు సమయంలో ఆ సంస్థ గ్రామీణ ప్రాంతాల్లో చేస్తున్న సేవలకు గాను కొంత నగదు తిరిగి చెల్లిస్తామని కేంద్ర ప్రభుత్వం హామీ ఇచ్చింది. కాగా 2010 వరకు మాత్రమే ఈ రకమైన చెల్లింపు చేసి ఆ తర్వాత ఈ వెసులుబాటును ఆపేసింది. భారత దేశంలో తయారైన సాంకేతిక పరిజ్ఞానం వాడుకుని 4జీ సేవలు ప్రారంభించడానికి అయ్యే ఖర్చును 'ఆత్మనిర్భర్ భారత్' ప్రోగ్రాంలో భాగంగా భరిస్తామని పేర్కొని, తర్వాత దాన్ని క్యాపిటల్ ఇన్ఫ్యూజన్, ఈక్విటీ ఇన్ఫ్యూజన్‌గా సర్దుబాటు చేసింది ప్రభుత్వం. ఇన్ఫ్యూజన్ అంటే నికరంగా నగదు రూపంలో ఇవ్వకుండా పెట్టుబడులు లేదా షేర్ల రూపంలో లేదా ఇతర మార్గాలలో సర్దుబాటు చేసి చూపడం.

నిజానికి ప్రయివేటు టెలికం కంపెనీలు గత నాలు గేళ్లుగా వాణిజ్య పరంగా లాభాలు వచ్చే పట్టణ ప్రాంతా ల్లోనే 4జీ సర్వీసులు ఇస్తున్నాయి. అంతగా ఆదాయం లేని గ్రామీణ ప్రాంతాల్లో 4జీ సర్వీసులు ఇవ్వాలంటే బీఎస్ఎన్ఎల్ అవసరం. ఇందుకోసం గ్రామీణ ప్రాంతాల్లో 5 లక్షల కిలో మీటర్ల ఓఎఫ్‌సీ కేబుల్ కలిగిన 'భారత్ బ్రాడ్ బాండ్ నెట్‌వర్క్ లిమిటెడ్' (బీబీఎన్ఎల్)ను బీఎస్ ఎన్ఎల్‌లో కేంద్ర ప్రభుత్వం విలీనం చేసింది.

తాజాగా ఈ జూన్‌లో మూడవ రివైవల్ ప్యాకేజీగా రూ. 89,047 కోట్లు ప్రభుత్వం ప్రకటించింది. ఇందులో 4జీ/5జీ స్పెక్ట్రమ్ కోసం 46,339 కోట్లు కేటాయించారు. మిగతాది అప్పులు తీర్చడం కోసం ఇచ్చారు. అయితే నికరంగా ఈ ప్యాకేజీలో నగదు సర్దుబాటు చేసింది రూ. 531 కోట్లు మాత్రమే. మొత్తంగా బీఎస్ఎన్ఎల్‌కు మూడు విడతల్లో ప్రకటించిన రూ. 3.23 లక్షల కోట్ల ప్యాకేజీలో నికరంగా నగదు రూపంలో 15,000 కోట్లు మాత్రమే సర్దుబాటు చేశారు. అది కూడా దశాబ్దాల తర్వాత పునరుద్ధరణ చేసిన గ్రామీణ సేవల సర్వీసులకు చేసిన చెల్లింపుగానే దీన్ని ఇచ్చారు. బుక్‌లో సర్దుబాటు చేసే మొత్తానికి ప్యాకేజీ అనే పేరు పెట్టడం వెసులుబాటు ఎలా అవుతుంది?

టెలికాం రంగంలో బీఎస్ఎన్ఎల్ లాంటి ప్రజా సేవలు అందించే సంస్థ లేకపోతే ప్రయివేటు టెలికాం కంపెనీలు ప్రజలను టారిఫ్‌ల పేరుతో దోచుకుంటాయని గమనించాలి.

వ్యాసకర్త టెలికాం రంగ నిపుణులు

గ్రహం అనుగ్రహం

శ్రీ శోభకృత్ నామ సంవత్సరం, ఉత్తరాయణం, గ్రీష్మ ఋతువు, ఆషాఢ మాసం, **తిథి:** శు.పంచమి సా.4.46 వరకు, తదుపరి షష్ఠి, **నక్షత్రం:** మఖ తె.4.55 వరకు (తెల్లవారితే శనివారం), తదుపరి పుబ్బ, **వర్జ్యం:** ప.3.36 నుండి 5.24 వరకు, **దుర్ముహూర్తం:** ఉ.8.07 నుండి 8.57 వరకు, తదుపరి .12.26 నుండి 1.20 వరకు, **అమృతఘడియలు:** రా.2.15 నుండి 4.01 వరకు ; **రాహుకాలం:** ఉ.10.30 నుండి 12.00 వరకు, **యమగండం:** ప.3.00 నుండి 4.30 వరకు, **సూర్యోదయం:** 5.30, **సూర్యాస్తమయం:** 6.33.

డ్రగ్స్ కేసులో అయిదుగురికి నోటీసులు

రాయదుర్గం: డ్రగ్స్ కేసులో అయిదుగురికి రాయదుర్గం పోలీసులు నోటీసులు జారీ చేశారు. వారిని పోలీస్‌స్టేషన్‌కు గురువారం పిలిచి నోటీసులు అందజేశారు. విచారణకు పిలిచినప్పుడు రావాలని, వివరణ ఇవ్వాలని ఆదేశించారు. నోటీసులు అందుకున్న వారిలో వెలగపూడి రఘుతేజ, రతన్, బాలకృష్ణ, మాధవ్‌కృష్ణ, సంస్కృత్ ఉన్నారు. మే 5వ తేదీన మాదాపూర్ ఎస్‌వోటీ పోలీసులు, రాయదుర్గం పోలీసులు కలసి నిర్వహించిన దాడుల్లో డ్రగ్స్ పెడ్లర్ సూర్యప్రకాశ్‌ను అరెస్ట్ చేశారు. ఈ కేసులో ఏ–1గా చింతా రాకేష్‌రోషన్, ఏ–3గా గజ్జల శ్రీనివాస్‌రెడ్డి, ఏ–5గా నైజీరియన్ విక్టర్ చుక్వు డ్రగ్స్ సరఫరా చేస్తున్నట్లు పోలీసులు గుర్తించారు. ఈ సమయంలో 303 గ్రాముల కొకైన్, రెండు నాలుగు చక్రాల వాహనాలు, ఒక వేయింగ్ మెషీన్, 5 మొబైల్ ఫోన్లను స్వాధీనం చేసుకోవడం తెలిసిందే. పోలీసులు స్వాధీనం చేసుకున్నవాటి విలువ రూ.1.33 కోట్లని అప్పట్లో నిర్ధారించారు.

శ్రీకృష్ణుని రూపంలో ఉన్న ఎన్టీఆర్ విగ్రహాలను తొలగించాలి

సాక్షి, హైదరాబాద్: దేవుళ్ల రూపంలో మనుషుల విగ్రహాలు పెట్టకుండా ప్రత్యేక చట్టాన్ని తీసుకురావాలని భారత యాదవ సమితి గవర్నర్ తమిళిసైకి విజ్ఞప్తి చేసింది. ఈ మేరకు సమితి అధ్యక్షుడు దాసరి నగేష్ యాదవ్, వర్కింగ్ ప్రెసిడెంట్ సిద్ధి రమేష్ యాదవ్ తదితరులు గురువారం గవర్నర్‌ను కలిసి వినతిపత్రం అందజేశారు. ఫిలింనగర్‌లోని ఫిలిం ఛాంబర్ వద్ద, ఏపీలోని వివిధ ప్రాంతాల్లో శ్రీకృష్ణుని రూపంలో ఉన్న ఎన్టీఆర్ విగ్రహాలను తొలగించాలని కోరగా.. దీనిపై గవర్నర్ సానుకూలంగా స్పందించినట్లు అధ్యక్షుడు దాసరి నగేష్ యాదవ్ తెలిపారు.

మొక్కు‘బడి బాట’..!

ప్రభుత్వ స్కూళ్లలో పిల్లల చేరికకు నామమాత్ర స్పందన

- స్థానిక ప్రజా ప్రతినిధులు సహకరించట్లేదంటున్న టీచర్లు
- ఉపాధ్యాయులు నిర్లిప్తంగా వ్యవహరిస్తున్నారని భావిస్తున్న అధికారులు
- కొన్నిచోట్ల బడిబాటకు వెళ్లకుండానే వెళ్లినట్లుగా రికార్డులు!
- బడి మానేసిన 66 వేల మందిని గుర్తించినా వారి చేరికలపై అస్పష్టత
- ఏజెంట్లను ఏర్పాటు చేసుకుని మరీ ప్రైవేటు స్కూళ్ల జోరు

సాక్షి, హైదరాబాద్: ప్రభుత్వ స్కూళ్లలో విద్యార్థులను చేర్పించేందుకు విద్యాశాఖ చేపట్టిన ‘బడిబాట’కు స్పందన నామమాత్రంగానే ఉంది. స్థానిక ప్రజాప్రతినిధులు ఇందుకు సహకరించట్లేదని ఉపాధ్యాయ వర్గాలు అంటుండగా..టీచర్ల నిర్లిప్తత ఇందుకు కారణమనే అభిప్రాయం వ్యక్తమవుతోంది. ప్రైవేటు స్కూళ్లు ఆకర్షించినట్టుగా విద్యార్థులను ప్రభుత్వ టీచర్లు ఆకర్షించడం లేదని ఉన్నతాధికారులు సైతం భావిస్తున్నట్టు సమాచారం. కాగా చాలాచోట్ల బడిబాట కార్యక్రమానికి వెళ్లేందుకు టీచర్లు మొగ్గుచూపడం లేదని తెలుస్తోంది. రికార్డుల్లో వెళ్లినట్టుగా చూపిస్తూ, ఆన్‌లైన్‌లో ఉన్నతాధికారులకు జిల్లా అధికారులు పంపుతున్నారు. దీంతో కార్యక్రమం మొక్కుబడిగా మారింది. డీఈవోలు, ఎంఈవోల కొరతతో పర్యవేక్షణ లోపం కొట్టొచ్చినట్టు కనబడుతోంది.

బడి మానేసినవారు తిరిగి చేరేలా..

బడి మానేసిన వారిని బడికి తిరిగి రప్పించడమే కాకుండా, ప్రభుత్వ స్కూళ్లలోకి విద్యార్థులను మరలించేందుకు విద్యాశాఖ ఈ నెల 3 నుంచి ‘బడిబాట’చేపట్టింది. ప్రతి స్కూల్ పరిధిలో టీచర్లు గ్రామాల్లో ప్రతి ఇంటికీ వెళ్లి, విద్యార్థుల తల్లిదండ్రులతో మాట్లాడి, పిల్లలు బడిలో చేరేలా చూడాలని మార్గదర్శకాల్లో పేర్కొన్నారు.

గుర్తించింది 66 వేలు..

ఏటా ప్రభుత్వ స్కూళ్లలో 2 లక్షల మందిని కొత్తగా చేర్పిస్తున్నామని విద్యాశాఖ చెబుతోంది. కానీ ఇప్పటివరకు బడిలో చేర్పించాల్సిన విద్యార్థులు 66,847 మందిని మాత్రమే గుర్తించినట్టు విద్యాశాఖ వెల్లడించింది. వీరిలో ఒకటవ తరగతిలో చేర్చాల్సిన వారి సంఖ్య 16,038 ఉంది. ఇందులో 12,120 మందిని అంగన్‌వాడీల్లో చేర్పించేందుకు పేర్లు నమోదు చేశారు. ప్రైవేటు స్కూళ్లలో చేరేందుకు 1,181 మంది మొగ్గుచూపారు. ఇక 2,737 మంది బడిబాట బృందాలతో సంబంధం లేకుండానే స్కూళ్లలో చేరేందుకు సిద్ధమయ్యారు. మరోవైపు 2–7 తరగతుల మధ్య బడి మానేసిన పిల్లలు 8,966 మందిని కూడా గుర్తించారు. వీళ్లు ఇప్పటివరకు ప్రభుత్వ, ప్రైవేటు స్కూళ్లలో ఎక్కడ చేరారన్నది స్పష్టత ఇవ్వలేదు.



రాజధాని పరిసరాల్లోనే ఎక్కువ

బడి మానేస్తున్న వారిలో గ్రామీణ ప్రాంతాలకన్నా, హైదరాబాద్ పరిసర ప్రాంతాల్లోనే ఎక్కువమంది ఉన్నారు. రంగారెడ్డి జిల్లాలో ఇప్పటివరకు 4,137 మందిని గుర్తించారు. హైదరాబాద్‌లో 2,376 మంది బడి మానేసినట్టు తెలుసుకున్నారు. మెదక్‌లో 2,254 మంది, మేడ్చల్‌లో 1,457 మంది బడికి దూరమైనట్టు గుర్తించారు. ఇక ఖమ్మం జిల్లాలోని మారుమూల ప్రాంతాల్లో 3,371 మంది, నిజామాబాద్‌లో 4,107 మంది బడి మానేసిన పిల్లలున్నారు. హైదరాబాద్, నిజామాబాద్ జిల్లాల్లో స్కూళ్లకెళ్లని విద్యార్థుల తల్లిదండ్రులంతా దినసరి కూలీలే కావడం గమనార్హం. ఇతర ప్రాంతాల నుంచి వలస వచ్చినవారు పిల్లలను కూడా రోజువారీ పనులకు పంపుతున్నట్టు తేలింది. వీళ్లను గుర్తించడమే తప్ప, వీరంతా స్కూళ్లలో చేరతారా? లేదా? అనేది మాత్రం స్పష్టం కావట్లేదు.

ప్రైవేటు టీచర్లకు టార్గెట్లు

ప్రైవేటు స్కూళ్లు విద్యార్థులను, తల్లిదండ్రులను ఆకర్షించడమే లక్ష్యంగా ఏజెంట్లను రంగంలోకి దింపుతున్నాయి. ఇప్పటికే ప్రభుత్వ స్కూళ్లలో చదివే వారికీ గాలమేస్తున్నాయి. గ్రామాల్లో కొంతమందికి కమీషన్లు ఇస్తూ పిల్లల్ని తమ స్కూళ్లలో చేర్పించేలా తల్లిదండ్రులను ఒప్పించాలని కోరుతున్నాయి. ఊరూరా ఫ్లెక్సీలతో ప్రచారం చేస్తున్నాయి. టీచర్లకు టార్గెట్లు విధించి మరీ విద్యార్థులను చేర్చేలా ఒత్తిడి చేస్తున్నాయి. ప్రైవేటు స్కూళ్ల యాజమాన్యాల లెక్కల ప్రకారం ఈ సంవత్సరం ఇప్పటివరకు రాష్ట్రం మొత్తమ్మీద లక్షమంది విద్యార్థులు కొత్తగా ప్రభుత్వ స్కూళ్ల నుంచి ప్రైవేటు స్కూళ్లలో చేరినట్టు తెలుస్తోంది.



పల్లె నాగేశ్వరరావును సత్కరిస్తున్న దృశ్యం. చిత్రంలో జస్టిస్ ప్రియదర్శిని, ఘంటా చక్రపాణి తదితరులు

అవకాశాల్లేక దళితులు వెనకబడిపోతున్నారు

జస్టిస్ ప్రియదర్శిని వెల్లడి

నాంపల్లి (హైదరాబాద్): దేశంలో ప్రతి 20 నిమిషాలకు ఒక దళిత మహిళ అత్యాచారానికి గురవుతోందని, వాస్తవాలు బయటకు రాకుండా ప్రయత్నాలు చేస్తున్నారని హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ ప్రియదర్శిని ఆందోళన వ్యక్తం చేశారు. దేశంలో మిగతా మహిళల కంటే దళిత మహిళలు వివక్షతకు గురవుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. 60 శాతం మంది దళితులు పేదరికంలో మగ్గుతున్నారన్నారు. అవకాశాల్లేక దళితులు వెనకబడిపోతున్నారని, వారు సామాజికంగా, ఆర్థికంగా ఎదగాలంటే విద్యతోనే సాధ్యం అవుతుందని చెప్పారు. తెలంగాణ హైకోర్టు అడ్వొకేట్ అసోసియేషన్ అధ్యక్షుడిగా ప్రముఖ న్యాయవాది పల్లె నాగేశ్వరరావు ఎన్నికైన సందర్భంగా గురువారం పీపుల్స్ ఎడ్యుకేషనల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో పొట్టి శ్రీరాములు తెలుగు విశ్వవిద్యాలయం కళామందిరంలో సన్మానించారు. జస్టిస్ ప్రియదర్శిని ఈ కార్యక్రమానికి హాజరై ప్రసంగించారు. పల్లె నాగేశ్వరరావు అసోసియేషన్ అధ్యక్షుడిగా ఎన్నికై చరిత్ర సృష్టించారని, భవిష్యత్తు తరాలకు బాటలు వేశారని కొనియాడారు. టీఎస్‌పీఎస్సీ మాజీ చైర్మన్ ప్రొఫెసర్ ఘంటా చక్రపాణి మాట్లాడుతూ.. హైకోర్టులో దళిత న్యాయవాదికి గౌరవం దక్కడం దేశ చరిత్రలోనే గర్వకారణమన్నారు. గత పదేళ్లలో ఎంపికైన 600 మంది న్యాయమూర్తుల్లో 70% అగ్రవర్ణ కులస్తులే ఉన్నారని చెప్పారు. దళితులకు రక్షణ కల్పించలేని దీనస్థితిలో న్యాయవ్యవస్థ ఉందని వ్యాఖ్యానించారు. పీపుల్స్ ఎడ్యుకేషన్ ట్రస్ట్ అధ్యక్షుడు సీహెచ్ బాలకృష్ణ అధ్యక్షతన జరిగిన సభలో ఐపీఎస్ అధికారి చేతన, మల్లెపల్లి లక్ష్మయ్య పాల్గొన్నారు.

వచ్చే నెల 2న విజయవాడలో తెలంగాణ బోనాలు

చార్మినార్ (హైదరాబాద్): భాగ్యనగర్ మహంకాళి జాతర బోనాల ఉత్సవ కమిటీ జూలై 2న విజయవాడ శ్రీకనకదుర్గమ్మకు బంగారు బోనాన్ని సమర్పించనుంది. ఇందుకోసం ఏర్పాట్లు చేయాలని కోరుతూ ఏపీ దేవాదాయ శాఖ మంత్రి కె.సత్యనారాయణకు ఉత్సవ కమిటీ ప్రతినిధులు గురువారం విజయవాడలో వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. రెండు తెలుగు రాష్ట్రాల్లో మంచి వర్షాలు కురవాలని, పాడి పంటలతో సస్యశ్యామలంగా ఉండాలని కోరుతూ గత 14 ఏళ్లుగా హైదరాబాద్ పాతబస్తీ నుంచి విజయవాడ శ్రీ కనకదుర్గ అమ్మవారికి సామూహిక బోనాలు సమర్పిస్తున్నామన్నారు. జూలై 2న విజయవాడ బ్రాహ్మణ వీధి నుంచి కనకదుర్గమ్మ దేవాలయం వరకు తెలంగాణ బోనాల జాతర నిర్వహించనున్నామన్నారు. మంత్రిని కలసినవారిలో గాజుల అంజయ్య, మధుసూదన్ గౌడ్, ప్యారసాని వెంకటేశ్ తదితరులు ఉన్నారు.

అరుణ్ పిళ్లై బెయిల్ పిటిషన్ కొట్టివేత

తీర్పు ప్రతిలో ఎమ్మెల్సీ కవిత పేరు

సాక్షి, న్యూఢిల్లీ: ఢిల్లీ లిక్కర్ స్కాం కేసులో హైదరాబాద్‌కు చెందిన అరుణ్ పిళ్లై బెయిల్ పిటిషన్‌ను రౌజ్ అవెన్యూ కోర్టు కొట్టివేసింది. పిటిషన్‌ను విచారించిన జస్టిస్ నాగ్‌పాల్ ధర్మాసనం ఈ నెల 1న తీర్పును రిజర్వు చేసిన విషయం విదితమే. కాగా జస్టిస్ నాగ్‌పాల్ గురువారం తీర్పును వెలువరించారు. తెలంగాణ ఎమ్మెల్సీ కవిత పేరును తీర్పులో ప్రస్తావించడం గమనార్హం. ‘ఈ కేసులో పిళ్లై ప్రధాన నిందితుడిగా ఈడీ ఆరోపిస్తోంది. సౌత్ గ్రూపు తరఫున పలు సమావేశాల్లో పాల్గొన్నారని పేర్కొంది. అడ్వాన్స్ కిక్‌బ్యాక్‌ల చెల్లింపుల్లో సౌత్‌గ్రూపు సభ్యుడిగా ప్రమేయం ఉందని, ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవిత ప్రతినిధిగా, ఇండో స్పిరిట్స్‌లో డమ్మీ పార్ట్‌నర్‌గా ఉన్నారన్న ఆరోపణలు ఉన్నాయి. కుట్రలో పిళ్లై భాగస్వామ్యంపై మౌఖిక, డాక్యుమెంటరీ ఆధారం ఉందని ఈడీ పేర్కొంది. ఇండోస్పిరిట్స్ రూ.192 కోట్ల లాభాల్లో పిళ్లై రూ.32.86 కోట్లు ఆర్జించారని, పెట్టుబడి ఎమ్మెల్సీ కవిత పెట్టారని, కవిత ప్రతినిధిగా ప్రాపర్టీలు కొనుగోలు చేయడంలో కూడా పిళ్లై ప్రమేయం ఉందని ఈడీ తరఫు న్యాయవాది పేర్కొన్నారు. పిళ్లై 29 సార్లు దర్యాప్తునకు సహకరించారని పిటిషనర్ తరఫు న్యాయవాది తెలిపారు. అన్యాయంగా పిటిషనర్‌ను అరెస్టు చేశారని ఆరోపించారు. ‘కానీ ఈడీ అధికారులు హైదరాబాద్‌లో పిళ్లై నివాసంపై దాడులు చేసినప్పుడు అతని భార్య, మరికొందరు ఈడీ అధికారులను నియంత్రించారన్న ఆరోపణలున్నాయి. ఇతర నిందితులు సమీర్ మహేంద్రు, విజయ్‌నాయర్, అభిషేక్ బోయినపల్లి, బినోయ్‌బాబు, శరత్‌చంద్రారెడ్డి, రాఘవ మాగుంట, మనీష్ సిసోడియా తదితరుల రెగ్యులర్ బెయిల్ పిటిషన్లు కొట్టివేశాం. మరోవైపు మనీలాండరింగ్ నేరంలో ఇతర నిందితుల కన్నా పిటిషనర్ పాత్ర చాలా తీవ్రమైనదిగా కనిపిస్తోంది. ఈ నేపథ్యంలో అతని బెయిల్ పిటిషన్‌ను కొట్టివేస్తున్నాం..’అని జస్టిస్ నాగ్‌పాల్ తీర్పులో స్పష్టం చేశారు.

బీసీల సంక్షేమంపై శ్వేతపత్రం విడుదల చేయాలి: జాజుల



సాక్షి, హైదరాబాద్: దశాబ్ది ఉత్సవాల్లో భాగంగా శుక్రవారం నిర్వహిస్తున్న సంక్షేమ దినోత్సవం రోజున బీసీల సంక్షేమం కోసం ప్రభుత్వం ఏం చేసిందో శ్వేత పత్రం విడుదల చేయాలని బీసీ సంక్షేమ సంఘం జాతీయ అధ్యక్షులు జాజుల శ్రీనివాస్ గౌడ్ డిమాండ్ చేశారు. జనాభా దామాషా ప్రకారం బీసీల కోసం నిధులు కేటాయించి, దానికి చట్టబద్ధత కల్పించినప్పుడే నిజమైన సంక్షేమ దినోత్సవం అవుతుందని ఆయన ఒక ప్రకటనలో పేర్కొన్నారు. నిజంగా బీసీలపై కేసీఆర్‌కు చిత్తశుద్ధి ఉంటే శుక్రవారం మంచిర్యాలలో జరిగే సంక్షేమ దినోత్సవం బహిరంగ సభలో బీసీలకు సబ్ ప్లాన్, దళిత బంధు తరహాలో బీసీ బంధు ప్రకటించాలన్నారు. ఈ సందర్భంగా 10 ప్రశ్నలను సంధిస్తూ శ్వేతపత్రం విడుదల చేయాలని ఆయన డిమాండ్ చేశారు.

లోపభూయిష్టంగా బీసీ కులవృత్తుల పథకం



సాక్షి, హైదరాబాద్: బీసీ కుల వృత్తులను ఆదుకునేందుకు తెలంగాణ ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా ప్రారంభించనున్న బీసీ కులవృత్తుల ప్రోత్సాహక పథకం అమలు లోపభూయిష్టంగా ఉందని బీసీ రాజ్యాధికార సమితి అధ్యక్షుడు దాసు సురేశ్ విమర్శించారు. దీనిపై ముఖ్యమంత్రి, మంత్రివర్గం సబ్ కమిటీ లోతైన విచారణ జరపాలని ప్రభుత్వాన్ని ఒక ప్రకటనలో కోరారు. రూ.లక్ష మంజూరుతో కేవలం 20 వేల మంది బీసీ కులవృత్తిదారులకు లబ్ధి చేకూరుతుందని వివరించారు. ప్రభుత్వ జీవోలో 15 వృత్తి కులాలను మాత్రమే చేర్చడం అనేక అనుమానాలకు తావిస్తోందని పేర్కొన్నారు.

‘రూ.లక్ష సాయానికి ముదిరాజ్‌లు తగరా?’

సాక్షి, హైదరాబాద్: రాష్ట్ర ప్రభుత్వం రూ.లక్ష ఆర్థిక సాయం అందజేసే కులాల జాబితాలో ముదిరాజ్‌లను పొందుపరచకపోవడంలో ఆంతర్యమేంటని ముదిరాజ్ ఎంప్లాయీస్ అండ్ ప్రొఫెషనల్స్ అసోసియేషన్ (మెపా) రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పులి దేవేందర్ ముదిరాజ్ ప్రభుత్వాన్ని గురువారం ఒక ప్రకటనలో ప్రశ్నించారు. ముదిరాజ్‌లు బీసీ కులాల్లో లేరా..? వారికి కుల వృత్తి లేదా? అని నిలదీశారు.

గ్రావిటీ ఉండగా ‘లిఫ్టు’ ఎందుకు?

- చెన్నూరు లిఫ్టు నిర్మాణంపై రౌండ్‌టేబుల్ సమావేశంలో అఖిలపక్ష నేతలు
- మందాకిని రెండోదశను పూర్తి చేస్తే గ్రావిటీ ద్వారానే నీళ్లు వస్తాయని వెల్లడి

సాక్షి, హైదరాబాద్: చెన్నూరు అసెంబ్లీ నియోజకవర్గానికి గ్రావిటీ ద్వారా నీళ్లు వచ్చే అవకాశం ఉండగా ఎత్తిపోతల పథకం ఎందుకని అఖిపక్ష పార్టీల నేతలు ప్రశ్నించారు. రాష్ట్ర ప్రభుత్వం అనవసరంగా లిఫ్ట్ ఇరిగేషన్ ప్రాజెక్టు నిర్మిస్తోందని విమర్శించారు. శ్రీరాంసాగర్ ప్రాజెక్టు ఉత్తర కాల్వ (మందాకిని) రెండోదశ పనులు పూర్తి చేస్తే నియోజకవర్గానికి గ్రావిటీ ద్వారా నీళ్లు వస్తాయని తెలిపారు. అన్నారం, సుందిళ్ల, మేడిగడ్డ రిజర్వాయర్లపై ఎత్తిపోతల పథకాలను నిర్మించి చెన్నూరుకు నీళ్లను తరలించడానికి రూ. 1,658 కోట్ల అంచనా వ్యయంతో నిర్మాణ పనులకు గతేడాది రాష్ట్ర ప్రభుత్వం అనుమతిచ్చింది. సీఎం కేసీఆర్ శుక్రవారం ఈ పనులకు శంకుస్థాపన చేయనున్నారు. దీనికి నిరసనగా ప్రొఫెసర్ వినాయకరెడ్డి అధ్యక్షతన గురువారం అఖిపలక్ష పార్టీల ఆధ్వర్యంలో సోమాజీగూడ ప్రెస్‌క్లబ్‌లో రౌండ్‌టేబుల్ సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో కాంగ్రెస్ సీనియర్ నేత కోదండరెడ్డి, టీజేఎస్ అధినేత కోదండరాం, సీపీఐ నాయకురాలు పశ్య పద్మ, సీపీఐ(ఎంఎల్) న్యూడెమోక్రసీ కార్యదర్శివర్గ సభ్యుడు వేములపల్లి వెంకట్రామయ్య, తెలంగాణ లోక్‌సత్తా నేత మన్నారం నాగరాజు, రిటైర్డ్ ఐఏఎస్ అధికారి ఆకునూరి మురళి, రిటైర్డ్ హైకోర్టు జస్టిస్ చంద్రకుమార్, రిటైర్డ్ ఇంజనీర్ లక్ష్మీనారాయణ, రిటైర్డ్ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ విఠల్‌రావు, ఆదిలాబాద్ అభివృద్ధి వేదిక అధ్యక్షుడు కొండేటి సత్యనారాయణ, రిటైర్డ్ ప్రొఫెసర్ వెంకటనారాయణ, బీసీ సంఘం నేత శ్రీనివాస్ యాదవ్, జలసాధన సమితి నేత సారయ్య తదితరులు మాట్లాడారు.

కుప్తీ బ్యాలెన్సింగ్ రిజర్వాయర్ నిర్మిస్తే...

చెన్నూరు ఎత్తిపోతలకు ప్రత్యామ్నాయంగా గ్రావిటీ ద్వారా నీళ్లు అందించడానికి ఉన్న అవకాశాలను తెలంగాణ జలసాధన సమితి నేత నైనాల గోవర్ధన్ సర్వే ఆఫ్ ఇండియా విడుదల చేసే టోపోగ్రాఫికల్ మ్యాపుల ద్వారా వివరించారు. శ్రీరాంసాగర్ ఉత్తర కాల్వ రెండో దశ పనులను పూర్తి చేసి కడెం రిజర్వాయర్‌కు అనుసంధానించడంతోపాటు కడెంకు ఎగువన కుప్తీ బ్యాలెన్సింగ్ రిజర్వాయర్‌ను నిర్మిస్తే చెన్నూరుకు నీళ్లు అందించవచ్చన్నారు. సముద్రమట్టానికి 120 మీటర్ల ఎత్తులో ఉన్న చెన్నూరుకు శ్రీరాంసాగర్‌తోపాటు ఎల్లంపల్లి, తుమ్మిడిహెట్టితో కూడా గ్రావిటీ ద్వారా నీళ్లు ఇవ్వగలమని స్పష్టం చేశారు. సీఎం కేసీఆర్‌ను తాను చివరిసారిగా కలిసినప్పుడు కాళేశ్వరం ప్రాజెక్టుతోపాటే తుమ్మిడిహెట్టి రిజర్వాయర్‌ను నిర్మిస్తామని హామీ ఇచ్చి ఆ తర్వాత మాటమర్చారని కోదండరాం విమర్శించారు. చెన్నూరు ఎమ్మెల్యే బాల్క సుమన్‌కు కమీషన్ల కోసం ఎత్తిపోతల పథకానికి ప్రభుత్వం అనుమతిచ్చిందని ఆకునూరి మురళి ఆరోపించారు.

గోవా విమానంలో సాంకేతిక లోపం

ఆగ్రహం వ్యక్తం చేసిన ప్రయాణికులు

శంషాబాద్: గోవా వెళ్లాల్సిన విమానంలో సాంకేతిక లోపం తలెత్తింది. గురువారం మధ్యాహ్నం శంషాబాద్ నుంచి గోవా వెళ్లాల్సిన విమానంలో సాంకేతిక లోపంతో నిలిచిపోయింది. దీంతో ప్రయాణికులు తీవ్ర ఆందోళనకు గురయ్యారు. సాయంత్రం వరకు కూడా ప్రయాణికులకు సరైన సమాచారం అందించడంలో ఎయిర్‌లైన్స్ అధికారులు నిర్లక్ష్యంగా ఉండటంతో.. ఆగ్రహం వ్యక్తం చేసిన ప్రయాణికులు ఎయిర్ ఏషియా ఎయిర్‌లైన్స్ ప్రతినిధులతో వాగ్వాదానికి దిగారు. ప్రయాణికుల ఆందోళనతో సాయంత్రం ఆరుగంటల తర్వాత ఎయిర్‌లైన్స్ ప్రతినిధులు ప్రత్యామ్నాయ ఏర్పాట్లు చేయడంతో ప్రయాణికులు శాంతించారు.

క్లుప్తంగా...

‘షెజల్ ఫిర్యాదుపై విచారణ జరపండి’

సాక్షి, న్యూఢిల్లీ: బెల్లంపల్లి ఎమ్మెల్యే దుర్గం చిన్నయ్యపై లైంగిక ఆరోపణలు చేసి ఆత్మహత్యాయత్నం చేసిన షెజల్ ఫిర్యాదుపై జాతీయ మహిళా కమిషన్ స్పందించింది. ఎమ్మెల్యే చిన్నయ్య రాజకీయాల కోసం తమ బతుకులతో చెలగాటం ఆడుతున్నారని, ఆయనపై తక్షణమే తెలంగాణ పోలీసులు కేసు నమోదు చేయాలని షెజల్ డిమాండ్ చేయడం తెలిసిందే. ఆత్మహత్య చేసుకునేంత స్థాయిలో తనను ఎమ్మెల్యే, ఆయన అనుచరులు చిత్రహింసలు పెట్టారని ఆమె ఆరోపిస్తూ జాతీయ మహిళా కమిషన్‌ను గతంలో ఆశ్రయించింది. దీనిపై స్పందించిన జాతీయ మహిళా కమిషన్.. షెజల్ ఫిర్యాదుపై విచారణ జరపాలని తెలంగాణ డీజీపీకి కమిషన్ లేఖ రాసింది. ఈ వ్యవహారంలో విచారణ జరిపి చర్యలు తీసుకోవాలని ఆదేశించింది.ఫిర్యాదుపై తీసుకున్న చర్యలను 15 రోజుల్లో తమకు తెలియజేయాలని డీజీపీకి సూచించింది.

కొత్తగా ఎన్ని ఎకరాలకు నీళ్లిచ్చారో చెప్పండి

బీజేపీ నేత పొంగులేటి సుధాకర్‌రెడ్డి




సాక్షి, హైదరాబాద్: రాష్ట్రంలో బీఆర్ఎస్ అధికారంలోకి వచ్చాక కొత్తగా ఎన్ని ఎకరాలకు నీళ్లు అందించారో శ్వేత పత్రం విడుదల చేయాలని బీజేపీ నేత పొంగులేటి సుధాకర్ రెడ్డి డిమాండ్ చేశారు. సాగునీటి ప్రాజెక్టుల్లో భారీగా అవినీతి జరిగిందని, కేసీఆర్ సర్కార్‌కు దమ్ముంటే ప్రాజెక్టులపై చేసిన ఖర్చుమీద బహిరంగ చర్చకు రావాలని సవాల్ విసిరారు. గురువారం ఆయన మీడియాతో మాట్లాడుతూ రైతులు, వివిధ వర్గాల ప్రజలను తీవ్ర ఇబ్బందుల పాలుచేసిన బీఆర్ఎస్‌కు దశాబ్ది వేడుకలు నిర్వహించే హక్కుందా అని ప్రశ్నించారు. వచ్చే అసెంబ్లీ ఎన్నికలను దృష్టిలో పెట్టుకొని మాత్రమే ఈ వేడుకలు జరుపుతున్నారని విమర్శించారు. ప్రజలను భ్రమలో పెట్టే కార్యక్రమమే సర్కార్ నీళ్ల పండుగ అని మండిపడ్డారు. ఇరిగేషన్ కోసం రూ.1.55 లక్షల కోట్లు ఖర్చు చేసినా, మొత్తంగా ఎన్ని ఎకరాలకు నీళ్లు అందించారనే విషయంలో స్పష్టత కొరవడిందన్నారు. కాళేశ్వరం గొప్పగా కట్టామని గప్పాలు కొట్టారని, అక్కడ ఎందుకు ఈ దశాబ్ది ఉత్సవాల నిర్వహించడం లేదని నిలదీశారు. అసలు కాళేశ్వరం నీళ్ల ఎక్కడ పారుతున్నయో చెప్పాలన్నారు.

25న విశాఖలో బీసీ గర్జన: ఆర్.కృష్ణయ్య



కాచిగూడ (హైదరాబాద్): బీసీ ఉద్యమాల్లో భాగంగా ఈ నెల 25వ తేదీన ఆంధ్రప్రదేశ్‌లోని విశాఖపట్నంలో పెద్ద ఎత్తున బీసీ గర్జన నిర్వహించనున్నట్టు జాతీయ బీసీ సంక్షేమ సంఘం అధ్యక్షుడు, రాజ్యసభ సభ్యుడు ఆర్.కృష్ణయ్య తెలిపారు. జాతీయ బీసీ సంక్షేమ సంఘం అధికార ప్రతినిధి, ఢిల్లీ ఇన్‌చార్జి కర్రి వేణుమాధవ్ అధ్యక్షతన గురువారం కాచిగూడలో జరిగిన 34 బీసీ కుల సంఘాల ప్రతినిధుల సమావేశంలో కృష్ణయ్య ముఖ్యఅతిథిగా ప్రసంగించారు. జనాభా ప్రాతిపదికన చట్టసభల్లో బీసీలకు 50 శాతం రిజర్వేషన్లు కల్పించే వరకు దేశవ్యాప్తంగా బీసీల ఉద్యమం నిరంతరాయంగా కొనసాగుతుందని స్పష్టం చేశారు. అన్ని రాజకీయపార్టీల్లోని ఓబీసీ పార్లమెంట్ సభ్యులను ఏకతాటిపైకి తెచ్చేందుకు కృషి చేస్తున్నట్టు తెలిపారు. సమావేశంలో బీసీ సంక్షేమ సంఘం జాతీయ కన్వీనర్ గుజ్జ కృష్ణ తదితరులు పాల్గొన్నారు.

11న కొత్తగూడెంలో ‘సీపీఐ ప్రజాగర్జన’



సాక్షి, హైదరాబాద్: ఈ నెల 11న లక్ష మందితో ‘సీపీఐ ప్రజాగర్జన’పేరుతో భారీ బహిరంగసభను కొత్తగూడెంలోని ప్రకాశం గ్రౌండ్స్‌లో నిర్వహిస్తున్నట్లు ఆ పార్టీ రాష్ట్ర కార్యదర్శి కూనంనేని సాంబశివరావు వెల్లడించారు. ఈ మేరకు గురువారం ఆయన ఒక ప్రకటన విడుదల చేశారు. కేంద్ర ప్రభుత్వ విధానాలపై పోరాటాల కొనసాగింపు, రాష్ట్ర ప్రజల సమస్యల పరిష్కారం కోసం కార్యాచరణను ప్రకటించేందుకు బహిరంగ సభ నిర్వహిస్తున్నామని పేర్కొన్నారు. రాష్ట్ర వ్యాప్తంగా పార్టీ కార్యకర్తలు బస్సులు, ప్రత్యేక రైళ్లు, వాహనాలలో పెద్ద ఎత్తున సభకు హాజరయ్యేందుకు సన్నద్ధమవుతున్నారని తెలిపారు. ఈ సభకు ముఖ్య అతిథిగా పార్టీ ప్రధాన కార్యదర్శి డి.రాజా హాజరుకానున్నారు.

పార్టీ మారే అవసరం నాకు లేదు: డీకే అరుణ



సాక్షి, హైదరాబాద్: తాను పార్టీ మారుతున్నట్లు ఓ దినపత్రికలో (సాక్షి కాదు) వచ్చిన వార్తను బీజేపీ జాతీయ ఉపాధ్యక్షురాలు డీకే అరుణ తీవ్రంగా ఖండించారు. పార్టీ మారే అవసరం తనకు లేదని జాతీయ ఉపాధ్యక్ష పదవి ఇచ్చిన బీజేపీని వీడే ప్రసక్తి లేదని స్పష్టం చేశారు. కాంగ్రెస్‌లో చేరుతున్నట్లుగా వార్త ప్రచురించడంపై ఆమె మండిపడ్డారు. ఆ వార్తా పత్రిక ఎవరి కనుసైగల్లో నడుస్తున్నదో ప్రజలకు తెలుసన్నారు. ఇలాంటివి భవిష్యత్తులో పునరావృతమైతే పరువు నష్టం దావా వేస్తానని అరుణ హెచ్చరించారు.

నేడు మంచిర్యాలకు సీఎం

- గృహలక్ష్మి, బీసీ కుల వృత్తిదారులకు రూ.లక్ష సాయం..
- రెండో విడత దళితబంధు పథకాలు ప్రారంభం



కులవృత్తిదారులకు ఇచ్చే చెక్కుతో బాల్క సుమన్, విఠల్, కలెక్టర్ సంతోష్

సాక్షి ప్రతినిధి, మంచిర్యాల: ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన గృహలక్ష్మి పథకం, బీసీ కులవృత్తిదారులకు రూ.లక్ష సాయం, రెండో విడత దళితబంధును సీఎం కేసీఆర్ మంచిర్యాలలో ప్రారంభించనున్నారు. శుక్రవారం సాయంత్రం ఆయన మంచిర్యాలలో పర్యటించనున్నారు. ముఖ్యమంత్రి మొదట బీఆర్ఎస్ పార్టీ జిల్లా కార్యాలయం, కొత్త కలెక్టరేట్ భవనం ప్రారంభించాక, బహిరంగ సభ వేదికపై వివిధ పథకాల లబ్ధిదారులకు లాంఛనంగా చెక్కులు అందజేస్తారు. వీటితోపాటు రూ.1,658 కోట్ల వ్యయంతో, లక్ష ఎకరాలకు సాగునీరందించే చెన్నూరు ఎత్తిపోతల పథకం, మందమర్రిలో రూ.500 కోట్లతో ఏర్పాటు చేయనున్న ఆయిల్‌పాం ఫ్యాక్టరీ, రూ.164 కోట్లతో గోదావరిపై నిర్మించనున్న మంచిర్యాల, అంతర్గాం రోడ్డు బ్రిడ్జి, రూ.205 కోట్ల అంచనా వ్యయంతో చేపట్టనున్న వైద్యకళాశాల భవన నిర్మాణ పనులకు శంకుస్థాపన చేయనున్నారు. ఈ మేరకు జిల్లా అధికారులు, ప్రజాప్రతినిధులు అన్ని ఏర్పాట్లు చేశారు.

మహారాష్ట్రలోని 288 నియోజకవర్గాల్లో విస్తరించాలి

- ప్రతి గ్రామంలో 9 బీఆర్ఎస్ కమిటీలు ఏర్పాటు చేయాలి
- మహారాష్ట్ర నేతలతో సీఎం కేసీఆర్.. పార్టీలో చేరిన పలువురు నేతలు
- 15న నాగ్‌పూర్‌కు కేసీఆర్.. జూలైలో మధ్యప్రదేశ్‌లో బహిరంగసభ!



కేసీఆర్ సమక్షంలో బీఆర్ఎస్‌లో చేరిన నేతలు

సాక్షి, హైదరాబాద్: తెలంగాణ మోడల్ పాలనే ఎజెండాగా మహారాష్ట్రలోని 288 నియోజకవర్గాల్లో బీఆర్ఎస్ విస్తరణ చేపట్టాలని పార్టీ అధినేత, సీఎం కేసీఆర్ ఆ పార్టీ నాయకులకు సూచించారు. ప్రతి గ్రామంలోనూ అన్ని వర్గాల ప్రజల భాగస్వామ్యంతో తొమ్మిది కమిటీలను ఏర్పాటు చేయాలని చెప్పారు. గురువారం మహారాష్ట్ర నుంచి వచ్చిన పలువురు కేసీఆర్ సమక్షంలో బీఆర్ఎస్‌లో చేరారు. వారందరికీ సీఎం గులాబీ కండువాలు కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. అనంతరం మాట్లాడుతూ.. తెలంగాణలో రైతులు సహా అన్ని వర్గాల ప్రజలకు అందిస్తున్న సంక్షేమ పాలన మోడల్‌పై కరపత్రాలు, బుక్‌లెట్స్, పోస్టర్స్, హోర్డింగ్స్, సోషల్‌మీడియా ద్వారా విస్తృత ప్రచారం చేయాలని సూచించారు. తెలంగాణలో ధరణి పోర్టల్ ఏర్పాటు, రైతుబంధు, రైతుబీమా పథకాల అమలు, 24 గంటల ఉచిత విద్యుత్తు వంటి పథకాలతో రైతులకు భరోసా కల్పిస్తున్నామని తెలిపారు. మహారాష్ట్ర ప్రజలకూ తెలంగాణ పథకాలు అందించాలనే లక్ష్యంతో బీఆర్ఎస్ పనిచేస్తోందని, అక్కడి రైతులు సహా అన్ని వర్గాల ప్రజలు పార్టీని ఆదరిస్తున్న తీరు సంతోషకరమని కేసీఆర్ అన్నారు. కాగా సామాజిక కార్యకర్త డాక్టర్ సుభాష్ రాథోడ్, సేనా సంఘటన్ నుంచి ఉమేష్ చవాన్, బీజేపీకి చెందిన సివిల్ ఇంజనీర్ దీపక్‌పవార్, భారత్‌పవార్, అకోలా బజార్ ఉప సర్పంచ్ అశోక్‌రాథోడ్ తదితరులు బీఆర్ఎస్‌లో చేరారు. కార్యక్రమంలో మహారాష్ట్ర బీఆర్ఎస్ నాయకులు శంకరన్న దొండ్గే, మాణిక్ కదం, టీఎస్ఐడీసీ చైర్మన్ వేణుగోపాలచారి, హిమాన్షు తివారి పాల్గొన్నారు.

నాగ్‌పూర్‌లో బీఆర్ఎస్ కార్యాలయం

భారత్ రాష్ట్ర సమితి కార్యాలయాన్ని మహారాష్ట్రలోని నాగ్‌పూర్‌లో ఈనెల 15న ప్రారంభించేందుకు సన్నాహాలు జరుగుతున్నాయి. పార్టీ అధినేత, సీఎం కేసీఆర్ దీన్ని ప్రారంభిస్తారు. ఈ సందర్భంగా పార్టీ మహారాష్ట్ర శాఖకు చెందిన నేతలతో కేసీఆర్ సమావేశం కానున్నారు. ఇప్పటికే మహారాష్ట్రలో బీఆర్ఎస్ రెండ్రోజుల శిక్షణ కార్యక్రమాన్ని కేసీఆర్ ప్రారంభించగా ప్రస్తుతం క్షేత్రస్థాయిలో 288 అసెంబ్లీ నియోజకవర్గాల పరిధిలో పార్టీ సంస్థాగత కమిటీల ఏర్పాటు, సభ్యత్వ నమోదు వంటి కార్యక్రమాలు జరుగుతున్నాయి. జూలై 8 నాటికి కమిటీల ఏర్పాటు పూర్తవుతుందని పార్టీ వర్గాలు వెల్లడించాయి. కాగా చేరికల వేగాన్ని బట్టి జూలైలో మధ్యప్రదేశ్‌లోనూ బహిరంగసభను నిర్వహించే యోచనలో కేసీఆర్ ఉన్నారు.

బన్సల్‌కే బాధ్యతలన్నీ..!

బీజేపీ అధిష్టానం యోచన

- నలుగురైదుగురు ఇన్‌చార్జీలతో ఇబ్బందులనే భావన
- రాష్ట్ర నేతల్లో అసంతృప్తి, క్రమశిక్షణా రాహిత్యంపై దృష్టి
- హెచ్చరికలతో పాటు ఒకరిద్దరిపై చర్యలకూ సిద్ధం!



సాక్షి, హైదరాబాద్: రాష్ట్ర పార్టీని చక్కదిద్దేపనిలో భాగంగా అటు రాజకీయ వ్యవహారాలు, ఇటు సంస్థాగత అంశాలకు సంబంధించిన బాధ్యతలను ఒక్కరికే అప్పగించే దిశలో బీజేపీ జాతీయ నాయకత్వం చర్యలు చేపడుతున్నట్టు తెలుస్తోంది. నలుగురైదుగురు ఇన్‌చార్జీలు కాకుండా ఒక్కరికే పూర్తిస్థాయి ఇన్‌చార్జి బాధ్యతలు కట్టబెట్టడం ద్వారా మంచి ఫలితాలను సాధించవచ్చనే అంచనాకు వచ్చినట్టు సమాచారం. గత లోక్‌సభ ఎన్నికలతో పాటు, యూపీలో పార్టీ ట్రబుల్ షూటర్‌గా పేరు తెచ్చుకుని రెండోసారి పార్టీని అధికారంలోకి తీసుకురావడంలో కీలకపాత్ర పోషించిన సునీల్ బన్సల్‌కు పూర్తిస్థాయి బాధ్యతలు అప్పగించాలని అధినాయకత్వం భావిస్తున్నట్టు తెలిసింది.

అసంతృప్తిని చల్లార్చే చర్యలేవీ..?

తెలంగాణకు ఏకంగా నలుగురైదురు ఇన్‌చార్జీలను నియమించి వారి ద్వారానే జాతీయ నాయకత్వం రాష్ట్ర పార్టీకి ఎన్నికల దిశానిర్దేశం చేస్తున్న సంగతి విదితమే. జాతీయ ప్రధాన కార్యదర్శి తరుణ్‌చుగ్ రాష్ట్ర రాజకీయ వ్యవహారాల ఇన్‌చార్జిగా, మరో జాతీయ ప్రధాన కార్యదర్శి సునీల్ బన్సల్ రాష్ట్ర సంస్థాగత ఇన్‌చార్జిగా కొనసాగుతుండగా మరో ఇద్దరు జాతీయ నేతలు శివప్రకాష్, అర్వింద్ మీనన్‌లు కూడా ఇన్‌చార్జిలుగా ఉన్నారు. వీరంతా ఎన్నికల నేపథ్యంలో రాష్ట్రంలో పార్టీని క్షేత్రస్థాయి నుంచి బలోపేతం చేసేందుకు దాదాపు ఆరేడు నెలలుగా వివిధ కార్యక్రమాలు, పార్టీ నేతలతో సమీక్షలు నిర్వహిస్తున్నారు. అయితే గత 20, 30 ఏళ్లుగా పార్టీ కోసం కృషి చేసిన సీనియర్లకు సరైన ప్రాధాన్యత, గౌరవం లేదని, వారికి తగిన బాధ్యతలు కూ డా ఇవ్వడం లేదన్నది ప్రధాన విమర్శ. కాగా సొంత ప్రచారానికే అత్యధిక ప్రాధాన్యతనిస్తున్నారనే ఆరోపణలు కూడా ఉన్నాయి. పార్టీ నాయకుల్లో అసంతృప్తి వివిధ సందర్భాల్లో బయటపడుతున్నా ఈ సమస్యను అధిగమించే దిశగా ఇన్‌చార్జిలు ఎలాంటి చర్యలూ చేపట్టడం లేదని అసంతృప్త నేతలు భావిస్తున్నారు. వీటిని పరిగణలోకి తీసుకుంటున్న జాతీయ నాయకత్వం ఒక్కరికే పూర్తిస్థాయిలో బాధ్యతలు అప్పగించడం ద్వారా పరిస్థితిని చక్కదిద్దాలని భావిస్తున్నట్టు పార్టీ నేతలు చెబుతున్నారు.

కేడర్‌లో స్తబ్దత తొలిగేలా చర్యలు..

ప్రస్తుతం పార్టీలో పాత, కొత్తనేతల మధ్య సమన్వయలేమి, క్షేత్రస్థాయిలో ఎదురౌతున్న సమస్యలతో కేడర్‌లోనూ కొంత గందరగోళ పరిస్థితులు ఏర్పడ్డాయి. కొంత స్తబ్దత కూడా నెలకొంది. రాష్ట్ర పార్టీ నాయకత్వంపై, ముఖ్య నేతల వ్యవహారశైలి, అనుసరిస్తున్న వైఖరిపై అసంతృప్తి వ్యక్తం కావడం, అసమ్మతి కార్యక్రమాలకు తావిచ్చేలా కొందరు వ్యవహరించడం వంటివి క్రమశిక్షణా రాహిత్యంగా జాతీయ నాయకత్వం పరిగణిస్తోంది. ఎన్నికల నేపథ్యంలో వివిధ స్థాయి నాయకుల్లో అసంతృప్తిని, ముఖ్యంగా కిందిస్థాయి కేడర్‌లో ఏర్పడిన స్తబ్దతను తొలగించడానికి సత్వరమే చర్యలు చేపట్టాలనే నిర్ణయానికి వచ్చింది. పార్టీ క్రమశిక్షణ గీతను దాటుతున్న వారికి, పార్టీ ప్రయోజనాలకు వ్యతిరేకంగా పని చేస్తున్న వారిని హెచ్చరించడంతో పాటు ఒకరిద్దరిపై క్రమశిక్షణ చర్యలకు కూడా దిగే అవకాశాన్ని కొట్టిపారేయలేమని చెబుతున్నారు. ఈ మేరకు త్వరలో చేపట్టబోయే చర్యలపై రాష్ట్ర ముఖ్య నేతలకు సంకేతాలు కూడా అందినట్టు తెలుస్తోంది.

చేతికే చెక్ పెట్టాలి!

▶ మొదటి పేజీ తరువాయి

పనితీరుపై కూడా కేసీఆర్ ఇప్పటికే ఒక అంచనాకు వచ్చారు.

గత రెండు ఎన్నికల్లోనూ కాంగ్రెస్సే..

రాష్ట్ర అవతరణ నేపథ్యంలో జరిగిన 2014, 2018 అసెంబ్లీ ఎన్నికల్లో కూడా కాంగ్రెస్ పార్టీయే ప్రధాన ప్రత్యర్థిగా ఉంది. 119 అసెంబ్లీ స్థానాలకు గాను 2014లో 21 స్థానాల్లో కాంగ్రెస్ అభ్యర్థులు గెలుపొందగా, మరో 50 స్థానాల్లో రెండో స్థానంలో నిలిచారు. 2018 అసెంబ్లీ ఎన్నికల్లోనూ 19 చోట్ల విజయం సాధించిన కాంగ్రెస్ మరో 68 చోట్ల రెండో స్థానంలో నిలిచింది. ఇక 2014లో ఐదు స్థానాల్లో, 2018లో కేవలం ఒకే చోట బీజేపీ అభ్యర్థులు గెలిచారు. రెండు ఎన్నికల్లోనూ బీజేపీ పది నియోజకవర్గాల్లో రెండో స్థానంలో నిలవగా, ఇందులో సగం వరకు హైదరాబాద్ నగరంలోనే ఉండటం గమనార్హం. ఈ గణాంకాలతో పాటు, ప్రస్తుతం వివిధ సంస్థల నుంచి అందుతున్న సర్వేలు, నిఘా సంస్థల నివేదికల ఆధారంగా వచ్చే ఎన్నికల్లో ఏ పార్టీ నుంచి ప్రధాన పోటీ ఉంటుందో బీఆర్ఎస్ అధినేత విశ్లేషిస్తున్నారు. దుబ్బాక, హుజూరాబాద్ అసెంబ్లీ ఉప ఎన్నికలు, గ్రేటర్ హైదరాబాద్ మున్సిపల్ ఎన్నికల్లో బీజేపీ కొంత పుంజుకున్నట్లు కనిపించినా, కర్ణాటక ఎన్నికల తర్వాత ఆ పార్టీ గ్రాఫ్ గణనీయంగా తగ్గినట్లు అధికార పార్టీ అంచనా వేస్తోంది. మొత్తం మీద వచ్చే ఎన్నికల్లో బీజేపీ ఓటు బ్యాంకు కొంత మెరుగయ్యే అవకాశమున్నా ప్రధాన ప్రత్యర్థిగా మాత్రం కాంగ్రెస్ పార్టీయే ఉంటుందని కేసీఆర్ లెక్కలు వేస్తున్నట్లు బీఆర్ఎస్ వర్గాలు చెప్తున్నాయి. సుమారు 80 అసెంబ్లీ నియోజకవర్గాల్లో తమకు కాంగ్రెస్‌తోనే ప్రధానంగా పోటీ ఉంటుందని బీఆర్ఎస్ లెక్కలు వేస్తోంది.

చేరికలతో బలోపేతం

రాష్ట్ర అవతరణ నేపథ్యంలో ముఖ్యమంత్రిగా అధికార పగ్గాలు చేపట్టిన కేసీఆర్ 2014 ఎన్నికల తర్వాత 25 మంది ఇతర పార్టీల ఎమ్మెల్యేలను బీఆర్ఎస్‌లో చేర్చుకున్నారు. ఇందులో కాంగ్రెస్‌కు చెందిన ఏడుగురు ఉన్నారు. టీడీపీ నిర్వీర్యమైనా, 2018 ఎన్నికల్లో మొత్తం మీద 87 స్థానాల్లో కాంగ్రెస్ తన పట్టు ప్రదర్శించింది. 2018 తర్వాత 12 మంది కాంగ్రెస్ ఎమ్మెల్యేలు బీఆర్ఎస్ గూటికి చేరారు. కాంగ్రెస్ ఎమ్మెల్యేలు ప్రాతినిధ్యం వహించిన హుజూర్‌నగర్, మునుగోడు స్థానాలను ఉప ఎన్నికల్లో బీఆర్ఎస్ కైవసం చేసుకుంది. దీంతో ప్రస్తుతం కాంగ్రెస్ కేవలం ఐదు స్థానాలకే పరిమితమైంది. 2014 ఎన్నికల్లో వివిధ పార్టీల నుంచి చేరిన 25 మంది ఎమ్మెల్యేలకు తిరిగి 2018లో బీఆర్ఎస్ టికెట్లు దక్కగా, తీగల కృష్ణారెడ్డి, పాయం వెంకటేశ్వర్లు, తాటి వెంకటేశ్వర్లు, బానోత్ మదన్‌లాల్ ఓటమి పాలయ్యారు. అయితే వీరిపై గెలుపొందిన కాంగ్రెస్ ఎమ్మెల్యేలందరూ తర్వాతి పరిణామాల్లో బీఆర్ఎస్ గూటికే చేరుకోవడం గమనార్హం. ఈ విధంగా కాంగ్రెస్ కుదేలైనట్లు కనిపిస్తున్నా పొంగులేటి, జూపల్లి వంటి నేతలు ఆ పార్టీలో చేరితే ఆ పార్టీయే తమ ప్రధాన ప్రత్యర్థిగా ఉంటుందని కేసీఆర్ భావిస్తున్నారు. అందుకనుగుణంగా బీఆర్ఎస్ ఎన్నికల వ్యూహం ఉంటుందని పార్టీ వర్గాలు చెప్తున్నాయి.

వివిధ పార్టీల నుంచి బీఆర్ఎస్‌లోకి చేరికలు

పార్టీ	2014	2018
కాంగ్రెస్	07	12
టీడీపీ	12	02
వైఎస్సార్‌సీపీ	03	–
బీఎస్పీ	02	–
సీపీఐ	01	–
ఇతరులు	–	02
మొత్తం	25	16

కాంగ్రెస్ గూటికి పొంగులేటి..

▶ మొదటి పేజీ తరువాయి

ఉమ్మడి ఖమ్మం జిల్లావ్యాప్తంగా ఆత్మీయ సమ్మేళనాలకు శ్రీకారం చుట్టారు. ఈ సందర్భంగా పలు నియోజకవర్గాలకు అభ్యర్థులను ప్రకటించారు. తాను ఏ పార్టీలో చేరినా తాను ప్రకటించిన అభ్యర్థులే బరిలో ఉంటారని పొంగులేటి చెబుతూ వస్తున్నారు. మొత్తం మీద ఐదు నెలలుగా పొంగులేటి ప్రజల మధ్యే ఉండేందుకు ప్రాధాన్యం ఇచ్చారు. ఆత్మీయ సమ్మేళనాలతో పాటు ఇతర ప్రైవేట్ కార్యక్రమాల్లో పాల్గొనడంపై దృష్టి సారించారు. మేలో రైతు భరోసా ర్యాలీ, పోడు రైతులకు మద్దతుగా ర్యాలీ నిర్వహించడంతో పాటు యువత కోసం భారీ స్థాయిలో జాబ్‌మేళా ఏర్పాటు చేశారు.

బీజేపీ, కాంగ్రెస్ యత్నాలు..

రాష్ట్రవ్యాప్తంగా ఉన్న కేసీఆర్ వ్యతిరేకులను ఏకతాటిపైకి తెచ్చే యత్నాల్లో భాగంగా మాజీ మంత్రి జూపల్లి కృష్ణారావు తదితరులతో కలిసి పయనించేందుకు పొంగులేటి సిద్ధమయ్యారు. ఇతర జిల్లాల్లోని అసంతృప్త నేతలతోనూ చర్చలు జరిపారు. బీజేపీలో చేరాలా లేక కాంగ్రెస్‌లో చేరాలా.. ఏ పార్టీలో చేరకుండా సొంత కూటమి ఏర్పాటు చేయాలా? అనే అంశంపై చర్చలు జరిగాయి. అయితే ఖమ్మం జిల్లాలో బలోపేతం కావాలనే లక్ష్యంతో ఉన్న బీజేపీ.. పలు దఫాలు పొంగులేటితో చర్చలు జరపగా, మే 4న బీజేపీ చేరికల కమిటీ చైర్మన్ ఈటల రాజేందర్, ఎమ్మెల్యే రఘునందన్‌రావు ఖమ్మంలో పొంగులేటి, జూపల్లిని కలిశారు. అనంతరం హైదరాబాద్‌లోనూ వీరు సమావేశమైనట్లు ప్రచారం జరిగింది. మరోవైపు టీపీసీసీ అధ్యక్షుడు రేవంత్‌రెడ్డితోనూ చర్చలు జరిగినట్లు సమాచారం. కాగా స్థానిక పరిస్థితులు, ఇతర అన్ని అంశాలనూ బేరీజు వేసుకున్న ఆయన కాంగ్రెస్ వైపు మొగ్గు చూపుతున్నట్లు తెలుస్తోంది.

అనుచరుల నిర్ణయం మేరకు..

ఖమ్మం ఎస్ఆర్ కన్వెన్షన్ హాల్‌లో ఉదయం 7.30కి మొదలయ్యే సమావేశానికి పది నియోజకవర్గాల నుంచి 200 మంది చొప్పున హాజరు కావాల్సిందిగా ఆయన అనుచరులకు సమాచారం అందింది. ఈ భేటీలో అభిప్రాయాలు సేకరించాక వారి నిర్ణయం మేరకు అడుగులు వేస్తానని పొంగులేటి చెప్పినట్లు తెలిసింది. కాగా ఈనెల 12న తన చేరిక విషయమై ప్రకటన చేస్తారని, ఈనెల 28 తర్వాత ఖమ్మంలో జరిగే సభలో అనుచర గణంతో కలిసి కాంగ్రెస్ కండువా కప్పుకుంటారని సమాచారం.

కేసీఆర్‌ను మళ్లీ ఎందుకు ఆశీర్వదించాలి?: షర్మిల



సాక్షి, హైదరాబాద్: కేసీఆర్‌ను మళ్లీ ఎందుకు ఆశీర్వదించాలో ఒక్క కారణం చెప్పాలని మంత్రి కేటీఆర్‌ను వైఎస్సార్ తెలంగాణ పార్టీ అధ్యక్షురాలు వైఎస్ షర్మిల ప్రశ్నించారు. రూ.16 వేల కోట్ల మిగులు బడ్జెట్ ఉన్న రాష్ట్రాన్ని.. రూ.5 లక్షల కోట్ల అప్పుల కుప్ప చేసినందుకు కేసీఆర్‌ను మళ్లీ ముఖ్యమంత్రిని చేయాలా అని ఆమె గురువారం ట్విట్టర్‌లో నిలదీశారు. మీ అనుచరవర్గం కోసం 30 వేల ఎకరాల సర్కారు భూమిని అమ్మినందుకు మీరు గొప్పోళ్లని ఆశీర్వాదం ఇవ్వాలా అన్నారు. కాంగ్రెసోళ్ల తెలివిలేనోళ్లయితే ఆ పార్టీ ఎమ్మెల్యేలను కొన్న మిమ్మల్ని ఏమని పిలవాలన్నారు. ప్రతిపక్ష లీడర్లు ఎన్నికల సమయంలోనే కనిపించే సంక్రాంతి గంగిరెద్దులైతే.. ఎన్నికలకు 6 నెలల ముందు నిద్ర లేచిన కేసీఆర్‌ను ఏమనాలని షర్మిల నిలదీశారు. ప్రాజెక్టుల పేరు చెప్పి మీ కుటుంబం లక్ష కోట్లు కాజేసినందుకు ఆశీర్వదించాలా? ఇంటికో ఉద్యోగం అని చెప్పి, 9 ఏళ్లలో 65 వేల ఉద్యోగాలే ఇచ్చినందుకు మళ్లీ అధికారం ఇవ్వాలా? అని ధ్వజమెత్తారు.

కాంగ్రెస్‌లోకే పొంగులేటి, జూపల్లి

సీఎల్పీ నేత భట్టి విక్రమార్క వ్యాఖ్య

- నల్లగొండకు బీఆర్ఎస్ ప్రభుత్వం తీవ్ర నష్టం చేసింది
- కాంగ్రెస్ అధికారంలోకి వస్తే ప్రాజెక్టులన్నీ పూర్తి చేస్తాం



నల్లగొండ జిల్లాలోని చందంపేట మండలంలో భట్టి విక్రమార్కతో పాదయాత్రలో ఉత్తమ్

సాక్షి ప్రతినిధి, నల్లగొండ: ‘బీఆర్ఎస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తొమ్మిదిన్నరేళ్లలో రాష్ట్రంలో ఒక్క మధ్యతరహా సాగునీటి ప్రాజెక్టునైనా పూర్తి చేశారా? చిన్న చెరువునైనా తవ్వారా? కృష్ణా, గోదావరి నదులపై ప్రాజెక్టులు కట్టి ఒక్క ఎకరానికైనా అదనంగా నీళ్లు ఇచ్చారా?’అని సీఎల్పీ నేత మల్లు భట్టి విక్రమార్క ప్రశ్నించారు. భట్టి చేపట్టిన పీపుల్స్ మార్చ్ పాదయాత్ర గురువారం నల్లగొండ జిల్లాలోని దేవరకొండ నియోజకవర్గం చందంపేట మండలంలోకి ప్రవేశించింది. ఈ సందర్భంగా ఆయన నక్కలగండి ప్రాజెక్టును పరిశీలించి భూనిర్వాసితులతో మాట్లాడారు. అనంతరం మీడియాతో మాట్లాడారు. దివంగత ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖరరెడ్డి హయాంలో జలయజ్ఞం కింద మొదలుపెట్టిన ప్రాజెక్టులను బీఆర్ఎస్ ప్రభుత్వం పూర్తిచేయకుండా నల్లగొండ జిల్లాకు తీవ్ర నష్టం చేసిందని విమర్శించారు. తొమ్మిదిన్నరేళ్ల పాలనలో జిల్లాకు అదనంగా చుక్క నీరూ ఇవ్వలేదన్నారు. ఈ విషయంపై బహిరంగ చర్చకు రావాలని సవాల్ విసిరారు. 2004లో సీఎం అయిన వైఎస్ జలయజ్ఞం ద్వారా 45 లక్షల ఎకరాలకు సాగునీరు ఇవ్వడానికి ప్రాజెక్టులకు రూపకల్పన చేశారన్నారు. బీఆర్ఎస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చే 2014 నాటికి ముందే రాష్ట్రంలో 95 లక్షల ఎకరాలకు సాగు నీరు అందించే ప్రాజెక్టులు ఉన్నాయన్నారు. కాళేశ్వరంతో కరెంటు బిల్లు నష్టం తప్ప తెలంగాణ ప్రజలకు, రైతులకు కలిగిన ప్రయోజనం ఏమీ లేదని భట్టి విమర్శించారు. కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వస్తే ప్రాజెక్టులన్నీ పూర్తి చేస్తామన్నారు. మాజీ ఎంపీ పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి కాంగ్రెస్‌లోకి వస్తారని భట్టి ఆశాభావం వ్యక్తం చేశారు. జూపల్లి కృష్ణారావు రాక ఖరారు అయినట్లేనని పేర్కొన్నారు. ఈటల రాజేందర్, కోమటిరెడ్డి రాజగోపాల్‌రెడ్డి అంశాన్ని విలేకరులు ప్రస్తావించగా.. బీజేపీ నుంచి కూడా కాంగ్రెస్‌లోకి పెద్ద ఎత్తున వలసలు ఉంటాయని చెప్పారు.

బీఆర్ఎస్ ఎమ్మెల్యేలకు ప్రైవేటు సైన్యంలా పోలీసులు: కేసీఆర్‌కు భట్టి బహిరంగ లేఖ

రాష్ట్రంలో బీఆర్ఎస్ ఎమ్మెల్యేలకు పోలీసులు ప్రైవేటు సైన్యంలా తయారయ్యారని, ఎమ్మెల్యేల ఆదేశాలతో పోలీసులు ప్రజలను భయభ్రాంతులకు గురిచేస్తున్నారని భట్టి విక్రమార్క ఆరోపించారు. ప్రజాస్వామ్యం ప్రమాదంలో పడిందని, ప్రజలు భయంతో బతకాల్సిన పరిస్థితులు ఏర్పడ్డాయని తెలిపారు. తాను 84 రోజులుగా చేస్తున్న పాదయాత్రలో ఈ పరిస్థితులను గ్రహించానని పేర్కొన్నారు. పోలీసు వ్యవస్థను ప్రజల కోసమే ఉపయోగించాలని డిమాండ్ చేశారు. ఈ మేరకు గురువారం సీఎం కేసీఆర్‌కు రాసిన లేఖను నల్లగొండ జిల్లా చందంపేట మండలంలోని నక్కలగండి ప్రాజెక్టు పాదయాత్ర శిబిరం వద్ద భట్టి విడుదల చేశారు.

ప్రజలు నా దృష్టికి తెచ్చారు..

‘మార్చి 16న చేపట్టిన పీపుల్స్ మార్చ్ పాదయాత్ర పురస్కరించుకుని వందల గ్రామాల్లో కాలినడకన తిరిగిన సందర్భంగా.. పోలీసులు తమను వేధింపులు, ఇబ్బందులకు గురి చేయడాన్ని వందలాది మంది ప్రజలు నా దృష్టికి తీసుకువచ్చారు. కుల, మత, ప్రాంతాలకు అతీతంగా ప్రజల రక్షణ కోసం ఏర్పాటు చేసిన పోలీసు వ్యవస్థ అధికార పార్టీకి చెందిన ఎమ్మెల్యేల ఆదేశాలను అమలు చేస్తోంది. డీజీపీ, ఐజీ, డీఐజీ, ఎస్పీ లాంటి ఉన్నతాధికారులు చెప్పినట్లుగా కాకుండా ఎమ్మెల్యేల ఆదేశాలు అమలు చేసే పోలీసులుగా మారిపోయారు.

వారు స్వేచ్ఛగా మాట్లాడే హక్కు కోల్పోయారు..

సమాజంలో అనేక వర్గాల ప్రజలు స్వేచ్ఛగా మాట్లాడే హక్కును కోల్పోయారు. కవులు, కళాకారు లు, మేధావులు, జర్నలిస్టులు, ప్రజాస్వామికవాదు లు, ప్రగతిశీల వాదులు, రాజకీయ పార్టీలు స్వేచ్ఛ గా భావజాలాన్ని వ్యాప్తి చేసుకునే పరిస్థితి లేకుండా పోయింది. ఏ ఆత్మగౌరవం కోసం, ఏ హక్కుల కోసం పోరాడామో అవి సాధించుకున్న స్వరాష్ట్రంలో మరింతగా లేకుండా పోయాయి. ప్రజాస్వామ్యంలో ఆయా రాజకీయ పార్టీలు వస్తుంటాయి పోతుంటాయి. కానీ వ్యవస్థలు మాత్రం శాశ్వతంగా ఉంటాయి. పోలీసు వ్యవస్థను ప్రజల రక్షణ కోసం ఉపయోగించాలి తప్ప రాజకీయ పార్టీల కోసం కాదు..’అని భట్టి లేఖలో పేర్కొన్నారు.

- ఆర్టీసీ ఈ-గరుడ ఎలక్ట్రిక్ బస్సుకు ట్రాఫిక్ షాక్
- 150 కి.మీ.సరిపడా శక్తిని మింగేస్తున్న ట్రాఫిక్
- దీంతో విజయవాడ వరకు సరిపోక సూర్యాపేటలో రెండోసారి చార్జింగ్
- ప్రయాణికుల అసహనం.. బ్రేక్ సమయంలో చార్జింగ్ పెడుతున్న అధికారులు

చార్జింగ్ చాలట్లే!

సాక్షి, హైదరాబాద్: ఎలక్ట్రిక్ బస్సుల బ్యాటరీలోని చార్జింగ్‌ను ట్రాఫిక్ జామ్‌లు హరిస్తున్నాయి. దీంతో బస్సు గమ్యం చేరేందుకు అవసరమైన చార్జింగ్ లేకపోవడంతో మధ్యలో మరోసారి బ్యాటరీని చార్జ్ చేయాల్సి వస్తోంది. ఇది ఇటీవలే ఆర్టీసీ ప్రతిష్టాత్మకంగా ప్రవేశపెట్టిన ఈ–గరుడ బస్సులకు తలనొప్పిగా మారింది.

‘ఈ-బస్సు’.. రెండు సార్లు చార్జ్ చేయాల్సిందే..

➤ ఆర్టీసీ ఇటీవలే పది ఎలక్ట్రిక్ బస్సులను అద్దె ప్రాతిపదికన ప్రారంభించిన విషయం తెలిసిందే. తొలి విడతలో అందుబాటులోకి వచ్చిన ఈ పది బస్సులను విజయవాడ వరకు తిప్పుతున్నారు. వీటిని బీహెచ్ఈఎల్ డిపో ద్వారా నిర్వహిస్తున్నారు. ఎయిర్‌పోర్టుకు తిరుగుతున్న ఎలక్ట్రిక్ బస్సుల కోసం మియాపూర్ డిపోలో బ్యాటరీ చార్జింగ్ పాయింట్‌లను ఏర్పాటు చేయడంతో, ఈ బస్సులకు కూడా అక్కడే చార్జి చేస్తున్నారు. పూర్తి చార్జింగ్ తర్వాత బస్సు ప్రారంభమై ప్రయాణికులను ఎక్కించుకుంటూ ఎంజీబీఎస్‌కు వెళ్తుంది. అక్కడి నుంచి విజయవాడ బయలు దేరుతుంది.



సూర్యాపేటలో ప్రైవేట్ చార్జింగ్ స్టేషన్‌లో చార్జింగ్

➤ మియాపూర్–ఎంజీబీఎస్ మధ్య 30 కి.మీ. దూరం ఉంది. ఈ రూట్ అంతా విపరీతమైన ట్రాఫిక్ నేపథ్యంలో తరచూ బస్సుకు బ్రేకులు వేయాల్సి వస్తుండటంతో బ్యాటరీ శక్తి ఎక్కువగా ఇక్కడే ఖర్చవుతోంది. ఎంజీబీఎస్‌లో బయలు దేరిన తర్వాత చౌటుప్పల్ వెళ్లే వరకు ట్రాఫిక్ కొనసాగుతోంది. ఈ ప్రాంతంలో కూడా మరింత ఖర్చవుతోంది. మొత్తంగా 150 కి.మీ. దూరం రావాల్సిన శక్తి ఈ రెండు ప్రాంతాల్లోనే ఖర్చవుతుండటంతో విజయవాడ వరకు వెళ్లేందుకు సరిపోవటం లేదు. విజయవాడకు చేరుకున్న తర్వాత తిరిగి చార్జ్ చేసేందుకు, అక్కడి బస్టాండుకు పది కి.మీ. దూరంలో ఉన్న చార్జింగ్ పాయింట్ వద్దకు వెళ్లాలి. వెరసి మియాపూర్ నుంచి ఆ పాయింట్ వరకు 325 కి.మీ.దూరం అవుతోంది. సాధారణంగా బ్యాటరీలో 20 శాతం చార్జింగ్ ఉండగానే మళ్లీ ఫిల్ చేయాలనేది నిబంధన. లేదంటే సాంకేతిక సమస్య తలెత్తి బస్సు ఉన్నదిఉన్నట్టు ఆగిపోతుంది. దీంతో నగరంలో ఫుల్ చార్జ్ చేసినా... ట్రాఫిక్ చిక్కుల్లో పవర్ ఖర్చవుతుండటంతో మధ్యలో మరోసారి విధిగా చార్జ్ చేయించాల్సి వస్తోంది. దీంతో సూర్యాపేటలో ఉన్న ఓ ప్రైవేటు చార్జింగ్ స్టేషన్‌లో రెండోసారి చార్జ్ చేయిస్తున్నారు. ఇది ప్రయాణికులకు విసుగ్గా మారింది. నాన్‌స్టాప్‌గా వెళ్తుందనుకుంటే మధ్యలో ఆగాల్సి రావటం వారికి చిరాకు తెప్పిస్తోంది.

సిటీ దాటేటప్పటికే చార్జింగ్ డౌన్

బ్రేక్ సమయంగా మార్పు..

విజయవాడ వెళ్లే బస్సులను మధ్యలో కోదాడ వద్దో, ఇతర దాబాల వద్దనో అరగంటపాటు ఆపుతుంటారు. ప్రయాణికుల ఆగ్రహాన్ని దృష్టిలో పెట్టుకుని ఆ బ్రేక్ సమయాన్ని సూర్యాపేటలో ఇస్తూ, ఆ సమయంలోనే బ్యాటరీని చార్జ్ చేయిస్తున్నట్టు అధికారులు పేర్కొంటున్నారు.

కాగా, మరో 20 రోజుల్లో..

సూర్యాపేట బస్టాండులో ఆర్టీసీ సొంతంగా చార్జింగ్ స్టేషన్ ఏర్పాటు చేస్తోంది. ఇది అందుబాటులోకి వస్తే మరింత వేగంగా చార్జ్ అవుతుందని పేర్కొంటున్నారు. మళ్లీ తిరుగు ప్రయాణంలో కూడా, విజయవాడ బస్టాండుకు 10 కి.మీ. దూరంలో ఉన్న పాయింట్‌లో ఫుల్ చార్జ్ చేయించి.. మళ్లీ సూర్యాపేటలో రెండో సారి చార్జ్ చేయిస్తున్నారు.


ఫుల్ డిమాండ్..

ఈ–గరుడ బస్సులకు ప్రస్తుతం మంచి డిమాండ్ ఉంది. ఏసీ బస్సులు కావటం, ఎలక్ట్రిక్ బస్సులు కావడంతో చప్పుడు లేకపోవటంతో ప్రయాణికులు వీటిల్లో ప్రయాణించేందుకు మొగ్గు చూపుతున్నారు. హైదరాబాద్ నుంచి విజయవాడ వెళ్లేటప్పటితో పోలిస్తే అక్కడి నుంచి వచ్చేటప్పుడు డిమాండ్ ఎక్కువగా ఉంటోంది. ఇటీవల వరసగా కొన్ని రోజులపాటు 100 శాతం ఆక్యుపెన్సీ నమోదైంది. వెళ్లేప్పుడు అది 70 శాతంగా ఉంటోంది.

సాక్షి
హైదరాబాద్
శుక్రవారం । 9 । జూన్ । 2023



రాష్ట్రంలో శాంతి భద్రతలు భేష్
శాంతి భద్రతల పరిరక్షణలో దేశానికే తెలంగాణ ఆదర్శంగా ఉందని రాష్ట్ర హోం మంత్రి మహమూద్ అలీ అన్నారు.
-10లో



సందర్శకులకు మొక్కల పంపిణీ
చెరువుల పండుగ సందర్భంగా గురువారం హెచ్ఎండీఏ ఆధ్వర్యంలో ట్యాంక్ బండ్‌పై సందర్శకులకు మొక్కలు పంపిణీ చేశారు.
– సాక్షి, సిటీబ్యూరో

ఉష్ణోగ్రత

గరిష్టం	కనిష్టం
39.7°	27.0°

న్యూస్‌రీల్

16 నుంచి సూత్ర లైఫ్‌స్టైల్ ఎగ్జిబిషన్


దుస్తులు, ఆభరణాలు ప్రదర్శిస్తున్న మోడల్స్

బంజారాహిల్స్: దేశంలోని ప్రఖ్యాత ఫ్యాషన్ డిజైనర్లు రూపొందించిన డిజైనర్ దుస్తులు, ఆభరణాల ప్రదర్శన ఈ నెల 16 నుంచి 18 వరకు బంజారాహిల్స్‌లోని తాజ్‌కృష్ణా హోటల్‌లో సూత్ర ఫ్యాషన్ ఎగ్జిబిషన్ పేరుతో ఏర్పాటు చేసినట్లు నిర్వాహకులు వెల్లడించారు. గురువారం బంజారాహిల్స్ రోడ్ నెం .1లోని ఎస్‌వీఎం గ్రాండ్ హోటల్లో ఈ ప్రదర్శనకు సంబంధించిన సన్నాహక కార్యక్రమం కనులపండువగా జరిగింది. ప్రముఖ డిజైనర్లు రూపొందించిన దుస్తులను ధరించిన మోడల్స్ సందడి చేశారు. ఆకట్టుకునే కలర్ కాంబినేషన్, లగ్జరీ, ట్రెడిషన్, ఇండియన్‌వేర్ ప్రత్యేకతలుగా ఈ ప్రదర్శన ఫ్యాషన్ ప్రియులను ఆకట్టుకోనుందని నిర్వాహకులు తెలిపారు.

డయల్ 100కు తప్పుడు ఫిర్యాదు

- మహిళకు 30 రోజుల జైలుశిక్ష

సైదాబాద్: మద్యం మత్తులో పక్కింటివారితో తగువు పడి డయల్ 100కి ఫోన్ చేసి తప్పుడు ఫిర్యాదు చేయటంతో పాటు విచారణకు వెళ్లిన పోలీసుల పట్ల దురుసుగా ప్రవర్తించిన మహిళకు న్యాయస్థానం 30 రోజుల జైలుశిక్ష విధించింది. సైదాబాద్ ఇన్‌స్పెక్టర్ సుబ్బిరామిరెడ్డి తెలిపిన వివరాల ప్రకారం.. సింగరేణి కాలనీలో నివసించే హనుమంతు భార్య మునావత్ జంకు కూలిపనులకు వెళ్తుండేది. బుధవారం రాత్రి మద్యం మత్తులో ఉన్న ఆమె పక్కింటివారితో గొడవ పడింది. 100కి ఫోన్ చేసి తన చైన్ స్నాచింగ్ గురైందని తప్పుడు ఫిర్యాదు చేసింది. సమాచారం అందుకున్న సైదాబాద్ ఎస్ఐ మోజీరాం సిబ్బందితో కలిసి సింగరేణి కాలనీకి వెళ్లారు. వారి విచారణలో చైన్ ఆమె వద్దనే ఉంచుకొని తప్పుడు ఫిర్యాదు చేసినట్లు గుర్తించారు. అక్కడ విచారిస్తున్న పోలీసు సిబ్బంది విచారణను జంకు అడ్డుకోవటమే కాకుండా వారితో దురుసుగా ప్రవర్తించింది. దాంతో పోలీసులు ఈ-పెట్టీ కేసు నమోదు చేసి ఆమెను అదుపులోకి తీసుకొని గురువారం నాంపల్లిలోని 7వ స్పెషల్ ఎంఎం కోర్టులో హాజరుపరిచారు. వివరాలు పరిశీలించిన న్యాయమూర్తి లక్ష్మణ్‌రావు ఆమెకు 30 రోజుల జైలుశిక్ష విధించారు. నగరవాసులు ఎవరైనా నిజమైన సమస్యలపై మాత్రమే 100కి ఫోన్ చేసి ఫిర్యాదు చేయాలని ఇన్‌స్పెక్టర్ సుబ్బిరామిరెడ్డి సూచించారు.

వార్డు కార్యాలయాలు మరింత ఆలస్యం

సాక్షి, సిటీబ్యూరో: జీహెచ్ఎంసీలో కొత్తగా ఏర్పాటు కానున్న వార్డు కార్యాలయాల ప్రారంభోత్సవం దఫదఫాలుగా వాయిదా పడుతోంది. తొలుత మే నెలాఖరులోగా ప్రారంభించాలనుకున్నారు. తర్వాత జూన్ 1 లేదా 2వ తేదీన ప్రారంభమన్నారు. అనంతరం మున్సిపల్ శాఖ స్పెషల్ చీఫ్ సెక్రటరీ అర్వింద్‌కుమార్ జూన్ మొదటి వారంలో ప్రారంభిస్తామన్నారు. ఆ తర్వాత రాష్ట్ర అవతరణ దశాబ్ది ఉత్సవాల్లో భాగంగా 10వ తేదీన 150 వార్డుల్లో వార్డు కార్యాలయాలు ప్రారంభిస్తామన్నారు. తాజా సమాచారం మేరకు పదో తేదీన సైతం ప్రారంభించే అవకాశాల్లేనట్లు తెలిసింది. బహుశా ఈ నెల 16వ తేదీన ప్రారంభించే యోచనలో ఉన్నట్లు విశ్వసనీయ సమాచారం. పదో తేదీన వార్డు కార్యాలయాలు, వాటి పనితీరుకు సంబంధించి ఎమ్మెల్యేలు, మంత్రులు, జీహెచ్ఎంసీలోని ఆయా విభాగాల అధిపతులు తదితరులకు ఓరియంటేషన్ కార్యక్రమం నిర్వహించాలని నిర్ణయించినట్లు తెలిసింది.

గుడి భూములపై అక్రమ పరిహారం

సాక్షి, సిటీబ్యూరో: ఆలయానికి చెందిన భూములూ తమవే అంటూ తప్పుడు పత్రాలను సృష్టించి, భూ సేకరణ పరిహారం కింద జీహెచ్ఎంసీ నుంచి రూ. 4.96 కోట్లు కాజేసిన ముగ్గురు వ్యక్తులపై సీసీఎస్‌లో కేసు నమోదయ్యింది. పోలీసుల కథనం ప్రకారం.. ప్రజా ప్రయోజనాల కోసం కిషన్‌బాగ్‌లో డ్రైయిన్ బాక్స్ నిర్మాణం దృష్ట్యా, ఉప్పర్‌పల్లి పరిధిలోని సర్వే నంబర్ 105లో భూ సేకరణకు జీహెచ్ఎంసీ ప్రకటన జారీ చేసింది. ఆ సర్వే నంబర్‌లో ఉన్న భూమి తమదంటూ సామ సురేష్‌రెడ్డి, సామ సుమన్‌రెడ్డి, సామ శ్యామ్ సుందర్‌రెడ్డి మరికొందరు నకిలీ పత్రాలను జీహెచ్ఎంసీలోని భూసేకరణ విభాగంలో సమర్పించారు. దీంతో వారికి జీహెచ్ఎంసీ నుంచి రూ.4,96,24,162 పరిహారానికి సంబంధించిన చెక్కులు అందాయి. ఈ విషయం తెలుసుకున్న షేక్‌పేట్‌కు చెందిన నందకుమార్, సర్వే నంబర్ 105లోని ఆ స్థలం కిషన్‌బాగ్‌లోని శ్రీమురళీ మనోహరస్వామి ఆలయానికి చెందిన భూములని, వాటికి సంబంధించిన నకిలీ డాక్యుమెంట్లు తయారు చేసి అక్రమంగా నష్టపరిహారం పేరుతో ప్రభుత్వ ధనాన్ని కొల్లగొట్టారని ఫిర్యాదు చేయడంతో కేసు దర్యాప్తు చేపట్టారు.

నేడే చేప ప్రసాదం

ఎగ్జిబిషన్ గ్రౌండ్స్‌లో 32 కౌంటర్ల ఏర్పాటు

- నేటి ఉదయం 8 గంటల నుంచి పంపిణీ
- అందుబాటులో 6 లక్షల చేప పిల్లలు


చేప ప్రసాదం కోసం వచ్చిన ప్రజలు

అబిడ్స్/గన్‌ఫౌండ్రీ: ఎగ్జిబిషన్ గ్రౌండ్స్‌లో బత్తిని కుటుంబ సభ్యులు శుక్రవారం ప్రారంభించే చేప ప్రసాద పంపిణీకి సర్వం సిద్ధమైంది. జీహెచ్ఎంసీ, రెవెన్యూ, ఆర్అండ్‌బీ, వాటర్ బోర్డు, పోలీస్, మత్స్య, విద్యుత్ తదితర శాఖల ఆధ్వర్యంలో అధికారులు అన్ని ఏర్పాట్లు పూర్తి చేశారు. మూడేళ్ల విరామానంతరం ప్రారంభం కానున్న చేప ప్రసాదానికి ఒక రోజు ముందుగానే తెలుగు రాష్ట్రాలతో పాటు దేశంలో వివిధ ప్రాంతాల నుంచి వేలాది మంది గురువారమే తరలిరావడంతో ఎగ్జిబిషన్ గ్రౌండ్స్ కిక్కిరిసింది. వీరికి పలు స్వచ్ఛంద సంస్థలు భోజన వసతులు కల్పించాయి.

వెయ్యి మంది పోలీసులతో బందోబస్తు

ఎగ్జిబిషన్ గ్రౌండ్స్‌లో చేప ప్రసాదం పంపిణీ నేటి ఉదయం 8 గంటలకు ప్రారంభం కానుంది. ఇందు కోసం 32 కౌంటర్లను ఏర్పాటు చేశారు. బత్తిని కుటుంబాలకు చెందిన దాదాపు 250 మందితో పాటు పలు స్వచ్ఛంద సంస్థల వారు కౌంటర్ల ద్వారా చేప ప్రసాదాన్ని అందజేస్తారు. తెలంగాణ రాష్ట్ర మత్స్యశాఖ 6 లక్షల చేప పిల్లలను అందుబాటులో ఉంచింది. దాదాపు వెయ్యి మంది పోలీసులతో బందోబస్తు ఏర్పాటు చేశారు. గురువారం నుంచే నగరంలోని పోలీసులతో పాటు అదనపు పోలీసు బలగాలు రంగంలోకి దిగాయి. ఎగ్జిబిషన్ గ్రౌండ్స్ అజంతా గేట్, మాలకుంట, గాంధీ భవన్ గేట్ల వద్ద మెటల్ డిటెక్టర్లను ఏర్పాటు చేశారు. ప్రతి ఒక్కరినీ తనిఖీలు చేసిన అనంతరం లోపలికి అనుమతిస్తున్నారు. నగర పోలీస్ జాయింట్ కమిషనర్ విశ్వప్రసాద్, సెంట్రల్ జోన్ డీసీపీ ఎం. వెంకటేశ్వర్లు, అబిడ్స్ డివిజన్ ఏసీపీ పూర్ణచందర్, బేగంబజార్ ఇన్‌స్పెక్టర్లు శంకర్‌లు బందోబస్తును పర్యవేక్షిస్తున్నారు. ప్రధాన ప్రవేశాల ద్వారా పరిశీలన విభాగం, సీసీ కెమెరాల పనితీరు, ప్రధాన కౌంటర్ల వద్ద చేప ప్రసాద పంపిణీ విధానాన్ని పరిశీలించారు.

కంట్రోల్ రూం ఏర్పాటు..

ప్రజల సౌకర్యార్థం పోలీసులు ఒక కంట్రోల్ రూం ఏర్పాటు చేశారు. వేలాది మంది జనం రావడంతో వారికి ఇబ్బంది కలగకుండా కంట్రోల్ రూంలు పోలీస్ శాఖ అంత సమాచారాన్ని ఇవ్వనున్నారు. ఎగ్జిబిషన్ సొసైటీ ఉపాధ్యక్షుడు అశ్విన్ మార్గం ఆధ్వర్యంలో చేప ప్రసాదానికి ఏర్పాట్లు చేస్తున్నారు. ఎగ్జిబిషన్ సొసైటీ సభ్యులు, పలు స్వచ్ఛంద సంస్థలు సహకారాన్ని అందిస్తున్నాయి.

ట్రాఫిక్ మళ్లింపు..

పాత బస్తీ నుంచి ఎంజే మార్కెట్ మీదుగా ఎగ్జిబిషన్ గ్రౌండ్స్‌కు వచ్చే వాహనాలను ఇతర ప్రాంతాల మీదుగా శుక్రవారం దారిమళ్లించనున్నట్లు ట్రాఫిక్ పోలీసులు వెల్లడించారు. ట్రాఫిక్ డీసీపీ అశోక్ కుమార్, ఏసీపీ కోటేశ్వర్‌రావు, ఇన్‌స్పెక్టర్ గురునాథ్‌లు ట్రాఫిక్ క్రమబద్ధీకరణ, ట్రాఫిక్ దారిమళ్లింపుపై గురువారం పర్యవేక్షణ జరిపి పరిస్థితులను సమీక్షించారు. ఆర్టీసీ పలు ప్రాంతాల నుంచి ఎగ్జిబిషన్ గ్రౌండ్స్‌కు ప్రత్యేక బస్సులను నడపనున్నట్లు ఆర్టీసీ ఉన్నతాధికారులు తెలిపారు.


పంపిణీకి సిద్ధంగా చేప పిల్లలు

స్వచ్ఛంద సంస్థల చేయూత

నగరంలోని పలు స్వచ్ఛంద సంస్థలు చేయూత అందించనున్నాయి. చేప ప్రసాదానికి వచ్చే ప్రజలకు అల్పాహారాలు, భోజనాలు, తాగునీరు, మజ్జిగను పంపిణీ చేస్తున్నాయి. ఆరోగ్యశాఖ అధికారులు హెల్త్ క్యాంపును ఏర్పాటు చేశారు. ప్రజలకు ఎలాంటి హెల్త్ సమస్యలు ఉన్నా 4 అంబులెన్స్‌లను అందుబాటులో ఉంచారు.



గ్రూప్-1 ప్రిలిమినరీకి పకడ్బందీ ఏర్పాట్లు

సాక్షి, సిటీబ్యూరో: తెలంగాణ రాష్ట్ర పబ్లిక్ సర్వీస్ కమిషన్ నిర్వహించే గ్రూప్ -1 ప్రిలిమినరీ పరీక్షకు పకడ్బందీ ఏర్పాట్లు చేయాలని హైదరాబాద్ జిల్లా అదనపు కలెక్టర్ వెంకటేశ్వర్లు అధికారులను ఆదేశించారు. గురువారం పొట్టి శ్రీరాములు తెలుగు విశ్వవిద్యాలయం ఆడిటోరియంలో పరీక్షల నిర్వహణపై అధికారులతో జరిగిన సమన్వయ సమావేశంలో ఆయన మాట్లాడారు. నగరంలో 109 కేంద్రాల్లో 50,808 మంది అభ్యర్థులు పరీక్షకు హాజరు కానున్నారని తెలిపారు. ఉదయం 8.30 నుంచి 10.15 గంటల వరకు మాత్రమే కేంద్రాల్లోకి అనుమతిస్తామన్నారు. ఎటువంటి అవాంఛనీయ ఘటనలు జరగకుండా బందోబస్తు ఏర్పాటు చేయాలని పోలీస్ శాఖకు సూచించారు. సమావేశంలో పోలీస్ సంయుక్త కమిషన్ శ్రీనివాస్ రావు మాట్లాడుతూ.. పరీక్ష కేంద్రాల వద్ద 144 సెక్షన్ విధించినట్లు చెప్పారు. సమావేశంలో రెవెన్యూ అధికారి సూర్యలత, డీసీపీ బాబురావు పాల్గొన్నారు.

మృగశిర ఎఫెక్ట్.. కొర్రమీను @ 650

సాక్షి, సిటీబ్యూరో: మృగశిర కార్తెను పురస్కరించుకుని చేపలకు భారీ డిమాండ్ ఏర్పడింది. గురువారం నగరంలోని చేపల మార్కెట్లు వినియోగదారులతో కిక్కిరిశాయి. గ్రేటర్ వ్యాప్తంగా సుమారు 3 లక్షల కిలోల చేపల విక్రయాలు జరిగినట్లు మార్కెట్ వర్గాల అంచనా. మృగశిర కార్తె ఎఫెక్ట్‌తో కొర్రమీను ధరలు విపరీతంగా పెరిగాయి. సాధారణ రోజుల్లో ఈ చేపలు కిలోకు రూ.320 పలుకుతుండగా.. ప్రస్తుతం రూ.500 నుంచి రూ. 650 వరకు విక్రయించారు. బొచ్చ, రవ్వ చేపలను కిలో రూ.120 నుంచి రూ. 150కి, పాంప్లేట్ రూ. 90–120 విక్రయించారు.

ఆపదలో కాపాడేలా..

వర్ష విపత్తులు ఎదుర్కొనేందుకు జీహెచ్ఎంసీ సిద్ధం

- 30 డీఆర్ఎఫ్ బృందాలు, భద్రత ఉపకరణాలు
- 12 ఎమర్జెన్సీ వాహనాలు, 6 అంబులెన్సులు
- విపత్తు నిర్వహణలో డ్రోన్ల వినియోగం

సాక్షి, సిటీబ్యూరో: అతి త్వరలోనే నైరుతి రుతుపవనాలు నగరంలో ప్రవేశించనుండటంతో వర్షాల వల్ల ఎదురయ్యే విపత్తులను ఎదుర్కొనేందుకు జీహెచ్ఎంసీ ఈవీడీఎంలోని డిజాస్టర్ రెస్పాన్స్ ఫోర్స్ (డీఆర్ఎఫ్) బృందాలు సిద్ధంగా ఉన్నాయి. జీహెచ్ఎంసీలో 30 సర్కిళ్లుండగా, ప్రస్తుతం 27 బృందాలున్నాయి. మరో మూడు బృందాలను అతి త్వరలో ఏర్పాటు చేయనున్నారు. ఈ బృందాలు సర్కిళ్లలో నీరు నిలిచే, ముంపు సమస్యలు తలెత్తే ప్రాంతాల్లో అందుబాటులో ఉంటాయి. నిల్వ నీటిని ఎప్పటికప్పుడు తోడిపోసేందుకు అవసరమైన డీవాటరింగ్ పంప్స్‌తో పాటు అవసరమైన ఇతరత్రా ఉపకరణాలు, సేఫ్టీ పరికరాలు ఉంటాయి. ఈ బృందాల్లోని సుశిక్షితులైన సిబ్బంది కేవలం వర్ష విపత్తులే కాక, భవనాలు, చెట్లు కూలిపోయినా, భూకంపాలు, ఇతరత్రా ప్రమాదాలు సంభవించినా వెంటనే తగిన రక్షణ చర్యలు అందించడానికి సిద్ధంగా ఉంటారు. ప్రాణాపాయస్థితిలో ఉన్నవారిని అడ్వాన్స్ లైఫ్ సపోర్ట్‌సిస్టమ్‌తో వెంటనే ఆస్పత్రికి తరలించేందుకు వీలుగా జోన్‌కొకటి చొప్పున అంబులెన్సులు అందుబాటులో ఉంటాయి.

ఎమర్జెన్సీ వాహనాలు..

అయా సందర్భాల్లో అత్యవసరంగా ప్రమాదస్థలికి చేరుకునేందుకు మూడు పోలీస్ కమిషనరేట్ల పరిధిలో 12 ఎమర్జెన్సీ వాహనాలు తగిన సిబ్బందితో ఉంటాయి. హైదరాబాద్ కమిషనరేట్‌లో 7, సైబరాబాద్‌లో 3, రాచకొండ కమిషనరేట్‌లో 2 రెస్క్యూ ఆపరేషన్లు నిర్వహించేందుకు సిద్ధంగా ఉంటాయి. అత్యవసర సమయాల్లో సమాచార లోపం లేకుండా ఇంజినీరింగ్, పారిశుద్ధ్యం తదితర విభాగాల్లోని వారితో సంప్రదింపులు జరిపేందుకు వైర్‌లెస్ హ్యాండ్‌సెట్స్ అందుబాటులో ఉంటాయి. చెట్లు కూలిపోయినప్పుడు వాటిని వెంటనే తరలించేందుకు 10 గ్రీన్‌వేస్ట్ టీమ్స్‌కూడా విడిగా ఉంటాయి. ఆపద సమయాల్లో పరిస్థితులను ఎదుర్కొనేందుకు బోట్లతోపాటు జనరేటర్లు, శ్లాబ్‌కట్టర్లు, ఇన్‌ఫ్లేటబుల్ ఎమర్జెన్సీ లైటింగ్ సిస్టమ్, స్కిడ్ స్టీర్ లోడర్ తదితరాలన్నీ సిద్ధంగా ఉన్నట్లు ఈవీడీఎం డైరెక్టర్ ఎన్. ప్రకాశ్‌రెడ్డి తెలిపారు. వర్షాకాల సన్నద్ధత ఏర్పాట్లపై గురువారం ఆయన వివరాలు వెల్లడించారు.



24 గంటల కంట్రోల్‌రూమ్..

అత్యాధునిక కమ్యూనికేషన్ సిస్టమ్‌తో 24 గంటల పాటు తమ కంట్రోల్‌రూమ్ పనిచేస్తుందన్నారు. ఐఎండీ, టీఎస్‌డీపీఎస్‌ల ద్వారా అందే వాతావరణ సూచనలతో ఎప్పటికప్పుడు డీఆర్ఎఫ్ బృందాలు అప్రమత్తంగా ఉంటాయి. ఎలాంటి ఆపదల్లోనైనా ప్రజలు డీఆర్ఎఫ్ సహాయం కోసం 040–29555500, 9000113667 ఫోన్ నంబర్లలో సంప్రదించవచ్చు. ఇవే నంబర్లకు ప్రమాద దృశ్యాల్ని వాట్సప్ కూడా చేయవచ్చునని, 15–20 నిమిషాల్లోగా డీఆర్ఎఫ్ బృందాలు చేరుకొని సహాయక చర్యలు ప్రారంభిస్తాయి.

మేజర్ నీటినిల్వ ప్రాంతాలు..

జీహెచ్ఎంసీలో 54 మేజర్ నీటి నిల్వ ప్రాంతాలు, వంద మైనర్ నీటి నిల్వ ప్రాంతాలున్నాయి. ప్రస్తుతం జరుగుతున్న ఎస్ఎన్‌డీపీ పనులు వారంలోగా పూర్తి కానున్నాయి.

నెలరోజుల్లో మొబైల్ కంట్రోల్‌రూమ్

ప్రమాద తీవ్రత దృష్ట్యా కొన్ని సందర్భాల్లో ప్రమాద ప్రాంతంలోనే తగిన వ్యూహంతో సంబంధిత అధికారులతో తగిన చర్యలు తీసుకునేందుకు వీలుగా మొబైల్ కమాండ్ కంట్రోల్‌రూమ్ ఏర్పాటు. నెలరోజుల్లో దీన్ని అందుబాటులోకి తేనున్నారు. మనుషులు వెళ్లలేని పరిస్థితుల్లో డ్రోన్లను వినియోగించనున్నారు. రాత్రి వేళల్లో డ్రాగన్ లైట్లు, అగ్నిప్రమాద సమయాల్లో ఫైర్‌ఎక్స్‌టింగిషర్లుగా పనిచేసే అధునాతన ఫైర్‌బాల్స్ వంటివి సైతం వినియోగిస్తారు. విపత్తుల్ని ముందస్తుగానే గుర్తించేందుకు హైదరాబాద్ ఐఐటీతో త్వరలో ఎంఓయూ కుదుర్చుకోనున్నారు.

పాఠశాలల్లో అవగాహన..

అగ్నిప్రమాదాలు వంటి విపత్తులు సంభవించినప్పుడు వ్యవహరించాల్సిన పద్ధతులపై పాఠశాలలు, సంస్థల్లో అవగాహన కల్పిస్తారు.

12 నుంచి సాలార్‌జంగ్ మ్యూజియంలో ప్రత్యేక ప్రదర్శన

ఆదివాసీల అపురూప కళాఖండాలు




చార్మినార్: ఆచార్య జయధీర్ తిరుమల్‌రావు గత 45 ఏళ్లుగా సేకరించిన జానపద, ఆదివాసీ అపురూప కళాఖండాల ప్రత్యేక ప్రదర్శన 12వ తేదీన మధ్యాహ్నం 12 గంటలకు సాలార్‌జంగ్ మ్యూజియంలో ప్రత్యేక ఎగ్జిబిషన్ ప్రారంభమవుతుంది. అయిదు మ్యూజియాలకు చెందిన సుమారు 2 వేల వస్తువుల ప్రత్యేక ప్రదర్శన ఏర్పాటు చేస్తున్నారు. సాలార్‌జంగ్ మ్యూజియంలోని వెస్టన్ బ్లాక్‌లోని రెండో అంతస్తులోని ఆర్ట్ గ్యాలరీలో నెల రోజుల పాటు ప్రతిరోజు ఉదయం 10 నుంచి సాయంత్రం 5 గంటల వరకు ప్రదర్శన ఉంటుంది. ప్రతి శుక్రవారం సెలవు. 'ఆది ధ్వని' పేరిట శిల్పాకృతుల గ్యాలరీలో వివిధ లోహాలతో తయారు చేసిన విగ్రహాలు, ఆదివాసుల జీవనాన్ని ప్రతిబింబించే వస్తువులు, దేవతా రూపాలు ఎన్నెన్నో చూడవచ్చు. 'ఆదివాసీ జీవితం పరికరాలు' విభాగంలో రకరకాల చిన్నవి, పెద్దవి పరికరాలు, నాగళ్లు, కర్రలు, కొడవళ్లు, మట్టి తీసే పరికరాలు, చక్రాలు తదితర వృత్తి పరికరాలు ఉంటాయి. 'ఆది చిత్రం' పేరుతో గ్యాలరీలో అట్టడుగు వర్గాల కళాత్మక చిత్రాలు, బొమ్మలు, దుస్తులు ఉంటాయి. ఆదివాసీ చిత్రలేఖనం, కోయ గిరిజనుల పగిడలు, జంతువుల ముఖాలు, మాస్కులు ఇలా ఎన్నెన్నో. 'ఆది అక్షరం' పేరుతో లిపి, భాష, సాహిత్య పరికరాలు, ఘంటాలు, తాళపత్రాలు, అపురూపమైన కాగితం చుట్టలు, చెక్క పుస్తకాలు ప్రదర్శనలో ఉంటాయి. సందర్శకులకు ప్రవేశం ఉచితం.

ఆదాయపు పన్ను శాఖకు రూ.1.63 కోట్లు అప్పగింత

కంటోన్మెంట్: రెజిమెంటల్ బజార్‌లో గత నెల అగ్నిప్రమాదం జరిగిన భవనంలో స్వాధీనం చేసుకున్న రూ.1.63 కోట్ల నగదును గోపాలపురం పోలీసులు ఆదాయపు పన్ను శాఖ అధికారులకు అప్పగించారు. పోలీసుల కథనం ప్రకారం.. గత మే 13న రెజిమెంటల్ బజార్‌లోని అభిజిత్ ఎలక్ట్రికల్స్ కొనసాగుతున్న భవనం సెల్లార్‌లో అగ్నిప్రమాదం జరిగింది. అదే భవనం మొదటి అంతస్తులో నివాసముంటున్న కంపెనీ డీజీఎం భైరి శ్రీనివాస్ నివాసంలో పోలీసులు పెద్ద మొత్తంలో నగదు, బంగారం స్వాధీనం చేసుకున్నారు. ప్రమాద సమయంలో శ్రీనివాస్ స్థానికంగా అందుబాటులో లేడు. ఈ నేపథ్యంలో గురువారం గోపాలపురం ఇన్‌స్పెక్టర్‌లు ఈశ్వర్ గౌడ్, మురళీధర్‌లు శ్రీనివాస్ సమక్షంలో రూ.1.63 కోట్ల నగదును ఆదాయపన్ను శాఖ అధికారులకు అప్పగించారు. స్వాధీనం చేసుకున్న బంగారాన్ని శ్రీనివాస్‌కు తిరిగి ఇచ్చారు.

ప్రహరీ కూలిన ఘటనలో గాయపడిన బాలుడి మృతి



రాజ్‌కుమార్ (ఫైల్)

చైతన్యపురి: చంపాపేట రెడ్డి బస్తీలో ప్రహరీ కూలిన ఘటనలో తీవ్రంగా గాయపడిన రాజ్‌కుమార్ చికిత్స పొందుతూ గురువారం మృతిచెందాడు. ఆడుకుంటున్న చిన్నారులపై ప్రహరీ కూలిన విషయం తెలిసిందే. ఈ ప్రమాదంలో స్వల్పంగా గాయపడిన ఇషాన్, మధుసాయిరెడ్డి కర్మన్‌ఘాట్‌లోని జీవన్ హాస్పిటల్‌లో చికిత్స పొందుతున్నారు. తీవ్రంగా గాయపడిన రాజ్‌కుమార్‌ను మెరుగైన చికిత్స నిమిత్తం బుధవారం సాయంత్రం నిమ్స్‌కు తరలించారు. నడుము, ఛాతీ, పొట్టపై శిథిలాలు పడటంతో తీవ్రంగా గాయపడిన అతను గురువారం మృతి చెందినట్లు వైద్యులు పేర్కొన్నారు. రాజ్‌కుమార్ తల్లిదండ్రులు నల్లి ప్రసాద్, మేరీ అతడి మృతదేహాన్ని అంత్యక్రియల నిమిత్తం అమలాపురం తీసుకెళ్లారు.

మూడు కుటుంబాల్లో 'కారు' చీకట్లు

నల్లగొండ జిల్లాలో రోడ్డు ప్రమాదం

- ముగ్గురు నగరవాసుల దుర్మరణం
- మరొకరి పరిస్థితి విషమం
- సనత్‌నగర్‌లో విషాద ఛాయలు


సయ్యద్ ఆమేర్, మహ్మద్ యూసుఫ్, నయీం

సనత్‌నగర్/చిట్యాల: నల్లగొండ జిల్లా చిట్యాల మండలం పెద్దకాపర్తి గ్రామ శివారులో హైదరాబాద్ – విజయవాడ జాతీయ రహదారిపై బుధవారం రాత్రి జరిగిన రోడ్డు ప్రమాదంలో ముగ్గురు నగరవాసులు మృతి చెందారు. తీవ్ర గాయాలతో మరొకరి పరిస్థితి విషమంగా ఉంది. మృతుల్లో ఇద్దరు సనత్‌నగర్ వాసులు కాగా మరొకరు బోరబండ శ్రీరామ్‌నగర్ నివాసి. పోలీసులు చెప్పిన వివరాల ప్రకారం.. నగరంలోని సనత్‌నగర్ డీఎస్ఎం కాలనీకి చెందిన సయ్యద్ ఆమేర్ (52), మహ్మద్ యూసుఫ్ (50), సలీం (48), బోరబండ శ్రీరామ్‌నగర్‌కు చెందిన నయీం (49)లు స్నేహితులు. వీరు సెకండ్ హ్యాండ్ కార్ల క్రయ విక్రయాలు జరుపుతుంటారు. కార్ల వ్యాపార లావాదేవీల విషయమై ఆంధ్రప్రదేశ్‌కు వెళ్తున్నామంటూ బుధవారం ఉదయం ఇంట్లో చెప్పి స్కోడా కారులో బయలుదేరారు. తిరిగి రాత్రి సనత్‌నగర్‌కు కారులో వస్తున్నారు. చిట్యాల మండలం పెద్దకాపర్తి శివారులో ముందు వెళుతున్న కారును ఎడమవైపు నుంచి ఓవర్‌టేక్ చేయబోయి ముందున్న మరో కారును వీరి వాహనం ఢీకొట్టింది. దీంతో ముందున్న కారు డివైడర్‌ను ఢీకొట్టి నిలిచిపోయింది. వీరు ప్రయాణిస్తున్న కారు కుడి వైపు డివైడర్‌ను ఢీకొని గాల్లోకి లేచి.. విజయవాడ వైపు వెళ్తున్న రెండు లారీలను ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో సయ్యద్ ఆమేర్ (50) అక్కడికక్కడే మృతిచెందాడు. యూసుఫ్ (47), డ్రైవింగ్ చేస్తున్న నయీం (40)తో పాటు ఎండీ సలీంకు తీవ్ర గాయాలుకాగా నార్కట్‌పల్లి కామినేని ఆస్పత్రికి తరలించారు. ఆస్పత్రిలో చికిత్సపొందుతూ యూసుఫ్, నయీంలు మృతిచెందారు. మెరుగైన చికిత్స కోసం సలీంను నగరంలోని ఓ ప్రైవేటు ఆస్పత్రికి తరలించారు. రెండు లారీల డ్రైవర్లకు స్వల్ప గాయాలయ్యాయి. మృతుల బంధువు మహ్మద్ రఫీక్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు పోలీసులు తెలిపారు.

ఒకే కుటుంబంలో వరుసగా కబళించిన మృత్యువు..

మృతుల్లో ఒకరైన సనత్‌నగర్ డీఎస్ఎం కాలనీకి చెందిన సయ్యద్ ఆమేర్ సోదరుడు బీఆర్ఎస్ సీనియర్ నేత సయ్యద్ సిరాజుద్దీన్ ఇటీవల అనారోగ్యంతో మృతి చెందారు. అంతకుముందు సిరాజుద్దీన్ కుమారుడు సయ్యద్ ఇర్ఫాన్ గుండెపోటుతో చనిపోయారు. ఒకే కుటుంబంలో ముగ్గురిని వివిధ రూపాల్లో మృత్యువు వరుసగా కబళించడం స్థానికులను కంటతడి పెట్టించింది.

ఇంటి పెద్ద దిక్కును కోల్పోయి..

బుధవారం అర్ధరాత్రి జరిగిన రోడ్డు ప్రమాదంలో ఒకే కాలనీకి చెందిన ఇద్దరు మృతిచెందగా, మరొకరు ప్రాణాలతో పోరాడుతుండడంతో కుటుంబసభ్యులు, స్థానికులు జీర్ణించుకోలేకపోతున్నారు. ఆమేర్‌కు కుమారుడు, ఇద్దరు కుమార్తెలు ఉన్నారు. యూసుఫ్‌కు ఇద్దరు కుమార్తెలు, నయీంకు ఒక కుమార్తె, ఇద్దరు కుమారులు ఉన్నారు. ఇంటి పెద్ది దిక్కును కోల్పోవడంతో ఆయా కుటుంబాల్లో తీవ్ర విషాదం అలుముకుంది.

పెళ్లింట విషాదం..

సయ్యద్ ఆమేర్ ఇంట ఈ వారంలోనే రెండు పెళ్లిళ్లు జరగాల్సి ఉంది. మృతుడు సయ్యద్ ఆమేర్ సోదరుడి ఇద్దరు కుమారుల ఇళ్లలో ఒకరి వివాహం గురువారం, మరొకరి వివాహం సోమవారం జరగాల్సి ఉంది. తెల్లారితే సోదరుడి కుమారుడి వివాహ వేడుకల్లో పాల్గొనాల్సిన ఆమేర్ మృతి చెందడం కుటుంబసభ్యులను కలచి వేసింది.

మహిళా మత్స్యకారుల అభ్యున్నతికి కృషి

మంత్రి తలసాని శ్రీనివాస్‌యాదవ్


ఫిష్ ఫుడ్ స్టాళ్లను పరిశీలిస్తున్న మంత్రి తలసాని

కవాడిగూడ: మహిళా మత్స్యకారులు ఆర్థిక స్వావలంబన సాధించేలా రాష్ట్ర ప్రభుత్వం అన్ని విధాలా సహకారం అందిస్తోందని రాష్ట్ర పశుసంవర్థక, మత్స్య, పాడి పరిశ్రమల అభివృద్ధి శాఖ మంత్రి తలసాని శ్రీనివాస్ యాదవ్ అన్నారు. గురువారం నగరంలోని ఎన్టీఆర్ స్టేడియంలో మత్స్య శాఖ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ఫిష్ ఫుడ్ ఫెస్టివల్ స్టాళ్లను శాసన మండలి డిప్యూటీ చైర్మన్ బండా ప్రకాష్, ఎమ్మెల్యే ముఠా గోపాల్‌లతో కలిసి ఆయన ప్రారంభించారు. చేపలు, రొయ్యల ఫ్రై, బిర్యానీ, పకోడీ, పులుసు తదితర వంటకాలను పరిశీలించారు. అనంతరం తలసాని మాట్లాడుతూ.. ఇక్కడ ఏర్పాటు చేసిన ఫిష్ ఫుడ్‌ను రుచి చూడాలని నగర వాసులను కోరారు. తెలంగాణ రాష్ట్రం ఏర్పడిన తర్వాత మత్స్య రంగం అభివృద్ధికి ఎన్నో కార్యక్రమాలు అమలు చేస్తోందన్నారు. చేప పిల్లలతో పాటు రొయ్యలను ఉచితంగా పంపిణీ చేస్తున్నట్లు ఆయన పేర్కొన్నారు. దేశంలో ఎక్కడా లేని విధంగా మత్స్యకారుల కుటుంబాలలో వెలుగు తేవడమే సీఎం కేసీఆర్ లక్ష్యమన్నారు. వెయ్యి కోట్ల రూపాయల వ్యయంతో మత్స్య కారులకు ద్విచక్ర, ట్రాలీ ఆటోలు, సబ్సిడీపై అందించిన విషయాన్ని గుర్తు చేశారు. చెరువుపై పూర్తి హక్కులు మత్స్యకారులకే కల్పించినట్లు పేర్కొన్నారు. కార్యక్రమంలో కార్పొరేటర్ రచనశ్రీ, మాజీ కార్పొరేటర్ శ్రీనివాస్‌రెడ్డి, మత్స్యశాఖ అధికారులు మురళి, సుధాకర్, చరితారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

దారి కాచి దోచేశారు..

- రూ.2.67 కోట్ల సొత్తు దోపిడీ
- ముంబైలో ఆరుగురు సూడో పోలీసులు చేసిన నేరం

సాక్షి, సిటీబ్యూరో: హైదరాబాద్ నుంచి బంగారం, వజ్రాభరణాలు వివిధ నగరాలకు సరఫరా చేసే సంస్థ ఉద్యోగిని ముంబైలో అడ్డగించిన దుండగులు రూ.2.67 కోట్ల సొత్తు దోచుకుపోయారు. మరో సంస్థ మాజీ ఉద్యోగి ఇచ్చిన సమాచారంతోనే అక్కడి సియోన్ ప్రాంతంలో గత నెల 31న ఈ ఘటన చోటు చేసుకుంది. పట్టపగలు జరిగిన ఈ నేరాన్ని తీవ్రంగా పరిగణించిన ముంబై పోలీసులు క్రైమ్ బ్రాంచ్‌ను రంగంలోకి దింపారు. నిందితుల కోసం ముమ్మరంగా గాలించిన టీమ్స్ సోమవారం ఇద్దరిని పట్టుకుని 70 శాతం సొత్తు రికవరీ చేసింది. మిగిలిన నలుగురి కోసం వేట కొనసాగిస్తున్నారు.

దారిలో అడ్డగించి..

నగరానికి చెందిన సంతోష్ నర్ది భారీగా బంగారం బిస్కెట్లు, వజ్రాభరణాలు తయారు చేసి జ్యువెలరీ దుకాణాలకు సరఫరా చేస్తుంటారు. అతడికి దేశ వ్యాప్తంగా వివిధ నగరాల్లో క్లయింట్స్ ఉండటంతో కొందరు ఉద్యోగులు వీటిని తీసుకెళ్లి డెలివరీ చేసి, వారు ఇచ్చిన నగదు తీసుకుని వస్తుంటారు. సంతోష్ వద్ద పని చేసే హరిరామ్ ఘోటియా గత నెల 30న రూ.2.67 కోట్ల విలువైన బంగారం బిస్కెట్లు, వజ్రాభరణాలతో నగరం నుంచి ప్రైవేట్ బస్సులు ముంబై వెళ్లాడు. మర్నాడు ఉదయం అక్కడి సియోన్ సర్కిల్‌లో దిగిన హరిరామ్ బాంద్రా కుర్లా కాంప్లెక్స్ ప్రాంతానికి వెళ్లడానికి కారు ఎక్కాడు. కారును వెంబడిస్తూ వచ్చిన ఓ ఎస్‌యూవీ వాహనం ఓ నిర్మానుష్య ప్రాంతంలో అడ్డగించింది. అందులోంచి దిగిన ఆరుగురు వ్యక్తులు తాము ఢిల్లీ పోలీసులమని హరిరామ్‌ను బెదిరించి, అతడి వద్ద ఉన్న సొత్తు లాక్కుని పోలీస్ స్టేషన్‌కు రమ్మని చెప్పి ఉడాయించారు.

టార్గెట్ చూపించిన మాజీ ఉద్యోగి...

ఈ విషయంపై సంతోష్‌కు సమాచారం ఇచ్చిన హరిరామ్ అక్కడి పోలీసులకు ఫిర్యాదు చేశాడు. రంగంలోకి దిగిన క్రైమ్ బ్రాంచ్ పోలీసులు నేరం జరిగిన తీరును బట్టి కచ్చితంగా తెలిసిన వారి పనిగా అనుమానించారు. ఆ కోణంలో ముందుకు వెళ్లిన అధికారులు కీలక ఆధారాలు సేకరించారు. రాజస్థాన్‌లోని చూరూలోని సర్దార్‌సహర్‌కు చెందిన ప్రశాంత్ చౌదరి గతంలో కార్ఖానాలోని నగల దుకాణంలో పని చేశాడు. దీనికి సమీపంలోనే సంతోష్‌కు చెందిన సంస్థ కూడా ఉండటంతో ఆయన వ్యాపార లావాదేవీలు, ఉద్యోగుల సమాచారాన్ని రాబట్టాడు. వీరు తరచు భారీ సొత్తుతో ప్రయాణిస్తుంటారని తెలుసుకున్న అతను ఆ సమాచారాన్ని తన స్నేహితుడు మహేంద్ర సరన్‌కు చెప్పి దోపిడీకి పథకం వేయమన్నాడు. దీంతో అతను చూరు ప్రాంతానికి చెందిన ఆనంద్ పాల్ సింగ్ గ్యాంగ్‌ను సంప్రదించాడు.


మరో గ్యాంగ్‌తో కలిసి రంగంలోకి దిగి...

ఆనంద్ పాల్ సింగ్, రోహిత్ గోదారా ముఠాలకు చెందిన నేరగాళ్లు రంగంలోకి దిగారు. మహేంద్ర సరన్, మనోజ్ నెహ్రా, కిషనాథ్, అశోక్, మనోజ్, మెహతా ఇందుకు ప్లాన్ సిద్ధం చేశారు. సరన్, నెహ్రా హైదరాబాద్ చేరుకుని సంతోష్ కార్ఖానా వద్ద కాపు కాశారు. హరిరామ్ సొత్తుతో బయలుదేరిన విషయాన్ని మిగిలిన నలుగురికీ చేర్చాడు. అప్పటికే ముంబై వచ్చి సిద్ధంగా ఉన్న వీరు ఓ ఎస్‌యూవీ వాహనం తీసుకుని సిద్ధమయ్యారు. హరిరామ్‌తో పాటు ప్రయాణించిన ఇద్దరు నేరగాళ్లు ముంబైలో దిగిన తర్వాత ఆ నలుగురినీ కలిశారు. ఆపై హరిరామ్ వెళ్తున్న కారును వెంబడించి దారిదోపిడీకి పాల్పడ్డారు. ఈ కేసులో ముంబై క్రైమ్ బ్రాంచ్ సోమవారం చూరూలో సరన్, నెహ్రాలను అరెస్టు చేసింది. వీరి నుంచి రూ.1.5 కోట్ల సొత్తు స్వాధీనం చేసుకుంది. పరారీలో ఉన్న మిగిలిన నలుగురి కోసం గాలిస్తోంది. వీరు చిక్కితే మిగిలిన సొత్తు రికవరీ అవుతుందని అధికారులు పేర్కొన్నారు.

రాష్ట్రంలో శాంతి భద్రతలు భేష్

- సీసీ కెమెరాలతో నేరాలు తగ్గుముఖం
- హోం మంత్రి మహమూద్ అలీ

సాక్షి, సిటీబ్యూరో: శాంతి భద్రతల పరిరక్షణలో తెలంగాణ దేశానికే ఆదర్శంగా ఉందని రాష్ట్ర హోం మంత్రి మహమూద్ అలీ అన్నారు. సీసీ కెమెరాల ఏర్పాటుతో నేరాలు తగ్గుముఖం పట్టాయన్నారు. తెలంగాణ దశాబ్ది ఉత్సవాల్లో భాగంగా గురువారం మేడిపల్లిలోని రాచకొండ కమిషనరేట్ కార్యాలయ ఆవరణలో పోలీసు సామాజిక సమ్మేళనం నిర్వహించారు. ముఖ్య అతిథిగా హాజరైన హోం మంత్రి మాట్లాడుతూ.. రాష్ట్రంలో నూతనంగా ఎన్నో పోలీస్ స్టేషన్లు, ఏసీపీ, డీసీపీ జోన్లు, కమిషనరేట్లు ఏర్పాటు చేసి పోలీస్ వ్యవస్థను ప్రజలకు మరింత చేరువ చేశామన్నారు. మంత్రి తలసాని శ్రీనివాస్ యాదవ్ మాట్లాడుతూ.. తెలంగాణా ఏర్పాటు అనంతరం పోలీసు శాఖలో చేపట్టిన మార్పులు, సంస్కరణలతో శాంతి భద్రతలు మెరుగుపడ్డాయన్నారు. పోలీసు శాఖలో అత్యాధునిక సాంకేతికతను వినియోగిస్తున్నామని, అధునాతన పెట్రోలింగ్ వాహనాలతో పెట్రోలింగ్ వ్యవస్థను పటిష్టం చేశామన్నారు. మంత్రి మల్లారెడ్డి మాట్లాడుతూ.. ఇతర రాష్ట్రాలు ఎన్నో దశాబ్దాలుగా సాధించలేని అభివృద్ధి తెలంగాణ దశాబ్ద కాలంలోనే సాధించిందన్నారు. రాష్ట్ర ప్రభుత్వ ప్రజా సంక్షేమ విధానాలు, మౌలిక వసతుల కల్పనతో మెరుగైన పాలన అందిస్తుందన్నారు.రాష్ట్రాన్ని శాంతి భద్రతల పరంగా ఉన్నత స్థాయిలో ఉంచడానికి పోలీసులు శక్తి వంచన లేకుండా పని చేస్తున్నారన్నారు. తెలంగాణా రాష్ట్ర ఏర్పాటు తర్వాత కొత్తగా 70 పోలీస్ స్టేషన్లు ఏర్పాటు చేసినట్లు ఆయన పేర్కొన్నారు.



మాట్లాడుతున్న హోం మంత్రి మహమూద్ అలీ

దశాబ్ది ఉత్సవాలు ఒక మైలు రాయి : సీఎస్ శాంతా కుమారి

దశాబ్ది వేడుకలు జరుపుకోవడం రాష్ట్ర చరిత్రలో ఒక మైలురాయి అని చీఫ్ సెక్రెటరీ శ్రీమతి శాంతా కుమారి అన్నారు. అన్ని వర్గాల ప్రజల సమష్టి పోరాటం, ఎన్నో వందల మంది అమరుల త్యాగాలతో తెలంగాణ రాష్ట్రం ఏర్పాటు అయిందని రాష్ట్రంలోని ప్రజలందరి సంక్షేమమే ధ్యేయంగా ప్రభుత్వం పని చేస్తోందన్నారు. 2014 కు ముందు అభివృద్ధిలో అన్ని రకాలుగా వెనుకబడ్డ తెలంగాణ నేడు బహుముఖ రంగాల్లో అభివృద్ధి చెందిందన్నారు. డీజీపీ అంజనీ కుమార్ మాట్లాడుతూ.. నేర నియంత్రణలో హైదరాబాద్, సైబరాబాద్ పోలీస్ కమిషనరేట్‌లతో రాచకొండ పోటీపడుతోందని అభినందించారు. నూతన సాంకేతిక వనరులను ఉపయోగించుకుని మరింత సమర్థవంతంగా విధులు నిర్వర్తించాలని, రాచకొండ పరిధిలోని నగర ప్రాంత పరిరక్షణే కాక గ్రామీణ ప్రాంతాల్లో శాంతి భద్రతలపై దృష్టి పెట్టాలని సూచించారు. రాచకొండ పోలీస్ కమిషనర్ డీఎస్ చౌహాన్ మాట్లాడుతూ.. దశాబ్ది వేడుకల్లో రాచకొండ పోలీస్ కమిషనరేట్ భాగం కావడం సంతోషంగా ఉందన్నారు. కార్యక్రమంలో ఎమ్మెల్యేలు బేతి సుభాష్ రెడ్డి, గొంగిడి సునీత, తెలంగాణ మాజీ సీఎస్ సోమేశ్ కుమార్, అడిషనల్ డీజీలు సంజయ్ కుమార్ జైన్, జితేందర్, సందీప్ శాండిల్య, మహేష్ భగవత్, శిఖాగోయల్ తదితరులు పాల్గొన్నారు.

బాలికపై లైంగికదాడి

నిందితుడిపై కేసు నమోదు

జవహర్‌నగర్: మైనర్ బాలికపై ఓ వ్యక్తి లైంగిక దాడికి పాల్పడిన ఘటన జవహర్‌నగర్ పోలీస్‌స్టేషన్ పరిధిలో గురువారం వెలుగులోకి వచ్చింది.పోలీసుల కథనం మేరకు వివరాలిలా ఉన్నాయి. దమ్మాయిగూడకు చెందిన అనిల్ ట్రావెల్స్ నిర్వహిస్తున్నారు. బోడుప్పల్‌కు చెందిన మహిళతో అతనికి చాలా ఏళ్లుగా పరిచయం ఉండటంతో తరచూ ఆమెతో మాట్లాడుతుండేవాడు. ఈ నేపథ్యంలో సదరు మహిళ కుమార్తెపై కన్నేసిన అనిల్ ఇంట్లో ఎవరూ లేని సమయంలో బాలికపై లైంగిక దాడికి పాల్పడ్డాడు. బాధితురాలి తల్లి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకున్న పోలీసులు దర్యాప్తు చేపట్టారు.

అనుభవాలు నేర్పిన పాఠం!

- ఉద్యోగాల పేరుతో మోసాలు
- గతంలో భారీ మొత్తాలు వసూలు చేసి మూడుసార్లు జైలుకు
- తక్కువ మొత్తం తీసుకుంటే సేఫ్ అనే భావన
- నిందితుడు అంజనీకుమార్ అరెస్ట్

సాక్షి, సిటీబ్యూరో: నగరానికి చెందిన ఓ సైబర్ నేరగాడు తనకు ఎదురైన అనుభవాల నుంచి పాఠం నేర్చుకున్నాడు. ఉద్యోగాల పేరుతో అందినకాడికి దండుకునే అతను ఎక్కువ మొత్తం కాజేస్తే పోలీసులకు చిక్కుతున్నానని భావించాడు. దీంతో ఒక్కొక్కరి నుంచి తక్కువ మొత్తాలు కాజేస్తూ పోయాడు. హైదరాబాద్‌కు చెందిన ఓ బాధితుడు ఇచ్చిన ఫిర్యాదుతో కేసు నమోదు చేసుకున్న సిటీ సైబర్ క్రైమ్ పోలీసులు గురువారం నిందితుడిని అదుపులోకి తీసుకుని విచారిస్తున్నారు. చంపాపేట్‌కు చెందిన ఎస్.అంజనీకుమార్ డిగ్రీ పూర్తి చేసి ప్రస్తుతం విద్యానగర్‌లో నివసిస్తున్నాడు. కొన్నేళ్లుగా సోషల్‌మీడియా వేదికగా సాఫ్ట్‌వేర్ సహా వివిధ ఉద్యోగాల పేరుతో ప్రకటనలు ఇస్తున్నాడు. వీటికి ఆకర్షితులైన వారితో చాటింగ్ చేస్తూ భారీగా దండుకునే వాడు. 2018, 2019, 2020ల్లో ఇదే తరహా కేసుల్లో సైబరాబాద్ పోలీసులు చిక్కి జైలుకు వెళ్లాడు. ఒకే వ్యక్తి నుంచి ఎక్కువ మొత్తం వసూలు చేస్తే కేసుల వరకు వెళ్లి అరెస్టవుతున్నానని భావించిన అతను చిన్న మొత్తాలు స్వాహా చేయాలని నిర్ణయించుకున్నాడు. ఫేస్‌బుక్ ద్వారా ప్రముఖ సాఫ్ట్‌వేర్ కంపెనీల్లో ఉద్యోగాల పేరుతో ప్రకటనలు ఇచ్చాడు. ఆసక్తి చూపిన వారిని సంప్రదించి ఒక్కో పోస్టుకు రూ.50 వేల నుంచి రూ.80 వేల వరకు చెల్లించాలని ఒప్పందం చేసుకున్నాడు. అప్లికేషన్‌తో పాటు కొంత, ఆఫర్ లెటర్ వచ్చాక మరికొంత చెల్లించాలని చెప్పేవాడు. మిగిలిన సగం ఉద్యోగం వచ్చిన తర్వాత నెలనెలా జీతం నుంచి కొంత మొత్తం చొప్పున కట్ అవుతుందని అనేవాడు. ఈ మేరకు ఆయా కంపెనీలతో తనకు ఒప్పందం ఉందని నమ్మబలకడంతో పలువురు అతడిని సంప్రదించారు. ఇలా ఒక్కో వ్యక్తి నుంచి రూ.20 వేలు, రూ.25 వేలు స్వాహా చేసి నకిలీ ఆఫర్ లెటర్లు ఇచ్చి మోసం చేసేవాడు. అయితే బాధితులెవరూ పోలీసులకు ఫిర్యాదు చేయడానికి ముందుకు రాకపోవడంతో అతడికి కలిసి వచ్చింది. ఇటీవల నగరానికి చెందిన ఓ వ్యక్తి నుంచి రూ.లక్ష కాజేయడంతో కేసు నమోదైంది. సిటీ సైబర్ క్రైమ్ ఏసీపీ కేవీఎం ప్రసాద్ ఆదేశాల మేరకు ఇన్‌స్పెక్టర్ కేఎస్ రవి నేతృత్వంలో దర్యాప్తు చేపట్టిన ఎస్సై వి.నరేందర్ గురువారం నిందితుడు అంజనీకుమార్‌ను అదుపులోకి తీసుకుని విచారిస్తున్నాడు. ఇతడి చేతిలో మోసపోయిన వారు చాలా మంది ఉండవచ్చునని అనుమానిస్తున్నారు. ఇతగాడు సాఫ్ట్‌వేర్, అడ్మిన్, టెక్నికల్ సహా అనేక ఉద్యోగాలను ఇప్పిస్తానంటూ మోసం చేసినట్లు గుర్తించారు.

స్నేహితుడే వంచించాడు..

- అతడి కోసం అప్పు చేసిన బాధితురాలు
- అదే అప్పును ఎరగా వేసి అఘాయిత్యం!
- వీడియో రికార్డ్ చేసి, స్నాప్‌చాట్‌లో స్టేటస్‌గా పెట్టిన అస్లాం
- తన స్నేహితులకు పంపి పైశాచికానందం

హిమాయత్‌నగర్: అతని కోసం అప్పు చేసిన ఆమెను..ఆ అప్పును ఎరగా వేసిన మరో ఇద్దరు యువకులు లోబరుచుకున్నారు. అప్పు కట్టలేని నిస్సహాయ స్థితిలో ఉన్న విద్యార్థినిపై లైంగిక దాడికి పాల్పడటమేగాక వీడియో రికార్డ్ చేశారు. ఆ వీడియోను అడ్డం పెట్టుకుని బ్లాక్ మెయిల్‌కు పాల్పడుతుండటంతో తనకు న్యాయం చేయాలంటూ బాధితురాలు కొద్దిరోజుల క్రితం షీటీం పోలీసులను ఆశ్రయించింది. వారి సూచన మేరకు ఈ నెల 3న నారాయణగూడ పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేసింది. దీంతో నిందితులు పూర్ణేష్ యాదవ్, అస్లాం, సాయిచరణ్‌లపై గురువారం కేసు నమోదు చేసినట్లు నారాయణగూడ ఇన్‌స్పెక్టర్ శ్రీనివాస్ తెలిపారు.

అతడే వెళ్లమన్నాడు.. అతడే వైరల్ చేశాడు

బాధితురాలికి పూర్ణేష్ యాదవ్, నగర వాసి అస్లాంలతో ఏడు నెలల క్రితం ఇన్‌స్టాగామ్ ద్వారా పరిచయం ఏర్పడింది. పూర్ణేష్ యాదవ్ బాధితురాలితో సన్నిహితంగా ఉండేవాడు. కొద్దిరోజుల క్రితం పూర్ణేష్ యాదవ్‌కు డబ్బు అవసరం కావడంతో బాధితురాలిని అడిగాడు. దీంతో ఆమె అస్లాం వద్ద తీసుకుని పూర్ణేష్‌కు ఇచ్చింది. డబ్బు తిరిగి ఇవ్వాలని అస్లాం కోరగా.. ఆమె వద్ద లేకపోవడంతో పూర్ణేష్‌కు చెప్పింది. తాను సాయిచరణ్ వద్ద ఇప్పిస్తానని, అయితే ఓయోకు నీ ఫ్రెండ్‌ను(బాధితురాలు) పంపాలని అస్లాం పూర్ణేష్‌కు చెప్పాడు. అందుకు అంగీకరించిన పూర్ణేష్ బాధితురాలిని ఓయో రూమ్‌కు పంపాడు. ఆ సమయంలో రహస్యంగా యువతి వీడియోలు రికార్డు చేసిన అస్లాం వాటిని పూర్ణేష్‌తో పాటు మరో ఇద్దరికి పంపాడు. పూర్ణేష్ సైతం ఆ వీడియోలను వైరల్ చేయడంతో బాధితురాలు షీటీంను ఆశ్రయించి ఫిర్యాదు చేసింది. నిందితులు పూర్ణేష్ యాదవ్, అస్లాం, సాయిచరణ్‌లపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఇన్‌స్పెక్టర్ తెలిపారు.

మైనర్లతో పని చేయించుకుంటున్న వ్యక్తులపై కేసు నమోదు

నాగోలు: మైనర్లతో పని చేయించుకుంటున్న ఇద్దరు వ్యక్తులపై కేసు నమోదు చేసిన ఎల్‌బీనగర్ పోలీసులు, 8 మంది మైనర్లను రక్షించి సంరక్షణ కేంద్రానికి తరలించారు. ఎస్‌ఐ నాగరాజు కథనం మేరకు వివరాలిలా ఉన్నాయి. ఎల్‌బీఆర్ పీఎస్ పరిధిలోని జైపురి కాలనీలో రాజస్థాన్‌కు చెందిన శ్రావణ్‌సింగ్ ప్లాస్టిక్ కవర్లు తయారు చేసే కంపెనీ, ఉత్తర ప్రదేశ్‌కు చెందిన సతీష్‌యాదవ్ తినుబండారాల తయారీ కేంద్రాన్ని నిర్వహిస్తున్నారు. వీరు మైనర్లతో పనులు చేయించుకుంటున్నట్లు పోలీసులకు అందడంతో దాడులు నిర్వహించిన ఎల్‌బీనగర్ పోలీసులు ఆయా కర్మాగారాల్లో పనిచేస్తున్న ఎనిమిది మంది బాలలను రక్షించి సైదాబాద్‌లోని బాలల సంరక్షణ గృహానికి తరలించారు. నిందితులు శ్రావణ్‌సింగ్, సతీష్ యదవ్‌లపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

దుండిగల్ ఎస్సై ప్రభాకర్‌రెడ్డి హఠాన్మరణం


ప్రభాకర్‌రెడ్డి (ఫైల్)

దుండిగల్: దుండిగల్ ఠాణాలో విధులు నిర్వర్తిస్తున్న ఎస్సై ప్రభాకర్ రెడ్డి (36) గుండెపోటుతో మృతి చెందారు. 2016 బ్యాచ్‌కు చెందిన ప్రభాకర్‌రెడ్డి నెల రోజుల క్రితం నాకాబందీ నిర్వహిస్తున్న సమయంలో ఓ వాహనాన్ని ఆపే క్రమంలో కింద పడ్డాడు. కాలికి తీవ్ర గాయం కావడంతో ఓ ప్రైవేట్ ఆస్పత్రిలో చేరాడు. పూర్తిగా కోలుకున్న అతను మరో రెండ్రోజుల్లో విధుల్లో చేరనున్నట్లు తన సహోద్యోగులకు సమాచారం అందించాడు. గురువారం రాత్రి అతను గుండె నొప్పితో బాధపడుతుండటంతో కుటుంబ సభ్యులు ఆస్పత్రికి తరలించారు. చికిత్స పొందుతూ రాత్రి 10 గంటల సమయంలో మృతి చెందినట్లు కుటుంబ సభ్యులు తెలిపారు.

సంప్‌లో పడి ఉద్యోగి మృతి

సర్వే ఆఫ్ ఇండియా ప్రాంగణంలో ఘటన


మృతి చెందిన డేవిడ్

ఉప్పల్: సర్వే ఆఫ్ ఇండియా ప్రాంగణంలోని సంప్‌లో పడి ఓ ఉద్యోగి మృతి చెందిన సంఘటన ఉప్పల్ పోలీస్ స్టేషన్ పరిధిలో గురువారం చోటు చేసుకుంది. పోలీసుల కథనం మేరకు వివరాలు ఇలా ఉన్నాయి. ఉప్పల్ శ్రీనగర్ కాలనీకి చెందిన ఆకివీటి డేవిడ్(43) సర్వే ఆఫ్ ఇండియాలో పని చేస్తున్నాడు. గురువారం ఉదయం అతను ఫైర్ ఇంజన్ల కోసం నీటిని నిలువ ఉంచే సంప్‌లో పడి మృతి చెందాడు. గత కొంత కాలంగా డేవిడ్ అనారోగ్యంతో బాధపడుతున్నాడని అతని సోదరుడు ప్రసాద్ పోలీసులకు ఇచ్చిన ఫిర్యాదులో పేర్కొన్నాడు. ఉప్పల్ పోలీసులు మృత దేహాన్ని స్వాధీనం చేసుకుని పోస్టు మార్టం నిమిత్తం గాంధీ ఆసుపత్రికి తరలించారు. కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

క్లుప్తంగా

న్యాయవాదిపై దాడి

కోర్టు ఆదేశాలతో నిందితులపై కేసు నమోదు

బంజారాహిల్స్: ఆర్థిక లావాదేవీల్లో తలెత్తిన వివాదంలో న్యాయవాదిని కారులో నిర్బంధించి కత్తితో బెదిరించిన ఘటనలో బంజారాహిల్స్ పోలీసులు ముగ్గురు వ్యక్తులపై కేసు నమోదు చేశారు. వివరాల్లోకి వెళ్తే.. మొఘుల్‌పురాకు చెందిన ఎండీ అబ్దుల్ ఖవీ అబ్బాసీ న్యాయవాదిగా పని చేస్తుంటాడు. అతడికి గులాం అతీక్ అనే వ్యక్తితో గత కొంతకాలంగా ఆర్థిక విబేధాలు ఉన్నాయి. ఈ క్రమంలో ఏప్రిల్ 25న బంజారాహిల్స్ రోడ్ నెం. 12లోని ఒక్రీస్ హోటల్ వద్దకు మాట్లాడే పని ఉందంటూ పిలిచిన అతీక్ అతడిని బలవంతంగా కారులోకి ఎక్కించాడు. కారు వెనక సీట్లో కూర్చుని ఉన్న మీర్జా సాజిద్ బేగ్, సయ్యద్ తారిఖ్ ఖాద్రి అతీక్‌తో వివాదాన్ని మర్చిపోవాలని, పీఎస్‌లో కేసు పెట్టవద్దంటూ హెచ్చరించారు. తాము చెప్పినట్లు వినకపోతే ప్రాణాలు పోతాయంటూ మెడపై కత్తిపెట్టి బెదిరించడంతో పాటు పిడిగుద్దులతో దాడి చేశారు. దీంతో బాధితుడు తనకు న్యాయం చేయాలని కోరుతూ నాంపల్లిలోని 3వ అదనపు చీఫ్ మెట్రో పాలిటన్ మెజిస్ట్రేట్‌ను ఆశ్రయించాడు. కోర్టు ఆదేశాల మేరకు బంజారాహిల్స్ పోలీసులు నిందితులు గులాం అతీక్, మీర్జా సాజిద్ బేగ్, తారిక్ ఖాద్రీలపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు.

తండ్రి సర్జరీ కోసం యజమాని ఇంట్లో చోరీ

24 గంటల్లో నిందితుడిని పట్టుకున్న పోలీసులు


నిందితుడు ఇర్ఫాన్

బంజారాహిల్స్: తండ్రి వెన్నుపూస సర్జరీ కోసం ఓ యువకుడు దొంగగా మారాడు. పనిచేస్తున్న ఇంట్లో చోరీకి పాల్పడి కటకటాల పాలయ్యాడు. బంజారాహిల్స్ పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటు చేసుకున్న సంఘటన వివరాలు ఇలా ఉన్నాయి. బంజారాహిల్స్‌రోడ్‌నెం 12లోని కిమ్టీ కాలనీ గోకుల్ రెసిడెన్సీలో ఉంటున్న సాఫ్ట్‌వేర్ ఇంజినీర్ మహ్మద్ అహ్మద్ అలీ ఇంట్లో ఈ నెల 6న చోరీ జరిగింది. గుర్తుతెలియని వ్యక్తి కిటికీ ఊచలు తొలగించి లోపలికి ప్రవేశించి రూ. 2.50 లక్షలు, ఆరు తులాల బంగారు ఆభరణాలు తస్కరించాడంటూ బాధితుడు బంజారాహిల్స్ పోలీసులకు ఫిర్యాదు చేశాడు. కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేపట్టిన పోలీసులు సంఘటనా స్థలంలో వేలిముద్రలతో పాటు సమీపంలోని సీసీ ఫుటేజీలను పరిశీలించగా, అదే ఇంట్లో డ్రైవర్‌గా పని చేస్తున్న సయ్యద్‌నగర్ ఫస్ట్ లాన్సర్‌కు చెందిన మహ్మద్ ఇర్ఫాన్‌పై అనుమానంతో అతడి వేలిముద్రలు సేకరించారు. సంఘటనా స్థలంలో దొరికిన వేలిముద్రలతో అవి సరిపోవడంతో చోరీ చేసింది ఇర్ఫాన్ అని నిర్ధారించారు. తమదైన శైలిలో ప్రశ్నించడంతో అతను నేరం అంగీకరించాడు. తన తండ్రి గత కొంతకాలంగా వెన్నునొప్పితో బాధపడుతున్నాడని, సర్జరీ కోసం సుమారు రూ.5 లక్షలు ఖర్చవుతుందని వైద్యులు చెప్పడంతో యజమాని ఇంట్లో చోరీ చేసినట్లు నిందితుడు వెల్లడించాడు. పోలీసులను తప్పుదోవ పట్టించేందుకు కిటికీ ఊచలు తొలగించడంతో పాటు మాస్కు ధరించి పారిపోయాడని తేలింది. అతడి నుంచి రూ. 2.50 లక్షల నగదు సుమారు 6 తులాల ఆభరణాలు స్వాధీనం చేసుకున్న పోలీసులు రిమాండ్‌కు తరలించారు.

స్విమ్మింగ్ పూల్‌లో పడి యువకుడి మృతి


సంపత్ (ఫైల్)

కంటోన్మెంట్: ఈతకు వెళ్లిన ఓ యువకుడు ప్రమాదవశాత్తు స్విమ్మింగ్ పూల్‌లో పడి మృతి చెందిన సంఘటన బోయిన్‌పల్లి పోలీస్ స్టేషన్ పరిధిలో గురువారం చోటు చేసుకుంది. ఎస్‌ఐ నాగేంద్ర బాబు కథనం మేరకు వివరాలిలా ఉన్నాయి. బాలానగర్ ఫతేనగర్‌కు చెందిన కొమ్మెర సంపత్ (22), తన స్నేహితులు సాయి కుమార్, రాజ్‌కుమార్, రాఘవేంద్రలతో కలిసి గురువారం బోయిన్‌పల్లి తెలంగాణ గార్డెన్స్‌లోని స్విమ్మింగ్ పూల్‌కు వెళ్లాడు. ఈత కొడుతున్న క్రమంలో లోతైన ప్రాంతంలో డైవ్ చేసిన నీటిలో మునిగిపోయాడు. ఆలస్యంగా గుర్తించిన మిత్రులు సంపత్ కోసం గాలించగా నీటి అడుగున కనిపించాడు. నిర్వాహకుల సహాయంతో బయటికి తీయగా అప్పటికే అతను మృతి చెందాడు. పోలీసులు కేసు దర్యాప్తు చేపట్టారు.

చెరువులో దూకి మహిళ ఆత్మహత్యాయత్నం

కాపాడిన కానిస్టేబుల్


మహిళను కాపాడిన కానిస్టేబుల్ ఇంతియాజ్

జవహర్‌నగర్: కుటుంబ సమస్యలతో మనస్తాపానికి గురైన ఓ మహిళ చెరువులో దూకి ఆత్మహత్యాయత్నానికి పాల్పడిన ఘటన జవహర్‌నగర్ పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది. పోలీసుల కథనం మేరకు వివరాలిలా ఉన్నాయి. జవహర్‌నగర్ వైఎస్ఆర్ నగర్‌కు చెందిన మమత(38) నలుగురు కుమార్తెలతో కలిసి నివాసం ఉంటోంది. మమత భర్త సుమంత్ అనారోగ్యంతో ఇటీవలే మృతిచెందాడు. కూలీ పనులు చేసుకుంటూ జీవనం సాగించే మమతకు భర్త మరణంతో ఆర్థిక ఇబ్బందులు ఎదురై ఇల్లు గడవడమే కష్టంగా మారింది. దీంతో మనస్తాపానికి గురైన ఆమె గురువారం మల్కారం చెరువులో దూకి ఆత్మహత్యాయత్నానికి పాల్పడింది. చెరువులో చేపలు పడుతున్న వారు దీనిని గుర్తించి 100కు ఫోన్ చేసి సమాచారం అందించారు. ఘటనా స్థలానికి చేరుకున్న కానిస్టేబుల్ ఇంతియాజ్ ఆమెను బయటికి తీసి 108లో గాంధీ ఆస్పత్రికి తరలించారు. ప్రస్తుతం మమత ఆరోగ్యం నిలకడగా ఉందని తెలిపారు. మమత ప్రాణాలను కాపాడిన కానిస్టేబుల్ ఇంతియాజ్‌ను పోలీసులు, ప్రజలు అభినందించారు.

క్లుప్తంగా

సివిల్స్‌లో సత్తాచాటిన పూర్వవిద్యార్థికి సన్మానం


పారుష్ సూద్

బంజారాహిల్స్: యూనియన్ పబ్లిక్ సర్వీస్ కమిషన్ (యూపీఎస్సీ) ఇటీవల ప్రకటించిన 2022 పరీక్ష ఫలితాల్లో జూబ్లీ హిల్స్ పబ్లిక్ స్కూల్ పూర్వ విద్యార్థి పారుష్ సూద్ జాతీయ స్థాయిలో 29వ ర్యాంకు సాధించాడు. ఈ సందర్భంగా గురువారం జేహెచ్‌పీఎస్ చైర్మన్ ఎ.మురళీముకుంద్ ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన కార్యక్రమంలో సివిల్స్‌కు ఎంపికైన పారుష్ సూద్‌ను అభినందించారు. ఇక్కడ చదువుతున్నప్పుడు క్రమశిక్షణతో కష్టపడి చదివే వాడని, ఇందుకు తగిన ప్రతిఫలం లభించిందన్నారు. ప్రిన్స్‌పాల్ ఎం.వరలక్ష్మి మాట్లాడుతూ... పారుష్ పాఠశాలలో చదివే సమయంలో ఎప్పుడూ చదువులో ముందుండే వాడని... 2013వ సంవత్సరం పదో తరగతి పరీక్ష ఫలితాల్లో స్కూల్ టాపర్‌గా నిలిచాడని గుర్తుచేశారు. ఆయన శ్రమ అంకిత భావం ఇతర విద్యార్థులందరికీ ఆదర్శంగా ఉంటుందన్నారు. యావత్తు పాఠశాల యాజమాన్యం, ఉపాధ్యాయులు, సిబ్బంది ఈ విజయం పట్ల గర్విస్తున్నారన్నారు.

అభయాంజనేయస్వామి విగ్రహ ప్రతిష్ఠాపనోత్సవం


ప్రతిష్ఠాపనోత్సవంలో పాల్గొన్న మాజీ ఎమ్మెల్యే విష్ణువర్ధన్‌రెడ్డి

శ్రీనగర్‌కాలనీ: షేక్‌పేట డివిజన్ సీతానగర్‌లో శ్రీ సీతారామాంజనేయ ఆలయంలో 63 అడుగుల శ్రీ అభయ ఆంజనేయ స్వామి అష్టోత్తర విగ్రహ ప్రతిష్ఠాపన, ఉత్తర ద్వార రాజగోపుర ప్రారంభోత్సవాన్ని గురువారం అంగరంగ వైభవంగా నిర్వహించారు. ఈ మహోత్సవాన్ని మాజీ ఎమ్మెల్యే పి.విష్ణువర్ధన్ రెడ్డి ప్రారంభించారు. కార్యక్రమంలో దాతలు ఆత్మకూరి గౌరయ్య, ఆత్మకూరి భారతి, భారతి, మధుసూదన్‌రావు, ఆకుల శ్రీరాములు, తోట వేణుగోపాల్, తోట అర్జున్‌రావు, డివిజన్ కాంగ్రెస్ ప్రెసిడెంట్ డి. సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

దేవుళ్ల రూపంలోని మానవ విగ్రహాలను తొలగించాలి


గవర్నర్ తమిళిసైకి వినతిపత్రం సమర్పిస్తున్న బీవైఎస్ నేతలు

బంజారాహిల్స్: దేవుళ్ల రూపంలో ఉన్న మానవ విగ్రహాలను తొలగించాలని భారత యాదవ సమితి నేతలు గవర్నర్ తమిళిసై సౌందర్‌రాజన్‌ను కలిసి వినతిపత్రం సమర్పించారు. ఫిలించాంబర్ వద్ద శ్రీ కృష్ణుడి రూపంలో ఉన్న ఎన్టీఆర్ విగ్రహాన్ని తొలగించేలా చర్యలు తీసుకోవాలని బీవైఎస్ నేతలు రాష్ట్ర అధ్యక్షుడు దాసరి నాగేష్‌యాదవ్, సిద్ధి రమేష్ యాదవ్, వి.శ్రీనివాస్‌యాదవ్, తోకల శ్రీనివాస్‌యాదవ్ కోరారు.

నేడు అంబేడ్కర్ విగ్రహావిష్కరణ


ప్రారంభోత్సవానికి సిద్ధంగా ఉన్న అంబేడ్కర్ విగ్రహం

రహమత్‌నగర్: రహమత్‌నగర్ డివిజన్‌లో మరో అంబేడ్కర్ విగ్రహాన్ని విష్కరించనున్నారు. కార్మికనగర్ బస్ స్టాప్ వద్ద రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బాబా సాహెబ్ అంబేడ్కర్ విగ్రహాన్ని శుక్రవారం ఉదయం 9 గంటలకు జూబ్లీహిల్స్ ఎమ్మెల్యే మాగంటి గోపీనాథ్ ఆవిష్కరించనున్నారు. ఇందుకోసం బీఆర్‌ఎస్ పార్టీ ఎస్సీ సెల్, దళిత సంఘాల నాయకులు ఏర్పాట్లు పూర్తి చేశారు. ఇప్పటికే రహమత్‌నగర్ డివిజన్‌లో రహమత్‌నగర్ కూడలి, ఎస్పీఆర్ హిల్స్, రాజీవ్‌గాంధీ నగర్‌లలో అంబేడ్కర్ విగ్రహాలు ఉన్నాయి. అయితే కార్మికనగర్ బస్ స్టాప్ వద్ద కూడా అంబేడ్కర్ విగ్రహాన్ని ఏర్పాటు చేసేందుకు ఎమ్మెల్యే మాగంటి గోపీనాథ్ ప్రత్యేక చొరవ తీసుకున్నారు. ఇందుకోసం కార్మికనగర్ బస్ స్టాప్ వద్ద ఆరు నెలల క్రితం దిమ్మెను ఏర్పాటు చేశారు. తాజాగా తెలంగాణ ఆవిర్భావ దశాబ్ది ఉత్సవాల్లో భాగంగా అంబేడ్కర్ విగ్రహాన్ని ఆవిష్కరిస్తారు. కార్మికనగర్‌లో అంబేడ్కర్ విగ్రహం ఏర్పాటు చేస్తుండటం పట్ల బీఆర్‌ఎస్ ఎస్సీ సెల్ విభాగం, దళిత సంఘాల నాయకులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

చెరువుల పునరుద్ధరణతో..
సమృద్ధిగా భూగర్భ జలాలు

- మంత్రి తలసాని శ్రీనివాస్ యాదవ్
- లోటస్ పాండ్‌లో సందడిగా చెరువుల పండుగ
- పలు ప్రాంతాల్లోని చెరువుల వద్ద సందడి చేసిన నేతలు


లోటస్‌పాండ్‌లో చెరువుల పండుగను ప్రారంభిస్తున్న మంత్రి తలసాని, మేయర్ గద్వాల్ విజయలక్ష్మి

బంజారాహిల్స్: చెరువుల సంరక్షణ, అభివృద్ధి కోసం తెలంగాణ ప్రభుత్వం ఎంతో కృషి చేస్తున్నదని రాష్ట్ర పశుసంవర్ధక, మత్స్య, పాడి పరిశ్రమల అభివృద్ధి, సినిమాటోగ్రఫీ శాఖల మంత్రి తలసాని శ్రీనివాస్ యాదవ్ తెలిపారు. దశాబ్ది ఉత్సవాలలో భాగంగా గురువారం ఖైరతాబాద్ నియోజకవర్గ పరిధిలోని లోటస్ పాండ్‌లో నిర్వహించిన చెరువుల పండుగ కార్యక్రమంలో మంత్రి తలసాని శ్రీనివాస్ యాదవ్ ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా స్థానిక మహిళలు మంత్రికి బతుకమ్మలతో ఘనంగా స్వాగతం పలికారు. అనంతరం ఏర్పాటు చేసిన కార్యక్రమంలో మంత్రి తలసాని మాట్లాడుతూ... కాకతీయుల కాలంలో నిర్మించిన చెరువులు సరైన నిర్వహణ, పర్యవేక్షణ లేని కారణంగా పూడిపోతూ, ఆక్రమణలకు గురియ్యాయన్నారు. ఆయా చెరువులను పరిరక్షించి వాటికి పూర్వవైభవం తీసుకురావాలని ముఖ్యమంత్రి కల్వకుంట్ల చంద్రశేఖర్‌రావు నాయకత్వంలోని తెలంగాణ ప్రభుత్వం కృషి చేస్తుందని చెప్పారు. చెరువులను పునరుద్ధరణతో భూగర్భ జలాలు వృద్ధి చెందుతాయని, తాగు, సాగునీటి సమస్య పరిష్కారం అవుతుందనే ఆలోచనతో ప్రభుత్వం మిషన్ కాకతీయ కార్యక్రమం కింద రాష్ట్రంలో ఉన్న 46,623 చెరువు కట్టలను పటిష్టపర్చడం, తూములు, కాలువల మరమ్మతులు వంటి అభివృద్ధి చేపట్టిందని గుర్తుచేశారు. దీంతో ప్రస్తుతం ఆయా చెరువులు నిండుగా నీటితో కళకళలాడుతున్నాయని వివరించారు. హైదరాబాద్ నగరంలో సుమారు 185 చెరువులు ఉండగా జీహెచ్‌ఎంసీ, హెచ్‌ఎండీఏల ఆధ్వర్యంలో కొన్ని చెరువుల అభివృద్ధి పనులు చేపట్టగా, మరికొన్ని చెరువులను సీఎస్ఆర్ కార్యక్రమం కింద అభివృద్ధి చేస్తున్నట్లు వివరించారు. భూగర్భ జలాల వృద్ధితోపాటు సాగుభూమి విస్తీర్ణం పెరిగి పంటల దిగుబడి కూడా భారీగా పెరిగిందన్నారు. రాష్ట్రంలోని అన్ని నీటి వనరులలో చేప పిల్లలను విడుదల చేయడం వలన అటు మత్స్యకారులు, సమృద్ధిగా సాగునీటి లభ్యతతో రైతులు ఎంతో సంతోషంగా ఉన్నారని చెప్పారు. మహిళలు కూడా బతుకమ్మ వేడుకలను చెరువుల వద్ద ఎంతో గొప్పగా జరుకొంటున్నారని ఆనందం వ్యక్తం చేశారు. దశాబ్ది ఉత్సవాల సందర్భంగా రూపొందించిన పుస్తకాలను మంత్రి ఆవిష్కరించారు. నగర మేయర్ గద్వాల్ విజయలక్ష్మి, ఎమ్మెల్యే దానం నాగేందర్, కార్పొరేటర్లు మన్నె కవిత, సంగీత, వెంకటేష్, గ్రంథాయల సంస్థ చైర్మన్ ప్రసన్న, జీహెచ్‌ఎంసీ జోనల్ కమిషనర్ రవికిరణ్, ఆర్‌డీఓ వసంత, సీతః సురేష్, ధర్మా, మత్స్య శాఖ జిల్లా అధికారి సుచరిత పాల్గొన్నారు.

సందడిగా చెరువుల పండుగ


బతుకమ్మలతో ఖైరతాబాద్ ఎమ్మెల్యే దానం నాగేందర్

బంజారాహిల్స్: ముఖ్యమంత్రి కేసీఆర్ దూరదృష్టితో నాడు ఎండిపోయిన చెరువులు నేడు నిండు కుండలను తలపిస్తున్నాయని ఖైరతాబాద్ ఎమ్మెల్యే దానం నాగేందర్ అన్నారు. మిషన్ కాకతీయతో చెరువులకు పునరుజ్జీవం పోసిన ఘనత సీఎం కేసీఆర్‌కే దక్కుతుందన్నారు. రాష్ట్ర అవతరణ దశాబ్ది ఉత్సవాల్లో భాగంగా గురువారం ఊరూరా చెరువుల పండుగ కార్యక్రమంలో భాగంగా బంజారాహిల్స్ రోడ్ నెం. 12లో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. నియోజకవర్గ మహిళలు ఆయనకు బతుకమ్మలు, బోనాలతో ఘనంగా స్వాగతం పలికారు. సాంస్కృతిక కార్యక్రమాలతో చెరువుగట్టులో సందడి నెలకొంది. మైసమ్మతల్లికి ప్రత్యేక పూజలు నిర్వహించిన అనంతరం ఎమ్మెల్యే మాట్లాడుతూ... తెలంగాణ ఆచరిస్తుంది.. దేశం అనుసరిస్తుంది అని కేసీఆర్ తెలంగాణ ఖ్యాతిని యావత్ దేశానికి చాటి చెప్పారన్నారు. చెరువులకు ప్రాణం పోయడమే కాకుండా వాటి సంరక్షణ కోసం కోట్లాది రూపాయలు వెచ్చిస్తున్నారన్నారు. చెరువుల పండుగను సంబురంగా నిర్వహించుకునేందుకు నియోజకవర్గం ప్రజలు భారీగా తరలిరావడం పట్ల ఆనందం వ్యక్తం చేశారు. మరో యాభై ఏళ్ల వరకు హైదరాబాద్‌లో మంచినీటి సమస్యలు తలెత్తకుండా సీఎం కేసీఆర్ కృష్ణా, గోదావరి నదుల నుంచి నీటిని తీసుకువస్తున్నారని ఆయన పేర్కొన్నారు.

గంగమ్మ ఆలయంలో...

ఖైరతాబాద్: తెలంగాణ ప్రభుత్వం చేపడుతున్న దశాబ్ది ఉత్సవాల సందర్భంగా చెరువుల పండుగ సందర్భంగా గురువారం హుస్సేన్ సాగర్ తీరంలోని గంగమ్మ ఆలయం వద్ద ఎమ్మెల్యే దానం నాగేందర్ పూజలు చేశారు. దేవాలయాన్ని అభివృద్ధి చేయాలని గంగతెప్పను రాష్ట్ర పండుగగా ప్రకటించాలని కోరుతూ ప్రదేశ్ గంగపుత్ర సంఘం, నగర గంగపుత్ర సంఘం, తెలంగాణ గంగ తెప్పోత్సవ కమిటి సభ్యులు కోరారు. కార్యక్రమంలో నేతలు గడప శ్రీహరి, చాట్ల నరేందర్, ఎం.మహేందర్‌బాబు, అంబటి సుధాకర్, మధునాల బాబురావు, పూస నరసింహ, మంగలి పెళ్లిరాజు, చంద్రప్రకాష్, పిల్లి శంకర్, అరుణ్ జ్యోతి, మధునాల చంద్రకళ, ఎం.సుభిత తదితరులు పాల్గొన్నారు.

క్రీడల్లో రాణిస్తే ఉజ్వల భవిష్యత్


బహుమతులు పొందిన చిన్నారులతో కాలనీనేతలు

వెంగళరావునగర్: చదువుతోపాటు క్రీడల్లోనూ రాణిస్తే సంబంధిత యువతకు ఉజ్వల భవిష్యత్ సాకారం అవుతుందని మధురానగర్‌కాలనీ సంక్షేమ సంఘం మాజీ అధ్యక్షుడు కె.విశ్వప్రకాశ్, జె.ఎస్.ఆర్.దాస్ తెలిపారు. మధురానగర్ కాలనీ ఇండోర్ స్టేడియంలో కాలనీ సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో 13 ఏళ్లలోపు విద్యార్థులకు షటిల్ బ్యాడ్మింటన్ వేసవి శిక్షణా శిబిరం జరిగింది. శిబిరం ముగింపు సందర్భంగా గురువారం బాల్ బ్యాడ్మింటన్ పోటీలను నిర్వహించారు. ఆయా క్రీడల్లో పాల్గొని విజయం సాధించిన విద్యార్థినీవిద్యార్థులకు బహుమతులను ప్రదానం చేశారు. ఈ సందర్భంగా నేతలు మాట్లాడుతూ... తల్లిదండ్రులు పిల్లల్లో దాగి ఉన్న నైపుణ్యాన్ని తెలుసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో అసోసియేషన్ అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు కోడె సాంబశివరావు, మన్నె కళ్యాణ చక్రవర్తి, కోశాధికారి ఉప్పలయ్య, సహాయ కార్యదర్శి డాక్టర్ పి.శ్రీలక్ష్మీరెడ్డి, పలువురు కార్యవర్గ సభ్యులు పాల్గొన్నారు.

ట్రాఫిక్ నిబంధనలపై అవగాహన


అవగాహన కల్పిస్తున్న ట్రాఫిక్ ఏసీపీ శంకర్‌రాజు

బంజారాహిల్స్: సోమాజిగూడలోని లేక్‌షోర్ టవర్స్‌లో ఉన్న రిలయన్స్‌జియో లిమిటెడ్ సంస్థ కార్యాలయంలో గురువారం బేగంపేట ట్రాఫిక్ ట్రైనింగ్ ఇనిస్టిట్యూట్ ఏసీపీ శంకర్‌రాజు రోడ్డు భద్రత, ట్రాఫిక్ బంధనలు, మోగారు వాహన చట్టం నియమాలపై అవగాహన కల్పించారు. వాహనంతో రోడ్డు మీదకు వచ్చే ప్రతి ఒక్కరూ రోడ్డు నియమ, నిభందనలు కచ్చితంగా తెలుసుకుని పాటించాలన్నారు. ప్రతి ఒక్కరూ ట్రాఫిక్ నిబంధనలు పాటించడం ద్వారా రోడ్డు ప్రమాదాలను నివారించవచ్చన్నారు. కార్యక్రమంలో సంస్థ ప్రతినిధులు కె.ఎస్.రావు, రామన్ మధిర, లక్ష్మీనారాయణ, పోలిరెడ్డి శ్రీనివాస్, ట్రాఫిక్ ఎస్ఐ జ్యోతి, వెంకటప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

బోరబండ పీఎస్ పరిధిలో...సెక్టార్లు.. ఎస్ఐలు


వివరాలు వెల్లడిస్తున్న ఎస్‌హెచ్‌ఓ రవికుమార్

రహమత్‌నగర్(బోరబండ): నూతనంగా ఏర్పాటైన బోరబండ పోలీస్ స్టేషన్ పరిధి, సెక్టార్ ఎస్ఐల సమాచారాన్ని స్టేషన్ హౌస్ ఆఫీసర్ (ఎస్‌హెచ్‌ఓ) కామల్ల రవికుమార్ తెలిపారు.

- సెక్టార్–1: ఎస్ఐ మనోజ్ కుమార్, సెల్: 85220 60849 (ఎస్ఆర్‌నగర్ పీఎస్ పరిధిలోంచి వచ్చిన ప్రాంతాలు, ఎర్రగడ్డ గోకుల్ థియేటర్, శంకర్‌లాల్‌నగర్, నటరాజ్ నగర్, సుల్తాన్‌నగర్, డాన్‌బోస్కో స్కూల్, నందినగర్, బాలాజీ స్వర్ణపురికాలనీ, వికాసపురి కాలనీ).
- సెక్టార్2: ఎస్ఐ సప్నారెడ్డి: సెల్: 87126 61070 (మోతీనగర్, రాజీవ్‌నగర్, కళ్యాణ్‌నగర్, వెంచర్–1, వెంచర్ 2, ఏజీ కాలనీ, హబీబ్‌ఫాతీమా నగర్, జంగయ్య బస్తీ, సారథి సొసైటీ).
- సెక్టార్–3: ఎస్ఐ మహేష్, సెల్: 73823 45617 (బోరబండ, వినాయకనగర్, రాజ్‌నగర్, ఎస్ఆర్ఆర్ పురం, సైట్–1, 2, 3, 4, 5, ఎస్ఆర్‌టీ నగర్, స్వరాజ్‌నగర్, బంజారనగర్, పీలీ దర్గా, సాయిబాబానగర్, ప్రభాత్‌నగర్, ఇందిరానగర్, సంజయ్‌నగర్, భరత్‌నగర్, జ్యోతినగర్, జక్కయ్య బస్తీ,హైటెక్ హోటల్, యాదయ్య బస్తీలు).
- సెక్టార్–4: ఎస్ఐ తుల్జారాం, సెల్: 98665 22119 (జూబ్లీహిల్స్ పీఎస్ పరిధిలోంచి వచ్చిన ప్రాంతాలు, పెద్దమ్మ నగర్, నాట్కో స్కూల్, కమలానగర్, ఆరోగ్యనగర్, ఎస్పీఆర్‌హిల్స్, జయంత్‌నగర్, ప్రశాంత్‌నగర్, ఎస్సీ, ఎస్టీ బీసీ కాలనీ, సునీల్‌నగర్, రాజీవ్‌గాంధీనగర్, కార్మికనగర్ నార్త్, బ్రహ్మశంకర్‌నగర్, ఫేజ్–2, ఎస్ఎస్‌బీ నగర్, వినాయకనగర్, సంజయ్‌నగర్, కేసీఆర్‌నగర్, ఆరోగ్యనగర్, ప్రగతినగర్,శ్రీరాంనగర్, హబీబ్ ఫాతీమానగర్.
- కామల్ల రవికుమార్, స్టేషన్ హౌస్ ఆఫీసర్, సెల్: 87126 61431
- డీఎస్ఐ సర్దార్ జమాల్, సెల్: 87126 61647
- బోరబండ పోలీస్ స్టేషన్ నెంబర్: 87126 65189.

వాహనదారులు అనుక్షణం అప్రమత్తంగా ఉండాలి

వెంగళరావునగర్: వాహనాలు నడిపే సమయంలో వాహనదారులు తప్పనిసరిగా తగిన జాగ్రత్తలు పాటించాలని యూసుఫ్‌గూడ ఫస్ట్ బెటాలియన్ అధికారి కమాండెంట్ ఎ.కె.మిశ్రా సూచించారు. ఫస్ట్ బెటాలియన్ ఆధ్వర్యంలో గురువారం అధికారులు, సిబ్బంది హెల్మెట్స్ ధరించి యూసుఫ్‌గూడ పరిసర ప్రాంతాల్లో ర్యాలీ నిర్వహించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ... ద్విచక్ర వాహనాలు నడిపే సమయంలో హెల్మెట్లు ధరించాలని, కార్లు లాంటి వాహనాల్లో వెళ్లేవారు సీటు బెల్టు ధరించాలని, డ్రైవింగ్ సమయంలో సెల్‌ఫోన్లు వినియోగించరాదని, మద్యం సేవించి వాహనాలు నడరాదని తదితర జాగ్రత్తలు వివరించారు. టీఎస్ఎస్‌పీ ఫస్ట్ బెటాలియన్ అసిస్టెంట్ కమాండెంట్లు సత్యనారాయణ, రంగారెడ్డి, జవహర్‌లాల్, కె.అప్పారాయ్, నరసింహారావు, ఆర్ఐలు ,ధర్మారావు, సాంబయ్య, శంకర్, రవీందర్, రాజేశం, ఆర్ఎస్ఐలు, సిబ్బంది పాల్గొన్నారు.


బైక్ ర్యాలీలో పాల్గొన్న టీఎస్ఎస్‌పీ అధికారులు, సిబ్బంది

ఆటో డ్రైవర్ల సమస్యలు పరిష్కరించాలి

లిబర్టీ: ఆటో డ్రైవర్ల సమస్యలపై తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం స్పందించి పరిష్కారం చూపేందుకు ఉన్నత స్థాయి కమిటీ వేయాలని తెలంగాణ రాష్ట్ర ఆటో రిక్షా డ్రైవర్స్ యూనియన్ రాష్ట్ర కార్యదర్శి రుద్రాక్ష మల్లేష్ విజ్ఞప్తి చేశారు. ఐఏఎస్ అధికారి నేతృత్వంలో కమిటీ ఏర్పాటు చేసి రవాణా శాఖ అధికారులను అందులో భాగస్వామ్యం చేయాన్నారు. తెలంగాణ రాష్ట్రవ్యాప్తంగా ప్రధానంగా గ్రేటర్ హైదరాబాద్ మహానగరంలో ఆటో డ్రైవర్లు ఎదుర్కొంటున్న సమస్యలను అధ్యయనం చేయాలని సూచించారు. గురువారం ఏర్పాటు చేసిన ఆటో డ్రైవర్ల సమావేశానికి ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని ప్రసంగించారు. ఈ సందర్భంగా మల్లేష్ మాట్లాడుతూ... నిరంతరం ఆటో డ్రైవర్లపై ట్రాఫిక్ పోలీసుల వేధింపులు పెచ్చు పెరిగిపోతున్నాయన్నారు. దీనికి అడ్డుకట్ట వేసేందుకు ప్రభుత్వం చర్యలు చేపట్టాలని డిమాండ్ చేశారు. ఆటోలు కొనుగోలు చేసి జీవనం సాగించేందుకు జాతీయ బ్యాంకుల నుంచి వడ్డీ లేని రుణాలు ఇప్పించాలని విన్నవించారు. పెరిగిన ధరలకు అనుగుణంగా ఆటో మీటర్ చార్జీలను రూ. 40కు పెంచాలని కోరారు. ఆటో డ్రైవర్లకు ఉచితంగా ప్రభుత్వం బీమా సౌకర్యం కల్పించాలని విజ్ఞప్తి చేశారు. అర్హులైన ఆటో డ్రైవర్లకు డబుల్ బెడ్‌రూమ్ ఇళ్లు నిర్మించి ఇవ్వాలని కోరారు. రవాణా శాఖలో ఆటో డ్రైవర్లు ఎదుర్కొంటున్న సమస్యలను పరిష్కరించాలని విన్నవించారు. నగరంలోనూ రాష్ట్రవ్యాప్తంగా ఆటో స్టాండ్ ఏర్పాటు చేయాలని రవాణా శాఖ ట్రాఫిక్ పోలీసులకు రుద్రాక్ష మల్లేష్ విజ్ఞప్తి చేశారు.

ఎంపీ బ్రిజ్ భూషణ్‌ను తక్షణమే అరెస్టు చేయాలి

రహమత్‌నగర్: భారత మహిళా రెజ్లర్లపై లైంగిక వేధిపులకు పాల్పడ్డ బీజేపీ ఎంపీ భూషణ్ చరణ్ సింగ్‌ను వెంటనే అరెస్టు చేసి, చట్ట పరంగా కఠినంగా శిక్షించాలని సీఐటీయూ నేతలు డిమాండ్ చేశారు. లైంగిక వేధింపులకు నిరసనగా గురువారం ఎస్పీఆర్‌హిల్స్‌లో సీఐటీయూ నేతలు ఆందోళన చేశారు. ఈ సందర్భంగా సీఐటీయూ జూబ్లీహిల్స్ కన్వీనర్ స్వామి మాట్లాడుతూ... దేశ కీర్తి పతాకాన్ని ప్రపంచానికి చాటిన మహిళా రెజ్లర్లపై ఎంపీ భూషణ్ లైంగిక వేధింపులకు పాల్పడటం సిగ్గుచేటన్నారు. కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం భూషణ్‌ను అరెస్టు చేయకుండా వెనకేసుకురావడం శోచనీయమన్నారు. సీపీఎం నాయకుడు రాపర్తి అశోక్, ఎ.ఆర్.నరసింహ, భాగ్యరాజ్, బాలయ్య, సిద్ధూ, మహిళ నాయకురాళ్లు సమాధానం, సువర్ణ తదితరులు పాల్గొన్నారు.

నిమ్స్ నూతన డైరెక్టర్‌కు సత్కారం



లక్డీకాపూల్: నిమ్స్ నూతన డైరెక్టర్‌గా ప్రొఫెసర్ నగరి బీరప్ప నియామకం పట్ల ఉద్యోగ వర్గాలు హర్షం వ్యక్తం చేశాయి. గురువారం డైరెక్టర్ పేషీ ఉద్యోగ సంఘాల నాయకులతో కోలాహలంగా మారింది. ఇంచార్జి డైరెక్టర్‌గా బీరప్ప అందించిన సేవల పట్ల నిమ్స్ పాలక మండలి చైర్మన్ అయిన ముఖ్యమంత్రి కేసీఆర్, వైద్య ఆరోగ్య శాఖ మంత్రి హరీష్‌రావు సంతృప్తిగా ఉన్నారడానికి ఆయన నియామకాల్లో పేర్కొనవచ్చు. నిమ్స్ అభివృద్ధి కార్యక్రమంలో భాగంగా దాదాపు రూ. 1615 కోట్ల వ్యయంతో విస్తరణ పనులు చేపడుతున్న తరుణంలో ఈ నియామకం మరింత ప్రాధాన్యతను సంతరించుకుంది. ఇప్పటికే తల్లి పిల్లల ఆస్పత్రి భవన సముదాయానికి వైద్యారోగ్య శాఖ మంత్రి హరీష్ రావు శంకుస్థాపన చేసిన సంగతి తెలిసిందే.

కూరగాయల ధరలు

సనత్‌నగర్: ఎర్రగడ్డ రైతుబజార్‌లో వివిధ కూరగాయల ధరలు ఈ విధంగా ఉన్నాయి. టమాటా కిలో రూ. 27, నల్లవంకాయ 28, పొడుగు వంకాయ 28, బెండకాయ 45, పచ్చిమిర్చి 65, బజ్జీమిర్చి 45, క్యాప్సికమ్ 55, పచ్చకాకర 38, పందిరి బీర 45, క్యాబేజీ 13, క్యారెట్ 47, దొండ 28, గుండుబీన్స్ 105, గింజ చిక్కుడు 75, గోకరకాయ 40, కీర 23, దోసకాయ 16, బీట్‌రూట్ 27, ఉల్లిగడ్డ 14, ఆలుగడ్డ 20, చామగడ్డ 40, మొరంగడ్డ 18, కందగడ్డ 45, సొరకాయ 15, పొట్లకాయ 18, అరటికాయ 10, మునగకాయ 3–4, ముల్లంగి 4–6 ప్రకారం ధర పలుకుతున్నాయి. ఈ ధరలు శుక్రవారం ఉదయం 9 గంటల వరకు అమలులో ఉంటాయి.



గుంటూరు జిల్లా తాడేపల్లిలో జరిగిన ఈ–ఆటోల ప్రారంభోత్సవంలో ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి. చిత్రంలో మంత్రులు, అధికారులు

516 ఈ–ఆటోలు ప్రారంభం

సాక్షి, అమరావతి : రాష్ట్రాన్ని క్లీన్ ఆంధ్రప్రదేశ్‌గా మార్చాలన్న లక్ష్యంతో ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి చిన్న మున్సిపాలిటీల్లోనూ చెత్త సేకరణకు పర్యావరణ హితంగా ఉండే 516 విద్యుత్తు ఆటోలను (ఈ – ఆటోలను) గురువారం జెండా ఊపి ప్రారంభించారు. ఒక్కొక్కటి రూ.4.10 లక్షల చొప్పున మొత్తం రూ.21.18 కోట్ల వ్యయంతో కొనుగోలు చేసిన వీటిని 36 చిన్న మున్సిపాలిటీలకు పంపిణీ చేయనున్నారు. తాడేపల్లిలోని సీఎం క్యాంపు కార్యాలయంలో ఏర్పాటు చేసిన ఈ కార్యక్రమంలో ముందుగా దివంగత మహానేత వైఎస్ రాజశేఖరరెడ్డి విగ్రహానికి సీఎం పూల మాల వేసి నివాళులర్పించారు. అనంతరం జెండా ఊపి ఆటోలను ప్రారంభించారు. ఆటోల నిర్వహణ, ఇతర విషయాల గురించి సీఎం.. డ్రైవర్లు, అధికారులతో మాట్లాడారు.

ఏపీలో సీపీఎస్ రద్దు చరిత్రాత్మక నిర్ణయం

- సీపీఎస్టీఈఏ టీఎస్ ప్రచార కార్యదర్శి మాచన రఘునందన్

సాక్షి, హైదరాబాద్: ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం తమ ఉద్యోగులకు సీపీఎస్ రద్దు చేయడం చరిత్రాత్మక నిర్ణయమని నేషనల్ మూవ్‌మెంట్ ఫర్ ఓల్డ్ పెన్షన్ స్కీమ్ రెస్టోరేషన్ జాతీయ కార్యదర్శి, భాగస్వామ్య పింఛన్ పథకం ఉపాధ్యాయ, ఉద్యోగ సంఘం తెలంగాణ రాష్ట్ర (సీపీఎస్టీ ఈఏ టీఎస్) ప్రచార కార్యదర్శి మాచన రఘునందన్ అన్నారు. ఈ మేరకు గురువారం ఆయన తిరుపతిలో ఒక ప్రకటన విడుదల చేశారు. దేశవ్యాప్తంగా 80 లక్షల పైచిలుకు ఉద్యోగులు సీపీఎస్ పథకంలో ఉన్నారని తెలిపారు. ఏపీలో ముఖ్యమంత్రి వైఎస్ జగన్ సీపీఎస్‌ను రద్దు చేసి సాహసోపేత నిర్ణయం తీసుకున్నారని అభినందించారు.

99 శాతం పూర్తి

ప్రమాణ స్వీకారం నుంచే మేనిఫెస్టో అమలుకు ఏపీ సీఎం జగన్ శ్రీకారం

(సాక్షి, అమరావతి)

ఓట్లడిగేటప్పుడు వందలకొద్దీ హామీలివ్వటం ... తీరా ఆ ఓట్లతో గెలిచాక హామీలను పక్కనబెట్టడం!. దశాబ్దాలుగా ఇక్కడ చూస్తున్నది అదే. అలవికాని హామీలను చూసి చూసి అలసిపోయిన జనం... ఎన్నికలప్పుడు పార్టీలు విడుదల చేసే మేనిఫెస్టోలకు విలువివ్వటమే మానేశారు. వాటినసలు చూడకుండానే పక్కనబెట్టేస్తున్నారు. కాకపోతే 2019 ఎన్నికల్లో... ఈ పరిస్థితి మార్చాలని సంకల్పించారు వై.ఎస్.జగన్‌మోహన్ రెడ్డి. నాడు ప్రతిపక్ష నేత హోదాలో వైఎస్సార్ సీపీ తరఫున ఒకే ఒక పేజీ మేనిఫెస్టోను విడుదల చేశారు. దాన్ని చిత్తశుద్ధితో అమలు చేస్తానని స్పష్టంగా చెప్పారు. జనం జై కొట్టారు. ఓ కొత్త చరిత్రకు అంకురార్పణ జరిగింది.

మరి సింగిల్ పేజీ మేనిఫెస్టోతో ఎన్నికల్లో పోటీ చేసి అఖండ విజయాన్ని అందుకున్న వై.ఎస్.జగన్‌మోహన్‌రెడ్డి... ముఖ్యమంత్రి అయ్యాక ఏం చేశారు? ఆ మేనిఫెస్టోను పూర్తిగా అమలు చేశారా? దీనికి నిజాయితీగా వినవచ్చే సమాధానం ఒక్కటే. అది... 'ఆ రెండూ తప్ప' అని!. ఎందుకంటే మేనిఫెస్టోను పవిత్ర గ్రంథంగా తీసుకున్న జగన్... తొలి ఏడాదే దాన్లో పేర్కొన్న 95 శాతం హామీలను అమల్లోకి తెచ్చారు. మిగిలిన సంక్లిష్టమైన హామీలను కూడా సాధ్యాసాధ్యాలను బేరీజు వేసుకుంటూ ఒక్కొక్కటిగా అమలు చేస్తూ వస్తున్నారు. కాకపోతే కాంట్రిబ్యూటరీ పెన్షన్ స్కీమ్‌ను (సీపీఎస్) రద్దు చేసి ఓల్డ్ పెన్షన్ స్కీమ్‌ను (ఓపీఎస్) తిరిగి అమల్లోకి తెస్తామన్న హామీని అమలు చేయలేకపోయారు. ఓపీఎస్‌ను తిరిగి తేవటం ఆచరణ సాధ్యం కాదని తేలినా... ఉద్యోగులకిచ్చిన హామీ మేరకు మెరుగైన పెన్షన్ పథకాన్ని తీసుకురావాలన్న ఉద్దేశంతో ప్రభుత్వ యంత్రాంగం రెండేళ్లుగా రకరకాల గ్రూపులతో చర్చించి కసరత్తు చేస్తూ వచ్చింది. చివరకు వారి ప్రయోజనాలను కాపాడేలా గ్యారంటీడ్ పెన్షన్ పథకానికి (జీపీఎస్) రూపకల్పన చేసింది. ఉద్యోగ వర్గాలంతా ఈ జీపీఎస్‌పై సంతృప్తి వ్యక్తం చేస్తున్న నేపథ్యంలో దీన్ని అమల్లోకి తేవటానికి ప్రభుత్వం



రంగం సిద్ధం చేస్తోంది కూడా. ఇక అమలు కాని హామీల్లో రెండవది మద్య నియంత్రణ. దశలవారీగా మద్యం వినియోగాన్ని తగ్గిస్తూ చివరకు దాన్ని ఫైవ్ స్టార్ హోటళ్లకే పరిమితం చేస్తామని మేనిఫెస్టోలో పేర్కొన్నా... రకరకాల సాంకేతిక, ఆర్థిక కారణాలతో పూర్తి స్థాయిలో ఆ హామీ అమలు కాలేదు. కాకపోతే నియంత్రణ దిశగా బలమైన అడుగులుపడ్డాయి. 2018–19తో పోలిస్తే విక్రయాలు 50 శాతానికన్నా తగ్గాయంటే నియంత్రణ దిశగా అడుగులు పడ్డాయన్నది స్పష్టంగా తెలియకమానదు. కాకపోతే ఈ రెండంశాలూ హామీ ఇచ్చినట్లుగా నూటికి నూరు శాతం అమలు కాలేదు కనక... మేనిఫెస్టోలో 99 శాతమే అమలయ్యిందని చెప్పాలి. నూటికి 99 శాతం మార్కులే ఇవ్వాలి.

ఇక్కడ గమనించాల్సిందొక్కటే. అసలు మేనిఫెస్టోను ఇంత చిత్తశుద్ధితో అమలు చేసిన ప్రభుత్వాలను మనమెన్నడైనా చూశామా? గత ప్రభుత్వంలో చంద్రబాబు నాయుడు ముఖ్యమంత్రిగా ఉన్నపుడు ఏం జరిగిందో ఎవరికి తెలియదని? 2014లో ఆయన ఇచ్చిన ఏ హామీనైనా గెలిచాక అమలు చేశారా? అసలు మేనిఫెస్టోనే పార్టీ వెబ్‌సైట్లో నుంచి తొలగించిన చరిత్ర ఆయనది. ఒకటికాదు రెండు కాదు... వందలకొద్దీ హామీలనిచ్చారు. కానీ తొలి నాలుగున్నరేళ్లూ ఒక్క హామీని కూడా పట్టించుకోలేదు. మళ్లీ 2019లో ఎన్నికలు ముంచుకొస్తున్నాయనగా హడావుడిగా కొన్ని హామీలను అరకొరగానైనా అమలు చేశామని చూపించుకోవటానికి ప్రయత్నించారు. కొద్ది మంది ఖాతాల్లో రూ.1000 చొప్పున నిరుద్యోగ భృతిని జమచేయటం... పసుపు కుంకుమ కింద మహిళల ఖాతాల్లో నగదు వేయటం... ఇవన్నీ ఎన్నికలకు కేవలం రెండుమూడు నెలల ముందు చేశారు. అంతేకాదు! ఈ రాష్ట్రానికి తీరప్రాంతమే మణిహారమంటూ రకరకాల గ్రాఫిక్‌లు చూపించి... ఎన్నికలకు కేవలం 20 రోజుల ముందు పోర్టులకు శంకుస్థాపనలంటూ హడావుడి చేశారు. భోగాపురం విమానాశ్రయానిదీ అదే కథ. విచిత్రమేంటంటే ఇలా ఏ హామీనీ అమలు చెయ్యని చంద్రబాబు నాయుడు... 2019 ఎన్నికల్లో మాత్రం తాను చెప్పినవన్నీ చేశానని, మళ్లీ గెలిపిస్తే ఇంకేదో చేస్తానంటూ స్వర్గాన్ని గ్రాఫిక్‌లలో చూపించే ప్రయత్నం చేశారు. ఇప్పుడూ అదే చేస్తున్నారు కూడా. ముఖ్యమంత్రి జగన్‌మోహన్ రెడ్డి మాత్రం నిజాయితీగా తన పనితీరుకు మార్కులు వేసుకుంటున్నారు. మేనిఫెస్టోలోని ప్రతి అంశాన్నీ అమలు చేయటానికి ప్రయత్నించటంతో పాటు రెండంశాలు తప్ప మిగిలినవన్నీ 100 శాతం అమలు చేశారు. 99 శాతం మార్కులు సాధించగలిగారు. రాజకీయ వర్గాలు ఈ రెండు మేనిఫెస్టోలనూ 'విశ్వసనీయత– వంచన'తో పోలుస్తున్నది కూడా అందుకేనేమో!!.

ప్రమాణ స్వీకారం చేసిన క్షణం నుంచే..

రాష్ట్రంలో 2019 సార్వత్రిక ఎన్నికల్లో 50 శాతానికిపైగా ఓట్లు.. 151 శాసనసభ, 22 లోక్‌సభ స్థానాలతో వైఎస్సార్‌సీపీ చారిత్రక విజయాన్ని సాధించాక 2019 మే 30న వైఎస్ జగన్ ముఖ్యమంత్రిగా ప్రమాణ స్వీకారం చేశారు. ఆ మరుక్షణమే ఎన్నికల మేనిఫెస్టోలో ఇచ్చిన హామీల అమలుకు శ్రీకారం చుడుతూ.. వృద్ధాప్య పింఛన్‌ను పెంచే ఫైలుపై తొలి సంతకం చేశారు. 2019 జూన్ 8న ఏర్పాటు చేసిన మంత్రివర్గంలో బీసీ, ఎస్సీ, ఎస్టీ, మైనార్టీలకు 56 శాతం పదవులు ఇచ్చి సామాజిక విప్లవానికి తెరతీశారు. అధికారంలోకి వచ్చిన తొలి ఏడాదే.. నవరత్నాలతో 95 శాతం హామీలను అమలు చేశారు. కోవిడ్ కష్టకాలంలోనూ మాట తప్పకుండా వాటిని కొనసాగించారు. ఉద్యోగులు అడగక ముందే 12వ పీఆర్సీ (పే రివిజన్ కమిషన్) ఏర్పాటుకు గ్రీన్ సిగ్నల్ ఇవ్వటం... సీపీఎస్ (కాంట్రిబ్యూటరీ పెన్షన్ స్కీమ్) ఉద్యోగులకు మెరుగైన పెన్షన్ అందించేలా జీపీఎస్ (గ్యారంటీ పెన్షన్ స్కీమ్) విధానానికి ఆమోదం తెలపటం... కాంట్రాక్టు ఉద్యోగుల క్రమబద్ధీకరణకు పచ్చజెండా ఊపడంతో మేనిఫెస్టో అమల్లో మరింత ముందడుగు వేసినట్లయింది. 99 శాతం హామీలను నెరవేర్చినట్లయింది.

ఇబ్బందుల్లోనూ చెప్పిన దాని కంటే మిన్నగా..

2020లో ప్రపంచ వ్యాప్తంగా విజృంభించిన కరోనా మహమ్మారి ప్రభావం రాష్ట్రంపైనా పడింది. ఆర్థిక ఇబ్బందులను సృష్టించింది. కరోనా కష్టకాలంలోనూ.. ఆర్థిక ఇబ్బందులున్నా హామీల అమల్లో సీఎం వైఎస్ జగన్ వెనుకంజ వేయలేదు. ఇచ్చిన మాటకు కట్టుబడి హామీలన్నీ అమలు చేశారు. వైఎస్సార్ రైతు భరోసా కింద ఏడాదికి రూ.12,500 చొప్పున నాలుగేళ్లలో రూ.50 వేలు రైతులకు ఇస్తానని మేనిఫెస్టోలో చెప్పిన సీఎం జగన్.. దాన్ని మరో వెయ్యి పెంచి ఏటా రూ.13,500 చొప్పున ఐదేళ్లలో రూ.67,500 ఇచ్చేలా అమలు చేస్తున్నారు. అంటే.. రైతు భరోసా ద్వారా ఒక్కో రైతుకు అదనంగా రూ.17,500 ప్రయోజనం చేకూరుస్తున్నారు. మేనిఫెస్టోలో ఇచ్చిన హామీలతోపాటు ఇతర పథకాలనూ అమల్లోకి తెచ్చారు. 2019 ఎన్నికల తర్వాత.. జరిగిన సర్పంచ్, ఎంపీటీసీ, జడ్పీటీసీ, మున్సిపల్, కార్పొరేషన్.. తిరుపతి లోక్‌సభ, ఆత్మకూరు, బద్వేలు శాసనసభ స్థానాలకు జరిగిన ఉప ఎన్నికల్లో వైఎస్సార్‌సీపీ రికార్డు విజయాలు సాధించడమే ఆయనపై జనానికున్న నమ్మకానికి నిదర్శనం.

అర్హతే ప్రామాణికం

కులం, మతం, ప్రాంతం, వర్గం, పార్టీ చూడకుండా.. అర్హతే ప్రామాణికంగా సంక్షేమ పథకాలను అమలు చేస్తామని సీఎం వైఎస్ జగన్ ఇచ్చిన హామీని అంతే పారదర్శకంగా అమలు చేస్తున్నారు. నాలుగేళ్లలో సంక్షేమ పథకాల ద్వారా డీబీటీ (ప్రత్యక్ష నగదు బదిలీ) రూపంలో రూ.2.16,786 కోట్లను లబ్ధిదారుల ఖాతాల్లో నేరుగా జమ చేశారు. ఇతరత్రా రూపాల్లో లబ్ధి చేకూర్చిన పథకాలు కూడా కలిపితే (డీబీటీ ప్లస్ నాన్ డీబీటీ) లబ్ధిదారులకు రూ.3.10 లక్షల కోట్ల ప్రయోజనాన్ని చేకూర్చారు. ఇచ్చిన మాట మేరకు 31 లక్షల మంది అక్కచెల్లెమ్మల సొంతింటి కలను సాకారం చేస్తూ వారి పేరిట ఇళ్ల స్థలాల పట్టాలు ఇవ్వడంతోపాటు పక్కా గృహాన్ని మంజూరు చేసి, నిర్మాణానికి చర్యలు చేపట్టారు. దేశ చరిత్రలో ఒకేసారి ఇలా 31 లక్షల మందికి ఇంటి స్థలాలను ఇచ్చి.. వారి పేర్లతోనే రిజిస్ట్రేషన్ చేసి ఇచ్చిన దాఖలు గతమెన్నడూ లేవు.

మహిళా పారిశ్రామికవేత్తలుగా ఎదిగేందుకు ఏడబ్ల్యూఈ చేయూత

- తెలంగాణ సహా ఏపీ, ఒడిశాలలో ఔత్సాహికులకు ఆన్‌లైన్‌లో శిక్షణ
- హైదరాబాద్‌లో ప్రారంభించిన యూఎస్ కాన్సుల్ జనరల్



సాక్షి, హైదరాబాద్: ప్రపంచవ్యాప్తంగా ఔత్సాహిక మహిళా పారిశ్రామికవేత్తలకు తోడ్పాటు అందించేందుకు అమెరికా ప్రభుత్వం అమలు చేస్తున్న వినూత్న కార్యక్రమం 'అకాడమీ ఫర్ విమెన్ ఎంటర్‌ప్రెన్యూర్స్'(ఏడబ్ల్యూఈ) తెలంగాణలో ప్రారంభమైంది. ఈ కార్యక్రమాన్ని హైదరాబాద్‌లోని యూఎస్ కాన్సులేట్ జనరల్ తోపాటు కళింగ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ ఇన్ఫర్మేషన్ టెక్నాలజీ (కేఐఐటీ), టెక్నాలజీ బిజినెస్ ఇంక్యుబేటర్ (టీబీఐ) సంయుక్తంగా నిర్వహించనున్నాయి. తెలంగాణ, ఆంధ్రప్రదేశ్, ఒడిశాలలో ఔత్సాహిక మహిళా పారిశ్రామికవేత్తల కోసం ఆన్‌లైన్ శిక్షణ కార్యక్రమాన్ని నిర్వహించనున్నారు. గురువారం హైదరాబాద్‌లో ఈ కార్యక్రమం ప్రారంభం సందర్భంగా యూఎస్ కాన్సుల్ జనరల్ జెన్నిఫర్ లార్సన్ మాట్లాడుతూ 'భారతదేశ ఆర్థిక వ్యవస్థలో మరింత చురుకైన భాగస్వాములు కావడానికి దోహదపడటం అమెరికా ప్రభుత్వ ప్రధాన ప్రాధాన్యతలలో ఒకటి. ఏడబ్ల్యూఈలో పాల్గొనే వారి జీవితాల్లో గొప్ప మార్పును చూడబోతున్నారు. తెలంగాణ, ఒడిశా, ఆంధ్రప్రదేశ్‌లలో ఏడబ్ల్యూఈ నిర్వహణలో కేఐఐటీ–టీబీఐ, మా స్థానిక భాగస్వాములతో కలసి రాబోయే నెలల్లో పనిచేసేందుకు ఎదురుచూస్తున్నాం' అని ఆమె తెలిపారు.

ఏడబ్ల్యూఈ అంటే...

అకాడమీ ఫర్ ఉమెన్ ఎంటర్ ప్రెన్యూర్స్ మహిళా వ్యాపారవేత్తలకు వారి వ్యాపారాలను ఆధునీకరించుకోవడానికి, అభివృద్ధి చేయడానికి అవసరమైన నైపుణ్యాలను అందించేందుకు రూపొందించిన కార్యక్రమం. దీనిలో ఆన్‌లైన్ లెర్నింగ్ ప్లాట్‌ఫాం ద్వారా స్థానిక వ్యాపార నాయకులు, అమెరికాకు చెందిన నిపుణులతో వ్యూహాత్మక ప్రణాళిక, మార్కెటింగ్, ప్రధాన వ్యాపార నైపుణ్యాలు తదితర అంశాలపై చర్చా కార్యక్రమాలు ఉంటాయి. మొత్తం 13 రకాల ఆన్‌లైన్ వ్యాపార మాడ్యూళ్లను ఉచితంగా ఆన్‌లైన్ విధానంలో నేర్పుతారు. వరంగల్, భువనేశ్వర్, విశాఖపట్నం, తిరుపతిల నుంచి 25 మంది చొప్పున మొత్తం 100 మంది ఔత్సాహిక మహిళా పారిశ్రామికవేత్తలకు ఇందులో అవకాశం కల్పిస్తారు. ఇందుకోసం ఆన్‌లైన్ ద్వారా గురువారం నుంచి దరఖాస్తుల స్వీకరణ ప్రారంభించారు. మరింత సమాచారం కోసం https://awe.kiitincubator.inలో చూడవచ్చు.

'స్థానిక' ఉప ఎన్నికల్లో వైఎస్సార్‌సీపీ హవా..

సాక్షి నెట్‌వర్క్: గ్రామీణ, పట్టణ స్థానిక సంస్థల్లో ఏర్పడిన ఖాళీలకు గురువారం జరిగిన ఉప ఎన్నికలు ప్రశాంతంగా జరిగాయి. గత నెల 31న రాష్ట్ర ఎన్నికల కమిషనర్ నీలం సాహ్ని నోటిఫికేషన్ జారీచేసిన విషయం తెలిసిందే. గురువారం ఉ.11 గంటలకు ఆయా స్థానిక ప్రజాప్రతినిధులతో ప్రత్యేక సమావేశాలు జరిగాయి. ఉమ్మడి పశ్చిమ గోదావరి జిల్లా పరిషత్ చైర్‌పర్సన్‌గా గంటా పద్మశ్రీ ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. జిల్లా పరిషత్ ఏర్పడిన అనంతరం బీసీ మహిళగా పద్మశ్రీ మొట్టమొదటి చైర్‌పర్సన్ కావడం.. మహిళకు జిల్లా పరిషత్ పీఠాన్ని అందించడం పట్ల వైఎస్సార్‌సీపీ శ్రేణులు, ప్రజలు సైతం హర్షం వ్యక్తంచేస్తున్నారు. నర్సీపట్నం మున్సిపల్ చైర్‌పర్సన్‌గా వైఎస్సార్‌సీపీకి చెందిన (ఎస్సీ మహిళకు రిజర్వు) బోడపాటి సుబ్బలక్ష్మి, వైస్ చైర్మన్‌గా కోనేటి రామకృష్ణ.. ఏలూరు జిల్లా నూజివీడు పురపాలక సంఘం మున్సిపల్ వైస్ చైర్మన్‌గా 22వ వార్డు వైఎస్సార్‌సీపీ కౌన్సిలర్ కొమ్ము వెంకటేశ్వరరావు ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. పశ్చిమ గోదావరి జిల్లా పెంటపాడు మండల పరిషత్ ఉపాధ్యక్షురాలిగా వైఎస్సార్‌సీపీ ఎంపీటీసీ ముప్పిడి సరోజని.. విజయనగరం మున్సిపల్ కార్పొరేషన్ డిప్యూటీ మేయర్–1గా ముచ్చు లయయాదవ్ (వైఎస్సార్‌సీపీ) ఎన్నికయ్యారు. గుంటూరు జిల్లా తెనాలి మున్సిపల్ రెండో వైస్ చైర్‌పర్సన్‌గా 40వ వార్డు వైఎస్సార్‌సీపీ కౌన్సిలర్ అత్తోట నాగవేణి.. శ్రీసత్యసాయి జిల్లా ధర్మవరం మున్సిపల్ చైర్‌పర్సన్‌గా చేనేత వర్గానికి చెందిన కాచర్ల లక్ష్మి ఎన్నికయ్యారు. కాగా, పలు చోట్ల కోరం లేక ఎన్నికలు వాయిదా పడ్డాయి.

'పశ్చిమ' జెడ్పీ పీఠంపై గంటా పద్మశ్రీ

నగర వార్తలు

పకడ్బందీగా 'అడ్వాన్స్‌డ్' పరీక్షలు నిర్వహించాలి

సాక్షి, సిటీబ్యూరో: ఇంటర్, ఎస్ఎస్‌సీ అడ్వాన్స్‌డ్ సప్లిమెంటరీ పరీక్షలను ఎటువంటి లోటుపాట్లు లేకుండా సజావుగా నిర్వహించాలని హైదరాబాద్ జిల్లా రెవెన్యూ అధికారి సూర్యలత అధికారులను ఆదేశించారు. గురువారం తన చాంబర్‌లో ఆమె ఇంటర్, ఎస్ఎస్‌సీ అడ్వాన్స్‌డ్ సప్లిమెంటరీ పరీక్షల నిర్వహణ ఏర్పాట్లపై సంబంధిత అధికారులతో వేర్వేరుగా సమీక్షించారు. జిల్లాలో ఇంటర్ పరీక్షలు నిర్వహణకు 136, పదో తరగతి పరీక్షల కోసం 49 పరీక్ష కేంద్రాలను ఏర్పాటు చేశామన్నారు. విద్యార్థులు పరీక్ష కేంద్రానికి ముందుగానే చేరుకునేలా జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. పరీక్ష కేంద్రాల్లోకి సెల్ ఫోన్లు, ఇతర ఎలక్ట్రానిక్ పరికరాలను అనుమతించవద్దని, కేంద్రాల్లో నిరంతర విద్యుత్ సరఫరా ఉండేలా చర్యలు తీసుకోవాలన్నారు. పరీక్ష కేంద్రాల్లో తాగునీటి సరఫరాతో పాటు బందోబస్తు ఏర్పాటు చేయాలని సంబంధిత శాఖల అధికారులను ఆదేశించారు. పరీక్ష కేంద్రాలకు వెళ్లే రూట్లలో పరీక్ష సమయానికి అనుగుణంగా అదనంగా బస్సులు నడపాలని ఆర్టీసీ అధికారులను ఆదేశించారు. పరీక్ష సమయంలో ట్రాఫిక్ ఇబ్బందులు కలుగకుండా జాగ్రత్తలు తీసుకోవాలని ట్రాఫిక్ పోలీసు అధికారులను ఆదేశించారు. వేర్వేరుగా జరిగిన సమావేశాల్లో జిల్లా ఇంటర్మీడియెట్ బోర్డు అధికారి ఒడ్డెన్న, జిల్లా విద్యాశాఖాధికారి రోహిణి తదితరులు పాల్గొన్నారు.

రేపు విద్యార్థి సంఘాల సమావేశం



ఉస్మానియా యూనివర్సిటీ: రాష్ట్రంలోని అన్ని విద్యార్థి సంఘాల అఖిలపక్ష సమావేశాన్ని ఈ నెల 10న సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో నిర్వహించనున్నట్లు తెలంగాణ బీసీ విద్యార్థి సంఘం ప్రధాన కార్యదర్శి వేముల రామకృష్ణ తెలిపారు. గురువారం ఓయూలో వివిధ విద్యార్థి సంఘాలతో సమావేశం ఏర్పాటు చేశారు. అనంతరం రామకృష్ణ మాట్లాడుతూ, 10వ తేదీన నిర్వహించే అఖిల పక్ష సమావేశంలో విద్యార్థుల ఫీజు రీయింబర్స్‌మెంట్, హాస్టల్, విద్యా రంగ సమస్యలపై చర్చించనున్నట్లు తెలిపారు. సమావేశానికి ముఖ్యఅతిథిగా రాజ్యసభ సభ్యులు ఆర్.కృష్ణయ్య ముఖ్యఅతిథిగా హాజరుకానున్నట్లు తెలిపారు. అనంతరం వివిధ విద్యార్థి సంఘాల నేతలు ఆర్ట్స్ కాలేజీ ఎదుట అభివాదం చేశారు.

నిత్యం మురుగు పరుగు

నగరంలో ఉప్పొంగుతున్న డ్రైనేజీ మ్యాన్‌హోళ్లు

- కంపుకొడుతున్న రోడ్లు
- ఫిర్యాదు చేస్తే కానీ పట్టించుకోని జలమండలి సిబ్బంది



ఇదీ నగర నడిబొడ్డులోని మోజంజాహి మార్కెట్ మెట్రో పిల్లర్ నంబర్ 1328. ఇక్కడ రోడ్ మధ్యలో ఉన్న డ్రైనేజీ మ్యాన్‌హోల్ పరిస్థితి అధ్వానంగా తయారైంది. వారం రోజులుగా ఇందులో మురుగు నీరు పొంగి పారుతున్నా పట్టించుకునే నాథుడే కరువయ్యాడు. వాహనదారులు ప్రమాదాలకు గురి కాకుండా మ్యాన్‌హోల్‌పై పోలీసు ఇలా బారికేడ్ ఏర్పాటు చేశారు.

సాక్షి, సిటీబ్యూరో: విశ్వ నగరంగా అభివృద్ధి చెందుతున్న హైదరాబాద్ మహా నగరంలో డ్రైనేజీల నుంచి మురుగు పొంగి పొర్లుతోంది. దుర్వాసన వెదజల్లుతుండటంతో జనం అవస్థలు పడుతున్నారు. సగం వరకు పగిలి, సరిగ్గా మూతల్లేని, చెత్తాతో నిండిన మ్యాన్‌హోళ్ల నుంచి నిత్యం మురుగు నీరు పొంగి రోడ్లపైకి వస్తుండటంతో వాహనదారులు, పాదచారులు ఇబ్బందులు పడుతున్నారు. కాలనీల్లోనే కాదు... నిత్యం రద్దీగా ఉండే ప్రధాన రహదారులపై కూడా ఇదే పరిస్థితి ఉంది. జలమండలి యంత్రాంగం, డ్రైనేజీ పైప్‌లైన్ల, మ్యాన్‌హోల్స్ మరమ్మతులు, నిర్వహణ పేరుతో పనులు కొనసాగిస్తున్నా... మురుగునీరు రోడ్లపై రాకుండా శాశ్వత పరిష్కారం మాత్రం లభించడం లేదు. కొన్ని చోట్ల చిన్న వర్షం పడ్డా డ్రైనేజీ మ్యాన్‌హోళ్లు పొంగి ముగురు నీరు ఇళ్లలోకి వస్తుండగా, కొన్నిచోట్ల తాగునీటి పైప్‌లోకి మురుగు వస్తోంది.

నిత్యం సమస్యలే..

మహానగరంలో మ్యాన్‌హోళ్ల నిర్వహణ జలమండలికి పెద్ద ప్రహసనంగా మారింది. నిత్యం వందల ప్రాంతాల్లో మ్యాన్‌హోళ్లు పొంగడం, లేదంటే వాహనాల బరువుతో మూతలు పగలడం, భూమిలోకి కుంగిపోవడం లాంటి సమస్యలు ఉత్పన్నమవుతూనే ఉన్నాయి. ప్రజల నుంచి అధికారులకు నిత్యం వందల సంఖ్యలో ఫిర్యాదులు వస్తుంటాయి. చిన్న వర్షం పడితే ఫిర్యాదుల సంఖ్య మూడింతలు పెరుగడం సాధారణంగా తయారైంది. ఎక్కడ చూసినా.. ఇవే సమస్యలు. నగరంతోపాటు శివార్లలో సైతం మ్యాన్‌హోళ్ల పరిస్థితి అధ్వానంగా తయారైంది. ప్రతిచోట మ్యాన్‌హోళ్లపై సిబ్బందితో నిఘా పెట్టడం కష్ట సాధ్యమే. ప్రజల నుంచి ఫిర్యాదులు వస్తే కానీ, స్పందించని పరిస్థితి ఉంది.

12 వేల చదరపు కిలో మీటర్ల మురుగు నీటి వ్యవస్థ...

మహానగరంలో సుమారు 12 వేల చదరపు కిలోమీటర్లకు పైగా మురుగు నీటి వ్యవస్థ విస్తరించి ఉంది. వీటిపై సుమారు నాలుగు లక్షల వరకు మ్యాన్‌హోళ్లు ఉన్నాయి. ప్రధాన రోడ్డు మార్గాల్లో లక్ష వరకు మ్యాన్‌హోళ్లు ఉంటాయన్నది అంచనా. వీటిలో సుమారు 20 వేలకు పైగా లోతైనవి ఉంటాయి. నగరంలోని సుమారు 450 ప్రాంతాల్లో నిత్యం డ్రైనేజీ సమస్య ఉత్పన్నమవుతోంది. చిన్న వర్షానికే పొంగిపర్లుతుంటాయి. మరోవైపు వ్యర్థాలు, చెత్తా పేరుకుపోవడంతో మురుగు వెళ్లక మ్యాన్‌హోళ్ల నుంచి పొంగడం సర్వసాధారణంగా తయారైంది.

నిజాం కాలం నుంచే..

నిజాం కాలం నుంచే అండర్ గ్రౌండ్ డ్రైనేజీ వ్యవస్థ కొనసాగుతోంది. అప్పట్లో వరద నీళ్లు పోయేందుకు నాలాలు, నివాసాలు, ఇతర నిర్మాణాల నుంచి వెలువడే మురుగునీటిని తరలించేందుకు అండర్ గ్రౌండ్ డ్రైనేజీ వ్యవస్థను ఏర్పాటు చేశారు. అప్పటి జనాభాకు ఐదు రెట్లు జనం పెరిగినా కూడా సీవరేజ్ పైపులైన్లు పనిచేసేలా పక్కా ప్లానింగ్‌తో నిర్మాణాలు చేపట్టారు. అయితే అప్పటికీ ఇప్పటికీ నగర జనాభా 25 రెట్లు పెరిగినా పాత కాలం నాటి డ్రైనేజీలే ఇప్పటికీ వినియోగంలో ఉన్నాయి. అవి చాలా చోట్ల దెబ్బతినడం, పెరిగిన జనాభాకు అనుగుణంగా సామర్థ్యం లేకపోవడంతో మురుగునీరు రోడ్లపై పారుతోంది. పైప్‌లైన్లను కొన్ని ప్రాంతాల్లో రీస్టోర్ చేసినా.. క్లీనింగ్ యంత్రాలతో మ్యాన్‌హోళ్లను శుభ్రం చేసినా పెద్దగా ఫలితం ఉండటంలేదు.

తాగునీటి పైపుల్లోకి..

కొన్ని ప్రాంతాల్లో డ్రైనేజీ పైపుల పక్కనే తాగునీటి పైపులు ఉండటం ఆందోళన కలిగిస్తోంది. డ్రైనేజీలు దెబ్బతిని లీకవడంతో ఆ నీళ్లు తాగునీటి పైపుల్లోకి చేరుతోంది. పాతబస్తీలో ఈ సమస్య ఎక్కువగా ఉంది. సీవరేజీ నీళ్లు తాగునీటిలో కలువడంతో మంచినీరు కలుషితమవుతోంది. సంబంధిత సిబ్బంది తాత్కాలిక మరమ్మతులతో చేతులు దులిపేసుకుంటున్నారు.



హైలైఫ్ ఎగ్జిబిషన్ పోస్టర్‌ను విడుదల చేస్తున్న నటీమణులు

26 నుంచి హైలైఫ్ ఎగ్జిబిషన్

బంజారాహిల్స్: నగరంలోని హెచ్ఐసీసీ నొవాటెల్ వేదికగా ఈ నెల 26, 27, 28 తేదీల్లో హైలైఫ్ ఎగ్జిబిషన్‌ను నిర్వహించనున్నారు. ఈ ప్రదర్శనకు సంబంధించిన పోస్టర్‌ను గురువారం బంజారాహిల్స్‌లో నటి కుశిత కల్లపు, నటి చరిష్మా రెడ్డి ఆవిష్కరించారు. ఈ సందర్భంగా నిర్వాహకులు మాట్లాడుతూ, దేశంలోనే అతిపెద్ద ఫ్యాషన్ లగ్జరీ ఎగ్జిబిషన్ ఏర్పాటు చేస్తున్నామని, ఈ ప్రదర్శనలో 350 మందికి పైగా అగ్రశ్రేణి డిజైనర్లు తమ ఫ్యాషన్ డిజైన్లు ప్రదర్శిస్తారన్నారు.


10,11 తేదీల్లో 'ఛూ మంతర్ 2023'

సనత్‌నగర్: 'ఛూమంతర్ మ్యాజిక్ ఏషియా 2023'కు నగరం వేదిక కానుంది. కోవిడ్ కారణంగా గత మూడేళ్లుగా నిలిచిపోయిన ఈ కార్యక్రమాన్ని ఈ ఏడాది ఘనంగా నిర్వహించేందుకు ఏర్పాట్లు చేస్తున్నారు. సికింద్రాబాద్ హరిహర కళాభవన్‌లో ఈ నెల 10, 11 తేదీల్లో జరిగే ఛూమంతర్ మ్యాజిక్ ఏషియా–2023 పోస్టర్‌ను బుధవారం కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డి ఆవిష్కరించారు. అనంతరం ఇంటర్నేషనల్ మెజీషియన్స్ కన్వెన్షన్ చైర్మన్ సామల వేణు మాట్లాడుతూ, 1996 నుంచి మెజీషియన్ అకాడమీ ఆధ్వర్యంలో ఛూ మంతర్‌ను నిర్వహిస్తున్నామన్నారు. ఈ ఏడాది జరిగే కన్వెన్షన్‌కు దేశవ్యాప్తంగా 400 నుంచి 500 మంది మెజీషియన్లు హాజరుకానున్నట్లు తెలిపారు. ప్రసంగాలు, డెమో, సెమినార్లు, పోటీలు నిర్వహిస్తామన్నారు.



కార్యక్రమ పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డి

'చలో ఓయూ' పోస్టర్ విడుదల



పోస్టర్‌ను విడుదల చేస్తున్న కాంట్రాక్టు అధ్యాపకులు

కేపీహెచ్‌బీకాలనీ: రాష్ట్రంలోని 12 యూనివర్సిటీల కాంట్రాక్టు అధ్యాపకుల సర్వీసును రెగ్యులరైజ్ చేయాలని కోరుతూ ఉస్మానియా యూనివర్సిటీ ఆర్ట్స్ కాలేజీలో ఈనెల 9వ తేదీన రాష్ట్ర మహాసదస్సు నిర్వహించనున్నారు. 'చలో ఉస్మానియా' పేరిట నిర్వహించే ఈ సదస్సు పోస్టర్‌ను గురువారం జేఎన్‌టీయూహెచ్‌లోని కాంట్రాక్టు అధ్యాపకులు విడుదల చేశారు. జేఎన్‌టీయూహెచ్ కాంట్రాక్టు టీచర్స్ అసోసియేషన్ నాయకులు బి. సురేష్ నాయక్, ఎస్. శివారెడ్డి శివకుమార్, డాక్టర్ ఎ.వంశీ కృష్ణారెడ్డి, శశికాంత్, గఫార్, సిద్ధార్థ్, శంకర్ గౌడ్, మాథ్యూస్, వెంకటేష్ పాల్గొన్నారు.

రేపు మిద్దె పంటపై శిక్షణ

నాంపల్లి: క్రిమిసంహారక మందులు పరిమితికి మించి వాడి పండించిన, పోషక విలువలు లేని పండ్లు, కూరగాయలు తినడం వల్ల ఆరోగ్యం చెడిపోయే అవకాశం ఉంది. దీనిని దృష్టిలో పెట్టుకొని హైదరాబాద్ వంటి నగరాల్లో సేంద్రియ పద్ధతిలో తమ ఇంటి మిద్దెపైనే మంచి పోషక విలువలు కలిగిన కూరగాయలు, పండ్లు పెంచుకొనేందుకు జనం ఆసక్తి చూపుతున్నారు. ఈ నేపథ్యంలో ఉద్యాన శాఖ ఈ నెల 10న ఉద్యాన శిక్షణ సంస్థ రెడ్‌హిల్స్‌లో మిద్దెపై పండ్లు, కూరగాయలు, పూల మొక్కలు, ముత్యాల సాగు, హైడ్రోఫోనిక్స్ అనే అంశంపై శిక్షణ ఇవ్వనుంది. ఉదయం 10 నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు నిర్వహించే ఈ శిక్షణ కార్యక్రమానికి హాజరుకాగోరు వారు ముందుగా పేర్లు నమోదు చేసుకోవాలి. ప్రవేశ రుసుం రూ.100.ఇతర వివరాలకు 7456915691, 7997725499 ఫోన్ నంబర్లలో సంప్రదించవచ్చు.

తాళం పగులగొట్టి ఇంట్లో చోరీ

శంషాబాద్: తాళం పగుల గొట్టి ఇంట్లో చోరీకి పాల్పడిన సంఘటన ఆర్‌జీఐఏ పోలీస్ స్టేషన్ పరిధిలో గురువారం చోటు చేసుకుంది. పోలీసుల కథనం మేరకు వివరాలిలా ఉన్నాయి. మధురానగర్ కాలనీలో ఉంటున్న సురేష్ జోరాదే ఇటీవల ఇంటికి తాళం వేసి ఊరికి వెళ్లాడు. గురువారం సాయంత్రం ఇంటి తలుపులు తెరిచి ఉండటాన్ని గుర్తించిన అతడి బంధువులు పోలీసులకు సమాచారం అందించారు. సంఘటనా స్థలానికి చేరుకుని క్లూస్‌టీం ఆధారాలను సేకరించింది. అల్మారాలో ఉన్న రెండు తులాల బంగారంతో పాటు విలువైన వస్తువులు చోరీకి గురైనట్లు బాధితులు పోలీసులకు ఇచ్చిన ఫిర్యాదులో పేర్కొన్నారు. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు.

ఫ్యాషన్



చీర కొంగుపై గోండు ఆర్ట్

వారసత్వ ప్రతీకలు



పటచిత్ర కళ

భిల్ ఆర్ట్

గోండు ఆర్ట్

మధ్య భారతదేశంలోని గోండు గిరిజనుల సంస్కృతికి ఈ పెయింటింగ్ అద్దం పడుతుంది. కాన్వాస్, క్లాత్‌పైన విరివిగా కనిపించే ఈ కళ ఇప్పుడు ఫ్యాషన్ వేదికలపైనా ఎంతో మందిని ఆకట్టుకుంటోంది.



కలంకారీ

వర్లి ఆర్ట్

గిరిజన కళా శైలి మన సాంస్కృతిక వారసత్వానికి ప్రతీక. ఇది నేటికీ సజీవంగా ఉండటానికి కళాకారులే కాదు ఫ్యాషన్ డిజైనర్లూ తమ నైపుణ్యాలను ప్రదర్శిస్తున్నారు. ఆ అందమైన అలంకరణను డ్రెస్ డిజైన్స్‌లో చూపుతూ జాతీయ, అంతర్జాతీయ వేదికల మీద ప్రదర్శిస్తూ జానపద కళారూపాలను మన కళ్ల ముందు నిలుపుతున్నారు. గిరిజనుల సంస్కృతి ఫ్యాబ్రిక్ మీద మన కళ్లకు కట్టేవాటిలో వర్లి, భిల్, గోండ్, మండన, కలంకారీ, పటచిత్ర.. కళారూపాలు సొగసుగా కనిపిస్తున్నాయి.

● మహారాష్ట్ర, గుజరాత్‌లోని కొన్ని ప్రాంతాలకు చెందిన గిరిజన కళారూపం ఇ. ఈ కళలో కళాకారులు తమ జీవితాన్ని అందంగా వ్యక్తీకరిస్తారు. చతురస్రం, వృత్తం, త్రిభుజంతో సహా ప్రాథమిక రేఖాగణిత ఆకృతులను ఈ కళల చూపుతారు. వెదురు బ్రష్‌తో ముదురు ఎరుపు, తెలుపు రంగులో ఉండే ఈ పెయింటింగ్‌లో నృత్యం, చేపలు పట్టడం, వ్యవసాయం, పండుగల, ఇతర కార్యకలాపాలతో సహా రోజువారి జీవితం వర్లి చిత్ర కళలలో మనకు కనిపిస్తుంది. ● 'పటచిత్ర' ఒరిస్సా ప్రాచీన ఆర్ట్ వర్క్. ప్రధానంగా హిందూ పురాణేతిహాసాలు ఈ కళలో కనిపిస్తాయి. ● మధ్య భారతదేశంలోని గోండు తెగ ఈ కళకు ప్రసిద్ధి చెందింది. కాగితం, కాన్వాస్, క్లాత్ మీద చిత్రించే ఈ పెయింటింగ్స్ కొన్నేళ్ల వరకు వాతావరణ మార్పులను తట్టుకుంటాయి. ● భిల్ ఆర్ట్ అనేది మధ్యప్రదేశ్, రాజస్థాన్, గుజరాత్, మహారాష్ట్రలలో నివసించే భిల్లులు వేసే చిత్ర కళ. భిల్లులు మన దేశంలో రెండవ అతి పెద్ద గిరిజన సమూహం. భిల్ ప్రజలు తమ గ్రామంలోని ఇండ్ల మట్టి గోడలను వారి కళతో అలంకరిస్తారు. ఈ కళ కాటన్ చీరలు, డ్రెస్సుల మీద అందంగా వికసిస్తున్నాయి. ●కలంకారీ అనేది మన దేశంలోని దక్కన్ ప్రాంతంలో పుట్టిన కళ. ఇందులో శ్రీకాళహస్తి శైలి, మచిలీపట్నం శైలి విలక్షణమైనవి. ఈ కళలో దేవాలయాలు, రథాలు, దేవతలు, పురాణేతిహాసాలు, తీగలు, లతలను చిత్రిస్తారు. సహజరంగులను, పెన్నును ఉపయోగిస్తూ చేతితో వేసే ఈ కళ జాతీయ అంతర్జాతీయ వేదికలపైనా హుందాగా నిలిచింది.

నివాళి

ఒక స్ఫూర్తి... ఒక జ్ఞాపకం

'ఆమె చదివే వార్తలు వినండి. ఇంగ్లీష్ ఎలా ప్రొనౌన్స్ చేయాలో తెలుస్తుంది' అని టీచర్లు పిల్లలకు చెప్పేవారు. ఆమె హుందా రూపాన్ని కాలేజీ అమ్మాయిలు, గృహిణులు అనుసరించేవారు. ఆడపిల్లలు చదువుకోవడానికి ఆ రోజుల్లో ఆమె ఒక స్ఫూర్తి. గీతాంజలి అయ్యర్ దూరదర్శన్ కోట్లాది ప్రేక్షకులకు మరువలేని జ్ఞాపకం. జూన్ 7న ఆమె మరణించారు. ఆమె వేసిన తొలి అడుగు నేటి ఎందరో మహిళా జర్నలిస్టుల ముందడుగు.





71 ఏళ్ల గీతాంజలి అయ్యర్ మరణ వార్త ఒకనాటి దూరదర్శన్ ప్రేక్షకులను పాత జ్ఞాపకాలలోకి తీసుకెళ్లింది. 1982 నుంచి దూరదర్శన్ కలర్ ప్రసారాలు మొదలయ్యాక, ఇళ్లల్లో టెలివిజన్ సెట్లు టేబుళ్ల మీదకు చేరుతుండగా జనానికి ఉదయంపూట పేపర్ చదవడం ఎలా అలవాటో, రాత్రిళ్ల దూరదర్శన్ వార్తలు చూడటం అలా అలవాటుగా మారింది. హిందీలో, ఇంగ్లిష్‌లో వార్తలు చూసేవారు కోట్లమంది ఉండేవారు. హిందీలో షమ్మి నారంగ్, జెవి రామన్, సల్మా సుల్తానా తదితర న్యూస్‌రీడర్లు ఖ్యాతి పొందితే ఇంగ్లిష్‌లో గీతాంజలి అయ్యర్, బుగ్గ మీద పులిపిరితో నీతీ రవీంద్రన్, రిని సిమోన్ అభిమానులను సంపాదించుకున్నారు.

ఆధునిక న్యూస్‌రీడర్

ఇంగ్లిష్‌లో అందరు న్యూస్‌రీడర్ల కన్నా ఎక్కువ గుర్తింపు పొందినది గీతాంజలి అయ్యర్. ఇందుకు కారణం ఆమె ఆధునిక హుందా రూపం. జుత్తును కత్తిరించుకుని, చిన్న బొట్టుతో ఆమె అందరినీ ఆకట్టుకుంది. ఆమె ఇంగ్లిష్ ఉచ్చారణ కచ్చితంగా ఉండటంతో స్కూళ్లల్లో ఇంగ్లిష్ టీచర్లు ఆమె ప్రస్తావన చేసేవారు. ఆమె ఎంపిక చేసుకునే చీరలకు కూడా గొప్ప ఫాలోయింగ్ ఉండేది. 'నేను రోడ్డు మీద ఎక్కడ కనిపించినా స్త్రీలు వచ్చి మీరు హెయిర్ కట్ ఎక్కడ చేయించుకుంటారు అని అడిగేవారు. బ్యూటీ సెలూన్లకు వెళ్లి నా పేరు చెప్పి నాలా హెయిర్ కట్ చేయమని కోరేవారు. అలాగే నా బ్లౌజ్ కట్ కూడా వారికి బాగా నచ్చేది. నాలా మంచిగా చదువుకుని, ఇంగ్లిష్ మాట్లాడుతూ, హుందా అయిన కెరీర్ ఏర్పరుచుకోవాలని ఎందరో యువతులు అనుకునేవారు. ఆ మేరకు వారిని నేను ఇన్‌స్పయిర్ చేశాను' అనేది గీతాంజలి అయ్యర్.

రేడియోలో వార్తలు విని

గీతాంజలి అయ్యర్ కోల్‌కతాలో పెరిగింది. ఆరేళ్ల వయసులో ఇంట్లో తండ్రి రేడియోలో వార్తలు వింటుంటే తనూ వినేది. 'ద న్యూస్ రెడ్ బై'... అనే మాట ఆమెను ఆకర్షించింది. ఆ తర్వాత స్కూల్‌లో తరచూ ఇంగ్లిష్ వక్తృత్వ పోటీల్లో పాల్గొనేది. నేషనల్ స్కూల్ ఆఫ్ డ్రామాలో డిప్లమా కోర్సు చేశాక 1976లో దూరదర్శన్‌లో చేరింది. 'నేను వార్తలు చదవడం మొదలుపెట్టే సమయానికి ఏడాది కొడుకున్నాడు. మరో ఐదేళ్లకు కూతురు పుట్టింది. ఆ రోజుల్లో ఉద్యోగం చేయడం ఒక గొప్ప అయితే పెళ్లయి, పిల్లలు పుట్టాక కూడా ఉద్యోగం చేయడం మరో గొప్ప. కాని స్త్రీలు తమ ఆసక్తులను నిలబెట్టుకోవాలి అని భావించి పనిచేశాను' అనేదామె.

ఎన్నో సవాళ్లు

దూర్‌దర్శన్‌లో వార్తలు ప్రసారం అయ్యే రోజుల్లో సాంకేతిక ఈ స్థాయిలో ఉండేది కాదు. 'వార్తలు అప్పటికప్పుడు వచ్చేవి. రిహార్సల్స్ లేకుండానే చదవాల్సి వచ్చేది. ఆఫీసులో చాలా పాత టైప్ రైటర్లు ఉండేవి. వాటిమీద వార్తలు టైప్ చేసి ఇచ్చేవారు. 'కూంబింగ్' బదులు 'బాంబింగ్' అని ఒక్కోసారి తప్పుగా టైప్ అయ్యేది. అప్పటికప్పుడు మాకున్న నాలెడ్జ్‌తో సరి చేసి చదివేవాళ్లం' అని చెప్పిందామె ఒక ఇంటర్వ్యూలో. 'వార్తలను పర్సనల్ టచ్ లేకుండా చదవడం మా ఆచారంగా ఉండేది. కాని ఇవాళ్టి న్యూస్ రీడర్లను చూస్తే వార్తల తరఫున వకాల్తా తీసుకుంటూ కనపడుతున్నారు. మా రోజుల్లో మాకున్న ఫాన్ ఫాలోయింగ్ అసామాన్యంగా ఉండేది. ఎందుకంటే మేమే తొలితరం న్యూస్‌రీడర్లం. స్క్రీన్ మీద కనిపించేవారం. కాని మేము అది నెత్తికి ఎక్కించుకునే వారం కాదు. ఇవాళ్టి న్యూస్ రీడర్లు అవతారమూర్తులుగా భావించడం శోచనీయం. స్క్రీన్ మీద మాత్రమే మీరు న్యూస్‌రీడర్లు. మామూలు జీవితంలో మీరు ఎవరికంటే ఎక్కువ కాదు.. తక్కువ కాదు.. ఆ సంగతి గుర్తించాలి' అని హితవు పలికిందామె.

అడ్వర్‌టైజ్‌మెంట్లలో మోడల్‌గా కూడా కనిపించిన గీతాంజలి అయ్యర్ తాను మరణించే వరకూ కూడా చక్కటి రూప ఆహార్యాలను పాటించింది. ఎలక్ట్రానిక్ మీడియాలో స్త్రీల ప్రవేశానికి గొప్ప పునాది వేసిన గీతాంజలికి నివాళి.

హీహీహీ... హోహ్హోహ్హో హా హా అంతే!



నవ్వు ఆరోగ్యానికి మంచిదని మనందరికి తెలుసు. తీరికలేని లైఫ్‌స్టైల్, బాధ్యతలు, బరువులతో నవ్వడం కూడా మర్చిపోతున్నాం. ఇది చాలదన్నట్లు రెండేళ్లపాటు ప్రపంచాన్ని శాసించిన కరోనా పుణ్యమా... ముఖానికి మాస్కుల తాళం పడింది. శానిటైజర్లు ఆవిరైపోయినట్లే ముఖాల మీద నవ్వులు మాయమయ్యాయి. ఇప్పుడు చాలామందికి చక్కగా నవ్వడం ఎలాగో తెలియడం లేదు. ఈ జాబితాలో జపాన్ వాసులు ముందు వరుసలో ఉన్నారు. గత కొద్దికాలంగా నవ్వడం మర్చిపోయిన జపనీయులు దాదాపు మూడేళ్లపాటు మాస్కులు ధరించిన జపనీయులు నవ్వడం మర్చిపోయారు. ప్రస్తుతం అక్కడి ప్రభుత్వం ఆంక్షలు సడలించడంతో 'స్మైలింగ్ లెసన్స్' నేర్చుకుంటున్నారు. చక్కగా నవ్వేందుకు ఏకాగ్రతతో పాఠాలు వింటున్నారు. ఒక్కో స్మైలింగ్ ట్రైనర్ దగ్గర మూడు వేలమంది క్లాసులకు హాజరవుతున్నారంటే అక్కడి డిమాండ్ ఏంటో తెలుస్తోంది.

"నవ్వు అనేది సహజ సిద్ధంగా జరగాల్సిన ఒక ప్రక్రియ. ఇది చాలా ముఖ్యమైనది. ఎవరినైనా కలిసినప్పుడు మొదట మన నవ్వే పలకరిస్తుంది. మంచి మర్యాదలు మన నవ్వులోనే కనిపిస్తాయి. నవ్వడం మానేస్తే ముఖ కండరాలను ఎలా వాడాలో మెదడు మర్చిపోతుంది అని నిపుణులు చెబుతున్నారు. అందుకే నవ్వడం చాలా ముఖ్యం" అని స్మైలింగ్ ఇన్‌స్ట్రక్టర్ మిహోకి టానో చెబుతున్నారు.



హాలీవుడ్ స్మైల్...

గతంలో రేడియో హోస్ట్‌గా పనిచేసిన కైకో క్వానో స్మైలింగ్ ఇన్‌స్టిట్యూట్‌ను నడుపుతున్నారు. "హాలీవుడ్ స్టైల్ స్మైలింగ్ టెక్నిక్'ను నేర్పించడం ఆమె ప్రత్యేకత. కళ్లను నెలవంకలా తిప్పి, బుగ్గలను గుండ్రంగా పెట్టి పై దవడలోని ఎనిమిది దంతాలు కనిపించేలా నవ్వడమే హాలీవుడ్ స్మైల్. ప్రస్తుతం జపనీస్ విద్యార్థులు ఈ నవ్వుని ఎగబడి నేర్చుకుంటున్నారు. "విద్యార్థులు, నిరుద్యోగులు అధిక సంఖ్యలో మా దగ్గర క్లాసులు చెప్పించుకుంటున్నారు. భవిష్యత్‌లో చేయబోయే ఉద్యోగాలకు నవ్వు ముఖ్యమని వారంతా క్లాసులకు హాజరవుతున్నారు. స్మైల్ ఎడ్యుకేషన్ గతంలోకంటే ఇప్పుడు నాలుగు రెట్లు పెరిగింది. ఒక్కోక్లాసుకు మన రూపాయల్లో సుమారు రూ.4,500 తీసుకుంటున్నాము. నవ్వుతూ ఎవరిని పలకరించినా అప్యాయంగా దగ్గరవుతారు" అని క్వానో చెబుతోంది.

ప్రస్తుతం నవ్వులు ప్రాక్టీస్ చేయడం కోసం కోచింగ్ సెంటర్‌లకు క్యూ కడుతున్నారు. ఇది కాస్త చిత్రంగా, మనకు నవ్వొస్తున్నా సరే... హహ్హ నవ్వుల కోసం వారు తెగ హడావుడి చేస్తున్నారు.

నవ్వు ఆరోగ్యమేగాక, నవ్వడం వల్ల ముఖ కండరాలకు మంచి వ్యాయామం జరిగి ముఖం మరింత గ్లోగా కనిపిస్తుంది. ఒత్తిడి దూరమవుతుంది. ఎక్కడైనా పని లేదా ఉద్యోగం చేయాలన్నా ముఖం మీద చిరునవ్వు తప్పనిసరి. దానితోనే నలుగురితోపాటు ముందుకు సాగగలం. ఇదే విషయాన్ని సీరియస్‌గా తీసుకున్న జపనీయులు శ్రద్ధగా నేర్చుకుని మరీ నవ్వుతున్నారు. అక్కడి స్మైలింగ్ కోచింగ్ సెంటర్లకు డిమాండ్ బాగా పెరిగిపోయింది.

కోవిడ్ ఆంక్షలు, కొన్ని రకాల ఫ్లూల వల్ల

నవ్వితే ముత్యాలేమీ రాలిపోవు, నాలుగు రకాలుగా మంచే జరుగుతుంది కాబట్టి మనం కూడ మన సారా నవ్వుదాం.

బ్యూటిప్స్

● రెండు గుడ్ల సొనను తీసుకుని చక్కగా కలపాలి. ఈ మిశ్రమాన్ని మాడు నుంచి జుట్టు చివర్ల వరకు పట్టించి అరగంట తరువాత చల్లని నీటితో షాంపూ చేసుకోవాలి. వారానికి ఒకసారి ఇలా చేయడం వల్ల గుడ్డులోని ప్రొటీన్ అంది కేశాలకు బలంగా ఒత్తుగా పెరుగుతాయి. ● ఉల్లిపాయ ముక్కలను మెత్తగా గ్రైండ్ చేసి రసాన్ని వేరు చేయాలి. ఈ రసాన్ని తలకు పట్టించి గంట తరువాత షాంపూతో కడిగేయాలి. వారానికి రెండుసార్లు ఇలా చేస్తుండాలి. ఎందుకంటే, ఉల్లిపాయలోని సల్ఫర్ జుట్టు మందంగా పెరిగేలా చేస్తుంది. ఈ రెండింటిలో ఏ మాస్క్ వేసుకున్నా జుట్టు ఒత్తుగా పెరుగుతుంది.

వంటిల్లు

మిక్స్‌డ్ ఫ్రూట్ డిప్




కావలసినవి: తొక్కతీసిన యాపిల్, పైనాపిల్, అరటి పండు, మామిడి పండు, స్ట్రాబెర్రీ ముక్కలు – ఒక్కోటి పావు కప్పు తీసుకోవాలి; దానిమ్మ గింజలు – కప్పు, పెరుగు – రెండు కప్పులు; మిరియాల పొడి – పావు టీస్పూను; జీలకర్ర పొడి – పావు టీస్పూను; కొత్తిమీర తరుగు – అర కప్పు; చక్కెర – టేబుల్ స్పూను; ఉప్పు – రుచికి సరిపడా.

తయారీ: ● పెద్ద గిన్నెలో పెరుగు వేసి క్రీమ్‌లా మారేంతవరకు చక్కగా కలపాలి. ● క్రీమ్ పెరుగులో చక్కెర, మిరియాల పొడి, జీలకర్ర పొడి, చిటికెడు ఉప్పు వేసి కలపాలి. ● ఇప్పుడు అన్నిరకాల పండ్ల ముక్కలు, దానిమ్మ గింజలు వేసి కలపాలి. ఈ గిన్నెను మూతపెట్టి అరగంటపాటు రిఫ్రిజిరేటర్‌లో ఉంచాలి. ● అరగంట తరువాత బయటకు తీసి కొత్తిమీర తరుగు వేస్తే మిక్స్ ఫ్రూట్ డిప్ రెడీ. ● మసాలా కూర, బిర్యానీల్లోకి ఈ డిప్‌లో డ్రైఫ్రూట్స్, బూందీ వేసుకుంటే మరింత రుచిగా ఉంటుంది.

చల్ల పచ్చళ్లు

సీజన్ ఏదైనా..ప్రతి అకేషన్‌లో మసాలా ఫుడ్ కామన్. ఘాటైన మసాల రైస్‌తో రైతా తప్పనిసరి. మసాలా, కారం ఘాటు తగ్గించి కడుపుని చల్లబరిచే రుచికరమైన వెరైటీ రైతాలు మీకోసం...

కూర్గ్ మాంగే పజ్జి



కావలసినవి: మామిడి పండు – ఒకటి; పెరుగు – రెండు కప్పులు; పచ్చికొబ్బరి తురుము – నాలుగు టేబుల్ స్పూన్లు; ఆవాలు – రెండు టీస్పూన్లు; పచ్చిమిర్చి – ఒకటి; చక్కెర – టీస్పూను; వెల్లుల్లి రెబ్బలు – మూడు; ఎండుమిర్చి – ఒకటి, కరివేపాకు – ఒక రెమ్మ; ఉప్పు – రుచికి సరిపడా; నూనె – టేబుల్ స్పూను.

తయారీ: ● మామిడి పండుని తొక్క తీసి సన్నని ముక్కలుగా తరుక్కోవాలి. ● పెద్దగిన్నెలో పెరుగు, చక్కెర వేసి ఉండలు లేకుండా చక్కగా కలపాలి. ● పచ్చి కొబ్బరి తురుము, పచ్చిమిర్చి, టీస్పూను ఆవాలను మిక్సీజార్ లో వేసి కొద్దిగా నీళ్లుపోసి మెత్తగా రుబ్బుకోవాలి. ● ఈ కొబ్బరి పేస్టు, మామిడిపండు ముక్కలు, రుచికి సరిపడా ఉప్పుని పెరుగు మిశ్రమంలో వేసి కలపాలి. ● బాణలిలో నూనె వేసి వేడెక్కిన తరువాత ఆవాలు, ఎండు మిర్చి, కరివేపాకు, వెల్లుల్లి రెబ్బలను దంచి వేసుకోవాలి. ● వెల్లుల్లి బ్రౌన్ రంగులోకి మారాక తాలింపుని పెరుగు మిశ్రమంలో వేసి కలిపితే కూర్గ్ మాంగే పజ్జి రెడీ.

బతువా రైతా



కావలసినవి: బతువా ఆకులు – ఒకటిన్నర కప్పులు; పెరుగు – ఒకటిన్నర కప్పులు; పచ్చిమిర్చి – రెండు (సన్నగా తరగాలి); అల్లం తురుము – అరటీస్పూను; బ్లాక్ సాల్ట్ – అరటీస్పూను; జీలకర్ర పొడి – అరటీస్పూను; మిరియాల పొడి – పావు టీస్పూను; నూనె – అరటీస్పూను.

తయారీ: ● బతువా ఆకులను శుభ్రంగా కడిగి, సన్నగా తరిగి పక్కన పెట్టుకోవాలి. ● స్టవ్‌మీద బాణలి పెట్టి నూనె వేయాలి. కాగిన నూనెలో బతువా ఆకులను వేసి మెత్తబడేంతవరకు మగ్గనివ్వాలి. ● మగ్గిన ఆకులను పేస్టులా గ్రైండ్ చేసి పక్కన పెట్టుకోవాలి. ● పెద్దగిన్నెలో పెరుగు, పచ్చిమిర్చి తరుగు, అల్లం తురుము, మిరియాల పొడి, జీలకర్ర పొడి, బ్లాక్ సాల్ట్ వేసి అన్నీ చక్కగా కలిసేలా కలపాలి. ● ఈ మిశ్రమానికి బతువా పేస్టుని వేసి కలిపితే బతువా రైతా రెడీ.

సొరైతా



కావలసినవి: సొరకాయ తురుము – అరకేజీ; పెరుగు – అరకేజీ; ఉప్పు – టీస్పూను; కారం – టీస్పూను; జీలకర్ర పొడి – అరటీస్పూను; నూనె – టేబుల్ స్పూను, జీలకర్ర – అరటీస్పూను; ఎండు మిర్చి – మూడు, ఉప్పు – రుచికి సరిపడా; కరివేపాకు – నాలుగు రెమ్మలు. **తయారీ:** ● సొరకాయ తురుములో వచ్చే నీళ్లన్నీ ఇగిరి పోయేంత వరకు మీడియం మంట మీద ఉడికించి పక్కన పెట్టుకోవాలి. ● పెరుగుని క్రీమ్‌లా మారే వరకు కలుపుకోవాలి. క్రీమ్‌పెరుగులో ఉడికిన సొరకాయ తురుము, కారం, జీలకర్ర పొడి, రుచికి సరిపడా ఉప్పు వేసి కలపాలి. ● బాణలిలో నూనె వేసి స్టవ్ మీద పెట్టాలి. నూనె వేడెక్కిన తరువాత జీలకర్ర, ఎండు మిర్చి, కరివేపాకు వేసి వేయించి పెరుగు మిశ్రమంలో వేస్తే సొరైతా రెడీ.

యువర్స్

● ఆర్ట్ అండ్ కల్చర్

స్వరాల సందడి


● అభిలాష సిన్హా

'నా దగ్గర ఉన్న ముఖ్యమైన మ్యూజికల్ ఇన్‌స్ట్రుమెంట్ నా గొంతు' అంటుంది దిల్లీకి చెందిన సింగర్–సాంగ్ రైటర్ అభిలాష సిన్హా. చిన్నప్పటి నుంచి ఇంట్లో గజల్స్, పాత హిందీ పాటలు వింటూ పెరిగింది. అమ్మ హార్మోని వాయిస్తూ పాడేది.

మూడు సంవత్సరాల వయసులోనే తల్లి పాటకు గొంతు కలిపేది అభిలాష.

'మన దేశంలోని ఎన్నో మధ్యతరగతి కుటుంబాలలో మ్యూజిక్ అనేది హాబీకి మాత్రమే పరిమితం. కెరీర్‌కు దూరం. హాబీని కెరీర్‌గా తీసుకోవడాన్ని రిస్క్‌గా భావిస్తారు. మొదట్లో నా తల్లిదండ్రులు కూడా అలాగే అనుకున్నప్పటికీ ఆతరువాత మాత్రం నేను మ్యూజిక్‌ను కెరీర్‌గా ఎంచుకోవడానికి అభ్యంతర పెట్టలేదు' అంటుంది అభిలాష.

మెలోడీస్ అంటే ఇష్టపడే అభిలాష రచనలో సింప్లిసిటీని ఇష్టపడుతుంది.

పదమూడు సంవత్సరాల వయసులో పాట కోసం కలం పట్టింది.

ఒక ఫ్రెండ్ ద్వారా ఉకులెలె ఇన్‌స్ట్రుమెంట్ ప్లే చేయడం నేర్చుకుంది.

ఒక పాటకు సంబంధించిన ఊహ మనసులోకి రాగానే పదిహేను నిమిషాల్లో దానికి ఒక రూపం ఇచ్చే దాకా అభిలాష మనసు స్థిమిత పడదు. అయితే కొన్ని సందర్భాల్లో మాత్రం ఒక పాటకు రెండు నుంచి మూడు నెలల సమయం తీసుకుంటుంది.

కాలేజీ రోజుల్లో ఎన్నో మ్యూజిక్ బ్యాండ్స్‌తో కలిసి పనిచేసింది.

అభిలాష కుటుంబానికి లాంగ్ జర్నీ అంటే ఇష్టం. ఆ సుదీర్ఘ ప్రయాణంలో ఎన్నెన్ని పాటలు వినేవారో!

డెబ్యూ సింగిల్ 'మదర్స్'తో మంచి పేరు తెచ్చుకుంది అభిలాష. లాక్‌డౌన్ టైమ్‌లో వచ్చిన 'హానిబీ' హల్‌చల్ చేసింది.

న్యూయార్క్‌లో 'మ్యూజిక్ బిజినెస్'లో మాస్టర్స్ డిగ్రీ చేసిన అభిలాషకు ప్రపంచవ్యాప్తంగా ప్రాచుర్యం పొందిన సంగీత ధోరణులపై అవగాహన ఉంది.

ఎన్నెన్నో దేశాలు తిరిగినా అభిలాషకు అన్ని భాషలు నచ్చుతాయి. అయితే బాగా నచ్చే భాష మాత్రం సంగీతం!

● సక్సెస్ స్టోరీ

శ్రీమంతుడి చిరునామా


● రాహుల్ రాయ్

కొందరు అదృష్టాన్ని మాత్రమే నమ్ముకుంటారు. కొందరు అదృష్టాన్ని కూడా నమ్ముకుంటారు. కొందరు అదృష్టం వైపు చూడకుండా కష్టాన్ని నమ్ముకుంటారు. అదృష్టవంతులు అవుతారు. ఎందుకంటే అదృష్టానికి కష్టపడే వాళ్లు అంటేనే ఇష్టం. కష్టాన్నే నమ్ముకొని అదృష్టవంతుడైన రాహుల్ రాయ్ చిన్న వయసులోనే మిలియనీర్ అయ్యాడు...

ఐఐటీ–బాంబేలో చదువు పూర్తికాకుండానే వార్టన్ స్కూల్(యూఎస్)లో చేరాడు రాహుల్ రాయ్. ఎకనామిక్స్‌లో పట్టా పుచ్చుకున్న తరువాత మోర్గాన్ స్టాన్లీ కంపెనీలో ఎనలిస్ట్‌గా చేరాడు. 2020లో ఇండియాకు వచ్చిన రాహుల్ సొంతంగా కంపెనీ మొదలుపెట్టాడు.

'క్రిప్టో'పై అవగాహన ఊపందుకున్న కాలం అది. క్రిప్టో కరెన్సీ అనేది 'టాక్ ఆఫ్ ది టౌన్' అవుతున్న కాలం అది.

బిట్‌కాయిన్, యూఎస్‌డీ కాయిన్, డాగీ కాయిన్, బినాన్స్ కాయిన్, సోలానా, ఇథేరియమ్, టెథర్, ఎక్స్‌ఆర్‌పీ, పొల్కడాట్...ఇలా ఎన్నో రకాల క్రిప్టో కరెన్సీలు వాటి మార్కెట్ విలువ గురించి ఆసక్తి మొదలైన కాలం.

'డిసెంట్రలైజ్డ్ ఫైనాన్స్' అనే కాన్సెప్ట్ నచ్చిన రాహుల్ 'క్రిప్టో'పై ఆసక్తి ఉన్న మిత్రులతో కలిసి రిసెర్చ్ మొదలుపెట్టాడు.

ఒక్కటా రెండా!

ట్రెడిషనల్ ఫైనాన్స్ వరల్డ్ నుంచి క్రిప్టో వరల్డ్ వరకు సమస్త విషయాలపై అవగాహన పెంచుకున్నాడు.

ఆ తరువాత ఈష్ అగర్వాల్, సనత్‌రావులతో కలిసి రాహుల్ 'గామా పాయింట్ క్యాపిటల్' మొదలుపెట్టాడు.

క్రిప్టో కరెన్సీ, ట్రెడిషనల్ ఫైనాన్స్ సర్వీసెస్, ట్రేడింగ్, రిస్క్ మేనేజ్‌మెంట్, వెంచర్ క్యాపిటల్, టెక్నాలజీ డెవలప్‌మెంట్‌లో తమ అనుభవాన్ని ఉపయోగించుకొని 'గామా పాయింట్'కు బలాన్ని ఇచ్చారు.

తక్కువ సమయంలోనే గామా పాయింట్ క్యాపిటల్ ఇన్వెస్టర్లకు ట్రస్టెడ్ ఛాయిస్ అయింది.

మియామి(యూఎస్)కి చెందిన క్రిప్టో ఎసెట్ ఇన్వెస్ట్‌మెంట్ ఫర్మ్ 'బ్లాక్ టవర్ క్యాపిటల్' 2021లో 'గామా పాయింట్ క్యాపిటల్'ను కొనుగోలు చేసింది.

'ఇది కఠినమైన నిర్ణయం. కాని సరియైన నిర్ణయం. మేము ఇప్పుడు ఉన్న స్థితికి చేరుకోవడానికి ఎంతో కాలం పట్టింది' అంటాడు రాహుల్.

25 సంవత్సరాల రాహుల్ ప్రస్తుతం బ్లాక్ టవర్ క్యాపిటల్ మార్కెట్ న్యూట్రల్ కో–హెడ్‌గా ఉన్నాడు.

ఇండియన్ వెబ్3 స్టార్టప్‌లలో ఇన్వెస్ట్ చేయడంతో పాటు ప్రాథమిక దశలో ఉన్న వెబ్3 స్టార్టప్‌లకు సలహాలు, సూచనలు ఇస్తుంటాడు రాహుల్.

సమర్థవంతమైన టీమ్ ఉంటే అద్భుతాలు సృష్టించడం అసాధ్యం కాదు అంటాడు రాహుల్.

ఐఐటీ–ముంబైలో చదువు కొనసాగించి, తన ప్రయాణం వేరే దిశలో సాగితే ఎలా ఉండేదో తెలియదుగానీ ఆర్థికశాస్త్రంతో చెలిమి అతడికి తిరుగులేని విజయాన్ని అందించింది.

'నన్ను నేను అదృష్టవంతుడిగా భావిస్తాను. ఈ వయసులో మిలియనీర్ అవుతానని ఎప్పుడూ అనుకోలేదు' అంటాడు రాహుల్ రాయ్.

అతడి చిరునామా...కొత్త ఆలోచనలు, కష్టపడే స్వభావం, అంకిత భావం! కష్టపడే వాళ్లను అదృష్టం ఇష్టపడుతుందనే మాట రాహుల్ రాయ్ విజయాన్ని చూస్తే 'నిజమే!' అని మరోసారి అనిపిస్తుంది.

● టెక్.. టాక్

ఇన్ఫీనిక్స్ నోట్ 30



డిస్‌ప్లే: 6.78 అంగుళాలు ; ఫ్రంట్ కెమెరా: 16 ఎంపీ ; రిజల్యూషన్: 1080X2460 పిక్సెల్స్ వోఎస్: ఆండ్రాయిడ్ 13 ; మెమోరీ: 128జీబి 8జీబి ర్యామ్ 256జీబి 8జీబి ర్యామ్ ; బ్యాటరీ: 5000 ఎంఏహెచ్ ● గ్లాస్ స్క్రీన్ ప్రొటెక్టర్

అమెజ్‌ఫిట్ పాప్ 3ఎస్



డిస్‌ప్లే: 1.96 అంగుళాలు రిజల్యూషన్: 410X502 పిక్సెల్స్ మోడల్ ఫ్రేమ్: గ్లాసీ మెటాలిక్ స్ట్రాప్: 304 స్టెయిన్‌లెస్ బ్యాటరీ లైఫ్: 12 రోజులు ఫీచర్స్: 24 హెచ్ హార్ట్‌రేట్, ఎస్పీవో2 అండ్ స్ట్రెస్ మానిటరింగ్, స్లీప్ ట్రాకింగ్

షావోమి ప్యాడ్ 6



డిస్‌ప్లే: 11 అంగుళాలు రిఫ్రెష్‌రేట్: 120 హెచ్‌జడ్ రిజల్యూషన్: 2880X1800 పిక్సెల్స్ వోఎస్: ఆండ్రాయిడ్ 13 ● 8ఎంపీ ఫ్రంట్ కెమెరా ఇంటర్నల్ స్టోరేజ్: 8జీబి ర్యామ్ 128జీబి బ్యాటరీ: 8,840 ఎంఏహెచ్ ● 4 స్పీకర్స్ ● 4 మైక్రోఫోన్స్ ● 33 డబ్ల్యూ ఫాస్ట్ ఛార్జింగ్ సపోర్ట్

వాట్సాప్‌లో ఫ్యాన్సీ ఫాంట్స్

వాట్సాప్‌లో బ్లూ కలర్, ఫ్యాన్సీ ఫాంట్‌లలో మెసేజ్ పంపడానికి... 1. ప్లేస్టోర్‌లోకి వెళ్లి స్టైలిష్ టెక్స్–ఫాంట్స్ కీబోర్డ్' యాప్‌ను డౌన్‌లోడ్ చేసుకోవాలి. 2. స్క్రీన్ బాటమ్ రైట్ కార్నర్‌లోని యారోపై ట్యాప్ చేయాలి. 3. అగ్రీ బటన్ ట్యాప్ చేసి బాటమ్ రైట్ కార్నర్‌లోని కీబోర్డ్ సెక్షన్‌లోకి వెళ్లాలి.

● గేమింగ్

అందరూ జాగ్రత్తగా వినండీ...



ఇటీవల విడుదలైన యాక్షన్ రోల్–ప్లేయింగ్ వీడియో గేమ్ డియాబ్లో–4. డియాబ్లో సిరీస్‌లోని 4వ ఇన్‌స్టాల్‌మెంట్ ఇది. ఓపెన్ వరల్డ్, ప్లేయర్ వర్సెస్ ప్లేయర్ (పీవీపీ)లాంటి కొత్త ఫీచర్స్ ఉన్నాయి. బర్బేరియన్, డ్రూవెడ్స్, నెక్రోమాన్సర్, రోగ్, సోసెర్....ఈ అయిదు ప్లేబుల్ క్లాసెస్ నుంచి ప్లేయర్ తమ క్యారెక్టర్‌ను క్రియేట్ చేసుకోవాల్సి ఉంటుంది. 'డియాబ్లో–3'లో చోటు చేసుకున్న సంఘటనల తరువాత 50 సంవత్సరాలకు జరిగే గేమ్ ఇది. 'యూజర్స్‌కు మధ్యయుగాల కాలానికి చెందిన నగరంలో ఉన్న అనుభూతిని కలిగించేలా ప్రయత్నించాం' అంటున్నాడు గేమ్ డైరెక్టర్ లూయిస్ బరిగ.
ప్లాట్‌ఫామ్: ప్లేస్టేషన్ 5, ఎక్స్‌బాక్స్ సిరీస్ ఎక్స్/ఎస్, ప్లేస్టేషన్ 4, ఎక్స్‌బాక్స్ వన్, మైక్రోసాఫ్ట్ విండోస్.
జానర్స్: హ్యాక్ అండ్ స్లాష్, అడ్వెంచర్ గేమ్, ఫైటింగ్ గేమ్.

● ఇంగ్లిష్ ఇడియమ్స్



ఏ స్టోన్స్ త్రో: దగ్గరలో ఉంది, అతి సమీపంలో ఉంది...అని చెప్పే సందర్భంలో ఉపయోగించే మాట. ఉదా: లక్కీలీ ది వెడ్డింగ్ ఈజ్ జస్ట్ ఏ స్టోన్స్ త్రో ఫ్రమ్ అవర్ హోటల్

బైట్–ది బుల్లెట్: కష్టమైన పని, నచ్చని పని అయినప్పటికీ చేయక తప్పని పరిస్థితులలో వాడతారు.

బాగ్–స్టాండర్డ్: సాధారణంగా ఉంది, ఎలాంటి ప్రత్యేకత లేదు... అని చెప్పే సందర్భంలో ఉపయోగిస్తారు.

కాల్ ఇట్ ఏ డే: ఒక పని ఆపివేయడం గురించి చెప్పే సందర్భంలో వాడుతారు. ఉదా: ఇట్స్ ఆల్‌మోస్ట్ 9 పీఎం. ఐ థింక్ వుయ్ మడ్ కాల్ ఇట్ ఏ డే అండ్ ఫినిష్ ది రిపోర్ట్ టుమారో.


సినిమా

రెండు హృదయాలు.. ఒక ప్రేమ


● లావణ్యా త్రిపాఠి, వరుణ్ తేజ్

హీరో వరుణ్ తేజ్, హీరోయిన్ లావణ్యా త్రిపాఠి కొంతకాలంగా ప్రేమలో ఉన్నారనే వార్తలు వస్తున్న సంగతి తెలిసిందే. ఈ వార్తలు నిజమే. త్వరలో వరుణ్ తేజ్, లావణ్యా త్రిపాఠి ఏడడుగులు వేసి, మూడు ముళ్ళ బంధంతో వైవాహిక జీవితాన్ని ప్రారంభించనున్నారు. నేడు (శుక్రవారం) వరుణ్, లావణ్యల నిశ్చితార్థం జరగడానికి ఏర్పాట్లు పూర్తయ్యాయి. 'రెండు హృదయాలు.. ఒక ప్రేమ' అంటూ నిశ్చితార్థ వేడుకకు సంబంధించిన ఓ నోట్ వైరల్‌గా మారింది. కుటుంబ సభ్యుల సమక్షంలో మాత్రమే ఈ వేడుక జరగనున్నట్లు సమాచారం. ఇక 2017లో వచ్చిన 'మిస్టర్'లో వరుణ్ తేజ్, లావణ్య తొలిసారి స్క్రీన్ షేర్ చేసుకున్నారు. ఆ తర్వాతి సంవత్సరం 'అంతరిక్షం: 9000కేఎమ్‌పీహెచ్' సినిమాలో జంటగా నటించారు. ఈ సినిమా టైమ్‌లోనే వీరి స్నేహం ప్రేమగా మారినట్లు తెలుస్తోంది.

సాఫ్ట్‌గా ఉండకు.. ఆడుకుంటారు


● నాగశౌర్య

'కుర్రాళ్ళంటే ఈ వయసులో ఇలాగే ఉంటార్రా. నువ్వేం కంగారు పడకు' అనే డైలాగ్‌తో మొదలైంది 'రంగబలి' టీజర్. నాగశౌర్య, యుక్తి తరేజ జంటగా పవన్ బాసంశెట్టి దర్శకత్వం వహిస్తున్న చిత్రం 'రంగబలి'. సుధాకర్ చెరుకూరి నిర్మిస్తున్న ఈ సినిమా జూలై 7న విడుదల కానుంది. ఈ సందర్భంగా ఈ సినిమా టీజర్‌ను విడుదల చేశారు. 'అయ్య బాబోయ్.... రేపట్నుంచి చూత్తారుగా.. మా డెడికేషన్ చూస్తే మీకు జ్వరం వచ్చేస్తది (నాగశౌర్య)', అయినా.. నువ్వేం అంత సాఫ్ట్‌గా ఉండకు.... ఆడుకుంటారు (యుక్తి తరేజ)' అనే డైలాగ్స్ టీజర్‌లో ఉన్నాయి. ఈ చిత్రంలో బీ ఫార్మసీ చదివిన యువకుడి పాత్రలో నాగశౌర్య, డాక్టర్ పాత్రలోయుక్తి తరేజ నటించినట్లుగా తెలుస్తోంది. ఈ సినిమా షూటింగ్ చివరి దశకు చేరుకుంది. సత్య, సప్తగిరి, షైన్ టామ్ చాకో కీలక పాత్రలు పోషిస్తున్న ఈ సినిమాకు సంగీతం: పవన్ సీహెచ్.

కలయా.. నిజమా..


● అరుణ్, కటూరి వెంకటేశ్వర్లు, సుడిగాలి సుధీర్

సుడిగాలి సుధీర్ హీరోగా రూపొందుతున్న సస్పెన్స్ థ్రిల్లర్ 'కాలింగ్ సహస్ర'. ఈ చిత్రంలో డాలిశ్య హీరోయిన్. అరుణ్ విక్కిరాలా దర్శకత్వంలో విజేష్ తయాల్, పమిడి చిరంజీవి, కటూరి వెంకటేశ్వర్లు ఈ సినిమాను నిర్మిస్తున్నారు. ఈ చిత్రంలోని 'కలయా నిజమా..' పాట లిరికల్ వీడియోను విడుదల చేశారు. మోహిత్ రెహమానిక్ స్వరపరచిన ఈ పాటకు లక్ష్మీ ప్రియాంక సాహిత్యం అందించగా, కేఎస్ చిత్ర పాడారు. హైదరాబాద్‌లో జరిగిన ఈ సాంగ్ లాంచ్ కార్యక్రమంలో సుడిగాలి సుధీర్ మాట్లాడుతూ– ''మూడేళ్ల కష్టం ఈ సినిమా. ఇప్పటివరకు నేను చేసిన సినిమాలకు భిన్నంగా డిఫరెంట్ జానర్‌లో రూపొందిన సినిమా ఇది'' అన్నారు. ''చిత్రగారు పాడిన తర్వాత ఈ పాటకు మరింత అందం వచ్చింది. ఈ పాట టైమ్‌లో ఆమెకు ఆరోగ్యం సరిగ్గా లేకపోయినా నాలుగు గంటలు ప్రాక్టీస్ చేసి, మరీ పాడారు'' అన్నారు మోహిత్ రెహమానిక్. ''నిర్మాతలుగా మాకు 'కాలింగ్ సహస్ర' తొలి అడుగు. మాకు ఇదొక స్వీట్ మెమొరీ'' అన్నారు వెంకటేశ్వర్లు. ''సినిమా ఎంగేజింగ్‌గా ఉంటుంది'' అన్నారు శివ బాలాజీ. డాలిశ్య, లక్ష్మీ ప్రియాంక, సినిమాటోగ్రాఫర్ సన్నీ, యూ ట్యూబర్ రవితేజ తదితరులు పాల్గొన్నారు.

బిజీ బిజీ


● అనుపమ

తెలుగులో ప్రస్తుతం రవితేజ 'ఈగిల్', సిద్ధు జొన్నలగడ్డ 'డీజే టిల్లు స్క్వేర్' చిత్రాల్లో హీరోయిన్‌గా నటిస్తున్నారు అనుపమా పరమేశ్వరన్. ఈ బ్యూటీ తాజాగా మరో సినిమాకు గ్రీన్‌సిగ్నల్ ఇచ్చారు. 'సినిమా బండి' ఫేమ్ దర్శకుడు ప్రవీణ్ ఈ సినిమాను తెరకెక్కించనున్నారు. ఈ విషయాన్ని సోషల్ మీడియా వేదికగా ప్రవీణ్ వెల్లడించి, ఓ ఫోటోను షేర్ చేశారు. విజయ్ డొంకాడ ఈ సినిమాను నిర్మిస్తారు. అతి త్వరలో ఈ సినిమా షూటింగ్ ప్రారంభం కానుంది. ఇది లేడీ ఓరియంటెడ్ ఫిల్మ్ అని, ట్రావెల్ బ్యాక్‌డ్రాప్‌లో ఈ సినిమా కథనం ఉంటుందని భోగట్టా. అలాగే తమిళంలో 'సైరన్', మలయాళంలో 'జేఎస్‌కే: ట్రూత్ షల్ ఆల్వేస్ ప్రివైల్' సినిమాలు చేస్తున్నారు అనుపమ. ఇలా వరుస చిత్రాలతో ఈ ఏడాది అనుపమ బిజీ బిజీ అన్నమాట.

ఈవీవీ సినిమాలు గుర్తుకు వస్తున్నాయి

- దర్శకుడు ఎ. కోదండరామిరెడ్డి


● రజిత్ రావు, సప్తగిరి, కోదండ రామిరెడ్డి, డైమండ్ రత్నబాబు, వీజే సన్నీ

''ఒకే సినిమాలో ఇంతమంది నటీనటులను చూస్తుంటే ఈవీవీగారి సినిమాలు గుర్తుకు వస్తున్నాయి. 'అన్‌స్టాపబుల్' చిత్రం పెద్ద విజయం సాధించాలి'' అన్నారు దర్శకుడు ఎ. కోదండ రామి రెడ్డి. వీజే సన్నీ, సప్తగిరి హీరోలుగా, నక్షత్ర, ఆక్సాఖాన్ హీరోయిన్లుగా నటించిన చిత్రం 'అన్‌స్టాపబుల్'. డైమండ్ రత్నబాబు దర్శకత్వంలో రజిత్ రావు నిర్మించిన ఈ చిత్రం నేడు (శుక్రవారం) విడుదలవుతోంది. ఈ సందర్భంగా జరిగిన ఈ సినిమా ప్రీ రిలీజ్ ఈవెంట్‌లో దర్శకుడు ఎ. కోదండరామి రెడ్డి అతిథిగా పాల్గొన్నారు. సప్తగిరి మాట్లాడుతూ– ''ఈ సినిమాతో సన్నీ, డైమండ్ రత్నబాబులకు విజయం రావాలి'' అన్నారు. ''కుటుంబం అంతా కలిసి చూడదగ్గ వినోదాత్మక చిత్రం ఇది. డైమండ్ రత్నబాబు మంచి హిలేరియస్ కథ రాశారు'' అన్నారు సన్నీ. ''మా సినిమా పోస్టర్ చూసిన వారు ఈవీవీగారి సినిమాలాంటి అనుభూతి కలుగుతుందని చెప్పడం సంతోషంగా ఉంది. ఈ సినిమా ఫస్ట్ షో ఎక్కడ ప్రదర్శించబడితే అక్కడ ఓ సీట్‌ను ఈవీవీగారి కోసం ఉంచుతాం. ఇది ఆయనకు మేం ఇచ్చే ఓ చిరు కానుక'' అన్నారు డైమండ్ రత్నబాబు. ''క్వాలిటీ కామెడీ ఉన్న ఈ ఫిల్మ్ ఆడియన్స్‌ను అలరిస్తుంది'' అన్నారు రజిత్ రావు.

ఆ మాటలే నాకు దీవెనలు

- ఆర్. నారాయణమూర్తి



"సమాజంలో బోలెడన్ని సమస్యలు ఉన్నాయి. ఆ సమస్యలను చర్చించడానికి ఎన్నో వేదికలు ఉన్నాయి. ఒక సినిమా కళాకారుడిగా వెండితెర వేదికగా ఆ సమస్యలు చూపిస్తున్నాను" అని అన్నారు దర్శక-నిర్మాత-నటుడు ఆర్. నారాయణమూర్తి. ఆయన స్వీయ దర్శకత్వంలో రూపొందించి, నటించిన చిత్రం 'యూనివర్సిటీ'. ఈ సినిమా రెండు తెలుగు రాష్ట్రాల్లో నేడు విడుదలవుతోంది. ఈ సందర్భంగా ఆర్. నారాయణ మూర్తి 'సాక్షి'తో చెప్పిన విశేషాలు ఈ విధంగా...

సమాజంలో ఉన్న సమస్యలతోనే 40 ఏళ్లుగా సినిమాలు తీస్తున్నారు... రెగ్యులర్ కమర్షియల్ చిత్రాలు తీస్తే సేఫ్ కదా?

సేఫ్టీ గురించి ఎప్పుడూ ఆలోచించలేదు. నా వంతుగా సమాజానికి ఎంతో కొంత ఉపయోగపడే సినిమా ఇవ్వాలన్నదే నా ఆశయం. అనాదిగా మంచి కోసం, సమసమాజం కోసం ఎందరో మహనీయులు వారివారి వేదికల్లో కృషి చేస్తూనే ఉన్నారు. అదే కోవలో నేను సినిమా వేదికగా ఒక ప్రధాన పాత్ర పోషిస్తున్నాను. ఒక సమస్య ఉత్పన్నం అయినప్పుడు జర్నలిస్టు తన కలంతో, వాగ్గేయకారుడు పాటతో, రచయిత తన రచనలతో పరిష్కారం కోసం పోరాడతారు. అలాగే ఒక సినిమా సాంస్కృతిక సైనికుడిగా 40 ఏళ్లుగా సామాజిక సమస్యలే ఇతివృత్తంగా సినిమాలు తీస్తున్నాను. ఇందులోనే నాకు సంతృప్తి, ఆనందం దక్కుతున్నాయి. శ్రీశ్రీ చెప్పినట్లు నేను సైతం ప్రపంచానికి సమిధనొక్కటి ఆహుతిచ్చాను అనేలా సామాజిక అంశాలపైన సినిమాలు తీస్తున్నాను తప్ప నేనేదో సమాజాన్ని ఉద్ధరించడం కోసం తీస్తున్నానని అనుకోవడంలేదు. గూడవల్లి రామబ్రహ్మం వంటి మహనీయులు సామాజిక అంశాలతో సినిమాలను రూపొందించి లెజెండ్స్‌గా నిలిచారు. వారి అడుగుజాడల్లో నడుస్తున్న చిన్నపిల్లవాడిని నేను.

'యూనివర్సిటీ' సినిమా గురించి?

విద్య, నిరుద్యోగం ప్రధానాంశాలుగా ఈ చిత్రాన్ని రూపొందించాను. ప్రైవేటు విద్య వద్దు, పబ్లిక్ విద్యే ముద్దు అనే అంశంతో తీశాను. ప్రస్తుతం ప్రైవేటు విద్యా వ్యవస్థ వల్ల చదువు వ్యాపారంగా మారిపోయింది. ఈ వ్యవస్థలో ఫస్ట్ ర్యాంకులు సాధించాలని పేపర్ లీకేజీలు, మాల్ ప్రాక్టీస్‌లు పెరిగిపోయాయి. దీనివల్ల బాగా చదివిన విద్యార్థులు వెనకబడిపోతున్నారు. ఇవి భరించలేక ఆ విద్యార్థులు ఆత్మహత్యలు చేసుకుంటున్నారు. అంతేకాకుండా క్యాంపస్ వేదికల్లోని ప్రొఫెసర్లు కూడా కులాలకు, మతాలకు ప్రాధాన్యత నిస్తూ వ్యవస్థను నిర్వీర్యం చేస్తున్నారు. ఇలాంటి అసమానతలు పోవాలంటే కొఠారీ కమిషన్ పేర్కొన్నట్లు ప్రభుత్వ విద్యకు ప్రత్యేక బడ్జెట్ కేటాయించాలి, ప్రైవేటు సంస్థల్లోని వసతులు ఇక్కడ కూడా అందేలా చూడాలి. ఈ అంశాలు ప్రతిబింబించేలా ఈ సినిమా తీశాను.

విద్య గురించి మాత్రమేనా? ఇతర విషయాలేమైనా ఈ సినిమాలో చెప్పారా?

ఉద్యోగాల గురించి కూడా చర్చించాను. అతి పెద్ద గ్లోబల్ విలేజ్ అయినటువంటి భారత్ నుంచి ఎందరో విద్యార్థులు ఉద్యోగాల కోసం విదేశాలకు వెళుతున్నారు. కానీ అక్కడ కూడా నిరుద్యోగం పెరిగిపోయి మనవారికి ఉద్యోగాలు ఇవ్వలేకపోతున్నారు. బడుగు బలహీన వర్గాలకు రిజర్వేషన్ రాజ్యాంగ హక్కు. ప్రస్తుత పరిస్థితుల్లో ప్రజలు అవన్నీ కోల్పోతున్నారు. అందుకే 1986లో మురళీధర్ రావు కమిషన్, 1990లో మండల్ కమిషన్ తెలిపిన రిపోర్టు ప్రకారం ప్రైవేటు సెక్టార్‌లో కూడా రిజర్వేషన్‌లు అమలు చేయాల్సిన అవసరముంది. మనది నిరుద్యోగ భారతం కాదు... ఉద్యోగ భారతం కావాలని చెప్పే చిత్రం ఇది.

తెలుగు భాషకు ప్రాధాన్యం ఇచ్చే మీరు ఈ చిత్రంలో రెండు ఇంగ్లిష్ పాటలు పెట్టారు?

'ఎవిరీ బడీ సే నో టు ప్రైవేట్ స్కూల్స్.. ఎవిరీ బడీ సే యస్ టు పబ్లిక్ స్కూల్స్.. ఎవిరీ బడీ వాంట్స్ కామన్ ఎడ్యుకేషన్' అనే మహోన్నత ఆశయంతో వేల్పుల నారాయణగారు గొప్ప పాట రాశారు. ఈ పాటను సాయిచరణ్ అంతే గొప్పగా పాడారు. ఇంకో ఇంగ్లిష్ పాటను జలదంకి సుధాకర్ రాయగా, సాయిచరణ్ పాడారు. ఈ రెండు ఇంగ్లిష్ పాటలతో పాటు 'తాత. తాత..' అని గద్దరన్న రాసి, పాడిన పాట, ఇతర పాటలు కూడా సందర్భానుసారం సాగుతాయి.

ప్రజా సమస్యలతో సినిమాలు తీస్తున్న మీ గురించి ప్రజలు నాలుగు మంచి మాటలు మాట్లాడినప్పుడు కలిగే అనుభూతి..

నారాయణమూర్తి మన సమస్యలు తీస్తున్నాడు.. మన కథలను చూపిస్తున్నాడు.. ఒక కళాకారుడుగా మన గుండెల్లోని బాధను సినిమాలో చూపించాడు... పరిష్కారం మార్గం చూపిస్తున్నాడు. అతను మన మనిషి. ప్రజా కళాకారుడు అని ప్రజలు అంటున్న ఆ మాటలను పెద్ద దీవెనలుగా భావిస్తున్నాను. ఏ కథాంశం అయినా ఆకట్టుకుంటేనే అభిమానులు చూస్తారు. 'అర్ధరాత్రి స్వతంత్రం' నుంచి ఇప్పటివరకు సామాజిక సమస్యలే ప్రధానాంశాలుగా సినిమాలు తీస్తున్నాను. ప్రజలు దీవిస్తే అదే నా సంపాదన. నా సినిమాలు వంద రోజులు, జూబ్లీ వేడుకలు చేసుకున్నాయి. సక్సెస్ అయినా ఫెయిల్ అయినా సినిమాలు తీస్తూనే ఉంటాను.

సాక్షి బిజినెస్
శుక్రవారం
9-6-2023

స్టాక్ మార్కెట్లు

దేశీ సూచీలు		
సెన్సెక్స్ ▽	294	62,849
నిఫ్టీ ▽	92	18,635

మరిన్ని బిజినెస్ వార్తల కోసం 'సాక్షి ఫ్లస్' చూడండి

విదేశీ సూచీలు (పొరిపెండు రాత్రి 11.30 గంటలకు)


సూచీ	విలువ		మార్పు
నాస్‌డాక్	13,176	▲	72
డోజోన్స్	33,790	▲	125
ఎఫ్‌టీఎస్‌ఈ 100	7,600	▽	25
డాక్స్	15,990	▲	29
షాంఘై	3,214	▲	16
నికాయ్	31,641	▽	272

అమెరికా • బ్రిటన్ • జర్మనీ • చైనా • జపాన్

బులియన్ (రూ.లలో) — ముంబై

బంగారం (99.9 స్వచ్ఛత)	59,587	▽	509
బంగారం (99.5 స్వచ్ఛత)	59,348	▽	404
వెండి (కిలో)	71,999	▲	175

మళ్లీ వృద్ధికే పెద్దపీట



- 6.5 శాతం వద్దే రెపో రేటు
- వరుసగా రెండోసారి యథాతథం
- ద్రవ్యోల్బణ అంచనాల కుదింపు
- 6.5 శాతంగానే జీడీపీ అంచనాలు

ముంబై: ధరల స్పీడ్ కట్టడి సంకేతాలతో రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా (ఆర్‌బీఐ) ద్రవ్య పరపతి విధాన కమిటీ (ఎంపీసీ) వరుసగా రెండోసారి రెపో రేటును 6.5 శాతం (బ్యాంకులకు తానిచ్చే రుణాలపై ఆర్‌బీఐ వసూలు చేసే వడ్డీరేటు) వద్ద యథాతథంగా కొనసాగించింది. మూడు రోజుల పాటు ప్రస్తుత ఆర్థిక సంవత్సర రెండవ ద్వైమాసిక ద్రవ్య పరపతి విధాన సమావేశాలు నిర్వహించిన గవర్నర్ శక్తికాంతదాస్ నేతృత్వంలోని ఆరుగురు సభ్యుల కమిటీ నిర్ణయాలు గురువారం వెలువడ్డాయి. కొన్ని కీలక నిర్ణయాలు చూస్తే..

యథాతథ వృద్ధి రేటు అంచనా

ఆర్థిక సంవత్సరం స్థూల దేశీయోత్పత్తి (జీడీపీ) వృద్ధి అంచనాలను యథాతథంగా 6.5 శాతం వద్ద కొనసాగించింది. ఏప్రిల్–జూన్, జూలై–సెప్టెంబర్, అక్టోబర్–డిసెంబర్, జనవరి–మార్చి త్రైమాసికాల్లో వరుసగా వృద్ధి రేట్లు 8%, 6.5%, 3.6%, 5.7 శాతంగా కొనసాగుతాయని అంచనావేసింది.

మెజారిటీ 'కఠినం' వైపే...

'సరళతర పరపతి ఉపసంహరణ' విధానం కొనసాగింపునకే ఆరుగురు సభ్యుల్లో ఐదుగురు ఓటు వేశారు. ద్రవ్యోల్బణంపై ఇంకా ఆందోళనకరమైన పరిస్థితి తొలగిపోలేదని తద్వారా ఆర్‌బీఐ ఎంపీసీ సంకేతాలు ఇచ్చింది. ఒక్కరు మాత్రమే మళ్లీ రేటు తగ్గించవచ్చన్న అభిప్రాయాన్ని వెలిబుచ్చారు. ఉక్రెయిన్‌పై రష్యా దాడి, అంతర్జాతీయంగా క్రూడ్ ధరల పెరుగుదల, ద్రవ్యోల్బణం తీవ్రత నేపథ్యంలో దీర్ఘకాలం 4 శాతంగా ఉన్న రెపో రేటు ఫిబ్రవరిలో వరుసగా ఆరోసారి పెంపుతో 6.5 శాతానికి ఎగబాకింది. గత ఏప్రిల్‌లో జరిగిన తొలి పాలసీ సమీక్షలో అంచనాలకు భిన్నంగా 6.5 శాతం యథాతథం రేటును కొనసాగించింది.

ద్రవ్యోల్బణం కట్టడిపైనే దృష్టి...

2023–24 ఆర్థిక సంవత్సరంలో ద్రవ్యోల్బణం క్రితం అంచనాలను తగ్గించింది. క్రితం 5.2 శాతం అంచనాలను స్వల్పంగా 5.1 శాతానికి కుదించింది. ఆర్‌బీఐకి కేంద్రం నిర్దేశిస్తున్న 6 శాతంకన్నా (ప్లస్ 2 లేదా మైనస్ 2తో 4 శాతం ఉండాలి) ఇది 90 బేసిస్ పాయింట్లు తక్కువ కావడం గమనార్హం. ద్రవ్యోల్బణం కట్టడిపైనే తన దృష్టి ఉంటుందని ఆర్‌బీఐ గవర్నర్ శక్తికాంత దాస్ ఉద్ఘాటించారు. దీనిని ఆయన 'అర్జున గురి'గా అభివర్ణించారు.

మరికొన్ని ముఖ్యాంశాలు..

- సహకార బ్యాంకులు త్వరలో మొండిబకాయిలకు (ఎన్‌పీఏ) సంబంధించి రాజీ సెటిల్‌మెంట్‌లు, రైటాఫ్‌లు చేయగలిగేలా మార్గదర్శకాలు వెలువడనున్నాయి. ఈ తరహా నిర్ణయాలను ఇప్పటి వరకూ షెడ్యూల్డ్ వాణిజ్య బ్యాంకులు, కొన్ని ఎంపిక చేసిన ఎన్‌బీఎఫ్‌సీలు మాత్రమే తీసుకునే వెసులుబాటు ఉంది.
- డిజిటల్ రుణాలకు సంబంధించి డిఫాల్ట్ లాస్ గ్యారెంటీ (డీఎల్‌జీ)పై మార్గదర్శకాలు జారీ. క్రెడిట్ డెలివరీ వ్యవస్థ క్రమాభివృద్ధి లక్ష్యంగా ఈ మార్గదర్శకాలు వెలువడ్డాయి.
- నాన్–బ్యాంక్ ప్రీపెయిడ్ పేమెంట్ ఇన్‌స్ట్రుమెంట్ (పీపీఐ) ద్వారా వ్యక్తుల కోసం నిర్దిష్ట ప్రీపెయిడ్ ఈ–రూపీ ఓచర్లను జారీ అవకాశాన్ని ఆర్‌బీఐ కల్పించింది. ఈ–రూపీ అనేది ప్రాథమికంగా డిజిటల్ వోచర్. ఇది ఒక లబ్ధిదారుడు తన ఫోన్‌లో ఎస్ఎంఎస్ లేదా క్యూఆర్ కోడ్ రూపంలో పొందుతాడు. ఇది ప్రీ–పెయిడ్ వోచర్. ఈ ప్రీపెయిడ్ వోచర్‌ను అంగీకరించే ఏ కేంద్రానికైనా వెళ్లి లబ్ధిదారుడు సంబంధిత రిడీమ్ చేసుకోవచ్చు. తాజాగా నాన్–బ్యాంక్ ప్రీపెయిడ్ పేమెంట్ ఇన్‌స్ట్రుమెంట్ (పీపీఐ) జారీ చేసేవారికి ఈ–రూపీ వోచర్‌లను జారీ చేయడానికి ఆర్‌బీఐ అనుమతించింది.

1,000 రాదు... 5,00 పోదు..

గతేడాది మే నుంచి వ్యవస్థలో ఉన్న రూ.2,000 నోట్ల ఉపసంహరణ ప్రకటన అనంతరం ఇప్పటి వరకూ దాదాపు సగం పెద్ద నోట్లు వెనక్కు వచ్చాయని ఆర్‌బీఐ గవర్నర్ తెలిపారు. 2023 మార్చి 31వ తేదీ నాటికి రూ.2,000 నోట్లు వ్యవస్థలో రూ.3.62 లక్షల కోట్లు చెలామణీలో ఉన్నాయి. ఇందులో ఇప్పటికి రూ.1.80 లక్షల కోట్లు వెనక్కు వచ్చేశాయి. వీటిలో 85 శాతం డిపాజిట్ల ద్వారానే వెనక్కు వచ్చాయన్నారు. రూ.500 నోట్లు వెనక్కు తీసుకోవాలన్న యోచన లేదని, అలాగే కొత్తగా రూ.1,000 నోట్లు తీసుకుని రాబోమని గవర్నర్ స్పష్టం చేశారు.

రూపే ప్రీపెయిడ్ ఫారెక్స్ కార్డులు..

రూపే ప్రీపెయిడ్ ఫారెక్స్ కార్డులను జారీ చేయడానికి బ్యాంకులకు ఆర్‌బీఐ అనుమతి ఇచ్చింది. విదేశాలకు వెళ్లే భారతీయులకు చెల్లింపుల వెసులుబాటు విస్తరణకు ఈ నిర్ణయం దోహదపడుతుంది. రూపే డెబిట్, క్రెడిట్, ప్రీపెయిడ్ కార్డ్‌లు భారత్‌సహా విదేశీ వినియోగానికి ఇక బ్యాంకులు జారీ చేయవచ్చు.

సమతౌల్యత పాటించింది..



మార్కెట్ అంచనాలకు అనుగుణంగానే పాలసీ సమీక్ష ఉంది. అటు వృద్ధికి–ఇటు ద్రవ్యోల్బణం కట్టడికి ప్రాధాన్యత ఇస్తూ ద్రవ్య పరపతి విధాన నిర్ణయాలు ఉన్నాయి. ద్రవ్యోల్బణం అంచనాలు తగ్గించడం ఎకానమీకి శుభ సంకేతం.

– దినేష్ ఖారా, ఎస్‌బీఐ చైర్మన్

రియల్టీకి సానుకూలం



పాలసీ నిర్ణయాలు హౌసింగ్ విక్రయాల్లో సుస్థిర పురోగతి కొనసాగడానికి దోహదపడతాయి. రానున్న పాలసీలో రెపో రేటు కోత జరిగితే అది రియల్టీ పురోగతికి కొత్త ఉత్సాహాన్ని అందిస్తుంది. రెపో రేటు కోత నిర్ణయం జరుగుతుందని విశ్వసిస్తున్నాము.

–బొమన్ ఇరానీ, క్రెడాయ్ ప్రెసిడెంట్

రేటు తగ్గాలి...



పరిశ్రమ అంచనాలకు అనుగుణంగానే పాలసీ నిర్ణయాలు ఉన్నాయి. ఇది వినియోగ సెంటిమెంట్‌ను బలపరుస్తుంది. అయితే రేటు తగ్గింపు నిర్ణయాలు జరగాలి. ప్రీపెయిడ్ రూపే ఫారెక్స్ కార్డుల జారీకి అనుమతి మరో ప్రోత్సాహకరమైన అంశం.

– దీపక్ సూద్, అసోచామ్ సెక్రటరీ జనరల్

పాలసీ ప్రకటన తర్వాత లాభాల స్వీకరణ

- రియల్టీ, ఆటో, బ్యాంకింగ్ షేర్లలో అమ్మకాలు
- 63 వేల దిగువకు సెన్సెక్స్
- నిఫ్టీకి 92 పాయింట్ల నష్టం



ముంబై: ఆర్‌బీఐ ద్రవ్యపరపతి విధాన వైఖరి వెల్లడి తర్వాత స్టాక్ మార్కెట్లో లాభాల స్వీకరణ చోటు చేసుకుంది. కీలక వడ్డీరేట్లను యథాతథంగా కొనసాగిస్తున్నట్లు ప్రకటించినప్పటికీ ద్రవ్యోల్బణ కట్టడికి కఠిన ద్రవ్య విధాన అమలుకు వెనుకాడబోమంటూ కేంద్ర రిజర్వ్ బ్యాంక్ సంకేతాలివ్వడంతో పలు రంగాల షేర్లు అమ్మకాల ఒత్తిడికి లోనయ్యాయి. ఫలితంగా గురువారం సెన్సెక్స్ 294 పాయింట్లు నష్టపోయి 63 వేల దిగువన 62,849 వద్ద స్థిరపడింది. నిఫ్టీ 92 పాయింట్లు క్షీణించి 18,635 వద్ద నిలిచింది. దీంతో సూచీల నాలుగు రోజుల వరుస ర్యాలీకి ముగింపు పడినట్టైంది. బ్యాంకింగ్, ఆటో, రియల్టీ, ఐటీ షేర్లు నష్టాలను చవిచూశాయి. బీఎస్ఈ మిడ్, స్మాల్ క్యాప్ ఇండెక్సులు ఒకశాతం, అరశాతం చొప్పున పతనమయ్యాయి. అమెరికాలో టెక్ కంపెనీల షేర్ల భారీ పతనంతో అంతర్జాతీయ ఈక్విటీ మార్కెట్లు బలహీనంగా ట్రేడవుతున్నాయి.

- రియల్టీ రంగానికి చెందిన బ్రిగేడ్ ఎంటర్‌ప్రైజెస్, మైక్రోటెక్ డెవలపర్స్ షేర్లు 3%, డీఎల్ఎఫ్, శోభా, ఒబెరాయ్ రియల్టీ షేర్లు 2%, గోద్రేజ్ ప్రాపర్టీస్, ఇండియాబుల్స్ రియల్ ఎస్టేట్, ఫోనిక్స్ మిల్స్ 1% చొప్పున నష్టపోయాయి.
- ఆటో రంగ కమ్మిన్స్ ఇండియా, మహీంద్రా, ఐషర్ మోటార్స్, టీవీఎస్ మోటార్స్ షేర్లు 2% క్షీణించాయి. టాటా మోటార్స్, భాష్, మారుతీ, ఎంఆర్ఎఫ్ షేర్లు 1–0.5% పతనమయ్యాయి.
- బ్యాంకింగ్ రంగానికి చెందిన కోటక్ మహీంద్రా బ్యాంక్ షేరు అత్యధికంగా మూడు శాతం నష్టపోయింది. బంధన్ బ్యాంక్ 2%, యాక్సిస్ బ్యాంక్ 1.5% పతనమయ్యాయి.

సర్వో కొత్త ఇంజిన్ ఆయిల్



చెన్నై: సర్వో బ్రాండ్ మరో కొత్త ఇంజిన్ ఆయిల్‌తో మార్కెట్లో వచ్చింది. మోటార్ సైకిళ్లలో వినియోగించే పూర్తి సింథటిక్ 4టీ ఇంజిన్ ఆయిల్‌ను సర్వో హైపర్‌స్పోర్ట్స్ ఎఫ్5 పేరుతో తీసుకొచ్చింది. ఈ ఉత్పత్తిని ప్రముఖ బాలీవుడ్ నటుడు జాన్ అబ్రహం విడుదల చేశారు. అలాగే సర్వో గ్రీజ్ మిరాకిల్ పేరుతో ప్రీమియం గ్రీజ్ ఉత్పత్తిని కూడా ఆవిష్కరించారు. రైడింగ్ పట్ల ఆసక్తి కలిగిన ఒక బైకర్‌గా ఈ కొత్త రకం ఆయిల్‌ను విడుదల చేస్తున్నందుకు సంతోషంగా ఉందని అబ్రహం తెలిపారు. న్యూఢిల్లీలో జరిగిన ఈ కార్యక్రమంలో ఆయిల్‌ఇండియా చైర్మన్ శ్రీకాంత్ మాధవ్ వైద్య, మార్కెటింగ్ డైరెక్టర్ వి సతీష్ కుమార్, ఆర్అండ్‌డీ డైరెక్టర్ ఎస్ఎస్‌వీ రామకుమార్, ఇతర బోర్డు సభ్యులు, సీనియర్ అధికారులు పాల్గొన్నారు.

తాన్లా చేతికి వేల్యూఫస్ట్

డీల్ విలువ రూ. 346 కోట్లు

tanla
ValueFirst

హైదరాబాద్, బిజినెస్ బ్యూరో: దేశీ 'సీపాస్' సేవల దిగ్గజం తాన్లా ప్లాట్‌ఫామ్స్ తాజాగా వేల్యూఫస్ట్ డిజిటల్ మీడియాను కొనుగోలు చేసేందుకు అమెరికన్ సంస్థ ట్విలియోతో ఒప్పందం కుదుర్చుకుంది. ఈ డీల్ విలువ 42 మిలియన్ డాలర్లు (సుమారు రూ. 346 కోట్లు). ఈ ఏడాది జూలైలో డీల్ పూర్తి కాగలదని అంచనా. దేశీ సీపాస్ (కమ్యూనికేషన్స్ ప్లాట్‌ఫామ్ యాజ్ ఎ సర్వీస్) కంపెనీల్లో ఒకటైన వేల్యూఫస్ట్ 1,000 పైచిలుకు సంస్థలకు సర్వీసులు అందిస్తోంది. మరోవైపు, వేల్యూఫస్ట్ మిడిల్ ఈస్ట్ ఎఫ్‌జెడ్‌సీని రూ. 20 కోట్లకు కొనుగోలు చేసేందుకు ఇంకో ఒప్పందాన్ని కూడా తాన్లా కుదుర్చుకుంది. రెండింటికీ దాదాపు రూ. 950 కోట్ల ఆదాయం ఉంటుందని, వేల్యూఫస్ట్ వ్యవస్థాపకుడు విశ్వదీప్ వీటికి సారథ్యం వహిస్తారని తెలిపింది. ప్రధానంగా అర్థవంతమైన కొనుగోళ్లపై తాము దృష్టి పెడుతున్నామని, కేరిక్స్ తరహాలోనే వేల్యూఫస్ట్ కొనుగోలు కూడా ప్రయోజనకరంగా ఉండగలదని తాన్లా వ్యవస్థాపక చైర్మన్ ఉదయ్ రెడ్డి ధీమా వ్యక్తం చేశారు. వేల్యూఫస్ట్‌ను దక్కించుకోవడంతో దేశీ సీపాస్, ఎస్ఎంఎస్, వాట్సాప్ తదిర విభాగాల్లో స్థానాన్ని మరింత పటిష్టం చేసుకోగలమని ఆయన చెప్పారు. అటు సౌదీ, ఇండోనేసియా మార్కెట్లలోనూ మరింతగా విస్తరించేందుకు ఇది దోహదపడగలదని ఉదయ్‌రెడ్డి వివరించారు.

సాక్షి స్పోర్ట్స్

హారిక గేమ్ 'డ్రా'... వైదొలిగిన హంపి



సెయింట్ లూయిస్ (అమెరికా): కెయిర్న్స్ కప్ మహిళల అంతర్జాతీయ చెస్ టోర్నీలో భారత గ్రాండ్‌మాస్టర్ ద్రోణవల్లి హారిక రెండో 'డ్రా' నమోదు చేసింది. అనా జటోన్‌స్కీ (అమెరికా)తో జరిగిన ఐదో రౌండ్ గేమ్‌ను హారిక 51 ఎత్తుల్లో 'డ్రా'గా ముగించింది. ఐదో రౌండ్ తర్వాత హారిక రెండు పాయింట్లతో ఐదో ర్యాంక్‌లో ఉంది. భారత్‌కే చెందిన మరో గ్రాండ్‌మాస్టర్, 2020 చాంపియన్ కోనేరు హంపి అనారోగ్య కారణాలరీత్యా ఈ టోర్నీ మధ్యలో నుంచి వైదొలిగింది. దాంతో నిర్వాహకులు హంపి ఈ టోర్నీలో ఆడిన నాలుగు రౌండ్ల గేమ్‌ల ఫలితాలను రద్దు చేశారు. షెడ్యూల్ ప్రకారం హంపితో తదుపరి రౌండ్లలో తలపడాల్సిన క్రీడాకారిణులకు ఆ రోజు విశ్రాంతి లభిస్తుంది. హంపి వైదొలగడంతో ప్రస్తుతం ఈ టోర్నీ తొమ్మిది మంది క్రీడాకారిణుల మధ్య జరుగుతుంది. ఐదో రౌండ్ తర్వాత అమెరికా క్రీడాకారిణి అనా జటోన్‌స్కీ 3.5 పాయింట్లతో అగ్రస్థానంలో ఉంది.

సెమీస్‌లో భారత్

చివరి లీగ్ మ్యాచ్‌లో చైనీస్ తైపీపై 11–0తో విజయం



దీపిక సొరెంగ్

కాకామిగహారా (జపాన్): మహిళల జూనియర్ ఆసియా కప్ హాకీ టోర్నీలో భారత జట్టు సెమీఫైనల్లోకి దూసుకెళ్లింది. చైనీస్ తైపీ జట్టుతో గురువారం జరిగిన పూల్ 'ఎ' చివరి లీగ్ మ్యాచ్‌లో భారత్ 11–0తో గెలిచింది. భారత్ తరఫున సునెలితా టొప్పో (43వ, 57వ ని.లో), అన్ను (10వ, 52వ ని.లో) రెండేసి గోల్స్ అందించగా... వైష్ణవి విఠల్ ఫాల్కే (1వ ని.లో), దీపిక (3వ ని.లో), రుతుజా (12వ ని.లో), నీలం (19వ ని.లో), మంజు చోర్సియా (33వ ని.లో), దీపిక సొరెంగ్ (46వ ని.లో), ముంతాజ్ ఖాన్ (55వ ని.లో) ఒక్కో గోల్ చేశారు. దీపిక సొరెంగ్‌కు 'ప్లేయర్ ఆఫ్ ద మ్యాచ్' అవార్డు లభించింది. పూల్ 'ఎ'లో మూడు విజయాలు, ఒక 'డ్రా'తో భారత్, దక్షిణ కొరియా 10 పాయింట్లతో సమ ఉజ్జీగా నిలువగా... మెరుగైన గోల్స్ అంతరం కారణంగా భారత్ 'టాపర్'గా నిలిచింది.

ప్రొ లీగ్ 'టాప్'లోకి భారత్



ఎయిండ్‌హోవెన్ (నెదర్లాండ్స్): అంతర్జాతీయ హాకీ సమాఖ్య (ఎఫ్ఐహెచ్) పురుషుల ప్రొ లీగ్‌లో భారత జట్టు మళ్లీ 'టాప్' ర్యాంక్‌లోకి వచ్చింది. బుధవారం రాత్రి నెదర్లాండ్స్ జట్టు చేతిలో 1–4 గోల్స్ తేడాతో ఓడిపోయిన భారత్... గురువారం జరిగిన మ్యాచ్‌లో 3–0 గోల్స్ తేడాతో అర్జెంటీనా జట్టును ఓడించింది. భారత్ తరఫున కెప్టెన్ హర్మన్‌ప్రీత్ సింగ్ (33వ ని.లో), అమిత్ రోహిదాస్ (39వ ని.లో), అభిషేక్ (59వ ని.లో) ఒక్కో గోల్ చేశారు. మొత్తం తొమ్మిది జట్లు పాల్గొంటున్న ప్రొ లీగ్‌లో ఇప్పటి వరకు భారత్ 14 మ్యాచ్‌లు పూర్తి చేసుకొని 27 పాయింట్లతో అగ్రస్థానంలో ఉంది. బ్రిటన్ 26 పాయింట్లతో రెండో స్థానంలో ఉంది.

భారత్ ఎదురీత!

15, 13, 14, 14... ప్రపంచ టెస్టు చాంపియన్‌షిప్ ఫైనల్లో భారత టాప్–4 బ్యాటర్ల స్కోర్లు ఇవి! కొండంత స్కోరు ఎదురుగా కనిపిస్తుండగా మన ప్రధాన బ్యాటర్లంతా చేతులెత్తేయడంతో రెండో రోజు కూడా ఆస్ట్రేలియాదే పైచేయి అయింది. మన బౌలర్ల ఆట కాస్త మెరుగుపడటంతో ప్రత్యర్థిని తొందరగానే ఆలౌట్ చేయగలిగిన టీమిండియా ఆనందం కొద్ది సేపటికే ఆవిరైంది. కంగారూ బౌలర్లు ఒకరితో మరొకరు పోటీ పడి కట్టుదిట్టమైన బంతులతో భారత బ్యాటర్లను కట్టి పడేశారు. జడేజా, రహానే కీలక భాగస్వామ్యంతో ఆదుకోకపోయుంటే పరిస్థితి ఇంకా ఘోరంగా ఉండేది. సగం బ్యాటర్లు ఇప్పటికే పెవిలియన్ చేరగా, మరో 318 పరుగులు వెనుకబడి ఉన్న భారత్ తొలి ఇన్నింగ్స్‌లో ఎంత వరకు పోరాడుతుందనే దానిపైనే టెస్టు ఫలితం ఆధారపడి ఉంది.



పుజారా బౌల్డ్

- తొలి ఇన్నింగ్స్‌లో 151/5
- మరో 318 పరుగులు వెనుకబడిన టీమిండియా
- ఆస్ట్రేలియా 469 ఆలౌట్
- స్టీవ్ స్మిత్ సెంచరీ



స్మిత్

లండన్: వరల్డ్ టెస్టు చాంపియన్‌షిప్ (డబ్ల్యూటీసీ) ఫైనల్లో భారత్ ఎదురీదుతోంది. మ్యాచ్ రెండో రోజు గురువారం ఆట ముగిసే సమయానికి భారత్ తమ తొలి ఇన్నింగ్స్‌లో 5 వికెట్ల నష్టానికి 151 పరుగులు చేసింది. రవీంద్ర జడేజా (51 బంతుల్లో 48; 7 ఫోర్లు, 1 సిక్స్) రాణించగా... ప్రస్తుతం అజింక్య రహానే (71 బంతుల్లో 29 బ్యాటింగ్; 4 ఫోర్లు), భరత్ (5 బ్యాటింగ్) క్రీజ్‌లో ఉన్నారు. ఐదుగురు ఆసీస్ బౌలర్లు తలా ఒక వికెట్ పడగొట్టారు. అంతకుముందు ఓవర్‌నైట్ స్కోరు 327/3తో ఆట కొనసాగించిన ఆస్ట్రేలియా 469 పరుగులకు ఆలౌటైంది. హెడ్ (174 బంతుల్లో 163; 25 ఫోర్లు, 1 సిక్స్), స్టీవ్ స్మిత్ (268 బంతుల్లో 121; 19 ఫోర్లు) నాలుగో వికెట్‌కు 285 పరుగులు జోడించారు.

బౌలర్ల జోరు...

రెండో రోజును ఆస్ట్రేలియా ధాటిగా ఆరంభించింది. సిరాజ్ వేసిన తొలి ఓవర్లో వరుసగా రెండు ఫోర్లు కొట్టిన స్మిత్ 229 బంతుల్లో కెరీర్‌లో 31వ సెంచరీ పూర్తి చేసుకోగా, హెడ్ కూడా కొద్ది సేపటికే 150 పరుగుల మార్క్‌ను అందుకున్నాడు. తమ జోరు కొనసాగించిన హెడ్, స్మిత్ మొదటి 6 ఓవర్లలోనే 34 పరుగులు జోడించారు. దాంతో స్కోరు 361/3కి చేరింది. ఈ స్థితిలో భారత బౌలర్లు ఆసీస్‌ను నిలవరించగలిగారు. హెడ్‌ను అవుట్ చేసి భారీ భాగస్వామ్యాన్ని సిరాజ్ విడదీయగా, గ్రీన్ (6) విఫలమయ్యాడు. అప్పటి వరకు ఆత్మవిశ్వాసంతో ఆడిన స్మిత్ కూడా శార్దుల్ బౌలింగ్‌లో దూరంగా వెళుతున్న బంతిని స్టంప్స్‌పైకి ఆడుకున్నాడు. చివరి వరుస బ్యాటర్లు చేతులెత్తేసినా... అలెక్స్ క్యారీ (69 బంతుల్లో 48; 7 ఫోర్లు, 1 సిక్స్) దూకుడైన బ్యాటింగ్ కారణంగా ఆసీస్ మెరుగైన స్కోరుతో ముగించగలిగింది. ఆస్ట్రేలియా 108 పరుగుల వ్యవధిలో చివరి 7 వికెట్లు కోల్పోగా... సిరాజ్ టెస్టుల్లో 50 వికెట్లు పూర్తి చేసుకున్నాడు. రెండో రోజు 36.3 ఓవర్లు ఆడిన ఆసీస్ 142 పరుగులు సాధించింది.

టపటపా...

భారత జట్టుకు ఓపెనర్ల నుంచి ఆశించిన ఆరంభం లభించలేదు. ఒకేస్కోరు వద్ద రోహిత్ (15), గిల్ (13) అవుట్ కావడంతో భారత్ కష్టాల్లో పడింది. కమిన్స్ అద్భుత బంతితో రోహిత్‌ను వికెట్ల ముందు దొరకబుచ్చుకోగా, బోలండ్ వేసిన బంతిని ఆడకుండా వదిలేసి గిల్ వెనుదిరిగాడు. ఆదుకుంటారనుకున్న పుజారా (14), కోహ్లి (14) కూడా విఫలమయ్యారు. పుజారా కూడా బంతిని వదిలేసి బౌల్డ్ కాగా, స్టార్క్ బౌన్సర్‌కు కోహ్లి స్లిప్‌లో క్యాచ్ ఇచ్చాడు. ఈ దశలో జడేజా, రహానే కలిసి జట్టును ఆదుకున్నారు. రహానే క్రీజ్‌లో నిలదొక్కునేందుకు పట్టుదల కనబర్చగా, జడేజా దూకుడుతో పరుగులు వేగంగా వచ్చాయి. 17 పరుగుల వద్ద కమిన్స్ బౌలింగ్‌లో రహానే ఎల్బీడబ్ల్యూ అయినా... అదృష్టవశాత్తూ అది నోబాల్ కావడంతో అతను బతికిపోయాడు. ఐదో వికెట్‌కు 71 పరుగులు జోడించిన అనంతరం జడేజాను లయన్ అవుట్ చేయడంతో ఆసీస్ ఊపిరి పీల్చుకుంది. ఆ తర్వాత వికెట్ పడకుండా రహానే, భరత్ మరో 21 బంతులు జాగ్రత్తగా ఆడారు.

స్కోరు వివరాలు

ఆస్ట్రేలియా తొలి ఇన్నింగ్స్: వార్నర్ (సి) భరత్ (బి) శార్దుల్ 43; ఖ్వాజా (సి) భరత్ (బి) సిరాజ్ 0; లబుషేన్ (బి) షమీ 26; స్మిత్ (బి) శార్దుల్ 121; హెడ్ (సి) భరత్ (బి) సిరాజ్ 163; గ్రీన్ (సి) గిల్ (బి) షమీ 6; క్యారీ (ఎల్బీ) (బి) జడేజా 48; స్టార్క్ (రనౌట్) 5; కమిన్స్ (సి) రహానే (బి) సిరాజ్ 9; లయన్ (బి) సిరాజ్ 9; బోలండ్ (నాటౌట్) 1; ఎక్స్‌ట్రాలు 38; **మొత్తం (121.3 ఓవర్లలో ఆలౌట్) 469.**

వికెట్ల పతనం: 1–2, 2–71, 3–76, 4–361, 5–376, 6–387, 7–402, 8–453, 9–468, 10–469. **బౌలింగ్:** షమీ 29–4–122–2, సిరాజ్ 28.3–4–108–4, ఉమేశ్ 23–5–77–0, శార్దుల్ 23–4–83–2, జడేజా 18–2–56–1.

భారత్ తొలి ఇన్నింగ్స్: రోహిత్ (ఎల్బీ) (బి) కమిన్స్ 15; గిల్ (బి) బోలండ్ 13; పుజారా (బి) గ్రీన్ 14; కోహ్లి (సి) స్మిత్ (బి) స్టార్క్ 14; రహానే (బ్యాటింగ్) 29; జడేజా (సి) స్మిత్ (బి) లయన్ 48; భరత్ (బ్యాటింగ్) 5; ఎక్స్‌ట్రాలు 13; **మొత్తం (38 ఓవర్లలో 5 వికెట్లకు) 151. వికెట్ల పతనం:** 1–30, 2–30, 3–50, 4–71, 5–142. **బౌలింగ్:** స్టార్క్ 9–0–52–1, కమిన్స్ 9–2–36–1, బోలండ్ 11–4–29–1, గ్రీన్ 7–1–22–1, లయన్ 2–0–4–1.



ముకోవా

ఓటమి అంచుల నుంచి...

- ఫ్రెంచ్ ఓపెన్ ఫైనల్లో చెక్ రిపబ్లిక్ క్రీడాకారిణి కరోలినా ముకోవా
- సెమీస్‌లో రెండో సీడ్ సబలెంకాపై సంచలన విజయం

పారిస్: అందరి అంచనాలను తారుమారు చేసి చెక్ రిపబ్లిక్‌కు చెందిన అన్‌సీడెడ్ క్రీడాకారిణి కరోలినా ముకోవా ఫ్రెంచ్ ఓపెన్ గ్రాండ్‌స్లామ్ టెన్నిస్ టోర్నీలో ఫైనల్లోకి ప్రవేశించింది. గురువారం జరిగిన మహిళల సింగిల్స్ తొలి సెమీఫైనల్లో ప్రపంచ 43వ ర్యాంకర్ ముకోవా 7–6 (7/5), 6–7 (5/7), 7–5తో ప్రపంచ రెండో ర్యాంకర్, రెండో సీడ్ సబలెంకా (బెలారస్)పై సంచలన విజయం సాధించింది. తన కెరీర్‌లో 17వ గ్రాండ్‌స్లామ్ టోర్నీ ఆడుతున్న 26 ఏళ్ల ముకోవా తొలిసారి ఓ గ్రాండ్‌స్లామ్ టోర్నీలో ఫైనల్ బెర్త్‌ను ఖరారు చేసుకుంది. సబలెంకాతో 3 గంటల 13 నిమిషాలపాటు జరిగిన సెమీఫైనల్ పోరులో నిర్ణాయక మూడో సెట్‌లో ముకోవా 2–5 స్కోరు వద్ద తన సర్వీస్‌లో 30–40 పాయింట్ల వద్ద ఓటమి ముంగిట నిలిచింది. ఈ కీలక తరుణంలో ముకోవా ఫోర్‌హ్యాండ్ విన్నర్‌తో 40–40తో సమం చేసింది. అనంతరం సబలెంకా రెండు అనవసర తప్పిదాలు చేయడంతో ముకోవా తన సర్వీస్‌ను నిలబెట్టుకుంది. అనంతరం సబలెంకా సర్వీస్‌ను బ్రేక్ చేసి, మళ్లీ తన సర్వీస్‌ను కాపాడుకున్న ముకోవా స్కోరును 5–5తో సమం చేసింది. 11వ గేమ్‌లో సబలెంకా సర్వీస్‌ను మళ్లీ బ్రేక్ చేసిన ముకోవా 12వ గేమ్‌లో తన సర్వీస్‌ను నిలబెట్టుకొని సెట్‌తోపాటు చిరస్మరణీయ విజయాన్ని దక్కించుకుంది.

రెండో సెమీఫైనల్లో డిఫెండింగ్ చాంపియన్, టాప్ సీడ్ ఇగా స్వియాటెక్ (పోలాండ్) 6–2, 7–6 (9/7)తో 14వ సీడ్ బీట్రిజ్ హదాద్ మయా (బ్రెజిల్)పై గెలిచి మూడోసారి ఫైనల్లోకి అడుగు పెట్టింది. 2020, 2022లలో విజేతగా నిలిచిన స్వియాటెక్ శనివారం జరిగే ఫైనల్లో ముకోవాతో తలపడుతుంది.

అల్‌కరాజ్ X జొకోవిచ్

పురుషుల సింగిల్స్ విభాగంలో నేడు సెమీఫైనల్స్ జరగనున్నాయి. తొలి సెమీఫైనల్లో టాప్ సీడ్, ప్రపంచ నంబర్‌వన్ అల్‌కరాజ్ (స్పెయిన్)తో మూడో సీడ్ జొకోవిచ్ (సెర్బియా) తలపడతాడు. అనంతరం రెండో సెమీఫైనల్లో 22వ సీడ్ జ్వెరెవ్ (జర్మనీ)తో నాలుగో సీడ్ కాస్పర్ రూడ్ (నార్వే) ఆడతాడు. సాయంత్రం గం. 6:30 నుంచి సోనీ స్పోర్ట్స్‌లో ప్రత్యక్ష ప్రసారం

ప్రిక్వార్టర్ ఫైనల్లో శ్రీకాంత్ పరాజయం

సింగపూర్: సింగపూర్ ఓపెన్ వరల్డ్ టూర్ సూపర్–750 బ్యాడ్మింటన్ టోర్నమెంట్‌లో భారత పోరాటం ముగిసింది. గత ఏడాది మహిళల సింగిల్స్ విభాగంలో పీవీ సింధు చాంపియన్‌గా నిలిస్తే ... ఈసారి మాత్రం ఏ విభాగంలోనూ భారత క్రీడాకారులు ప్రిక్వార్టర్ ఫైనల్ దాటలేకపోయారు. పురుషుల సింగిల్స్‌లో బరిలో నిలిచిన ప్రపంచ మాజీ నంబర్‌వన్ కిడాంబి శ్రీకాంత్, యువతార ప్రియాన్షు రజావత్ ప్రిక్వార్టర్ ఫైనల్లో ఓటమి చవిచూశారు. గురువారం జరిగిన మ్యాచ్‌ల్లో ప్రపంచ 23వ ర్యాంకర్ శ్రీకాంత్ 37 నిమిషాల్లో 15–21, 19–21తో 42వ ర్యాంకర్ చియా హావో లీ (చైనీస్ తైపీ) చేతిలో... ప్రపంచ 37వ ర్యాంకర్ ప్రియాన్షు 17–21, 16–21తో ప్రపంచ నాలుగో ర్యాంకర్ కొడాయ్ నరోకా (జపాన్) చేతిలో పరాజయం పాలయ్యారు. పురుషుల డబుల్స్ ప్రిక్వార్టర్ ఫైనల్లో ధ్రువ్ కపిల–అర్జున్ (భారత్) జోడీ 15–21, 19–21తో బెన్ లేన్–సీన్ వెండీ (ఇంగ్లండ్) ద్వయం చేతిలో ఓడింది.



ఏసు తన రెండు చేతులతో చంద్రుడిని మోస్తున్నట్లు ఉన్న ఈ చిత్రాన్ని బ్రెజిల్‌కు చెందిన ఫొటోగ్రాఫర్ లియనార్డో సెన్స్ తీశారు. ఇది తీయడానికి ఆయనకు మూడేళ్లు పట్టిందట. ఇలాంటి ఫొటో తీయాలని ప్రయత్నించి.. లియనార్డో ఎన్నోసార్లు విఫలమయ్యారు. బ్రెజిల్‌లోని ప్రఖ్యాత క్రైస్ట్ ది రిడీమర్ విగ్రహంపైకి ఏ రోజున.. ఏ సమయానికి చంద్రుడు ఇలా పర్‌ఫెక్ట్‌గా వస్తాడో తెలుసుకోవడానికి ఆయన చంద్రుడి గమనాన్ని అధ్యయనం చేశారు. చివరికి జూన్ 4న విగ్రహానికి 11 కిలోమీటర్ల దూరంలో ఉన్న ఓ బీచ్ ఒడ్డున నిల్చొని అద్భుతమైన ఈ చిత్రాన్ని క్లిక్‌మనిపించారు. ఇన్‌స్టాగ్రాంలో పోస్ట్ చేస్తే.. లైకులు లక్షల్లో కురుస్తున్నాయి.

పార్సిల్ ట్రాకింగ్ పేరిట కొత్త మోసాలు

- ఎస్‌ఎంఎస్‌లలో మాల్వేర్ లింకులు పంపుతున్న సైబర్ నేరగాళ్లు
- అప్రమత్తంగా ఉండాలని హెచ్చరిస్తున్న పోలీసులు



సాక్షి, హైదరాబాద్: ఆన్‌లైన్‌లో వస్తువులను కొనడం ఈ రోజుల్లో సర్వసాధారణమైంది. అయితే మనకు వచ్చే ఆ పార్సిల్ ఎప్పుడు వస్తుందో తెలుసుకునేందుకు ట్రాకింగ్ చేయడం పరిపాటి. ఇదే అదనుగా ఆన్‌లైన్‌లో వస్తువులను కొనేవారిని లక్ష్యంగా చేసుకుని సైబర్ నేరగాళ్లు కొత్త తరహా మోసాలకు తెరతీస్తున్నారు. ఆన్‌లైన్‌లో వస్తువులను ఆర్డర్ చేసేందుకు మా వెబ్‌సైట్‌ను సంప్రదించండి.. అంటూ నకిలీ యాడ్స్‌ను ఇస్తున్నారు. అదేవిధంగా ట్రాకింగ్ కోసం అంటూ ఆన్‌లైన్‌లో కొన్ని ఫేక్ కాల్ సెంటర్ నంబర్లను పెడుతున్నారు. వాటిని నమ్మి ఎవరైనా ఆ నంబర్లకు ఫోన్ చేసేందుకు ప్రయత్నిస్తే అలాంటి వారికి నకిలీ మాల్‌వేర్ లింకులతో కూడిన ఎస్‌ఎంఎస్, వాట్సాప్ మెసేజ్‌లు పెడుతున్నారు. వినియోగదారులు ఆ లింక్‌లపై క్లిక్ చేస్తే మన ఫోన్‌లోని పూర్తి సమాచారం హ్యాకర్ల చేతికి వెళ్లడంతో పాటు మన ఫోన్లను వారి నియంత్రణలోకి తీసుకుని మోసాలకు పాల్పడుతున్నారు. ట్రాకింగ్ పేరిట ఇచ్చే యాడ్స్‌ను నమ్మి మోసపోవద్దని, ఆయా కంపెనీల అధికారిక వెబ్‌సైట్ల నుంచి మాత్రమే ఫోన్ నంబర్లు తీసుకోవాలని సైబర్ క్రైం పోలీసులు సూచిస్తున్నారు.

నాట్రాక్స్-ఐఐటీహెచ్ కీలక ఒప్పందం

సాక్షి ప్రతినిధి, సంగారెడ్డి: ఆటోమేటెడ్ వాహనాల సాంకేతిక అభివృద్ధిలో పరస్పర సహకారానికి కేంద్ర ప్రభుత్వరంగ సంస్థ నేషనల్ ఆటోమోటివ్ టెస్ట్‌ట్రాక్స్ (నాట్రాక్స్) ఐఐటీ హైదరాబాద్‌తో గురువారం కీలక అవగాహన ఒప్పందం (ఎంవోయూ) కుదుర్చుకుంది. సాంకేతిక నైపుణ్యం, మౌలిక సదుపాయాలను ఉపయోగించి అటానమస్ నేవిగేషన్ టెస్టింగ్‌ను అభివృద్ధి చేసేందుకు ఇరు సంస్థలు ఉమ్మడిగా శిక్షణ, నైపుణ్య సామర్థ్యాలను పెంపొందించుకోవాలని నిర్ణయించాయి. ఐఐటీహెచ్‌లో ఆటోమేటెడ్ వాహనాల వినియోగంపై పరిశోధన చేసే టెక్నాలజీ ఇన్నోవేషన్ హబ్ ఆన్ అటానమస్ నేవిగేషన్ (టిహాన్)తో నాట్రాక్స్ కలసి పని చేయనుంది. ఈ సందర్భంగా ఐఐటీహెచ్ డైరెక్టర్ ప్రొఫెసర్ బీఎస్ మూర్తి మాట్లాడుతూ మానవాళి కోసం సాంకేతికత అనేది తమ నినాదమన్నారు. ఆత్మనిర్భర్ భారత్‌గా మారేందుకు నాట్రాక్స్‌తో ఒప్పందం దోహదపడుతుందన్నారు. ఈ కార్యక్రమంలో నాట్రాక్స్ డైరెక్టర్ డాక్టర్ మనీశ్ జైస్వాల్, టీఐహెచ్ఏఎన్ డైరెక్టర్ ప్రొఫెసర్ పి.రాజ్యలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

హైదరాబాద్‌లో జాతీయ 3డీ ప్రింటింగ్ కేంద్రం ప్రారంభం

- రూ.70 కోట్ల వ్యయంతో దేశంలో తొలి కేంద్రం
- ఏరోస్పేస్, డ్రోన్లు, మానవ కృత్రిమ అవయవాల తయారీ



3డి ప్రింటింగ్ సెంటర్‌ను ప్రారంభిస్తున్న ప్రభుత్వ కార్యదర్శులు అల్కేష్‌కుమార్‌శర్మ, జయేష్‌రంజన్

సాక్షి, హైదరాబాద్/ఉస్మానియా యూనివర్సిటీ: హైదరాబాద్‌లోని ఉస్మానియా విశ్వవిద్యాలయంలో జాతీయ 3డీ ప్రింటింగ్ కేంద్రాన్ని కేంద్ర ఎలక్ట్రానిక్స్, సమాచార శాఖ కార్యదర్శి అల్కేష్‌కుమార్ శర్మ, రాష్ట్ర ఐటీ, పరిశ్రమల ముఖ్యకార్యదర్శి జయేశ్ రంజన్ ప్రారంభించారు. రాష్ట్ర ప్రభుత్వ భాగస్వామ్యంతో కేంద్రం, వివిధ పరిశ్రమలు రూ.70 కోట్ల వ్యయంతో దేశంలో తొలిసారిగా రాష్ట్రంలో ఈ అత్యాధునిక నేషనల్ సెంటర్ ఫర్ అడిటివ్ మాన్యుఫాక్చరింగ్ (3డీ ప్రింటింగ్ సెంటర్)ను ఏర్పాటు చేసిన్నట్లు వారు పేర్కొన్నారు. ఓయూ క్యాంపస్ ఇంజనీరింగ్ కాలేజీ ప్రాంగణంలోని టెక్నాలజీ డెవలప్‌మెంట్ సెంటర్‌లో అత్యాధునిక సౌకర్యాలతో ఏర్పాటు చేసిన జాతీయ 3డీ ప్రింటింగ్ కేంద్రంలో ఏరోస్పేస్, డ్రోన్లు, మానవ కృత్రిమ అవయవాలు, ఆటోమొబైల్ పరికరాలు, అన్ని రకాల పరిశ్రమలకు ఉపయోగపడే వస్తువులను తయారుచేస్తారని కళాశాల ప్రిన్సిపల్ ప్రొ.శ్రీరామ్ వెంకటేశ్ చెప్పారు.

3డీ ప్రిటింగ్ రూపకర్త ప్రొ.శ్రీరామ్ వెంకటేష్

ఓయూ ఇంజనీరింగ్ కాలేజీ మెకానికల్ ఇంజినీరింగ్ సీనియర్ ప్రొ.శ్రీరామ్ వెంకటేశ్ 2002 నుంచి 3డీ ప్రింటింగ్ సబ్జెక్టును ఇంజనీరింగ్ విద్యార్థులకు బోధిస్తున్నారు. ఈ సబ్జెక్టుపై అనేక పరిశోధనలు చేసిన ఆయన 2007లో కేంద్ర మానవ వనరుల అభివృద్ధిశాఖ నుంచి రూ.కోటి ప్రాజెక్టును పొందారు. దీంతో ప్రత్యేకంగా పరికరాలను, యంత్రాలను కొనుగులు చేసి 3డీ సెంటర్‌ను అభివృద్ధి చేశారు. ఆ విధంగా ఓయూలో అంకురించిన 3డీ ప్రింటింగ్ టెక్నాలజీ నేడు జాతీయస్థాయి ప్రింటింగ్ కేంద్రం స్థాపనకు దోహదపడిందని అధికారులు చెప్పారు.

Published and Printed by V. Murali on behalf of Jagati Publications Limited, Printed at Jagati Publications Limited, Sakshi Press, Plot no. D-75 & E-52, Industrial Estate (APIE), Balanagar, Medchal Dist. and Published at 6-3-249/1, Sakshi Towers, Road No. 1, Banjara Hills, Hyderabad - 500 034, Editor: V. Murali, (Responsible for selection of News under the PRB Act) Phone No. +91-40-23256000 (30). RNI Reg No. TELTEL/2008/23482.